# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, మార్చి, 2016 ₹ 25

ISSN 2454–4329




కామమ్

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 27** | **మార్చి** | **సంచిక 3**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

సాంకేతిక సహాయకులు
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేముల రాణి, సారిక నిర్మల

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*
**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
**http://facebook.com/misimimaasapathrika**

ప్రతి : ₹ 25/– సంవత్సరానికి : ₹300/–
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

LIBRARY OF CONGRESS LCCN 91-903060

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 5
సాహిత్యం ఒక కళ : షోపెన్ హోవర్ వ్యాసాలు ........ 7
*– ముక్తవరం పార్థసారథి*
ఆంధ్ర నాటక రంగ చరిత్ర ........ 10
*– శ్రీనివాస చక్రవర్తి*
శాస్త్రము – మతము : ద్వంద్వానుబంధం ........ 21
*– ఆచార్య చందు సుబ్బారావు*
ఇల్లిందల సరస్వతీదేవి – స్వర్ణకమలాలు ........ 27
*– ప్రొ. రావినూతల సత్యనారాయణ*
సంస్కృతుల ప్రభావం ........ 37
*– వేలూరి కృష్ణమూర్తి*
చరిత్రలో చెరగని జ్ఞాపకాలు ........ 40
*– కె. వెంకటేశ్వర్లు*
మనసున్న రాయుడు ........ 51
రాయలసీమ నవలా చరిత్ర ........ 52
*– డా. పొదిలి నాగరాజు*
క్రోమోసోమ్ కథనమ్ – X & Y ........ 55
*– ము.పా.సా.*
కురుక్షేత్రం ........ 59
*– సాయి పాపినేని, జయశ్రీ నాయని*
మధుసేవ ........ 65
*– డా. ఓరుగంటి సరస్వతి*
పిల్లల పాటలు ........ 70
*– సందినేని రవీందర్*
రామ్‌దర్శ్ మిశ్ర : సాహిత్య అకాడెమీ పురస్కారం ........ 72
*– డా. వెన్నా వల్లభరావు*
కథలెందుకు? ........ 76
*– వి. అశ్వినీకుమార్*
ఎల్లోరా – కైలాస నాథాలయం ........ 80
*– డా. ఈమని శివనాగిరెడ్డి*
"ఆమెకు నవతి – అందుకే ఈ ప్రణతి" ........ 84
*– డా. వోలేటి పార్వతీశం*
ల్యాబ్ కేస్ ........ 87
*– పి. దస్తగిరి*
మా నాన్న హీరో కాదు ........ 90
*– కాండ్రేగుల జీలం చటర్జీ*
సంగీత ఆభరణం ........ 91
*– డా. సి.వి. రామచంద్రరావు*
బహుముఖ ప్రజ్ఞాశాలి – బాలశౌరి రెడ్డి ........ 92
*– ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్*
కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె ........ 95
చదవండి ........ 96


*ముఖచిత్రం* : అమాయిక
*రెండవ అట్ట* : కామమ్
*మూడవ అట్ట* : క్రోధమ్
*నాల్గవ అట్ట* : లోభమ్

*చిత్రకారుడు :*
*దీనానాథ్ దలాల్*

అట్టతో కలిపి 100 పుటలు

*వివరాలు : 50 వ పుటలో...*

**ఈ** మధ్యనే అంగరంగ వైభవంగా జరిగిన హైద్రాబాదు 'పుస్తకాల జాతర' (ఇది నిర్వాహకుల నిర్వచనం)! బెజవాడలో జరిగిన పుస్తకాల సంత చాలా విషయాలను వెలుగులోకి తెచ్చింది. ముఖ్యంగా చెప్పుకోదగింది ముద్రిత పుస్తకాలకు గిరాకీ పెరగడం – ఆన్‌లైన్ పోర్టళ్ళు అంతగా ఆదరణ పొందకపోవటం తెలియవచ్చింది – పుస్తకాలు చదవాలని ఉత్సాహపడేవారు వేలల్లో తరలివచ్చారు – ఇది ఆనందదాయక పరిణామమే – ఈ ఐపాడ్ – నోట్‌పాడ్ రోజుల్లో – ఈ సందర్భంలోనే **మిసిమి** స్టాల్‌కి చాలామంది సందర్శకులు వచ్చారు – వందల్లోనే చందాలు కట్టారు. ఇదీ శుభసూచకమే!

సంపాదకుల సంభాషణలలో పాఠకుల మనస్సులోని స్పందనలు తెలియవచ్చాయి. అందులో... **మిసిమి** "ఎంతో ఉన్నతంగా ఉంటోంది – చదివి దాచుకుంటున్నాం" అంటూనే "మీరు కథలు, మంచివే అనుకున్నవి ప్రచురించవచ్చుకదా?" రెండోది, "కవితలు కూడా వినిపించలేరా" అని!


ఈ విషయాలపైనే సంపాదకుల సమావేశాల్లో ఎన్నోమార్లు చర్చలు జరిగాయి. కథలు, కవితలు ప్రచురించే పత్రికలు, నెల, వార, దిన పత్రికలు ఎన్నిలేవు? అయినా చెప్పుకోదగినవి – ఏమి ప్రచురితమవుతున్నాయి? మరో దురదృష్టం – కవితల సంపుటలు – ఎవరికి వారే ముద్రించుకుని – వీటికి లబ్ధప్రతిష్ఠుల ముందుమాటలనే సర్టిఫికేట్లతో – మళ్ళీ వారే పంచిపెట్టుకోవటం ఎంత దయనీయస్థితి – సరే ఇదంతా ఒక పక్క –

అసలు విషయానికి వద్దాం – కథలను తీసుకుంటే, కారుతో మొదలయిన ఆధునిక కథ – అంటే యాంత్రీకరణే ఆధునికం అనుకుంటే, మరి కారులాగా కథ – ముఖ్యంగా తెలుగు కథ – ఎన్ని సోయగాలుపోవాలి? ఎన్ని బాహిరకమైన వంపు సొంపులకు, ఆంతరికమైన హైటెక్ సోయగాలకు నోచుకోవాలి?

శాస్త్రవిజ్ఞానంతో వృద్ధిచెందిన – భౌతిక, రసాయన, ఖగోళ శాస్త్రాలు ఎంత దూరం వెళ్ళాయి?! ఎన్ని పాలపుంతలు దాటి కాంతి సంవత్సరాల ప్రయాణం చేస్తున్నాయోకదా–

మన కథలు ఇంకా మట్టిగోడలు గీకుతున్నాయేమిటి? గిట్టలతో దుమ్ములేపుతూ నేలచూపులు చూస్తున్నాయేమిటి? ఇంకా ఆధునికమనే కవితలు ఊరు చెరువు దాటలేదేమిటి? పొలిమేర మురికి కాలువమీది తాటిబోదె పైనే తచ్చాడుతున్నాయేమిటి?

అస్సలు 'ఇంటర్నల్ కంబస్టన్' లేకుండా చలనం ఎక్కడినుంచి వస్తుంది? అందుకే **మిసిమి** ని ఈ వరసలో నిలబెట్టలేకపోతున్నాము. అంతేకాదు – కథల కమామీషు చూద్దాం!



పోలీసు డైరీ కథలు – కేవలం భర్తకు తెలియకుండా భార్యలు చదవాలనుకునే డైరీలు – మొదటరకం –

ఆపై డైరీల నుంచి ఒకటో రెండో 'పాత్ర'లను తెచ్చి ఫ్లవర్‌వాజ్‌లో పెట్టి చూపేవి రెండోరకం –

ఈ పాత్రలతో పొరపాటున పాఠకుడు తాదాత్మ్యం చెందితే – 'ఆ కాలానికి ప్రయాణించటం' మూడోరకం.

ఇక నాలుగోరకం – చాలా అరుదు – కథలోని సంఘటనలకు, వ్యక్తులకు సార్వజనీనత సృష్టించగలగటం, వాస్తవంలోనుంచి ఊహాత్మకంగా మరో స్థాయికి తీసుకుపోగలగటం! ఇవి పదికాలాలపాటు మనగల కథలు !– ఇప్పుడు చెప్పండి – మమ్మల్ని ఎటు ప్రయాణం చేయమంటారు?

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

* "... శ్రీ ఆలపాటి బాపన్న గారికి నమస్కారం. మీరు దయతో పంపిన నవంబరు ***మిసిమి*** సంచికలు ఇప్పుడే అందాయి. అందులో కృష్ణశాస్త్రి గారిపై వ్యాసం చాలాగొప్పగా ఉంది. అది ఎప్పుడు పంపానో గుర్తు రావటంలేదు, నాకు ఇప్పుడు 92 సంవత్సరాలు. మీరు పంపిన పారితోషికమూ అందింది. శ్రీ రవీంద్రనాథ్ గారు స్వర్గస్థులైన తర్వాత బాధ్యతలు మీరు స్వీకరించి, సక్రమంగా నిర్వహిస్తున్నారు. మీకు, సంపాదకులకు అభినందనలు..."

– ***ఆవంత్స సోమసుందరం,*** *పిఠాపురం*

* "... ***మిసిమి*** క్రమం తప్పకుండా చదువుతున్నాను. నా భార్య నెలంతా చదువుతుంది. సంపాదకుల శ్రద్ధ, ప్రకాశకుల శ్రమ అభినందనీయం.

– ***తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి,*** *రాజమహేంద్రవరం*

* "... ఫిబ్రవరి సంచిక నిన్ననే అందినది. ప్రతి నెల ఒకటవ తేదీ, లేక ఒక్కొక్కప్పుడు ఒక రోజు ముందుగానే అందించడంలో మీరు కనబరిచే శ్రద్ధ ఎంతైనా పొగడతగినది. వి.ఎ.కె. రంగారావుగారు "***మిసిమి*** చదివినంత శ్రద్ధగా మరొక పత్రికను చదవను" అని 93వ పేజిలో రాశారు. నేనైతే ***మిసిమి*** తప్ప మరో తెలుగు పత్రికను చదవను. వారు రాసినట్లు అక్షర దోషాలు నన్ను కూడా బాధిస్తుంటాయి. ఇంత గొప్ప స్థాయిలో మంచి ముద్రణా విలువలతో ప్రచురిస్తున్న పత్రికలో అక్షర దోషాలు మచ్చల్లా ఉ ంటున్నాయి. "ప్రఖ్యాత మరాఠీ నటుడు శ్రీ మాన్ లగ్గు...." ఆ మహానటుడి పేరు డాక్టర్ శ్రీరామ్ లాగూ. ఇలాంటి పొరబాట్లు రావడం భావ్యం కాదని మనవి. మరొక్క సూచన :

... మీరెందుకో April నెలని అకారణంగా తెలుగులో ఏప్రియల్ అని ముద్రిస్తారు.




చిన్నప్పుడు, 50-60 సంవత్సరాల కిందట, వీధి బడిలో మాస్టరు అలా పలికించినా స్కూల్లో సరిదిద్దేవారు. మరో సంచిక తరవాత ఏప్రిల్ సంచిక రాబోతున్నందుకు మధ్యలో వున్న 'యు' తీసివేయవచ్చని ముందుగానే సూచిస్తున్నాను...

... ఫిబ్రవరి సంచికలో వచ్చిన 'భవాని' కథ చాల బాగుంది. రచయిత పేరు మీరు రాయకపోయినా అది వల్లభనేని అశ్వినికుమార్ గారిదని తెలుస్తోంది. అవునా?...

... ఇది పూర్తిగా గద్యం కాదు, అలాగని పరిపూర్ణమైన పద్యం కూడా కాదు. అభినందనలు..."

It is not prose but sheer poetry! Hats off to you, Sir.

– ***గబ్బిట కృష్ణమోహన్,*** *ఆన్‌లైన్*

* "... జనవరి నెల ***మిసిమి*** ఇప్పుడే పూర్తి చేశాను. అన్ని రచనలు చాలా బాగున్నాయి. ముఖ్యంగ నాకు తిరుమల రామచంద్ర గారి *హంపీ నుండి హరప్పా దాక* నచ్చటానికి కారణం మాది బళ్ళారి కావటం ఒకటైతే మరొకటి వారి అమ్మాయి ఆముక్త మాల్యద నా స్నేహితురాలు కావటం. బడా వెంగళరెడ్డి గారి గురించి తెలుసుకొని చాలా సంతోషించాను. ఆయన సహృదయత తెలుసుకొని ఇంత మంచివారు కూడా వుంటారా అని ఆశ్చర్యపోయాను. మంచి మంచి విషయాలు తెలుపుతున్నందులకు, మీకు మా హృదయపూర్వకాభివందనాలు.




– ***మంగళాకందూర్,*** *చెన్నయ్.*

* "... ***మిసిమి*** పత్రికను నిన్ననే చూశాను. చాలాచాలా బాగుంది. ఇన్నాళ్ళ నుంచీ ***మిసిమి*** ని చదవనందుకు, చాలా విచారిస్తున్నాను. దయచేసి గత ఆర్నెల్లు పత్రికలు వెంటనే పంపండి..."

– ***ఆర్. సత్యనారాయణ,*** *ముంబై*

* "...మీరు నాటక కళ మీద చూపుతున్న శ్రద్ధ, ప్రచురిస్తున్న వ్యాసాలు ఎంతో విలువగలిగినవి. చదివి, దాచుకోతగినవి. చాట్ల లేరంటే నమ్మలేకపోతున్నాం. తన జీవితం నాటకానికి ధారపోసిన మహానుభావుడు..."

– ***త్రినాథ్,*** *హైదరాబాద్*

# వేదిక

## అర్ధాంగి అంతరంగం

మా అక్కకు సంగీతం మీద కోరిక! సోలెడు బియ్యాన్ని సంగీతం మేస్టారికిచ్చి ఆరోజు పాఠాన్ని నేర్చుకునేది. దానికి సంగీత విద్వాంసుడు భర్తగా లభించడంతో దాని కోరిక అలా తీరింది. నాకు పత్రికల్లో కథలు చదవడమంటే మహాయిష్టం. ఇంట్లోవాళ్ళు చూస్తే తిట్టేవారు. రహస్యంగా చదివేదాన్ని. నాకూ కథలు వ్రాయాలనిపించేది. కానీ నాకా శక్తిలేదు. ఆ స్థితిలో నాకు పెళ్ళి అయింది. పెళ్ళి అయిన క్రొత్తలో పత్రికలో మా ఆయన కథ పడింది. దాన్ని చదివి చాలా సంతోషించాను. రచయితను భర్తగా ఇచ్చి భగవంతుడు నా కోరికను తీర్చాడనుకున్నాను. మా ఆయన ఏ కథను వ్రాసినా ముందు నాకే వినిపిస్తారు. ఆయన చదువుతూంటే వినడం నాకు బాగుటుంది. ఎంత పని వున్నా ప్రక్కనపెట్టి వింటాను, విసుక్కోను.

ఒకనాడు ఆయన కథను స్వీకరించినట్లుగా ఓ పత్రిక వారు ఉత్తరం వ్రాసారు. పత్రికలో కథ వచ్చింది. కానీ పారితోషికం ఇస్తామన్న పత్రికవారు ఆ ఊసే ఎత్తలేదు. పారితోషికం వస్తే బాగుండును అనుకునేదాన్ని. ఆయన పడ్డ శ్రమకూ, వెచ్చించిన కాలానికీ, కాగితం కలాలకూ విలువ ఉండేది కాదు. అటువంటి సామాన్య రచయిత ఈ రోజు ఇంట్లోంచి డబ్బు పట్టుకుని వెళ్ళి తన పుస్తకాలు వేసుకుంటున్నారు. మొదటి పుస్తకం "ఆబ" వేసుకున్నప్పుడు – దానికైన ఖర్చుకు నేను బాధపడి, ఆయన్నీ బాధపెట్టాను. తర్వాత పశ్చాత్తాపపడ్డాననుకోండి. ఏ దురలవాట్లూ లేని మనిషి ఇంతకాలానికి పుస్తకాలు వేసుకుంటున్నందుకు సంతోషమే.

పుస్తకావిష్కరణ రోజున పెద్దలందరూ ఆయన రచనలను మెచ్చుకుంటూ వుంటే నాకు మరో అమ్మాయికి పెళ్ళి చేస్తున్నంత సంబరంగా ఉంటుంది. వెయ్యి కాపీలు వేసి, వాటిని పంచడానికి మరింత ఖర్చుపెడుతుంటారు. వేయిమందిలో ఏ ఒకరో పుస్తకాన్ని ఊరికే తీసుకోకుండా ఓ వందరూపాయలు ఇస్తుంటారు. అలాంటివారు నా కంటికి దేవుడిలా కనబడతారు. ఎవరికి పుస్తకం యిచ్చినా వారు ఆ పుస్తకాన్ని చదవాలని కోరుకుంటారాయన. చదివినవారు తమ అభిప్రాయాన్ని చెబితే, ఆయన పొందే ఆనందానికి విలువ కట్టలేం. అందుకే నేను కథలు చదివాక, ఆ రచయితలకు ఫోన్లు చేసి అభినందిస్తూ వుంటాను. ఆయన వ్రాత పనిలో పడ్డప్పుడు ఆయనకు ఒళ్ళు తెలియదు. అలాంటప్పుడు ఆయన మీద నాకు కోపం వస్తూంటుంది. ఆయన బుర్రలో రచనలు తప్ప, నా అనారోగ్యం గురించి కూడా పట్టించుకోరు. "కళ్ళు మూసుకు పడుకో! తగ్గిపోతుంది" అంటారు. ఆయన చూపించే సానుభూతి అంతే. తొలిచూలు పురిట సమయం (1973). ఎనిమిదో నెలలో నాకు నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆయన వ్రాసుకుంటున్నారు.

"ఏవండీ! నాకు నొప్పులు వస్తున్నట్టున్నాయి..." అన్నాను. "నీ మొహం, ఎనిమిదోనెలలో నొప్పులేమిటి?" అన్నారు తప్ప నా మీద దృష్టిపెట్టలేదు. ఆ నొప్పులు ప్రసవానికి దారితీసి, ఎనిమిదో నెలలోనే కొడుకు పుట్టేశాడు. ఆయన అంతటి నిర్వికారపురుషులు. ఇంట్లో ఓ రోగం వచ్చినా, రొచ్చొచ్చినా, అది ఎవరికైనా సరే, నా మీదనే వదిలేస్తారు. ఆయన పుస్తకాలు చదువుకోవడం, బ్రహ్మరాతలు వ్రాసుకోవడం తప్ప మరేం పట్టించుకోరు. ఇంటికి ఎవరు వచ్చినా సాహిత్య విషయాలైతే మొహం చేటంత చేసుకుని గంటల తరబడి మాట్లాడుతారు. లేకపోతే ఓ మారు పలుకరించేసి, దూరంగా ఉంటారు.

మరో ఆశ్చర్యకర విషయం...

ఒకరోజు తెల్లవారు ఝామున నాలుగు గంటలకి తలుపులు తీసుకుని టేబులువద్ద కూర్చుని వ్రాసుకుంటున్నారు. నేను లోపల బాత్‌రూములో స్నానం చేస్తున్నాను. మా ప్రక్క యింటావిడ తిన్నగా బాత్‌రూమ్‌దాకా వచ్చి పూజకు పూలు అడిగి పట్టుకుపోయింది. ఈయన గారికి ఆవిడ రాకపోకలు తెలియదు! దొంగాడొచ్చినా అంతేకదా!

ఈయనే ఇలా ఉంటారా, లేక రచయితలందరూ ఇలాగే ఉంటారా! నాకు తెలియదు. మనిషి మంచాయనే – ఆయన ప్రపంచంలో ఆయన ఉంటారు. నాకు ఏదీ అడ్డు చెప్పరు. తలదాచుకొనుటకది చాలనుకుని వదిలేసాను!

నా గురించి భార్యగా నీ అభిప్రాయం వ్రాయమంటూ ఒత్తిడి చేసిన మూలాన యింత చెప్పాల్సి వచ్చింది.

ఉంటా–

**మహీధర కామేశ్వరి,** శంభునగరం

# సాహిత్యం ఒక కళ :

## షోపెన్ హోవర్ వ్యాసాలు

– ముక్తవరం పార్థసారథి

ఇప్పటివరకు మీరు చదివిన వ్యాసాలన్నీ షోపెన్‌హోవర్ ప్రచురించిన 'మరేగా'లోనివే. ఈ సంకలనంలో వివిధ విషయాల గురించిన చర్చ వున్నప్పటికీ, సాహిత్య ప్రక్రియలూ, వాటి నిర్మాణానికి సంబంధించిన వ్యాసాలకో ప్రత్యేకత వుంది. ఎందుకంటే, షోపెన్‌హోవర్ తత్త్వవేత్త మాత్రమేగాదు, గొప్ప సాహిత్యకారునిగా కూడా ఆయనకో గుర్తింపు వున్నది. జర్మన్ భాషలోని అత్యుత్తమ వచన రచయితల్లో అతడొకడు అనటం కూడా అతిశయోక్తి ఏమాత్రం కాదు. 'సాహిత్యం ఒక కళ' అని ధైర్యంగా చెప్పటానికి యిదే ఆయనకున్న అర్హత. కేవలం తన శక్తిసామర్థ్యాలేగాక, రచయిత కృషిని అనేక యితర సామాజిక, సాంస్కృతిక విషయాలు కూడా ప్రభావితం చేస్తాయని స్వానుభవంతో వచ్చిన తర్వాత, అతణ్ణి అప్రదిష్టపాలు చెయ్యటానికి ఎంతమంది, ఎన్ని రకాల ప్రయత్నిస్తారో ఆయనకు తెలుసు. షోపెన్‌హోవర్ స్వయంగా ఎన్నో చేదు అనుభవాలను రుచిచూశారు. కాని, యిలా మాట్లాడుకున్నంత మాత్రాన మనుషుల స్వభావం మారదు. అందరూ "నిష్పక్షపాతంగా రచనల్ని బేరీజు వెయ్యాలి" అని చెప్పి లాభం లేదు.



ఆర్థర్ షోపెన్‌హోవర్

రచనాశిల్పంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి, రచనాశిల్పం గురించి రాసిన వ్యాసం యిందులో వుంది. పదాడంబరం ప్రదర్శించని పదవాచస్పతి షోపెన్‌హోవర్. స్వంత ఆలోచనలే చుక్కానిగా సాగమని వుద్బోధించిన ఈ మనిషి, నిజజీవితంలో అదే ఆచరించాడు. సమకాలికుల చేతుల్లో దారుణ, అనైతిక విమర్శలను తట్టుకుని నిలచిన వ్యక్తి విమర్శ గురించి తన అభిప్రాయాలను మనతో పంచుకున్నాడు. కీర్తిప్రతిష్ఠల గురించి ఆయన గొప్పగా రాశాడు అని మీరనవచ్చుగాని, జీవితకాలంలో అవి ఆయనకు ఎండమావులుగానే మిగిలాయి. ఇక 'జీనియస్' గురించి రాయటానికి ఆయనకన్నా ఎక్కువ అర్హత వున్న మనిషి మరొకరుండరు. "నిజాయితీగల రచయిత కీర్తి కోసం పాకులాడకూడదు. అనామకుడిగానే వుండటానికి సిద్ధపడాలి" అన్న ప్రతిపాదనను అంగీకరించినా అంగీకరించకపోయినా, "గొప్ప సాహిత్యం ఎప్పుడూ డబ్బు కోసం సృష్టించబడదు" అన్నది నిర్వివాదాంశమేగద. సాహిత్యం ప్రజల్లోకి పోగలిగిన పరిస్థితుల గురించి కూడా షోపెన్‌హోవర్ బాగానే వివరించాడు.

అయితే, "ఈ విషయాలన్నీ కేవలం జర్మన్ సాహిత్యానికే పరిమితం. ఇతర భాషా సాహిత్యాలకు యివి వర్తించవు" అనుకోవటం ఆత్మవంచనే అవుతుంది. ఆయన జర్మన్ వుదాహరణలిచ్చినా ఆ అభిప్రాయాలు, వ్యాఖ్యానాలు, సూచనలను ఏ దేశ సాహిత్యానికైనా ఆపాదించుకోవచ్చు. షోపెన్‌హోవర్ గురించి తెలిసినవారెవరైనా, ఆయన అభిప్రాయాలు అస్పష్టంగా వున్నాయి, వాదనలు బలహీనంగా వున్నాయి అనలేరు. నిస్సందేహంగా ఆయన సమకాలికుల గురించే రాసి వుండవచ్చు. కాని అవి యిప్పటికీ అందరికీ వర్తిస్తాయి అని స్పష్టమవుతూనే వుంది. వాటికి కాలదోషం ఏమాత్రం పట్టలేదు.

షోపెన్‌హోవర్ రచనలు మనల్ని ఆకట్టుకోవటానికి కారణం ఆయన విలక్షణ వ్యక్తిత్వమేనని విజ్ఞులైన పాఠకులెవరైనా గమనించగలరు. రచనను కేవలం వృత్తిగా చేసుకొని జీవించినవాడు కాదాయన. అన్ని విషయాల గురించీ స్వంతంగా ఆలోచించి, ధైర్యంగా, నిర్మొహమాటంగా ఆ ఆలోచనల్ని కాగితం మీద పెట్టాడు. ఎంతటి ప్రముఖ వ్యక్తులతోనైనా విభేదించటానికి వెనుకాడలేదు. ముఖ్యంగా

సాహిత్య విషయాలలో ఆయన చాలా నిక్కచ్చిగా రాశాడు. పొగడ్తలకు దూరంగా వున్నాడు... అయినా, హితైషిలా, ఉపయుక్తమైన సలహాలివ్వటానికి సందేహించలేదు. రచయితల బలహీనతలను నిర్భయంగా వేలెత్తి చూపాడు. పుస్తకాలు చదవటంలో నిగ్రహం పాటించి, స్వంతంగా ఆలోచించటం అలవాటు చేసుకొమ్మన్నాడు. అందరూ చదివిన పుస్తకాలే మనమూ చదివితే, యితర్లకన్నా ఎక్కువ జ్ఞానం మనకెక్కిడినుంచి వస్తుంది?

తుచ్ఛ ప్రయోజనాలకోసం సాహిత్యం సృష్టించవద్దంటూ పదేపదే హెచ్చరించాడు. అంటే, భుక్తికోసం, పొట్టపోసుకోవటానికి, సంపాదనకోసం పుస్తకాలు రాసి లోకం మీదికి వదలొద్దని ఆయన వుద్దేశం. పుస్తకాలు కొత్త సత్యాల్ని ఆవిష్కరించాలి. అంతేకాని, ఎన్ని ప్రతులు అమ్ముడైనయో లెక్కవేసుకోగూడదు. సాహిత్యం లాభసాటి వ్యాపారంగా మారుతోందని ఆయన చెప్పింది. ఇప్పుడు ఆచరణలో మనం చూస్తూనే వున్నాం. బెస్ట్ సెల్లర్లంటే అంగడి సరుకులే – Commodities. ఎంత తక్కువ కాలంలో ఎన్ని ఎక్కువ ప్రతులు అమ్ముడుపోతే అదంత గొప్ప బెస్ట్‌సెల్లర్! ఇలాంటి పుస్తకాలు రాయటంలో లాభాపేక్ష తప్ప మరో ప్రయోజనముండదని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈ వ్యాపారంలో, రచయితలూ, ప్రచురణకర్తలూ Brand Namesగా మారుతారు. అంటే పుస్తకంలో వున్న విషయాన్నిబట్టిగాక, కేవలం వాళ్ళ పేర్లమీద అమ్ముడయిపోతాయవి. లేదా లబ్ధప్రతిష్ఠులైన రచయితలను భట్రాజు పొగడ్తలతో నింపి వాళ్ళ ఛత్రచ్ఛాయలో తానూ వెలగిపోవాలనుకునే రచయితలు మరికొందరు. ముఖ్యంగా మరణించిన రచయితల్ని పొగిడితే మరీ మంచిది. వాళ్ళెట్లాగూ మన లాభాల్లో వాటా అడగరుగద – కాని సూర్యుడి వెలుతురు చంద్రుడి మీద పడినట్టుగా ఒక చిన్ని కీర్తిపుంజం మనం కూడా ఏర్పరచుకొనవచ్చు!

* * *

అనేక పుస్తకాలలో షోపెన్‌హోవర్ సాహిత్యం గురించి చర్చించిన విషయాలన్నీ ఒక పద్ధతిలో అమర్చి కొత్త వ్యాసాలుగా కూర్చాడు ఇంగ్లీష్ పరిష్కర్త / అనువాదకుడు (T.B.S.). 'సాహిత్యం ఒక కళ' అని పేరుపెట్టింది కూడా ఈయనే. ఈ పేరు గురించి ఆయన యిచ్చిన వివరణ యిలాగుంది : సాహిత్యం అంటే ఆలోచనల్ని అక్షరబద్ధం చెయ్యటమేగద. దీన్ని 'కళ' అనటమేమిటి? అని పాఠకులు ప్రశ్నించవచ్చు. కాని చిత్రకళ, సంగీతం, శిల్పకళలు కూడా ఆలోచనా ఫలితమేగద. వాటిని 'కళ'లుగా గుర్తించినపుడు సాహిత్యాన్ని మాత్రం ఎందుకు మినహాయించాలి? అక్షరబద్ధం చేసిన ఆలోచనలన్నీ సాహిత్యం కాదు. ఒక పద్ధతి, ఒక నేర్పు, చదివించే గుణం, పదాల ఎంపిక, వాక్యనిర్మాణం, ఆకర్షణ వగైరా అన్నీ మనం కళకు ఆపాదించే లక్షణాలే. మనం రోజంతా ఏదోఒకటి చదువుతూనే వుంటాం. అదంతా 'కళ' అని ఎవరూ అంగీకరించరు.

కాని గొప్ప మేధావి, తత్వవేత్త, విషయం గురించి ఆలోచించినంతగా రూపం గురించి ఆలోచించడుగదా అంటారు మీరు. నిజమే. జీవితమనే పీటముడి గురించి రాసిందే సాహిత్యమని అందరం అంగీకరిస్తాం. ఆ పీటముడిని విప్పగలిగిన రచనలో ఏ యితర సౌందర్యాల కోసమూ మనం వెదకనక్కర్లేదు. ఒక రచయిత కేవలం రూపం (శైలి, కథనం) గురించి ఎంత ఎక్కువగా శ్రమిస్తే అతడు విషయం గురించిన తన మిడిమిడి జ్ఞానాన్ని ఈ తొడుగుల (శైలి, కథనం) వెనక అంతగా దాచుకుంటున్నాడన్నమాట. ఇలాంటివాళ్లను మనం కోకొల్లలుగా చూస్తూనే వున్నాం. స్వంతంగా ఆలోచించలేని వాళ్ళు, చెప్పదలచుకున్న విషయం గురించి ఆత్మవిశ్వాసం లేని వాళ్ళు చేసే పని యిదే. ఆనాటి షోపెన్‌హోవర్ వ్యాఖ్యలు నేటి 'స్టైలిస్టులకు' కూడా వర్తిస్తాయి. పదాడంబరమంటే అరువు తెచ్చుకున్న కోకలే. అతి సాధారణమైన విషయాన్ని లేదా చవకబారు విషయాన్ని నువ్వు ఎంత గొప్పగా చెప్పినా దాని ప్రభావం ఎవరిపైనా వుండదు.

ఈ రోజుల్లో కలం పట్టుకోగలిగిన ప్రతివ్యక్తీ రచయిత కావాలనుకుంటున్నాడు. అవకాశం దొరికితే చాలు, పత్రికల్లో ఏదో ఒకటి రాసెయ్యటమే. ఇక సమీక్షలో, అభిప్రాయాలకు లెక్కలేదు. ఇవి సరిపోవన్నట్టుగా చెప్పటానికేమీ లేకపోయినా వందలాది పేజీల నవలలు పుంఖానుపుంఖంగా రాసెయ్యటం (ఇది పశ్చిమదేశాలలో ఎక్కువ) అలవాటుగా మారింది. "సాహిత్యం ఒక కళ" అని యిలాంటి వాళ్ళను దృష్టిలో పెట్టుకొనే చెబుతున్నాడు షోపెన్‌హోవర్. వీళ్ళందరూ కళగా గుర్తించగలిగిన సాహిత్యాన్ని సృష్టించాలని ఆయన అభిలాష.

"నాలుగు కాలాలు నిలబడగలిగే పుస్తకాలు రాయాలంటే మొదట కాలపరీక్షను తట్టుకుని నిలిచిన పుస్తకాలు చదవండి. వాటిని అధ్యయనం చెయ్యండి" అని ఔత్సాహిక రచయితల్ని

వేలుపట్టుకుని నడిపిస్తున్నాడు. ఈ రోజుల్లో కనీస జ్ఞానం, కనీసార్హతలు కూడా లేని వాళ్ళు ఎంత అలవోకగా రాసేస్తున్నారంటే తెల్లటి కాగితం మీద నల్లటి అక్షరాలున్నంత మాత్రాన అదంతా సాహిత్యమనిపించుకుంటుందా అని ఎవరికైనా సందేహం కలగక మానదు. వార్తాపత్రికా కథనాలు, పత్రికల్లో వస్తున్న కథలు, వ్యాసాలు, రొమాన్సు, అడ్వెంచర్, హారర్, డిటెక్టిక్, సస్పెన్స్ థ్రిల్లరు ఇదంతా సాహిత్యమా? ఈ చెత్తంతా చదవటం అవసరమా? అసలు విషయమేమంటే సమకాలికులు ప్రశంసించినంత మాత్రాన ఒక రచయిత గొప్పవాడైపోడు.

ఒక తరం గడవాలి. మలితరం మాత్రమే అతణ్ణి సరిగా బేరీజు వేయగలదు. కళ అంతా మానవావిష్కరణ అనుకుంటే సాహిత్యం కూడా ఒక ఆవిష్కరణే. ఇతర రంగాలలో జరిగిన ఆవిష్కరణలు తరతరాలుగా మానవజాతి ప్రస్థానంలో మైలురాళ్ళుగా నిలిచాయి. సాహిత్యం కూడా అదే పని చెయ్యాలి. సత్యాన్వేషణ, సౌందర్యారాధన భావనలను పాఠకులలో జాగృతం చేయాలి. ప్రాచీన గ్రంథాలను, కావ్యాలను చిన్నచూపు చూడతగదని షోపెన్‌హావర్ చెప్పటానికిదే కారణం. క్లాసిక్స్ అంటే సాహిత్యంలో ధృవతారలు. అవే మానవాళికి మార్గదర్శకాలు. 'మంచి శైలి' అంటే తక్షణ పాఠకులను ఆకట్టుకునేది అని అర్థం కాదు. అది కూడా తరతరాల చదువరులను అలరించగలిగేదై వుండాలి. ఈ విషయంలో కూడా క్లాసిక్స్ అవశ్యం పఠనీయాలే.

ఇవన్నీ మాకు తెలిసినవే. షోపెన్‌హావర్ కొత్తగా చెప్పిందేమిటి అని కొందరడుగుతారు. ఆ విషయం కొంతవరకు నిజమే. 'మంచి' ఏమిటో అందరికీ తెలుసు. కాని యుద్ధరంగంలో కర్ణుడిలాగ రచయితలు తెలిసిన విషయాలే మరచిపోతుంటారు మరి. పోనీ, మీకు తెలిసిన విషయాలే షోపెన్‌హావర్ పునశ్చరణ చేస్తున్నారనుకోండి. తెలిసిందా, తెలియనిదా అని కాదు. దాన్ని మనం ఆచరణలో పెడుతున్నామా లేదా అన్నది ముఖ్యం.

* * *

### ఏం చేస్తున్నావు?

కష్టపడి పనిచేశావా?
మనసుపెట్టి కావ్యం రాశావా?
ఇదే నా జీవిత లక్ష్యం అనుకున్నావా?
ఏం చేసినా
ఏం రాసినా
డబ్బుకోసమైతే అది అంగడి సరుకే.
అంతకన్నా ఎక్కువేమీ కాదు

మారిస్ రోసైన్‌ఫెల్డ్ (1862–1923)
పోలిష్ కవి

*షోపెన్ హావర్ చెప్పిన కథ*

### ముళ్లపందుల సమాజం!

ఓ చలికాలం ముళ్లపందులు చలికి తట్టుకోలేక, వాటేసుకొని పడుకోవాలనుకున్నాయి. కాని ముళ్లు... దగ్గరకు రావాలనుకున్నా రాలేవు పాపం. ఎముకలు కొరికే చలి. మరోసారి ప్రయత్నించాయి. మళ్లీ ఒళ్లంతా గాయాలు. దీర్ఘంగా ఆలోచించుకుని, చర్చించుకుని ఓ నిర్ణయానికొచ్చాయి. ఎంత దూరంలో పడుకుంటే ముళ్లు గుచ్చుకోకుండానూ, కాసింత వెచ్చగానూ వుంటుందో తెలుసుకున్నాయి.

తమతమ అవసరాల కోసం మనుషులు దగ్గరగా వస్తారు. కాని, ఒకరి అలవాట్లను ఒకరు, ఒకరి స్వభావాన్ని ఒకరు భరించటం ఎంత కష్టం! Every other Person is Hell అని అంటాడు బెర్‌ట్రెండ్ రస్సెల్.

మనిషికీ మనిషికీ మధ్య వున్న ఎడం పేరే "మర్యాద". నచ్చని మనుషుల్ని మనం ''దూరం, దూరం'' అని చీదరించుకోవటం అందుకోసమే.

అందరూ ముళ్లపందులైతే ఫరవాలేదు. కాని తరచూ, ముళ్లు లేని పందులు కూడా ఈ మందలో కలుస్తాయి. అప్పుడు ముళ్లపందులు దూరాన్ని పాటించవలసిన అవసరం లేదు! అందుకే అన్నారు, 'సమవుజ్జీలకే మర్యాద, కిందివాళ్లకు కాదని.'' ముళ్లపందుల గుంపులోకి రావాలో లేదో తేల్చుకోవాల్సింది ముళ్లు లేని జంతువులే.



తెలుగు సేత :
ముక్తవరం పార్థసారథి
హైదరాబాదు.
ఫోన్ : 917 761 8708

# ఆంధ్ర నాటక రంగ చరిత్ర

*- శ్రీనివాస చక్రవర్తి*

"ఆంధ్ర ప్రజల కళాజీవితంలో 1880 మహత్తర సంవత్సరం. అప్పటివరకు నేడు మనం "స్టేజి నాటకాలు" అనే తరహా నాటక ప్రదర్శనాలు వారెరగరు. తోలుబొమ్మలు, యక్షగానాలు, వీధినాటకాలు, పగటివేషాలు లాంటి జానపద కళారూపాలే వారికి ఆనందం, విజ్ఞానం చేకూరుస్తుండేవి. అయితే ఈ కళారూపాల లక్ష్యం, మూలసూత్రం నాటకీయం. సంభాషణలు, సన్నివేశాలు, ప్రక్రియలు కూర్చి, కథకు రూపకత్వం ఇచ్చి దృశ్యమానం చేయడమే వీటి లక్ష్యమన్నమాట. సజీవ వ్యక్తులకుబదులు నిర్జీవ ప్రతిమలను చలింపచేయటం ద్వారా కథకు రూపం ఇవ్వటమే తోలుబొమ్మలాట, కీలుబొమ్మలాట. అలాగే సంగీతం, నృత్యం ద్వారా కథకు రూపకత్వం ఇచ్చినవే వీధినాటకాలు. పగటివేషాలలో పగలు ప్రదర్శించేవేగాక రాత్రిళ్ళు ప్రదర్శించే పంతులు, పఠాణీ వేషాలలాంటివి ఎన్నో వున్నాయి. ఈ ప్రదర్శనలు సంస్కృత ప్రహసన లక్షణాలకు సమీపంలో ఉంటాయి. ఈ జానపద నాటక కళారూపాల రచనాశిల్పంలో ప్రారంభం, పరాకాష్ఠ, నిర్వహణలాంటి నాటక సంధులు చక్కగా పొందుపరచబడి ఉన్నాయి. ఇవన్నీ ఉచితంగా ఆరుబయట ప్రదర్శించేవారు కాబట్టి చుట్టుపట్ల ఉన్న గ్రామాల నుంచి వందలకొద్ది జనులు వచ్చి చూసి ఆనందిస్తూండేవారు. ఆదినుంచీ ఆంధ్రప్రజలలో నాటకతృష్ణ 1880 నాటికే తారాస్థాయిలో ఉండేది. కాని కొన్ని కులాలవారు, శాఖలవారు ఈ ప్రదర్శనలను కులవృత్తిగా పెట్టుకోవటంవల్ల నటులు పంక్తిబాహ్యులనే నియమంతో సంఘంలో వేషధారులకు గౌరవం లేకపోవడంవల్ల సామాన్య ప్రజానీకంలో ఈ తృష్ణ ప్రదర్శనాలివ్వాలనే ఉత్సాహరూపం ధరించకుండా, ప్రదర్శనాలు చూసి ఆనందించేదానికి పరిమితమై ఉండిపోయింది.

కాని ఆనాటి రచయితలకు, పండితులకు సంస్కృత రూపకాలతో ఎక్కువగా పరిచయం ఉండేది. 1860 కీ.శే. కోరాడ రామచంద్ర కవిగారు 'మంజరీ మధుకరీయం' అనే నాటకం రచించారు. 14 వ శతాబ్దంలో రచయితమై ప్రదర్శింపబడిన క్రీడాభిరామం మినహాయిస్తే *మంజరీ మధుకరీయమే* తెలుగులో మొదటి నాటకమని తెలుస్తోంది. క్రీడాభిరామం రచించింది వల్లభరాయుడు. దీనిని మోహపూరిభైరవుని తిరునాళ్లల్లో ప్రదర్శించారట. వల్లభరాయుడిది వినుకొండ. నటులది ఓరుగల్లు. ఆనాటి ఆంధ్ర ప్రజల సాంఘికాచారాలు, వివిధ కళారూపాలు క్రీడాభిరామంవల్ల మనకు ప్రస్ఫుటమవుతాయి.

కాని *మంజరి మధుకరీయం* నాటక ప్రదర్శనను దృష్టిలోపెట్టుకొని వ్రాసిన నాటకం కాదు. అయినా దీనిని మన ప్రథమ స్వతంత్ర నాటకంగా పరిగణించవలసి ఉంటుంది. అలాగే 1872లో కీ.శే. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి *నరకాసుర వ్యాయోగం* ప్రథమంగా సంస్కృతం నుంచి అనువదించబడిన రూపకం. ఆనాటికే ఇంగ్లీషు విద్య వ్యాప్తిలోకి రావడంవల్ల కీ.శే. గురజాడ శ్రీరామమూర్తిగారు షేక్స్పియర్ 'మర్చెంట్ ఆఫ్ వెనీసు', 'జూలిస్ సీజరు' అనువదించారు. వావిలాల వాసుదేవశాస్త్రిగారు 'సీజరు చరిత' అనువదించడమేకాకుండా 1880లో నందక రాజ్యమనే స్వతంత్ర్య సాంఘిక నాటకం రచించి ప్రచురించారు. ఇదే ప్రప్రథమ తెలుగు సాంఘిక పద్యనాటకం. ఎక్కడా వచనంలేదు. అందులో వైదీకి నియోగి కక్షలు వాటివల్ల సంభవిస్తున్న అనర్థకాలు వరితమయినాయి.

ఇదీ 1880 నాటికి తెలుగుదేశంలో నాటకకళ పరిస్థితి. అయితే సంప్రదాయానికే ఎక్కువగా అంటిపెట్టుకుని ఉంటూ మార్పు అంటూ ఎక్కువగా లేని వీధినాటకాదులు చూసిచూసి ప్రజలలో విసుగూ, నూత్న కళారూపాలు కావాలనే ఆకాంక్షా ప్రబలమై ఉండవచ్చు. ఈ పరిస్థితిలో ధార్వాడ కంపెనీవారు మన దేశమంతటా పర్యటించారు. నాలుగువేపులా మూసిన తాటాకుపాకలలో రంగస్థలం, ప్రేక్షకస్థానం ఏర్పరచి క్రొత్త తరహా నాటకాలు ఆడారు. మనవారికి అప్పటికే తెర అనేది తెలిసినా పైకి కిందకూ చలించేవీ, ప్రక్కలకు చలించేవీ తెరలు ఎరగరు. సీనరీలు ఎరగరు. అందుచేత ధార్వాడ నాటకాలు మనవారిలో ఉత్సాహం రేకెత్తించాయి. ధార్వాడవారు

నాటకాలాడి వదలివేసి వెళ్ళిన పాకలో కీ.శే. కందుకూరి వీరేశలింగంగారు *చమత్కార రత్నావళి* అనే నాటకం ఆడించారు. ఇదే షేక్స్పియర్ నాటకానికి అనువాదం. ప్రదర్శించడానికని వ్రాసిన మొట్టమొదటి తెలుగు నాటకం. వారే తరువాత *రత్నావళి* ఆంధ్రీకరించి, ప్రదర్శింపజేశారు.

కొత్త తరహా ధార్వాడ నాటకాలు చూసేసరికి యువకులలో ఎనలేని ఉత్సాహం రేకెత్తింది. దానికితోడు వీరేశలింగం గారి వంటి యుగపురుషుడు స్వయంగా నాటకాలాడించడంవల్ల, సంస్కరణ భావాలు అప్పటికే యువకులలో వ్యాపిస్తూండడంవల్ల నాటకాలలో వేషాలు వేయడం తప్పు కాదనే భావం నాటుకుంది. ప్రతి పట్టణంలోనూ నాటక సమాజాలు స్థాపించబడ్డాయి. యువకులు బహిరంగంగా, కొందరు చాటుమాటున, కొందరు నాటక ప్రదర్శనాలలో పాల్గొనసాగారు.

నాటకం ప్రదర్శించాలంటే ముందు నాటకం కావాలిగా! నమూనాగా పెట్టుకోవటానికి ఇప్పటివరకు స్టేజినాటకాలు లేవు. నాటక రచనాశిల్పాన్ని తెలియజేసే లక్షణ గ్రంథాలు తెలుగులో లేవు. పోతే వారిముందున్నవల్లా కొద్ది సంస్కృత నాటకాలు, పగటివేషాలు, వీధినాటకాలు, పాశ్చాత్య నాటకాలు, ధార్వాడ నాటకాలు. అందుకని రచయితలు ఎక్కువగా ధార్వాడ నాటకాల ఫక్కీలో నాటకాలు వ్రాయడం మొదలుపెట్టారు. ఆ నాటకాలు పూర్తిగా వచనంలోనే ఉండేవి. ఏ నారదుడికోమాత్రం పాటలు పెట్టేవారు. పౌరాణిక కథలనే ఎక్కువగా తీసుకునేవారు. కాని తరువాత వచ్చిన గద్య, పద్య గేయమయ నాటకాలు వీటిని తోసిరాజనడంవల్ల వీటి ప్రతులు మనకిపుడు లభ్యం కావడంలేదు.

ఈ సమాజాలలోని సభ్యులంతా ఔత్సాహికులు. డబ్బు సంపాదించాలనే ఆలోచన వీరికి ఉండేదికాదు. కళే వారికి పరమావధి. అందుచేత వారు రంగస్థలాన్ని, చివరకు రిహార్సలు గదిని కూడా పవిత్ర స్థలంగా భావించేవారు. చెప్పులతో లోపలకు అడుగుపెట్టేవారు కాదు. సిగరెట్లు వగైరాలు తాగేవారు కాదు. సామాన్యంగా ఆ నాటక రచయితనో లేక తమలోకెల్లా విద్యావంతుడినో దర్శకుడిగా పెట్టుకుని భక్తిశ్రద్ధలతో నాటకం సాధన చేసేవారు. కాని అభినయ ప్రయోగ విధానాలను తెలిపే గ్రంథాలు – సంప్రదాయాలు లేకపోవడంవల్ల ధార్వాడవారినే ఒరవడిగా పెట్టుకోవలసి వచ్చింది. అసలు ధార్వాడవారే పాశ్చాత్యులను ఒరవడిగా పెట్టుకున్నారు. పాశ్చాత్యుల ఒరవడికి ఒరవడి మనం అవలంబించడం మూలానే దేశ, కాల పాత్రౌచిత్యాలకు దూరమయిన ఆహార్యం తయారయింది.

అభినయంలో, నాటక ప్రయోగంలో నిర్దిష్టాభిప్రాయాలు, శాస్త్రీయ దృక్పథం లేకపోయినా తమలో పెద్ద చెప్పినట్టు కట్టుబాటుతో సాధన చేసేవారు. నటన అంటే చేతులు ఎక్కువగా ఆడించడంగా భావించి, ఆంగికాభినయానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆనాటి వారి నటనను హంగామా నటన అనవచ్చు. సాత్త్వికాభినయం మీద వారికి దృష్టి ఉండేది కాదు. రాక్షస వేషాలమీద మరీ హంగామా చేసి, ప్రేక్షకులను హడలగొట్టేసేవారు. మన దేశాచారాలు విభిన్నమైనవయినా ధార్వాడ వారివలె లాగులు, కోట్లు, మేజోళ్ళు వగైరా వేషంమీద ధరించేవారు. సఫేదు, అరదళాలతో కోటాలు వేసుకునేవారు. ఏ పాకలోనో, పందిరిలోనో నాటకమాడేవారు. తెల్లటి తెర ఉపయోగించేవారు. నాటకం ప్రారంభం కావడానికి ముందు వినాయకుడు, సరస్వతి వేషాలు వచ్చేవి. తరువాత నటీసూత్రధారులు వచ్చి నాటక కథను, నాటకాన్ని పరిచయం చేసేవారు. ఆపైన అసలు నాటకం ప్రారంభమయేది. నటన, నాటక ప్రయోగం చాలా ప్రాథమిక దశలో ఉన్నా ఆనాటి వారి పట్టుదల, కట్టుబాటు, కళాభిమానం మెచ్చుకోతగ్గవి.

1884లో సాంగ్లీపార్సీ కంపెనీ వచ్చి హిందీలో నాటకాలు ఆడివెళ్ళింది. వారిని చూసి తిరిగి మనవారు హిందీలో కూడా నాటకాలాడడం మొదలుపెట్టారు. బందరు, ఏలూరు, పట్టణాలలో హిందీ నాటకాలాడే సమాజాలేర్పడ్డాయి. బందరులో కీ.శే. ఈమని లక్ష్మణస్వామిగారు హిందీ, తెలుగు నాటకాలాడడంలో మేటి దిట్ట అని పేరుపొందారు. వీరు రంగస్థలం మీద పాత్రగా జీవించి, ప్రేక్షకులను ఉర్రూతలూగించేవారట. మొత్తం నాటక రంగంలోనే మార్పువచ్చింది. అనుభవంమీద నటులు, ప్రయోక్తలు సాత్త్వికాభినయ ప్రాధాన్యం గుర్తించసాగారు.

సర్కారు జిల్లాలలో ఇలా వచన నాటకాలాడుతుంటే బళ్ళారి నుంచి ఇంకో రకం నాటకాలు బయలుదేరాయి. దీనికి మూలపురుషులు కీ.శే. ధర్మవరం రామకృష్ణమాచార్యులు. వచనంతోపాటు వందలకొలది పద్యాలు, పాటలు పెట్టి వీరు 14 నాటకాలు వ్రాసారు. *చిత్రనలీయం* (1886) వీరి మొదటి నాటకం. సరస వినోదినీసభ అనే సమాజం స్థాపించి, స్వయంగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తూ గద్య, పద్య, గేయమయ నాటకాలను రాయలసీమలో, మదరాసులో

ప్రచారంలోకి తీసుకువచ్చారు.

సర్కారు జిల్లాలలోకి ఈ రకం నాటకాలను తీసుకువచ్చింది గుంటూరు హరిప్రసాదరావు. కృష్ణమాచార్యులు పద్యాలు, పాటలు ఇంపుగా ఉంటాయి. అంతకు ముందు తెలుగులో, సంస్కృతంలో పద్యాలు, శ్లోకాలు పాడేవారో చదివేవారో గట్టిగా చెప్పలేంగాని బళ్ళారివారు మాత్రం సంగీతంతో పద్యాలు పాడడం మొదలుపెట్టారు. సంగీతం ప్రేక్షకులను తొందరగా మెప్పిస్తుంది. దానికితోడు కృష్ణమాచార్యులు, హరిప్రసాదరావు మేటి నటులు కావడంతో ఈ రకం నాటకాలు బహుళ ప్రజాదరణ పొందసాగాయి. దీనితో ఆంధ్ర నాటక రంగంలో పెద్ద మార్పు వచ్చింది. నాటకంలో పద్యాలు, పాటలు ఉండి తీరాలని ఎంత బాగా పాడితే అంత గొప్ప నటుడనీ భావాలు మొలకెత్తాయి. అంతకుముందు పూర్తిగా వచనంలో నాటకాలు వ్రాస్తూ వచ్చిన చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటివారు కూడా ప్రజాదరణకు తలొగ్గి నాటకాలలో పద్యాలు పెట్టవలసి వచ్చింది. గయోపాఖ్యానం మొదట వచన నాటకం. తర్వాత వందలాది పద్యాలు చొప్పించవలసి వచ్చింది (చిలకమర్తి వారి ఆత్మకథ).

*ఈ కాలంలోనే 1889లోనో 1895లోనో సురభి నాటక సమాజం ఏర్పడింది. సంస్థాపకులు కీ.శే. వనారస గోవిందరావు. దీనిని సమాజం అనడంకంటె నాటక కుటుంబం అనడం మంచిది. ఇందులో కుటుంబాలే సభ్యులు. స్త్రీలు, పురుషులు వేషాలు వేస్తారు. వీరి నాటక ప్రదర్శనా విధానమే వేరు. ఎక్కువగా వైరు వర్కు ఉపయోగించి సముద్ర లఘనం, ఆకాశ గమనం లాంటి విచిత్రాలు చూపెడుతూ అశేష జనానీకం ఆదరణకు పాత్రులయారు. ఇప్పుడు వీరి నాటక సమాజాలు 32 దాకా దేశంలో పర్యటిస్తూ, నాటక ప్రదర్శనలిస్తున్నాయి. అధునాతన సాంకేతిక పరికరాలను కూడా ఉపయోగిస్తున్నారు సురభివారు.*

ఈ కాలంలో బందరు దేశీయ నాటక సమాజం, గొడుగుపేట కంపెనీ; విశాఖపట్నంలో జగన్మిత్ర, కళాభిలాషక; రాజమండ్రి హిందూ నాటక సమాజం; బళ్ళారి సరస వినోదినీసభ; గుంటూరు ఫస్టుకంపెనీ, సెకండు కంపెనీ, నెల్లూరు ఆంధ్ర భాషాభిమాని, ఆంధ్రసభ; నరసరావుపేట విక్టోరియా మెమోరియల్ థియేటర్ పేరులోకి వచ్చాయి. నటులలో ఈమని లక్ష్మణస్వామి, మాగంటి సుబ్బారావు, టంగుటూరి ప్రకాశం పంతులు, ఇమ్మానేని హనుమంతరావు, ధర్మవరం కృష్ణమాచార్యులు, హరిప్రసాదరావు, మల్లాది గోవిందశాస్త్రి, సరస్వతి రంగస్వామి, కందాడై శ్రీనివాస్ ప్రసిద్ధిపొందారు. కందుకూరి, చిలకమర్తి, దవేం, కొండుభట్ల సుబ్రహ్మణ్యం, వడ్డాది, సెట్టి పంతులు, మారేపల్లి రామచంద్ర కవి మొదలగువారు వాసికెక్కారు. ఆనాటి నాటక రంగాన్ని గురించి గురజాడ అప్పారావు కన్యాశుల్కం పీఠికలో ఇలా వ్రాసారు (1909):

"But the condition of Telugu stage can, by no means, be considered to be satisfactory. There are no theatres worth the name and no professional actors who practice acting as art. There are not many good plays either. Modern life which presents complex social conditions is neglected by playwrights except for purposes of the broadest force and poverty of invention is manifested by the constant handling of threadbare romantic topics. Few writers display any knowledge of technique."

(కాని, ఆంధ్ర నాటక రంగం సంతృప్తికరంగా ఉందని చెప్పలేం. చెప్పుకోతగ్గ నాటక శాలలు లేవు. నటనను కళగా అభ్యసించే వృత్తి నటులు లేరు. మంచి నాటకాలు కూడా లేవు. క్లిష్ట సాంఘిక పరిస్థితులతో కూడిన ఆధునిక ప్రజాజీవితాన్ని వట్టి ప్రహసనాలలోతప్ప రచయితలు ద్యోతకం చేయకుండా అశ్రద్ధ వహిస్తున్నారు. చవకబారు శృంగార కథలు నాటకంగా వ్రాయడమేగాని రచయితలలో కల్పనాశక్తి కనిపించడంలేదు. కొద్దిమంది రచయితల నాటకాలలో మాత్రమే నాటకశిల్పం గోచరిస్తోంది.)

ఇదీ కళాదృష్ట్యా నాటి నాటక రంగ స్థితి. ఎక్కువగా పౌరాణిక కథలు, మహత్మ్యాలు తీసుకుని నాటక కర్తలు నాటకాలు వ్రాసేవారు. సాంఘికాలు బహు తక్కువ. సాంఘిక నాటకాలు రావడం లేదని చింతిల్లిన గురజాడవారే తెనుగు నాటక రచనలో గొప్ప విప్లవం తెచ్చిన *కన్యాశుల్కం* రచించారు. వీరికి ముందు వీరేశలింగంగారు బ్రహ్మవివాహం మొదలయిన ప్రహసనాలు, వావిలాల వాసుదేవశాస్త్రి *నందకరాజ్యం* రచించినా రంగస్థలం మీద ప్రదర్శింపబడి వ్యాప్తిలోకి వచ్చిన మొదటి సాంఘిక నాటకం *కన్యాశుల్కమనే* చెప్పాలి. 1896లో విజయనగరం జగన్నాథ విలాసినీ నాటక సమాజముచే ప్రదర్శింపబడింది. అప్పారావుగారి *కన్యాశుల్కం* అమోఘసృష్టి. పాత్ర పోషణలో, శిల్పంలో సాటిలేని మేటి నాటకం. ఆనాటి సాంఘికాచారాలను దుయ్యపట్టటమే

గాక నాటి వివిధ తరగతుల ప్రజల మనస్తత్వాలను ఇందులో ప్రతిబింబింపచేసారు అప్పారావు. ఇందులోని పాత్రలు సజీవములయి నేటికీ మన ముందు తారాడుతుంటాయి. ఒక్క నాటక రచనలనేగాక భాష విషయంలో, అభినయంలో గొప్ప విప్లవానికి దారితీసిన నాటకం *కన్యాశుల్కం.* వ్యవహారిక భాషావాదుల చేతికి ఒక వజ్రాయుధం దొరికింది. వ్యవహారిక భాష ఉత్తమ సాహిత్యానికి పనికిరాదనే అపవాదు తొలగిపోయింది. అభినయంలో హంగామా కృత్రిమత్వాలను తోసిరాజని వాస్తవికతను అంకురార్పణ చేసింది కన్యాశుల్కం.

ఈ కాలంలో వెలువడిన ఇంకో ఉత్తమ నాటకం *ప్రతాప రుద్రీయం.* రచన వేదం వెంకట్రాయశాస్త్రి. పాత్రోచిత భాషావాదానికి వెన్నెముక ఈ నాటకం చారిత్రాత్మకం. ఇందలి యుగంధరుడు, పేరిగాడు పాత్రలు అపూర్వ సృష్టి. స్త్రీ వేషానికి ప్రాధాన్యం లేకుండా పఠనానికి, ప్రదర్శనానికి యోగ్యమయిన నాటకం.

ధార్వాడ, పార్శీ కంపెనీలవారు ఆంధ్రదేశంలో నాటకాలాడి డబ్బు సంపాదించడం, పట్టణ పట్టణాన అనేక నాటక సమాజాలు ఏర్పడడం మూలంగా నాటకశాలలు లాభదాయకమయిన వ్యాపారంగా తోచింది. ధనవంతులు శాశ్వత నాటకశాలలు నిర్మించసాగారు.

*ఇప్పటివరకు నడుస్తున్న నాటక సమాజాలు, నటులు ధనార్జన పరమావధిగా పెట్టుకోలేదు. అంతా ఇంచుమించు ఔత్సాహికులే. ఆనాటి నాటకరంగం ఔత్సాహిక నాటకరంగం. ఈ ఔత్సాహిక నాటకరంగాన్ని వ్యాపార నాటకరంగంగా మార్చింది గున్నేశ్వరరావు. వీరు రాజమండ్రిలో 1906లో నాటక సమాజం స్థాపించి దేశంలో పేరుగడించుకున్న నటులను రప్పించి, నెలజీతాలమీద అట్టేబెట్టారు. ఇలా చేయడంవల్ల ఇతరచోట్ల కొన్ని నాటక సమాజాలు మూలపడ్డాయి. గున్నేశ్వరరావు మంచి కట్టుదిట్టంగా నాటకాలాడించాలని సంకల్పించారు. బొంబాయి నుంచి రాం అనే చిత్రకారుడిని పిలిపించి సీనరీలు వ్రాయించారు. నిజాం నుంచి పాపట్ల కాంతయ్యగారిని సంగీత దర్శకులుగా పిలిపించారు. కాంతయ్యగారు హిందూస్థానీ సంగీతంలో పండితులు. రకరకాల హిందుస్థానీ బాణీమట్లు, సంవాదాలు మన నటులచేత సాధన చేయించేవారు. కట్టుబాటుగా నాటకాలాడించారు. త్వరత్వరగా సీనులు మారిపోయేవి. ముప్పిడి జగ్గరాజుగారు, అంకరాజురామరాజు ప్రభృతులు సమాజంలోనే ఉండి పెద్ద ఖ్యాతినార్జించారు. గున్నేశ్వరరావుతో చీలిపోయి నాగేశ్వరరావు వేరే నాటక సమాజం స్థాపించి అదేపద్ధతిలో నడిపారు.*

గున్నేశ్వరరావుగారి నమూనాలోనే ఇంకా పెద్ద ఎత్తున బాలభారతీ సమాజం స్థాపించారు. దీనినే మైలవరం కంపెనీ అనేవారు. వీరు సావిత్రి, ద్రౌపది మొదలయిన నాటకాలు బహు జనరంజకంగా ఆడేవారు. వీరి సావిత్రిని చూడడానికి దూరదూర ప్రదేశాల నుంచి కూడా ప్రత్యేకంగా వచ్చేవారంటే చాలు మైలవరం కంపెనీ సంగతి తెలియడానికి ఇందులో యడవల్లి సూర్యనారాయణుడు, ఉప్పులూరి సంజీవరావు, గురజాడనాయుడు ప్రధాన భూమికలు ధరిస్తూ ప్రజాదరణకు పాత్రులయేవారు. అయితే కళాదృష్ట్యా వీరి నాటక ప్రదర్శనాలు గొప్పవని చెప్పటం కష్టం. ఆ తరవాత బందరు బాలభారతి నుంచి వచ్చి కళావేత్తల మన్ననలుగూడా పొందింది. పాపట్ల కాంతయ్యగారు మైలవరం కంపెనీలో చేరారు. ఇంక సంగీతానికేమి కొదువ? దేశ కాల పాత్రౌచిత్యం పాటించకుండా పాటలు, పద్యాలు పాడటం అతి సామాన్య విషయమైపోయింది. అభినయం, నాటక ప్రయోగంలో అసలుకంటె హంగామా ఎక్కువ మైలవరం వారిది.

ఈ కాలంలోనే బందరులో రాయలు థియేటరు, ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ, బాలభారత సంఘం; ఏలూరులో మోతేవారి కంపెనీ, చక్కటి ప్రదర్శనాలిస్తుండేవి. ముంజులూరి కృష్ణారావు, పింగళి సోదరులు, డి.వి. సుబ్బారావు, పారుపల్లి సుబ్బారావు, అద్దంకి, పంచాంగం, నగరాజరావు, జగన్నాయకులు బోటి నటులు ప్రఖ్యాతిలోకి రాసాగారు.

ఈ కాలంలోని ఇంకో విశిష్టత నాటకాల పోటీలు. ఈనాటిలా ఆనాడు ఎవరికి ఇష్టం వచ్చిన నాటకం వారు పోటీలలో ఆడే సంప్రదాయం లేదు. నిర్వాహకులు చెప్పిన నాటకమే అన్ని సమాజాలవారూ ఆడాలి. బందరు, గుంటూరు, బెజవాడ మొదలైన పట్టణాలలో *చిత్రనళీయం, రసపుత్ర విజయం, వేణీసంహారం, హరిశ్చంద్ర* మొదలయిన నాటకాల పోటీలు (1914 సం॥) జరిగాయి. ఈ పోటీలమూలంగా కళాదృష్టితో కట్టుబాటుతో నాటకాలు సాధన చేయడం జరిగింది. డి.వి. సుబ్బారావులాంటి యువ నటులు తారాజువ్వలలా పైకిలేచి యావదాంధ్ర ఖ్యాతినార్జించుకున్నారు. ఇలా పైకి వచ్చే నాటక సమాజాలలో విశిష్టతనార్జించుకున్న సమాజం బందరు ఇండియన్ డ్రమెటిక్ కంపెనీ. ఇది 1910లో స్థాపితమయి 1946 వరకు అంటే 36 సంవత్సరాలు నిరాటంకంగా మొత్తం 42 నాటకాలాడి

యావదాంధ్ర ప్రజల మన్ననలు పొందడమేగాకుండా ఆదర్శ సమాజంగా పరిగణింపబడింది. ఇన్ని సంవత్సరాలు నడిచిన సమాజం ఇన్ని రకాల నాటకాలాడిన సమాజమింకోటి యావదాంధ్రలో లేదేమో!

*ఈ కాలంలోని ఇంకో విశేషం సిద్ధాంత పరిజ్ఞానం వ్యాప్తికి బీజారోపణ. ఈ సమయంలోనే పత్రికలు ఎక్కువగా వెలువడ్డం, వాటిలో నాట్యకళను గురించి పలువురు పెద్దలు వ్యాసాలు వ్రాయడం, చర్చలు జరపడం జరిగింది. సభలు సమావేశాలే జరిపి నాట్యకళను గురించిన సిద్ధాంత వ్యాప్తికి దోహదం జరిగింది. అయితే నటులలో సమాజాలలో ఎక్కువ మార్పు వచ్చినట్టు లేదు. నటనలో, ఆహార్యంలో, సీనరీలలో ఆడంబరత్వం, కృత్రిమత్వం ఎక్కువయిందిగానీ తగ్గలేదు. సంగీతపు జోరు హెచ్చింది. హార్మోనియం, తబలాల మోతలు, పార్శీ మట్లు హాలును హోరెత్తించేవి.*

అయితే 1900–20 మధ్యనే బందరులో బి.టి. రాఘవాచారి, నరసింహాచారి, నెల్లూరులో వేదం వేంకట్రాయశాస్త్రి, కందాడై శ్రీనివాసన్ అభినయ రీతుల్లో, నాటక ప్రయోగంలో కొత్త దారి తొక్కారు. భరతముని నాట్యశాస్త్ర పద్ధతులను నాటి స్టేజీనాటకాలకి అనువుగా ఉంచాలని ప్రయత్నించారు. బందరువారి *వేణీసంహారం*, నెల్లూరువారి *శకుంతల* ఈ మాదిరి ప్రయోగాలే. అవి కళావేత్తల మన్ననలనందుకున్నాయేగాని నటులలో, ప్రజలలో వ్యాప్తిలోకి రాలేదు. పెద్దగా అభిమానం చూరగొనలేదు.

ఈ కాలపు అభినయ రీతుల్ని, నాటక ప్రయోగ విధానాలను, నాటక సంగీత ధోరణులను తెలుసుకోవడానికి బి.టి. రాఘవాచార్యులుగారి సంగీత ఇంద్ర సభ ఎంతగానో ఉపకరిస్తుంది.

పానుగంటి, బలిజేపల్లి, తిరుపతి వేంకట కవులు ప్రభృతుల నాటకాలు ప్రజాదరణ, నటనాదరణ పొందసాగాయి.

ఆంధ్ర నాటక రంగం ఇలా కృత్రిమత్వంతో, ఆడంబరంతో సాగిపోతుంటే 1920లో విప్లవాత్మకమయిన సంఘటన జరిగింది. బళ్ళారి రాఘవ అదే తొలిసారిగా బెజవాడ వచ్చి, నాటకాలాడాడు. ఈయన సాత్త్వికాభినయంలో దిట్ట. ఒక్క చూపుతో ఎంతో భావాన్ని ద్యోతకం చేయగల మేటి నటుడు. అంతవరకు ఆంగికాభినయానికి, డౌలు దర్పానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న నటులకు, ప్రేక్షకులకు కనువిప్పు కలిగింది. అభినయానికి సాత్త్వికం ప్రధానం అనే భావం ప్రబలసాగింది. రాఘవ చూపిన దారిని చాలామంది నటులు తొక్కజొచ్చారు. తెనాలి రామవిలాస సభ, ఏలూరు మోతే కంపెనీ మొదలయిన సమాజాలు కట్టుదిట్టంగా నాటకాలాడసాగాయి. సంగీతం లేకపోయినా నాటకం రక్తికట్టించి, ప్రేక్షకులను రంజింపచేయవచ్చని రాఘవ నిరూపించి చూపాడు. దీనికి విరుగుడుగానా అన్నట్లు కొందరు నటులు తిరిగి సంగీత ప్రధానమైన పాండవ నాటకాలు ప్రదర్శింపసాగారు.

1920 నాటికి దేశమంతటా జాతీయోద్యమం పెల్లుబికింది. సంస్కరణాభిలాష హెచ్చింది. ఈ రెండు ఉద్యమాల ఫలితంగా రెండు కొత్తరకాల నాటకాలు వెలువడసాగాయి. ఒక రకం చారిత్రక నాటకాలు, రెండవరకం సాంఘిక నాటకాలు. దేశభక్తిని రేకెత్తించే *రోషనార* లాంటి పూర్వ చారిత్రక నాటకాలేగాక ఆనాటి జాతీయోద్యమాన్ని చిత్రించే నాటకాలుగా వెలువడసాగాయి. ఈ రకం నాటకాలకు అంకురార్పణ చేసింది దామరాజు పుండరీకాక్షుడు. *గాంధీ విజయం, పాంచాల పరాభవం* మొదలైన నాటకాలు రచించి ఆడించారు. *రోషనార, రామరాజు* మొదలైన నాటకాలతోపాటు ఈ రకం నాటకాలను కూడా బ్రిటిష్ ప్రభుత్వం సహించలేక నిషేధించింది. గురజాడ తరువాత సాంఘిక నాటకాలమీద దృష్టిని కేంద్రీకరించింది కాళ్ళకూరి నారాయణరావు. వీరి *చింతామణి, వరవిక్రయం, మధుసేవ* విశేష ప్రచారంలోకి వచ్చాయి. తొలిసారిగా 1921లో ప్రచురితమైన చింతామణి నేటికీ విశేషంగా ప్రదర్శింపబడుతోంది.

నటులకు శాస్త్రీయ దృక్పథంతో నాటకాలాడాలనే చూపు లేకపోవడం, సంగీతపు హోరు మితిమీరిపోవడం చూసి బి.టి. రాఘవాచార్యులు, గూడవల్లి రామబ్రహ్మం 'భరతబృందం' అనే పేరుతో బెజవాడలో 1924లో స్థాపించి, అనేకమంది యువ నటులకు శిక్షణ ఇచ్చారు. ఆంధ్ర దేశంలోనేగాదు బహుశా యావద్భారతంలోనే ఇది మొట్టమొదటి నాటక పాఠశాల. అయితే ఇందులో శిక్షణ పొందిన నటులు ఈ పాఠశాల వదిలిన తర్వాత శాస్త్రీయ దృక్పథాన్ని వదలిపెట్టి పాతబాటనే పట్టటం మాత్రం విచారకరం.

1920–30 మధ్య ఆంధ్ర నాటక రంగం మొత్తం పెద్ద మార్పుకు కారణాలయిన సంఘటనలు అనేకం జరిగాయి. మొదటిది : మైలవరం కంపెనీ అంతరించిపోవడం. మోతే, తెనాలి రామవిలాస సభ కూడా నానాటికీ ఆర్థికంగా

తీసికట్టుకు దిటం. దీనితో నటలోకం నిరాధారులయి పోయారు. కల్పవృక్షం అదృశ్యమయిపోయింది. కొంచెం పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్న నటులంతా తలా ఒక సమాజం స్థాపించారు. ఈ విధంగా శక్తి వికేంద్రీకరణ కావడంవల్ల, వసుధా నటుల దగ్గర పెట్టుబడి ఎక్కువ లేకపోవడంవల్ల ఈ సమాజాలు ముందుకు సాగలేదు. నాటక సమాజాలను, నటులను పూర్తి పతనం నుంచి కాపాడేవారు కావలసి వచ్చారు. సరిగ్గా యిలాంటి సమయం చూచుకుని పెట్టుబడిదారులు కంట్రాక్టరు రూపంలో ప్రత్యక్షమయారు. నటులకు, సమాజాలకు స్వస్థత చేకూరింది. తరవాత తరవాత కంట్రాక్టు పద్ధతి పిచ్చితలలు వేసినా ఆనాడు మాత్రం ఆంధ్ర నాటకరంగం అంతరించిపోకుండా నిలబెట్టింది. ఈ పద్ధతి నాటక ప్రదర్శనలు మొదటలో కొంత కాలంపాటు సవ్యంగా నడిచినా తరువాత తరువాత నటులు రాకపోవటం, సరియైన రిహార్సల్సు లేక ఎవరికి వారే యమునాతీరే అనే ధోరణి ప్రబలడంవల్ల కంట్రాక్టు నాటకాలంటే చులకన భావం ఏర్పడింది.

ఆంధ్ర నాటక రంగంలో పెద్ద మార్పు తెచ్చి, నూతన పరిణామానికి దారితీసిన ఇంకో సంఘటన బళ్ళారి రాఘవ ఇంగ్లండు వెళ్ళిరావటం, రాఘవ ఇంగ్లండులో ఆంగ్ల నాటక రంగం చూసాడు. మన నాటక రంగం ఎంత వెనకబడి వుందో గ్రహించాడు. *స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించడంలో వుండే సహజత్వం, ప్రాశస్త్యం తెలుసుకున్నాడు. జాతి నిర్మాణానికి నాటకరంగం ఎంతగా ఉపయోగపడుతుందో అవగాహన చేసుకున్నాడు. తిరిగి భారతదేశం రాగానే స్త్రీలే స్త్రీ పాత్రలు ధరించాలనీ, జాతీయ నాటక రంగం అవతరించాలని ప్రబోధించాడు. పురుష స్త్రీ వేషధారుల పక్క వేషం వేయకూడదని నియమం పెట్టుకున్నాడు.* అప్పటికీ స్త్రీలు బందరు జగన్మోహినీ సమాజంలోనూ, గుంటూరు నవలా నాటక సమాజంలోనూ, సురభి సమాజాలలోనూ వేషాలు వేస్తున్నారు. పై సమాజాల్లో స్త్రీలు స్త్రీ పాత్రలు కూడా వేయడం కద్దు. "స్త్రీలే స్త్రీ పాత్రలు నిర్వహించాలి. పురుషులు పనికిరారు" అనే నినాదం మొదటిసారిగా లేవదీసింది రాఘవ. దీనితో నాటక రంగంలో పెద్ద మార్పు వచ్చింది. స్త్రీలు క్రమక్రమంగా స్త్రీ పాత్రలు ధరిస్తూ రావడమేగాకుండా నేడు పురుషులు స్త్రీ పాత్రలు వేస్తే ప్రేక్షకులు భరించలేని స్థితికి కూడా వచ్చింది.

ఈ కాలంలోనే ఇంకో ముఖ్య సంఘటన ఆంధ్ర నాటక కళాపరిషత్తు స్థాపన. 1927లో లాంఛనప్రాయంగా స్థాపించబడినా 1929లో రిజిష్టరై సంస్థ రూపంలో చురుకుగా పనిచేస్తూ ఆంధ్ర నాటక కళాపరిణామంలో అమోఘమయిన పాత్ర నిర్వహించింది.

సిద్ధాంత పరిజ్ఞాన వ్యాప్తికి పురాణం సూరి శాస్త్రి, గొల్లపూడి శ్రీరామ శాస్త్రి, శ్రీపాద కామేశ్వరరావు ప్రభృతులు గ్రంథాల ప్రచురణ ద్వారా, వ్యాసాల ద్వారా కృషిచేశారు.

ఈ పది సంవత్సరాల కాలంలో (1920-30) నాటక రంగాన్ని ఏలిన వ్యక్తులు ఇద్దరు. ఒకరు - కపిలవాయి రామనాథశాస్త్రి, రెండు - స్థానం నరసింహారావు. రామనాథశాస్త్రి గొంతు కంచు గీసినట్లుండేది. పద్యం చక్కగా విడమర్చి చదవడంలో అందెవేసిన చేయి. అందుచేత ఆంధ్ర ప్రజలను సమ్మోహితులను చేశాడు. స్థానం నరసింహారావు హావభావాలను ఒప్పిస్తూ వివిధ తరగతి ప్రజల మన్ననలనందుకున్నారు. వీరుగాక జొన్నవిత్తుల శేషగిరి, మాధవపెద్ది, గోవిందరాజుల సుబ్బారావు, జవర్లపూడి నరసింహారావు ప్రభృతులు మంచి ఖ్యాతిలోకి వచ్చారు. ముత్తరాజు సుబ్బారావు, సోమరాజు రామానుజరావు మొదలయినవారి రచనలు స్టేజిమీద ప్రాబల్యం వహించాయి.

ఇంతవరకు అంటే 1930 వరకు ప్రబలంగా ఉన్న విశిష్ఠ గుణం నాటకరంగంలో వ్యక్తి ప్రాధాన్యం, సమాజం పేరుకంటే వ్యక్తికే పేరు హెచ్చు. సమష్టి కృషికంటే వ్యక్తి ప్రతిభతో నాటకరంగం సాగిపోతోంది. శాస్త్రీయ దృక్పథం లేకపోవడానికి కూడా ఇది కొంత కారణం. ఫలానా సమాజం వేసే నాటకం చూడాలి అనటంకంటే ఫలానా నటుడి ఫలానా వేషం చూడాలి అనేదే ఎక్కువ వాడుక అయింది. సమాజం పేరు, సమష్టి కృషి వెనకకు తగ్గి, వ్యక్తి ప్రాధాన్యం ముందుకు వచ్చింది.

1930కి వచ్చాం. కాలం మారింది. వివిధ దేశాల నాటక సాహిత్యంతో, నటనారీతులతో మనవారికి పరిచయం ఏర్పడింది. సోషలిస్టు సిద్ధాంత భావాలు వ్యాప్తిలోకి రాసాగాయి. జాతీయోద్యమం తారాస్థాయి నందుకుంది. ఆంధ్ర నాటక రంగంలో ఇవన్నీ నూతనాధ్యాయనానికి దారితీశాయి. పి.వి. రాజమన్నారు గారు *తప్పెవరిది?* అనే వచన సాంఘిక నాటకం వ్రాసారు. ఇందులో కథ సారంగధర లాంటిదే. దీనిని బళ్ళారి రాఘవ విజయవంతంగా ప్రదర్శించారు. దాంతో పూర్తిగా వచన నాటకాలు ఆడి రక్తికట్టించవచ్చేనే భావం బయలుదేరింది. రచయితలకు వచనంలో వ్రాసే ధైర్యం చిక్కింది. అసలు *తప్పెవరిది?* లోని

శిల్పమే అంతకు ముందటి నాటక శిల్పానికి విభిన్నమయింది. వాస్తవికతకు ఎక్కువ ప్రాధాన్యం లభించింది. కొత్త పోకడలు పోవాలని రచయితలకు ఉత్సాహం కలిగించింది. *తప్పెవరిది?* నాటకం రాఘవ ప్రదర్శించిన విధానం నటులకు నాటక కళాభిమానులకు కనువిప్పు కలిగించింది. నాటినుంచీ విరివిగా పూర్తిగా వచనంలో నాటకాలు రాసాగాయి.

గున్నేశ్వరరావుగారు వ్యాపార రంగంగా మన నాటక రంగాన్ని మార్చినా ఔత్సాహిక నాటక సమాజాలు అంతరించిపోలేదు. సామాన్యంగా ప్రతి పట్టణాన, పెద్దపెద్ద గ్రామాలలో ఔత్సాహిక నటులు నాటకాలాడుతూనే ఉన్నారు. కానీ ఆ సమాజాలు వృత్తి నాటక సమాజాలు కావు కాబట్టి స్థానికంగా ప్రదర్శనలిస్తూ ఉండిపోయేవి. అంతేగాక ఇందులో పాల్గొనేవారు విద్యాధికులు, ఏదో ఇతర వృత్తులు చేసుకునేవారవడంవల్ల ఇతర పట్టణాలకు తరచూ వెళ్ళి, నాటకాలాడడం వారికి సాధ్యం కాకపోయింది. అట్టివాటిలో చెప్పుకోతగ్గవి బందరు చిత్ర కళాభివర్ధని, నేషనల్ థియేటరు. చిత్ర కళాభివర్ధని వారు ముద్రారాక్షసం వంటి రసవత్తర సంప్రదాయ నాటకాలు ఆడారు. నేషనల్ థియేటర్ వారు పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలాడేవారు.

ఈ కాలంలో విశాలాంధ్రమంతటినీ ఉర్రూతలూగించిన నాటకం *సక్కుబాయి*. రచన మల్లాది అచ్యుతరామ శాస్త్రి. ఇందులోని నటులంతా నటనను వృత్తిగా పెట్టుకున్నవారైనా కీ.శే. దైతా గోపాలం శిక్షణ క్రింద మంచికట్టుగా ప్రదర్శనలిచ్చారు. ఇంకొక విశేషం – ఒకే నాటకం రోజులకుతరబడి ఒకేచోట ప్రదర్శించి, ప్రజల మన్ననలు పొంది చరిత్రనే సృష్టించారు.

గద్య పద్య గేయ నాటకాలు సంగీత నాటకాలుగా తయారుకావడంవల్ల కంట్రాక్టు పద్ధతి అభాసుపాలు గావడంవల్ల ఔత్సాహిక నాటకరంగం మళ్ళీ పుంజుకుని దినదినాభివృద్ధి గాంచసాగింది. కళాశాల, హైస్కూలు విద్యార్థులు చొరవచేసుకుని నాటకాలు, నాటికలు ఆడడం మొదలుపెట్టారు.

గుంటూరు ఆంధ్ర నాటక కళాపరిషత్తుకు (1937 అని గుర్తు) వచ్చి హరీంద్రనాథ ఛటోపాధ్యాయ ఆంధ్ర నాటక రంగానికి కొత్త సందేశం ఇచ్చాడు. సమష్టి కృషితో నాటకాన్ని రక్తికట్టించవలసిన అవసరాన్నేగాక తెరల విషయంలో నూత్న దృక్పథం కలగజేశాడు. అప్పటివరకు ఏ అడవి దృశ్యమో చిత్రించిన తెర దింపి, ఆ రంగం అడవి అని ప్రేక్షకులను అనుకొనుమనేవారు. అటువంటి తెరలు కృత్రిమంగా ఉండటంవల్ల వాటిని తొలగించి, వాటి స్థానే గుడ్డగాని, కాగితాలవిగాని ఏ చిత్రాలూ లేని వట్టి రంగువి తెరలుగా ఉపయోగించి, ఆ దృశ్యాన్ని ప్రేక్షకుల భావనాశక్తికే వదిలివేయడం ఉత్తమం అని సలహా ఇచ్చాడు హరీన్. 1938లో బందరులో వేటూరి చంద్రశేఖరం రచించిన *కాంచనమాల* నాటక ప్రదర్శనం అటువంటి ప్రయోగమే. దీనిలో నటించిన దాడి గోవిందరాజులు, కందికొండ సత్యనారాయణశాస్త్రి ప్రభృతులు, సంస్కృతీపరులు, నిర్వహణ పింగళి నాగేంద్రరావు. కళాదర్శకత్వం, ఆహార్యం అడివి బాపిరాజు. ఆయా రంగాలలోని ప్రధాన రసాలకు అనుగుణమయిన రంగు తెరలను వాడారు. ఆహార్యంలో, రంగాలంకరణలో, దేశ, కాల పాత్రౌచిత్యాలను గమనించారు. సమష్టికృషి నాటకానికి వన్నెతెచ్చింది. ప్రయోగంలో కొత్త పోకడలు గోచరించాయి. నాటినుంచి ఔత్సాహిక నాటక సమాజాలు ఈ ఒరవడినే నాటకాలాడడం ప్రారంభించాయి.

*సుమారు 1930 నుంచి చిన్న నాటికలు ఎక్కువగా వెలువడసాగాయి. భమిడిపాటి కామేశ్వరరావు హాస్యనాటికలు యువకులను ముఖ్యంగా విద్యార్థులను ఎక్కువగా ఆకర్షించసాగాయి. ముద్దుకృష్ణ, నార్ల వెంకటేశ్వరరావు, పి.వి. రాజమన్నారు మున్నగువారు రకరకాల నాటికలను రచించి, ప్రచురించసాగారు.*

ఈ కాలంలోనే ఆధునిక పాశ్చాత్య నాటకాలు, ఎక్కువగా లభ్యం కావడం ప్రారంభించడంవల్ల రచయితలకు నాటక శిల్పంలో కొత్త లోకాలు గోచరించసాగాయి. ఆధునిక నాటకాలతో, ఆధునిక, ఆర్థిక, తత్వశాస్త్ర సిద్ధాంతాలు ప్రచారంలోకి వచ్చి, రచయితల దృక్పథమే మారజొచ్చింది. 1930 వరకు రచనలు సాగించిన నాటక కర్తలు, భావవాదులు గతం అంటే వారికి ఎక్కువ అభిమానం – అందుకే వారు పౌరాణిక, చారిత్రక నాటకాలు ఎక్కువగా వ్రాసారు – చింతామణి లాంటి సాంఘిక నాటకాల నాయకులు ధనవంతులు, పైతరగతివారు. ప్రజాస్వామ్య భావాలు వ్యాప్తిలోకి రావడంతో రచయిత దృష్టి సామాన్య మానవుడిమీదకి వెళ్ళింది. నాటకంలో కూడా సామాన్య మానవుడికి, వాస్తవికతకు ప్రాధాన్యం ఇవ్వాలనే భావం ప్రబలంగా జొచ్చింది. ఔత్సాహిక నటకుల దృష్టి కూడా వాస్తవికతవైపు మళ్ళింది. రాజకీయ చైతన్యం అశేష ప్రజానీకంలో హెచ్చింది. పురాణాలకు నూతన వ్యాఖ్యానాలు

చేస్తూ విమర్శకులు రచించసాగారు. ఆ వ్యాఖ్యానాల ఫలితాలే త్రిపురనేని రామస్వామిచౌదరి 'ఖూనీ', ముద్దుకృష్ణ 'అశోకం'.

రాజకీయ, సాంఘిక చైతన్యం రచయితలలో, ప్రజలలో హెచ్చడంతో సమకాలీన రాజకీయ, సాంఘిక పరిస్థితులను ప్రతిబింబింపచేస్తూ రచనలు సాగించ తలపెట్టారు యువ రచయితలు. సంఘంలో ఎంతో కుళ్ళు పేరుకుపోయింది. కుల, మత, సంప్రదాయాలు జాతి పురోభివృద్ధికి వేరు పురుగులా తయారయాయి. ధనవంతుడు ఇంకా ధనవంతుడు కావడానికి, బీదవాడు ఇంకా బీదవాడు కావడానికి మన ఆర్థిక పరిస్థితి తోడ్పడుతుంది. ధనవంతుడు బీదవానికి ధర్మకర్త అనే సిద్ధాంతం అమలులోకి నాటికీ నేటికీ రాలేదు. బీదవాడిని ధనవంతుడు అనేక విధాల దోపిడీ చేస్తున్నాడని యువ రచయితలకు దృఢవిశ్వాసం ఏర్పడింది. పైగా విదేశీ పరిపాలన, దాస్యం వీటన్నింటిమీద నాటకం ద్వారా తిరుగుబాటు లేవదీసారు రచయితలు. వీటికితోడు సినిమా బాగా వ్యాప్తిలోకి వచ్చింది. తెలుగులో అనేక చిత్రాలు విడుదలయి ప్రజలను అపరిమితంగా ఆకర్షింపజొచ్చాయి. తక్కువ ఖర్చుతో సినిమా చూసి, ఆనందించే అవకాశం నాటకరంగం మీద సినిమా శిల్పాన్ని ప్రవేశపెట్టి అంతకు ముందు చూపలేని అనేక భావాలను, సంఘటనలను ద్యోతకం చేయడానికి, కొత్త దారులు తొక్కడానికి రచయితలకు, ప్రదర్శనలకు సినిమా ఉపకరించింది.

రచయితలలో, నటులలో ఆవిర్భవించిన ఈ నూతన భావాలకు, కొత్త పోకడలకు దోహదం చేయడానికి నడుంకట్టిన సంస్థలలో ముఖ్యమైనవి. 1. ఆంధ్ర నాటక కళాపరిషత్తు, 2. వేంకటగిరి అమెచ్యూర్సు, 3. ప్రజా నాట్యమండలి, 4. తెలుగు లిటిల్ థియేటర్, 5. ఆంధ్ర విశ్వవిద్యాలయ నాటకశాఖ.

1929లో స్థాపితమయిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఏటేటా సభలు, ఉత్సవాలు జరుపుతోంది. 1944–45 లో పరిషత్తు యం.ఆర్. అప్పారావు ఆధ్వర్యంకిందకు వచ్చిన తరువాత ఔత్సాహిక నాటక రంగాభివృద్ధికి చేయూతనిచ్చి కొత్త పోకడలకు దోహదం చేయాలనే ఉద్దేశ్యంతో ఏటేటా నాటక నాటికల పోటీలు ఏర్పాటు చేస్తోంది. ప్రతి సంవత్సరం పోటీలు జరపడంవల్ల చాలా లాభాలు చేకూరాయి. పోటీకి ప్రదర్శనం ఇవ్వవలసి వున్నందున నాటక సమాజాలు కట్టుబాటుతో సాధనచేసి, కట్టుగా ప్రదర్శన ఇవ్వవలసిన వచ్చింది. పరిషత్తు సమష్టి కృషికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంవల్ల ఈ మేలు చేకూరింది. నటులు, రచయితలు తమతమ శక్తిసామర్థ్యాలను చూపెట్టే అవకాశాలు ఎక్కువ కావడంతో వారిలో మంచి ఉత్సాహం రేకెత్తింది. పూర్వంలాగా అన్ని సమాజాలవారూ ఒకే నాటకం ఆడాలనే నియమం లేనందున సమాజాలకోసం సంవత్సరం సంవత్సరం అనేక సాంఘిక నాటకాలు వెలువడసాగాయి. స్త్రీలే స్త్రీ పాత్రలు ధరించాలనే నియమం పెట్టడం మూలంగా స్త్రీలు నాటకరంగం మీదకు రావడానికి ప్రోత్సాహం ఎక్కువగా లభించింది. ప్రతి సంవత్సరం ఈ పోటీలు ఒకేచోట జరపకుండా సంవత్సరానికో పట్టణంలో జరపడంవల్ల పట్టణ పట్టణానా ఉత్సాహం వెల్లివిరిసింది. నటీనటులకు, రచయితలకు తమ ప్రతిభను నలుదిక్కులా ద్యోతకంచేసి, యావదాంధ్రలోనూ పేరు సంపాదించుకోవడానికి అవకాశం చిక్కింది. ఆధునిక, సాంకేతిక పరికరాలను ఉపయోగించి, నాటక ప్రదర్శనాలివ్వడానికి ప్రోద్బలం కలిగింది. ఈ విధంగా ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఆధునిక నాటక రంగానికి ఎనలేని దోహదం చేసి ఇప్పుడు రజితోత్సవం చేసుకుంటోంది.

ఆ తరువాత చెప్పుకోతగ్గవి వెంకటగిరి అమెచ్యూర్సు, ప్రజా నాట్య మండలి. ఈ రెండు సంస్థలు 2, 3 సంవత్సరాల తేడాతో స్థాపించబడి ఆధునిక నాటక రంగాన్ని అభ్యుదయ మార్గాన తీసుకువెళ్ళడానికి నడుంకట్టాయి. యువ నటీనటులు, రచయితలు కంటున్న కలలు, తొక్కదలచిన కొత్త మార్గాలకు రూపం ఇచ్చి ఆచరణలోపెట్టి చూపించాయి ఈ రెండు సంస్థలు. నాటకం రక్తి కట్టి, అశేష జనాదరణ పొందాలన్న, కవి ఈయదలచిన సందేశం ప్రేక్షక హృదయాలకు హత్తుకోవాలన్న వ్యక్తి ప్రతిభయే కాకుండా సమష్టి కృషి చాలా ముఖ్యమని ఈ రెండు సంస్థలూ గ్రహించాయి. అందుబాటులో ఉన్నంతరవరకు ఆధునిక, సాంకేతిక పరికరాలను ఉపయోగించడం కూడా నాటక రక్తికి దోహదమిస్తుందని తెలుసుకున్నాయి. ఆ విధంగా కృషి చేసి, ఎన్నో కళాఖండాలను అర్పించాయి. వెంకటగిరివారి యన్.జి.ఓ.; ప్రజా నాట్య మండలివారి *మా భూమి* లక్షలాది ప్రజలను తనియింపజేసింది. పూర్వంలా ఫలానా నటుడి ఫలానా వేషం చూడాలనడంకంటె ఫలానా సమాజంవారి ఫలానా నాటకం చూడాలనే మాట ముందుకువచ్చింది. నటుల పేరుకంటే సమాజాల పేరు ఎక్కువ వ్యాప్తికి వచ్చింది. సమష్టి కృషికి విజయపతాక ప్రజా నాట్య మండలి. ఒక్క నాటక కళకే కాకుండా బుర్రకథ, చెంచుకథ మొదలైన ఇతర

నాట్యకళారూపాల అభివృద్ధి కూడా దోహదం చేసింది. ఈ రెండు సంస్థలకు ఎక్కువగా నాటకాలు వ్రాసి ఇచ్చిన కొండముది గోపాలరాయ శర్మ, ఆచార్య ఆత్రేయ, సుంకర, వాసిరెడ్డి ఆధునిక నాటకాలు రచించడంలో దిట్టలని పేరుపొందారు.

చాలా సంవత్సరాలుగా ఏకాంక నాటికలు రచింపబడుచున్నా అవి కళాశాలల వార్షికోత్సవాలలోను, సభలు, సమావేశాలలోను ప్రదర్శింపబడుతూ వచ్చాయేగాని టిక్కెట్లు పెట్టి బహిరంగంగా ప్రదర్శించబడలేదు. టికెట్లుపెట్టి నాటికలు ప్రదర్శించడానికి అంకురారోపణ చేసింది కీ.శే. కొప్పరపు సుబ్బారావు. తాము రచించిన 'అల్లీ ముఠా' మొదలైన నాటికలు, ఇతర్లవి 1945లో విజయవాడలో ప్రదర్శింపజేశారు. నాటినుంచీ నాటికాప్రదర్శనలు బహుళ ప్రచారానికి వచ్చాయి. కొద్దిమందితో చిన్నచిన్న నాటక సమాజాలు అనేకం ఏర్పడి ప్రదర్శనాలివ్వడానికి మంచి అవకాశం ఇచ్చింది. సమాజాలు ఎక్కువయినకొద్దీ వారికి కావలసిన నాటికలు కూడా కావలసి రావడంవల్ల రచయితలు నాటికలు కూడా కావలసి రావడంవల్ల రచయితలు నాటికల మీద ఎక్కువ దృష్టిని కేంద్రీకరించసాగారు. కొప్పరపు సుబ్బారావు లిటిల్ థియేటరు ఉద్యమం లేవదీసి మంచి నాటక గ్రంథాలయం స్థాపించారు. దాని ఫలితంగా అనేకమంది యువ నటులకు, రచయితలకు నాటక కళకు సంబంధించిన వివిధ శాఖల సిద్ధాంత, సాంకేతిక పరిజ్ఞానం కలిగింది. ఆధునిక, సాంకేతిక పరికరాలు తెప్పించి, వివిధ సమాజాలు వాటిని ఉపయోగించే అవకాశం కలిగించారు.

వివిధ దేశాల నాటక ప్రయోగ రీతులను, నాటకశాల నిర్మాణ రీతులను ఆకళింపు చేసుకున్న దిట్ట కూర్మా వేణుగోపాలస్వామి. ఆంధ్ర విశ్వవిద్యాయ రిజిస్ట్రారుగా చేరక పూర్వం నుంచీ కూడా నాటకాలు ప్రయోగింపజేశారు. చేరిన తర్వాత విద్యార్థులలో ఎంతో నాటకాభిమానం కలిగించారు. ప్రతి సంవత్సరం విశ్వవిద్యాలయ విద్యార్థులచేత చక్కగా నాటకాలాడిస్తూ విశ్వవిద్యాలయంలో ఆధునిక, సాంకేతిక పరికరాలతో కూడిన నాటకశాల నిర్మింపచేసి, నాటక కళకు ఎంతో సేవ చేస్తున్నారు.

వెంకటగిరి ఎమెచ్యూర్సు, ప్రజా నాట్య మండలి చిన్నాభిన్నమయినాక వాటి చోటనే ఆంధ్ర ఆర్ట్ థియేటర్, రాఘవ కళాసమితి, నటరాజ కళాసమితి, ఐ.యన్.టి. ఆదర్శ నాట్యమండలి, రసన సమాఖ్య, నవ్య కళామండలి మొదలైన అనేక నాటక సమాజాలు సమష్టి కృషిని, వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని నాటకాలు, నాటికలు వ్రాస్తున్నారు.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు నాటిన పోటీల బీజం మహావృక్షంగా పెరిగింది. పట్టణాలలో పెద్దపెద్ద గ్రామాలలో నేడు పోటీలు జరుపుతున్నారు. ఇది పోటీల యుగమా అనిపిస్తుంది. ఇందువలన దేశం నలుమూలలా నాటకరంగం అంటే అమితోత్సాహం రేకెత్తింది. కాని సత్ఫలితాలతోపాటు దుష్ఫలితాలు కూడా ఎక్కువగా కలుగుతున్నాయి. ఈ పోటీల మూలంగా నాటక సమాజాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. నటులలో కొంతకు కొంత అహంభావం పెరుగుతుంది.

ఆంధ్ర నాటక సమస్య 1956లో విజయవాడలో, 1957లో రాజమండ్రిలో నాటక కళాశిక్షణ తరగతులను నడిపి, మరొకసారి నాటక కళాతరగతుల ఆవశ్యకతను నిరూపించింది.

న్యూఢిల్లీలోని భారతీయ నాట్య సంఘం కార్యకలాపాలు ఆంధ్రదేశానికి విస్తరించాయి. ఆంధ్ర నాటక కళాపరిషత్తు కొంతకాలం నడిపి విడిచివేసిన *నాట్యకళ* పత్రికను నాట్య సంఘం పునరుద్ధరించి విజయవాడ నుంచి నడుపుతోంది. నాటక నాటికల రచనలందు పోటీలు జరిపి బహుమతులిస్తోంది. తెలుగు నాటకాల భోగట్టాను తెలిపే 'బిబ్లియోగ్రఫీ'ని తయారుచేస్తుంది. ఈ నాట్య సంఘపు ఆంధ్రశాఖ హైదరాబాదు కేంద్రంగా ఏర్పడి, పలు ముఖాలుగా నాటక కళాసేవకు పూనుకుంది. హైదరాబాదులో 40 రోజులపాటు ఏక వరసన నాటకోత్సవాలు జరిపింది. జానపద కళారూపాల పరికరాలను, దుస్తులను సేకరిస్తోంది. ఇంకా అనేక విధాల నాటకోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి పథకాలు తయారు చేస్తోంది ఆంధ్రప్రదేశ్ నాట్యసంఘం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంగీత నాటక అకాడమీని స్థాపించి, దాని ద్వారా వృద్ధ నటీనటులకు, పత్రికలకు, గ్రంథాలకు ఆర్థిక సహాయం చేస్తోంది. కూచిపూడి నాట్య సదస్సు జరిపి, ఆ కళను పురోభివృద్ధిలోకి తీసుకురావడానికి పూనుకుంది. సంగీత నృత్య కళాశాలలను ప్రభుత్వం నడుపుతుంది.

విజయవాడ మొదలైన పట్టణాలలో ప్రేక్షక సంఘాలు ఏర్పడి, ఔత్సాహిక నాటక సమాజాలకు చేయూతనిస్తున్నాయి.

యావత్ప్రపంచంలో ప్రమాణ గ్రంథాలుగా పరిగణింపబడుతున్న బొలెస్లవస్కీ, స్టానిస్లావస్కీ రచనలు (నటన, అభినయం) యావద్భారతంలో తొలిసారిగా తెలుగులో

వెలువడ్డాయి. సమగ్ర వ్యాఖ్యానంతో భరతముని 'నాట్యశాస్త్రం' (అనువాదం : శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు) వెలువడింది. వివిధ ప్రచురణల సంస్థలవారు నాటక నాట్య లక్షణ, విమర్శక గ్రంథాలు ప్రకటిస్తున్నారు. వీటన్నింటివల్ల సిద్ధాంత పరిజ్ఞానం వ్యాపిస్తోంది. శాస్త్రీయ దృక్పథం ఏర్పడుతోంది.

పూర్వ నాటక రంగం కళాదృష్టితో చూస్తే నానాటికీ తీసికట్టుగా ఉంది. ముగ్గురు కృష్ణులు, ముగ్గురు దుర్యోధనులతో విచిత్రంగా తయారయింది. వెనకటి నాటకరంగం మారిపోయి, నూతన నాటకాలు, నూతన రంగస్థలం ఆవిర్భవించాయి. ఈ నూతన యుగపు లక్షణాలను సమీక్షించి వ్యాసం ముగిస్తాను.

## ఇతివృత్తం

పూర్వ నాటకాలలో పురాణ పురుషులకు, రాజు, రాణి, ధనికుడు మొదలైన పై తరగతి పాత్రలకు ప్రాధాన్యం హెచ్చుగా ఉండేది. వారి సుఖదుఃఖాలను చిత్రించటమే రచయిత పరమావధిగా భావించాడు. భావవాదం ప్రాబల్యం వహించింది. కాని, నేడు కాలంతోపాటు ప్రజాస్వామ్య భావాలు వ్యాప్తిగాంచడంతో ఈ పద్ధతి తారుమారయింది. నాటకాలలో కూడా సామాన్య మానవుడికి ప్రాధాన్యం హెచ్చింది, నాయకత్వం లభించింది. మధ్యతరగతి గుమస్తా, కూలి, రైతు, బడిపంతులు, పతితులు, తాడితులు వారి సుఖదుఃఖాలు, జీవిత సంఘర్షణలు, వారి ఆలోచనలు, కలలు, శాంతి కాముకత, ధనిక, బీద వర్గాల సంఘర్షణ నాటకాలలో, నాటికలలో చిత్రితమవుతున్నాయి. అపరాధ పరిశోధక నవలల ప్రభావం పడి అపరాధ పరిశోధన ఇతివృత్తంగా నాటకాలు, నాటికలు వెలువడుతున్నాయి. సాంఘిక నాటకాల సమస్యా, పరిష్కారం కూడా పిస్తోళ్ళతో, పోలీసులతో జరుగుతుంది. భారత రాజకీయ జీవితంలో వచ్చిన పరిణామాలను ఇతివృత్తంగా తీసుకుని నాటకాలు, నాటికలు రచిస్తున్నారు.

## శిల్పం

పంచ సంధులకు బదులు సాధారణంగా మూడు సంధులనే (ప్రారంభం, పరాకాష్ఠ, నిర్వహణ) వాడుతున్నారు. అంక విభజన చేయకుండా కొంతకాలం గడిచిందని సూచించడానికి ఫేడిన్, ఫేడౌట్‌లు నాటి నాటకంలో గమకాన్ని నిలబెడుతున్నారు. స్వగతాలు వాడకుండా పాత్రల భావాలను, మానసికావస్థలను నేపథ్య గానంతో ద్యోతకం చేస్తున్నారు. ప్రేక్షకులు కూడా రసప్రపంచంలో భాగస్వాములేననే తలంపుతో పాత్రలను ప్రేక్షకుల మధ్య కూర్చోబెట్టడం, ప్రేక్షకులతో సూటిగా మాటాడించటం సాగిస్తున్నారు. స్వాప్నిక జగత్తును సినిమాలోలాగా పాత్రల ఛాయలు లేచి నడిచి పోయినట్టు ప్రదర్శిస్తున్నారు. నాటికలలో ఛాయానాటకాలు చొప్పిస్తున్నారు. నాటకమంతా ఒక పాత్ర ఇంకో పాత్రతో వర్ణించి చెపుతున్నట్లు కథ నడిపిస్తున్నారు.

## నాటక ప్రయోగం

నాటక ప్రయోగంలో ఈ నూతన యుగపు విశిష్ట లక్షణం సమష్టి కృషి. పూర్వం సమష్టి కృషికంటే వ్యక్తులకు ప్రాధాన్యం హెచ్చుగా ఉండేది. ప్రతి పాత్రధారీ తన శక్తిసామర్థ్యాలను చూపెట్టాలనే ఆదుర్దాకొద్దీ మొత్తం నాటక ప్రదర్శనాన్ని దృష్టిలో పెట్టుకోకుండా ప్రవర్తించేవారు. దానివల్ల నాటక ప్రదర్శనం తరచూ రసాభాసగా తయారవుతుండేది. అటువంటిది పోయి సమష్టి కృషి హెచ్చింది.

అభినయంలో పూర్వపు కృత్రిమత్వం, హంగామా తగ్గింది. ఆంగికాభినయంకంటే సాత్వికాభినయానికి ప్రాధాన్యం హెచ్చింది. శాస్త్రీయ దృక్పథం అలవర్చుకునే యత్నం జరుగుతోంది. సహజత్వం, వాస్తవికతకు ప్రాధాన్యం లభించింది. పాత్రౌచిత్యం పాటించటంమీద దృష్టి ఎక్కువయింది. పూర్వం నటులు ప్రేక్షకుల మెప్పుకోసం పాత్రౌచిత్యం పాటించకుండా స్వంత కవిత్వం మాటాడటం, ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించటం సాగించేవారు.

అభినయమే నాటక ప్రయోగానికి ఆయువుపట్టని తక్కినవాటి విషయం అంత జాగ్రత్త తీసుకునేవారు కారు పూర్వ నటులు. ఇటువంటి అభిప్రాయంపోయి ప్రయోగానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ నేటి నటులు, ప్రయోక్తలు జాగ్రత్త తీసుకుంటున్నారు. పూర్వం మేడను చిత్రించిన తెరను ఏ అంతఃపురమో అనుకొనుమనేవారు. అలాగే దర్బారు సీను. నాలుగు విరిగిన కుర్చీలతో దర్బారు తీర్చేవారు. ఇప్పుడు చక్కటి సెట్టింగులు కట్టి, దానిలో రంగౌచితమైన వస్తువులు అమరుస్తున్నారు లేదా వట్టి రంగు తెరలు కట్టి, దృశ్యం ప్రేక్షకుల భావనాశక్తికి వదులుతున్నారు.

మేకప్, ఆహార్యాల విషయంలో పూర్వం ఏ కొద్దిమంది స్త్రీ వేషధారులలో తప్ప తక్కినవారు ఎక్కువ శ్రద్ధ వహించేవారు కారు. దేశ కాల పరిస్థితులను గమనించేవారు కారు. నేడు అలా కాకుండా మేకప్ విషయంలో శ్రద్ధవహిస్తున్నారు. దేశ కాల పరిస్థితులను సాధ్యమయినంతవరకూ గమనిస్తున్నారు.

పూర్వం దూర శ్రవణ యంత్రాలు లేవు. చివర కూర్చున్న ప్రేక్షకుడికి వినిపించవలసి ఉన్నందున గొంతెత్తి పెద్దగా

వాచికం చెప్పవలసి వచ్చేది. స్థాయీ భేదాలూ ఎక్కువగా చూపించడానికి వీలుండేది కాదు. గాలి వాన హోరు, ఉరుములూ సముద్ర ఘోష మొదలయినవి పూర్వం సాధ్యమయ్యేవి కావు. ఇప్పుడు సాంకేతిక పరికరాల మూలంగా అటువంటి 'ఎఫెక్టు'లు సాధ్యమయి ప్రేక్షకులను నాటక భ్రమలో ముంచడానికి దోహదం చేస్తున్నాయి.

**అలాగే దీపాలు :** పూర్వం గ్యాసు లైట్ల ముందు, మామూలు విద్యుత్ దీపాల ముందు నటించవలసివచ్చేది. దూరాన ఉన్న నటుల హావభావాలు స్పష్టంగా కనిపించే అవకాశం లేనందున ఎక్కువగా హంగామా చేయవలసి వచ్చేది. ముఖంలో భావం స్పష్టంగా గోచరింపచేయడానికి కృత్రిమంగా ముఖంపెట్టడం, ముఖ కండరాలను అతిగా కదిలించటం చేయవలసి వచ్చేది. నేడు ఫుట్‌లైట్లు, ఫ్లాష్‌లైట్లు, స్పాట్‌లైట్లు, డిమ్మర్లు ఉపయోగించే అవకాశాలు కలిగినందువల్ల సహజంగా అభినయించడానికి ఎక్కువ వీలు చిక్కుతోంది. సూర్యోదయం, అస్తమయం, నిశ మొదలయినవి పాత్రలచేత వర్ణించి చెప్పనక్కరలేకుండా దీపాల కాంతితో ద్యోతకం చేయడానికి వీలవుతుంది. నేడు బళ్ళారి రాఘవ స్థాయిని అందుకున్న మహానటులు లేకపోవచ్చు. కానీ ఎంతో అభివృద్ధి నటసామాన్యంలో గోచరిస్తోంది. ఆధునిక నాటక రంగం సమష్టి కృషితో కొత్త పోకడలతో, కొత్త శృంగారాలతో విరాజిల్లుతోంది.

**(ఆంధ్ర నాటక కళాపరిషత్తు రజితోత్సవ సంచిక)**

---

## Statement about ownership and other particulars of **MISIMI**

**FORM IV (SEE RULE - 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 5. | Editor's Name | : | CHENNURU ANJANEYA REDDY |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd.,<br>1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

**ALAPATI BAPANNA**
Publisher

Date : March 31, 2016.

## శాస్త్రము – మతము :
# ద్వంద్వానుబంధం

– చందు సుబ్బారావు

భౌతిక ప్రపంచాన్ని అర్థంచేసుకొనే ఒక పద్ధతిని 'శాస్త్రం'గానూ, దృశ్య, అదృశ్యమాన ప్రపంచంలోని శక్తులను ఊహించి, విశ్వసించి సాంఘిక ప్రవర్తనను నిర్దేశించే తత్వాన్ని 'మతం'గానూ విజ్ఞులు నిర్వచించారు. రెండూ పరస్పర ప్రభావం కలిగిన ఆలోచనా ధోరణులుగా నేటికీ విరాజిల్లుతున్నాయి. చరిత్రలోని అన్ని సందర్భాల్లోనూ ఈ రెండూ ఘర్షించాయి, పోరాడాయి; తిరిగి సహజీవనానికి రాజీపడ్డాయి. వీటి పుట్టుక, పెరుగుదలచూసి 'కవలలు' అనవచ్చునన్నారు కానీ... మతం శాస్త్రాభివృద్ధికన్నా ముందు నుంచీ వున్న పెద్దన్న కనుక 'స్నేహవైరుధ్యం' వున్న ద్వంద్వం అనటమే సమంజసం. స్నేహం ఏమిటి... శతృవైరుధ్యమేనని కొందరు వాదించినా, మానవాళి పురోగతిలో రెండూ తమ పాత్ర పోషించాయి. పైగా శతృవైరుధ్యమే అయితే యిప్పటికే రెండూ అంతరించి, మూడవ ప్రక్రియ పుట్టవలసింది; అలా జరగలేదు.

మానవుడు వేటాడి, ఆహారాన్ని సంపాదించి, వండి భుజించే కాలంలోనే చావు, వ్యాధి, సమాధివంటి జీవన దశలు, భూకంపం, తుఫాను, వరదలు, క్రూర జంతువుల దాడి వంటి ప్రకృతి సంఘటనలు భయపెట్టి అతనిని తాంత్రిక చర్యలవేపు పురిగొల్పాయి. మానవాతీత శక్తి ఉందన్న అనుమానం విశ్వాసంగానూ, అనంతరం అభిమానంగానూ, తత్ఫలితంగా వినయ విధేయతలు కలిగి వుండాల్సిన అవసరంగానూ రూపొందింది. క్రీ.పూ. 8000 (నియోలిథిక్ యుగం) నాటికే క్రూర జంతువుల నుండి మనిషిని, ప్రకృతి వైపరీత్యాల నుండి పంటను, ప్రమాదాల నుండి స్త్రీ, పశు, శిశు, వృద్ధులనూ రక్షించే తతంగం ఏర్పాటూ జరిగింది. దాని నిర్వాహకుడు 'సమూహంలో పెద్ద'గానూ రూపొందాడు. క్రీ.పూ. 5000 నాటికే సుమేరియన్ నాగరికతలో సూర్యారాధన కనిపిస్తుంది. సూర్యుడు దినకరుడేగాక – ప్రధాన వ్యవసాయదారుడు, ప్రధాన కుమ్మరి, ప్రధాన ప్రాణాధార జలప్రదాత. ఈజిప్షియన్ నాగరికతలో స్వర్గదేవతను, భూదేవతను, సత్యదేవతను ఆరాధించినట్లు గుహాంతర చిత్రాలు సూచిస్తున్నాయి. మార్మికతను ఆరాధించే కర్మకాండ ఒకవైపూ – ప్రకృతితో పోరాడి జీవనం సాగించే పరికరాలు, పద్ధతులూ సక్రమ అవగాహనలో అలవాట్లూ మరోవైపూ కొనసాగాయి. తుఫాను బీభత్సంలో 'వర్షశక్తి'కి నమస్కారం ఒకవైపూ, గట్టిగా నిర్మించిన గుహల్లో తొర్రల్లో నివాసం మరొకవైపూ నెలకొన్నాయి. *మనిషికీ, దైవానికీ రాయబారిగా పురోహితుడు వెలసి ప్రాధాన్యత సంతరించుకున్నాడు. ప్రకృతిని అర్థం చేసుకొనే ప్రథమ చర్యగా పుట్టిన విశ్వాసం క్రమంగా రుతు క్రతువుల్లో పడి, పెరిగి వటవృక్షమై మతనామం సంతరించుకుంది.*

క్రీ.పూ. 3000 నాటి కాంస్య యుగం నుండి అనంతరం జనించిన ఇనుప యుగం వరకూ హేతు ప్రక్రియలూ – మత క్రియలూ సమగౌరవంతో నడిచాయి. మనిషి ఆశలకూ, హక్కులకూ మతం ఆధారభూతమైంది. వేదాలూ, వ్యాఖ్యానాలూ, యజ్ఞయాగాది క్రతువులూ – పాశ్చాత్యుల పాత నిబంధన గ్రంథం – బుద్ధయుగం, అక్కడక్కడా ప్రజ్వరిల్లిన నాగరికతలూ – జీసస్ పుట్టుకా – ద్వంద్వానుబంధ కాలంగానే గుర్తించాలి. క్రీ.పూ. 400 నాడే పైథాగరస్ సిద్ధాంతం పుట్టినా, క్రీ.పూ. 1000–1500 కాలంలోనే పిరమిడ్లు వెలసినా, చక్రవర్తులు యుద్ధాలకై ఆయుధాలు తయారుచేసి కోటలు నిర్మించి, యుద్ధ పీడితుల కోసం అద్భుత వైద్యాన్ని పెంపొందించినా, 'పదార్థ జ్ఞానం' ఒకడుగు ముందుకూ నాలుగడుగులు వెనక్కూ నడిచింది. మతంలోని కేంద్రరూపమైన దైవానికి, మనిషి బాగోగులు చూసే బాధ్యతలు అప్పగించబడ్డాయి. రుగ్వేదంలో ఇంద్ర, వరుణారాధనలు వాతావరణ, వర్షావరణ అధిదేవతలుగానే సాగాయి. మెసపోటోమియా నాగరికతలో సూర్య

చంద్రారాధనలు అలాగే నిర్వహించారు. భారతదేశంలోని గణపతి, ప్రజాసమూహాలైన గణాలకు అధిపతి అనే భావన. క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు దేవత ఎస్కులోప్స్ వ్యాధి బాధల నివారణ, స్నానపానాదుల నియంత్రణాధిపతిగా కీర్తించబడ్డాడు. భారతదేశంలోని 'వైద్యోనారాయణోహరి' పూర్తిగా తత్తుల్యమైన విశ్వాసమే. క్రీ.పూ. 4వ శతాబ్దంలో అరిస్టోటిల్ ప్రతిపాదించిన 'PRIMUM MOBILE' అనే నవగ్రహ సిద్ధాంతం భూమిని కేంద్రంగా నిలిపింది. భూమిచుట్టూ చంద్రుడు, బుధుడు, వీనస్ (శుక్రుడు), సూర్యుడు (!), అంగారకుడు, గురుడు, శని గ్రహాలు తిరుగుతున్నాయి. వీటి బయట స్వర్గంలో దైవం నివాసం. ఆయన ప్రధాన గోళ చలన శక్తి కనుకనే తన ప్రతిపాదనకు 'అరిస్టోటిల్', 'ప్రైమమ్ మొబైల్' అని పేరుపెట్టాడు. విజ్ఞానం, విశ్వాసం, విశ్లేషణాశక్తి (కొంత దోషంతో) కలిసి మత విశ్వాసంలో భాగంగా మాత్రమే ప్రతిపాదించిన, నవగ్రహ చలనాలపై సిద్ధాంతం ఆయనది.

*"యోగం నుండి నిర్వాణం" బుద్ధ యుగంలోని ప్రధాన లక్షణం. గ్రీకుతత్వం సమకాలీన బుద్ధతత్వం ఒకే రూపులో కనిపిస్తాయి. ఉపనిషత్తులు అదే కాలంలో సూర్యుడే సర్వశక్తి ప్రదాత అని ప్రతిపాదించాయి. ఆత్మను భౌతిక చర్యల పర్యవసానంగా వ్యాఖ్యానించటానికి యత్నించాయి. సూర్యుడు నుండి ఆహారం, ఆహారం నుండి జీవశక్తి, అందుండి చైతన్యం, చైతన్య సంక్షిప్త రూపమే ఆత్మ అని విశ్లేషించాయి ఉపనిషత్తులు!*

సాంఖ్య యోగంలో, కృష్ణుని గీతోపదేశంలోని శ్లోకాలు, ఆకాశం, నిప్పు, భూమి, గాలి, నీరు అనే పాంచభౌతిక నిర్మితమే శరీరం. విముక్తికి శరీర యోగమే ఆధారం. నిష్కామకర్మయే శాశ్వత ముక్తికి త్రోవ అని నిర్ద్వంద్వంగా చెప్పటమే శ్రీకృష్ణుని గీతోపదేశం. బుద్ధుడు క్రతువుల్ని తంతునీ, తరంగాల్నీ తీవ్రంగా వ్యతిరేకించి నైతిక క్రమశిక్షణా మార్గమైన నిగ్రహశక్తి ద్వారానే "నిర్వాణం" సాధ్యమని బోధించాడు. పంచేంద్రియ గ్రహణ తత్వాన్ని మాత్రమే నిర్వాణ సాధనంగా బోధించటం వలన బుద్ధ బోధన హేతువుకూ, పదార్థ శక్తికీ కార్యకారణ బంధ జ్ఞాన వివేచనకూ దారితీసింది! పాశ్చాత్యదేశాల్లో మత శాస్త్ర కార్యక్రమాలు ఒకదానిపై ఒకటి పై చేయికోసం పోరాడాయి. ప్రయోగాల ప్రత్యక్ష వాస్తవికతకు హేతువు ప్రాణధాతువుగా ఒక శక్తీ – తెలియని అర్థజ్ఞానంలో విశ్వాసాల అల్లిక ఆధారంగా ఒక శక్తీ – సమాంతరంగా పయనించాయి. కానీ ఎవరికివారు "తానొక్కడినే విజ్ఞుడననీ – తానే సత్యరహస్య సంధాతననీ" భావించటంవలన ఘర్షణ పూర్ణసత్యం వేపు ప్రయాణాన్ని వాయిదావేసింది. వేగాన్ని కుంటుపరచింది. ప్రతి తాత్వికుడూ ''తెలిసింది'' అని చెప్పటమేతప్ప "తెలియనిది" ఎంతో తెలియలేదు.

"He Knows not that he Knows not" అన్న సూత్రం పనిచేసింది. పైగా నా అంతటివాడికి తెలియనిది వుండటమేమిటన్న అహంకారంలో కాల్పనికతను, విశ్వాసాలను జ్ఞానసంపుటిలో దూర్చిపారేసాడు.

మరొక గ్రీకు తాత్వికుడు ప్లేటో (5వ శతాబ్దం చివర) మానవ జీవన విధానంపై *ఆదర్శ రాజ్యం* అనే గ్రంథాన్ని రచించాడు. *Republic* అనే యీ పుస్తకాన్ని తెలుగులో డా. జి.వి. కృష్ణారావుగారు అనువదించి ఆ పేరుపెట్టాడు. ప్లేటో తన ఆదర్శ సమాజాన్ని నాలుగు భాగాలు విభజించాడు: 1. పరిపాలకులు – సంఘర్షకులు, 2. తాత్వికులు – పర్యవేక్షకులు, 3. సైనికులు – రక్షకులు, 4. ప్రజలు – సేవకులు – ఇంత క్రమరూపంలో ఉంటుందా సమాజం అంటే, ఏం ఎందుకుండదు? అంతరిక్షంలో గ్రహగోళాలు (Timaeus) ఖచ్చిత వర్తనలో ఉండటం లేదా అని ప్రశ్నించాడు. ఈ నాలుగు విభాగాలనూ ఆయన బంగారం, వెండి, ఇత్తడి, ఇనుము అనే నాలుగు రూపాలుగా వర్ణించాడు. భారతదేశంలో వర్ణ విభజన యిదే కాలంలో, యిదే తీరులో నాలుగు వర్ణాలుగా ఘనీభవించడం జరిగిందని కొందరు ఊహించారు. రాజ్యం గురించి అధికంగా మాట్లాడటం సహించలేని పాలకులు ప్లేటోని నిర్బంధించి 'బానిస'గా అమ్మివేశారు. ఆదర్శవాదాన్ని 'విరమించుకుని', ఏథెన్సును వదలి ప్లేటో శేషజీవితం కేవలం శాస్త్రవేత్తగా కొందరు శిష్యులకు బోధిస్తూ గడిపాడు. అతని పాఠశాల పేరు నేటికీ మనం వాడుకునే "ఎకాడమీ". దాని బయట ప్లేటో ''లెక్కలు తెలియనివాడు లోనికి ప్రవేశించరాదు" అని బోర్డుపెట్టించాడు!

ఆయన శిష్యుడైన అరిస్టోటిల్ తర్కం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, మార్మికశాస్త్రం అన్నీ కలగలిపి బోధించాడు. విశ్వరహస్యాలను పూర్తిగా వివరించటం సాధ్యపడదు కనుక తెలియని విషయాలన్నీ మార్మిక శాస్త్రం (metaphysics)

క్రిందకు నెట్టేసి చెబుతుండేవాడు. మరి తాత్వికుడు ఏదీ 'తెలియదు' అనకూడదు కదా! 'స్వర్గం' తొమ్మిదో గ్రహమని చెప్పటం ఇలాంటిదే! కానీ చిత్రంగా అరిస్టాటిల్ భావాలు అటు సైన్సువాదులకీ, ఇటు చర్చి సభ్యులకూ కూడా బాగా నచ్చాయి. కొన్ని శాస్త్రాలకు సైతం అరిస్టోటిల్ పితామహుడని భావిస్తారు. విశ్వం ఎలా పుట్టిందో తెలియదు... దైవ సృష్టి అంతే. ఆనక అది పరిణామం చెందింది. ఇంకా అరిస్టోటిల్ ఆత్మ గురించి వివరించిన విధం కూడా చర్చికి బాగా యిష్టమైంది. ఆత్మ మూడు విధాలుగా ఉంటుందన్నాడాయన.

*వృక్షసముదాయంలో – శాకాత్మ*

*జంతు సముదాయంలో – జంతువాత్మ*

*దైవాన్ని స్మరించగల (మానవ) – హేతువిహితాత్మ*

అని విభజించాడు. భారతదేశంలో శంకరాచార్య అందరిలో వుండేది ఆత్మ అనీ.. దైవం మాత్రం పరమాత్మ అనీ అన్నాడు. అస్పృశ్యుడిలో వేరే 'ఆత్మ' అంటూ ఉండదు. 'మానవాత్మ ఒక్కటే' అన్నాడు. పైగా 'ఆత్మ – పరమాత్మ' కలయికే అద్వైతమనీ బోధించాడు. అస్పృశ్యత కేవలం మానవ కల్పితమన్న శంకరాచార్య సూచన అనంతర దశలో ప్రాధాన్యత సంతరించుకుంది. నిజానికి మతం రెండు విధాలుగా వృద్ధి చెందింది. ఉన్నత వర్గాల మతం, పనులు, చేతివృత్తులు చేసుకునే సామాన్యుల మతం... భిన్నంగా వుండేవి. ప్రఖ్యాత సైన్సు చరిత్రకారుడు జె.డి. బెర్నాల్ అన్నట్లుగా –

*"శృంఖలాల నుంచి తప్పించుకోలేని బానిసకూ, వ్యవస్థ శిలాభారం క్రింద నలిగిపోయే సామాన్యుడికీ.. మతావిర్భావం ఎంతో అవసరమైంది". సరిగ్గా యిటువంటి భావమే మార్క్సు 19వ శతాబ్దంలో మత విశ్లేషణకు దారితీసింది. కారల్‌మార్క్సు మత ప్రాధాన్యతను సుదీర్ఘంగా వివరిస్తూ...*

*"మత ఆవేదన నిజమైన జీవితావేదనకు వ్యక్తీకరణే... జీవితావేదనపై నిరసన కూడా.. అణచివేయబడ్డ జీవుల నిట్టూర్పు... హృదయం లేని ప్రపంచానికి హృదయం.. ప్రాణం లేని దుర్భర పరిస్థితులకు ప్రాణం, అది మనుష్యులకు నల్లమందు..''* అనటంలో మార్క్సు భావన చాలా సునిశితమైంది. "మానవ కన్నీటి గాథల పిండ స్వరూపంలో విమర్శ నిద్రిస్తుంటుంది. దాని చుట్టూ వున్న ప్రకాశ కాంతి మతం.." అన్నాడాయన. నేటి మార్క్సిస్టులు కమ్యూనిస్టు ప్రచారంలో "మతం మానవాళి పాలిట మత్తుమందు" అన్న చివరి వాక్యాన్ని గోడలపై రాస్తుంటారు. అది మత నిరసనకు పనికివస్తుందికాని, మతాన్ని అర్థం చేసుకోవటానికి పనిచేయదు. పైగా ఆయన విశ్లేషణకు న్యాయం చేయదు.

పైగా క్రైస్తవ మతారంభం తర్వాత మత వ్యక్తుల్లోని సేవాభావం, పరిశుద్ధ జీవనం మతవ్యాప్తికి గట్టి పునాదులు వేసాయి. క్రైస్తవం, ఇస్లాం, బుద్ధిజం, హైందవం – అన్నీ మానవ భౌతికావసరాల ప్రాతిపదికనే పెంపొందాయి. క్రీస్తు పూర్వం జొరాస్ట్రియనిజం కూడా సంస్కరణ స్వభావం కల్గినది. రుషులు, ఫకీర్లు, యోగులు, సన్యాసులు, లామాలు, పురోహితులు పేదవారికి న్యాయం చేయాలని, బలహీనుణ్ని రక్షించాలని, ఆర్తులను ఆదుకోవాలని ప్రచారం చేశారు. రోమన్ సామ్రాజ్యంలో పేదలకు న్యాయం చేయాలని ఉద్యమం లేవదీయటం వల్లనే 'జీసస్ క్రీస్తు'ను పాలకులు సిలువ వేసి 'ధర్మాన్ని' రక్షించారు!! క్రీ.శ. 4–7 శతాబ్దాలమధ్య రోమను సామ్రాజ్యం చర్చిని ఆమోదించింది. విశ్వాసమూ – హేతువూ విరోధులు కావని భావించిన చర్చి పురోగతి భావాలను ఆదరించింది. క్రైస్తవ భావాలను హేతువు (Reason) ప్రశ్నించదని భావించింది. సెయింట్ జాన్, సెయింట్ పాల్, సెయింట్ అగస్టీన్ వంటివారు శాస్త్రీయ పరిశీలనలను ఆదరించారు. శాస్త్ర పరిశీలకులు కూడా చర్చిని ప్రశంసిస్తూ ఉండేవారు. భారతదేశంలో హిందూమతం ఆర్యభట్ట, వరాహమిహిర, సుశ్రుత, బ్రహ్మగుప్తాది ప్రయోగశీలురను ప్రోత్సహించింది. 'వ్యక్తి గొప్పతనం దైవదత్తమన్న' హిందూ భావన ఏ రంగంలోనైనా ''పెద్దలను'' గౌరవించేది. తిరస్కరించినవారిని 'వారి పాపానికి' జన్మాంతర అకౌంటులో శిక్షపడుతుందని భావించి వదిలేసేవారు. అయితే బౌద్ధమతం దైవస్వభావాన్ని అంగీకరించకుండా – పాప – పుణ్య భావనల సిద్ధాంతాన్ని తిరస్కరిస్తుందని హిందూవాదులు ఆగ్రహించారు. బౌద్ధం దాదాపు భారతంలో అదృశ్యమైంది. శంకర, మధ్వ, రామానుజులు అనే ఆచార్యత్రయం నాయకత్వంలో హిందూమతం పునరుద్ధరింపబడింది. కాని హైందవంలోని వర్ణవ్యవస్థ సమాజంలో అపారమైన భిన్నత్వాన్ని సృష్టించింది. సమాజాన్ని వర్గీకరణకు బదులు వర్ణీకరించింది. పుట్టుకలో ప్రతిభా లక్షణాలు వస్తాయని శాసించింది. వర్ణ విభజన కాదనటం మహామహులకు కూడా దుర్భేధ్యమైంది. వైదిక జ్ఞానంలోని భౌతిక ప్రపంచ స్పర్శ అదృశ్యమై, సర్వ సుఖజీవనమే పరమార్థమన్న భావన పలచబడి, మార్మికత

మంచుపర్వతంలా దిగిపోయి అగ్రవర్ణమైన బ్రాహ్మణ్యమే హిందూత్వమన్నంతగా స్థిరపడింది. "హిందూయిజం మతం కాదు; జీవనవిధానం" అని యీనాటికీ కొందరు ఘోషించినా పట్టించుకునేవారు లేరు. అయితే వర్ణ స్వరూపంలో చేతివృత్తులవారు, వ్యవసాయ జీవనులు, శ్రామికులు, సేవకులు కేవలం శరీరం ఆధారంగా బ్రతకటం వలన "హృదయం... ఆత్మ... ఆధ్యాత్మికత... పరమాత్మకై అన్వేషణ–ఆరాధన" వంటి బుద్ధిజనిత విశేషాలన్నీ వారికి సంబంధం లేని విషయాలుగా పరిణమించాయి. కాని ఆయా వర్ణాలు ఫలసాయం కోసం, పదార్థ సృష్టికోసం, శిల్ప చిత్రకళాది కృషికోసం, భవన నిర్మాణాల కోసం – అనుక్షణం పదార్థ జ్ఞానాన్ని ఆశ్రయించవలసివచ్చింది. ఆశ్రయమే కాకుండా అద్భుతాలను సృష్టించారు. అగ్గిపెట్టెలో చీరెలు పెట్టిన చేనేత శిల్పులు అంతర్జాతీయ ఖ్యాతినార్జించారు. అజంతా, ఎల్లోరా, కోణార్క్, ఖజురహోల కళాచైతన్యం పదార్థ హేతుజ్ఞాన ప్రభావమే. హైందవం ఆ అద్భుత పరిణామాన్ని తిరస్కరించే స్థితిలో లేదు. కవులూ, కళాకారులూ, కీర్తికాంతులూ, సైన్యబలగాలు, సౌధ నిర్మాణం సామ్రాజ్యాధిపతులకు అత్యవసరమైంది. దరిమిలా మతం పాలకులను శాసించే శక్తి కోల్పోయింది.

క్రైస్తవంపై తిరుగుబాటుగా వచ్చిన ఇస్లాం, మహ్మద్ ప్రవక్త నాయకత్వంలో హేతు పరిశీలనలను ప్రోత్సహించింది. ఇస్లాం గ్రీకు తత్వవేత్తల పౌరసత్వాన్ని స్వీకరించి, క్రైస్తవంతో పోటీపడాలన్న వాదనతో శాస్త్రీయ పురోగతికి సాయం చేసింది. ఇస్లామిక్ శాస్త్రవేత్తలు ఇబూ – హైతియాన్, వైద్యానికి, కాంతిప్రసార సాధనాల అభివృద్ధికీ విశేష కృషిచేశారు. అరబ్బుల రసాయన శాస్త్రం సుగంధ ద్రవ్యాలను, పరిమళ పదార్థాలను, గాజు పరికరాలను, సులోచనాలను, లోహ పారిశుధ్య క్రియలను, సూక్ష్మదర్శినీ కటకాలను, బహువర్ణ దర్పణాలను, తయారుచేసి ఎగుమతులు గావించింది. 11వ శతాబ్ది అనంతరం రాజకీయ పరిణామాలవల్ల అరబ్బుల ఇస్లామిక్ సైన్సు అభివృద్ధి ఘనీభవించింది. ఈ ఘర్షణ కాలం అనంతరం తిరిగి క్రైస్తవం నూత్న లక్షణాలతో, సరళీకరించిన వాదాలతో పురోగమించింది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి తమను బలవంతమైన శక్తిగా మారుస్తుందని క్రైస్తవ దేశాలు భావించాయి. ప్యారిస్ విశ్వవిద్యాలయం (క్రీ.శ. 1160), ఆక్స్‌ఫర్డ్ (క్రీ.శ. 1209), నేపుల్స్ విశ్వవిద్యాలయం (1224), వియన్నా విశ్వవిద్యాలయం (1367)లను స్థాపించి వాటిలో విజ్ఞాన శాస్త్రాన్ని ప్రధాన శాఖగా ప్రవేశపెట్టాయి. అయితే అక్కడ కూడా జాగ్రత్త వహించారు. గణితం, రేఖాశాస్త్రం, ఖగోళశాస్త్రం వంటి శాస్త్ర విషయాలతోపాటు కళ, సంగీతం, సాహిత్యం వంటి 'ఆనంద ప్రదాన' శాఖలను ప్రవేశపెట్టారు. చిత్రంగా ఖగోళశాస్త్రాన్ని 'మతరహస్యాలను' అర్థం చేసుకోవటానికే ప్రవేశపెట్టినట్లు చిత్తశుద్ధితో ప్రకటించారు.

సెయింట్ థామస్ ఆక్వినాస్ ఖగోళ రహస్యాలను విశ్లేషించేటప్పుడు విశ్వాసాల ప్రాధాన్యత చొప్పించారు. మతవాది అయిన రేమాండ్ లల్ రసాయన శాస్త్ర అభివృద్ధికి కృషి చేశారు. గెర్బర్ట్ అనే హేతువాది పోప్ అయ్యాడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షులు (క్రీ. శ. 1208) రాబర్ట్ గ్రాస్‌టెస్ట్ బిషప్ అయ్యాడు. సెయింట్ ఆల్బర్ట్ (1306) జీవరసాయన శాస్త్రవేత్త. ఆయన చర్చి ప్రొవిన్షియల్‌గా నియమితులయ్యాడు. సెయింట్ నికొలస్ (1450) బిషప్‌గా వుంటూనే ఖగోళ శాస్త్రాన్ని విశ్వసించాడు. శాస్త్రవేత్తలు మత విశ్వాసాలను కించపరచకూడదన్న సత్యాన్ని యీ పై ఉదంతాలు తెలియజేస్తున్నాయి. ఇద్దరూ సహజీవనం చేస్తూ తమ బంధాన్ని కాపాడాలనే విశ్వసించారు. కాని శాస్త్రజ్ఞానం అతి నూతన విశేషాలను నిరవధికంగా బయల్పరచటంతో మతం ఇబ్బందులకు లోనయింది. ఈ లోగా చక్రవర్తులు, మహారాజులు 'చర్చి రాజ్యంలో భాగం తప్ప' పరిపాలనపై అజమాయిషీ చేయకూడదని తిరస్కరించనారంభించారు. చర్చి తెలివిగా పాలకులతో మమేకం పాటించి న్యాయ పరిపాలనా విభాగంలోకి చొచ్చుకుపోయింది. న్యాయవ్యవస్థగా రూపొందింది.

సైన్సుకూ, చర్చి నిర్వాహకులకూ మెల్లమెల్లగా ఘర్షణ ప్రారంభమైంది. విశ్వరహస్యాలు, సృష్టి కర్తృత్వము అనే విషయాల్లో భేదాభిప్రాయాలు పొడసూపాయి. కాంతిపై పరిశోధనలు, గడియారం, కాగితం, ముద్రణ (చేతితో)వంటి ప్రక్రియలు 'దైవసేవకే' అని శాస్త్రవేత్తలు పునశ్చరణ చేయటంతో కొంత శాంతించారు. చర్చిలో అధిపతులుగావున్న రాబర్ట్, రోజర్ బేకన్ వంటివారు శాస్త్రజ్ఞానం దైవారాధనకు మరో మార్గమే అని పునరుద్ఘాటించారు. వారు పదే పదే ఒక విషయం చెప్పేవారు "శాస్త్రం మతానికి సేవ చేయటానికే కృషి చేస్తుంది తప్ప, మతం వాళ్ళకు సేవ చేయదుకదా" అని! అయస్కాంతం.. తుపాకిమందు, మధువు తయారీ,

వైద్యసేవలు అన్నీ మతసేవకులకే అన్న ప్రచారం మరికొంత రక్షణకు దారితీసింది. అయినాసరే, శాస్త్రవేత్తల ఆశ్చర్యకర నూత్న రహస్యాల వెల్లడి చర్చిలోని తీవ్రవాదులకు ఆగ్రహం తెప్పించింది. శృతిమించి హింసావిధానానికి తెరతీసారు. హైపేషియా అనే మహిళా గణిత శాస్త్రవేత్తకు మరణశిక్ష విధించారు. రోమ్ వీధుల్లో అత్యంత కౄరంగా, నగ్నంగా చేసి రాళ్ళు విసిరి చంపి ఊరేగించారు. వెసీవియస్ అనే (క్రీ.శ. 1550) జీవ శాస్త్రవేత్తకు ప్రవాస శిక్ష విధించారు. "ఆత్మ, పరమాత్మల రహస్యం మానవులకు తెలుసుకోవటం అసాధ్యం" అన్నందుకు సెర్వాటిస్, అనగ్జాగోరస్ అనే శాస్త్రవేత్తలను ప్రవాసానికి పంపించారు. విశ్వకేంద్రం 'భూమికాదు' అన్నందుకు (1600 క్రీ.శ.) గియార్డినో బ్రూనోను సజీవదహనం చేసారు. కోపర్నికస్ (క్రీ.శ.1590) సూర్యుడే గ్రహవ్యవస్థకు కేంద్రం' అన్నందుకు 'బుద్ధిహీనుడు..' అని జైలు శిక్ష విధించారు. అనంతరం అతని మిత్రులు పోప్‌తో చర్చించి, పోప్ ఉపోద్ఘాతంతో కోపర్నికస్ రచనలను ముద్రించారు. కాని, కోపర్నికస్ మరణానంతరం తిరిగి ఆ గ్రంథం నిషేధానికి గురయింది. పోప్ తన 'ముందుమాట'లో "ఈతని ఆలోచనలు ప్రతిపాదనలు మాత్రమే కదా... సత్య నిర్ణయాలు కాదు.. అందుకే అనుమతిస్తున్నాను" అని రాసాడు.

కాని చరిత్ర గమనంలో భౌతిక సత్యాల అన్వేషణ ఆగలేదు; కారణం అది చక్షుజ్ఞాన నిరూపితం.. పాదార్థిక శక్తి... విశ్వాసం మెదడుకు సంబంధించింది కావొచ్చును. జ్ఞానేంద్రియాలు చెప్పేది సత్యం కాదనేది ఎలా; "అయస్కాంతం ఉత్తరానికే చూపిస్తుంటుంది" అన్న విషయాన్ని తిరస్కరించటం ఎలా.. పైగా సైన్సు సత్యాలు దినవారీ జీవితంలో ఉపయోగపడుతున్నాయి కదా! ఈ సంఘర్షణకు పతాక సన్నివేశం క్రీ.శ. 1633లో జరిగింది.

ఆధునిక శాస్త్ర పితామహుడు గెలీలియోను పోప్ రోమ్ నగరానికి పిలిపించి 'తన సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని' ప్రశ్నించాడు... వదులుకోమని ఆజ్ఞాపించాడు. గెలీలియో అంగీకరించలేదు. పోప్ 3 సంవత్సరాలు జైలు శిక్ష విధించాడు. జైలులో గెలీలియోకు కన్నుచూపు పోయింది. వినికిడి శక్తి పోయింది. జైలు అధికారుల బలవంతంతో... "సూర్యుడు స్థిరంగా ఉండటం లేదు.. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాడని" అంగీకరించాడు!!! కొద్ది కాలానికే గెలీలియో మరణించాడు..!


గెలీలియో మరణం ప్రజల్లో తీవ్ర కల్లోలాన్ని సృష్టించింది. 'ఆయనే నిజమేమో' అన్న అనుమానం మొలకెత్తింది. టెలిస్కోప్‌ను చూద్దామన్న జిజ్ఞాస ప్రారంభమైంది. ఈలోగా సత్యంకోసం మరణించినవారి త్యాగం తుఫాను సృష్టించి, చర్చి అధిపతులకూ, పాలకులకూ భయాన్ని కలిగించింది. వారొక్క అడుగు వెనక్కు వేశారు. గెలీలియో మరణించిన సంవత్సర కాలానికి విజ్ఞానశాస్త్రంలో అధినాయక స్వరూపం ఐజక్ న్యూటన్ (1643–1727) జన్మించాడు.

న్యూటన్ రాజోద్యోగి కుమారుడు. అనేక విప్లవకర భావాలను ప్రయోగ ఫలితాలుగా చెబుతున్నా, మతాధిపతులు మౌనంగా వుండటమే కాక, ప్రశంసించటం కూడా జరిగింది. న్యూటన్ గురుత్వాకర్షణ శక్తి, చలన సూత్రాలు, కాంతి ప్రసార సూత్రాలు ఆధునిక భౌతికశాస్త్రానికి పునాదులు వేసాయి. ఈ పునాది గట్టిగా ఉండటం చేత సరిగ్గా నూటయాభై సంవత్సరాల అనంతరం ఛార్లెస్ డార్విన్ (1809–1882) జీవ పరిణామ సిద్ధాంతం ప్రతిపాదించినప్పుడు మతం తన విశ్వాసాలకు తీవ్ర ప్రతిఘటన ఎదురైందని భావించినా ఏమీ చెయ్యలేని పరిస్థితిలో – "వారు కూడా దైవ సన్నిధికి వేరొక మార్గంలో అన్వేషకులు మాత్రమే... ఉభయ మార్గాలూ గౌరవించతగినవే" అని సంబాళించుకుని ఊరుకున్నారు. ఆధునిక విజ్ఞాన శాస్త్ర జగన్నాథ రథం కదిలింది. తొలిదశలో (క్రీస్తు శకానికి అటూ యిటూ) ఎన్నో విశేషాలను ప్రపంచానికి నివేదించిన హిందూ దేశం (నీటివేగం, శూన్యాంశం, సంఖ్యా వర్గ మూలాలు, గ్రహ సంచలనాలు) మధ్యయుగాల్లో విదేశీ దండయాత్రలు, పరిపాలనల ఫలితంగా "విశ్వాసమే ప్రమాణం – ప్రయోగం నిషిద్ధం" అనే తత్వాన్ని అనుసరించింది. *తాజ్‌మహల్ నిర్మాణానికి సహకరించిన ఇంజనీరింగ్ శిల్పమూ, అజంతాలో గదుల పై కప్పులపై చిత్రాలకు వాడిన రసాయనాలూ, కోణార్క్ సూర్యదేవాలయ సాంకేతికతా, బజారుల్లో వజ్ర వైఢూర్యాలను పోసి అమ్మిన లోహజ్ఞానమూ, అనూహ్యామైన అంతఃపురాలను, కోటలనూ సృష్టించిన శిల్పనైపుణ్యమూ ప్రపంచ దృష్టిలో గణనకెక్కలేదు.*

19, 20 శతాబ్దాలు శాస్త్ర పురోగతిలో ఉజ్వల స్థాయినందుకున్నాయి. అన్ని రహస్యాలూ విజ్ఞాన శాస్త్రం ఛేదించగలదన్న విశ్వాసంతో నాస్తికవాదులూ, అజ్ఞేయ వాదులూ మత నిరసనతోపాటూ, సమాజానికి మతం

అందించే విలువలు, సహనం, నైతిక ప్రవర్తనా శిక్షణను త్రోసిరాజన్నారు. శాస్త్రవేత్తల్లో నాస్తికులూ, ఆస్తికులూ, అజ్ఞేయవాదులూ అందరూ వున్నారు. వారు మతాన్ని శాస్త్ర పరిధిలో చర్చించటానికి వీలులేదని తిరస్కరించారు. శాస్త్రాన్నీ, మతాన్నీ కలిపి సామాజిక సందర్భాల్లో చర్చించే తరుణంలో కొన్ని వ్యాఖ్యలు చేసారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐనిస్టీన్ అటువంటి ఒక సందర్భంలో... *"శాస్త్రవేత్త విశ్వజన్మ రహస్యంమీద పూర్తి ఆసక్తితో వున్నాడు. అతనిలోని మత విశ్వాసం ప్రకృతి సూత్రాల్లోని నిర్దిష్టవైఖరిని చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూంది. ఈ అనుభూతి తన జీవితానికి, శాస్త్రకృషికి చోదకశక్తి... ఇది తన స్వార్థ కాంక్షలకు దూరంగా వున్నంతవరకే యీ శక్తి అతణ్ణి నడిపిస్తుంది.*


*ఈ రెండూ అనతికాలంలో ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం వుంది. అంతవరకూ రెండింటి కృషి సమాజానికి అవసరం.."* అన్నాడాయన. ఆధునిక విజ్ఞాన శాస్త్ర నాయక శిఖామణి మాటల నేపథ్యంతో సాంఘిక తాత్వికులు ఒక తీర్మానానికొచ్చారు. "ఒక అంతిమ నిర్ణయానికొచ్చేవరకూ... లోకాతీత శక్తుల రహస్య విచ్ఛేదనకు తానే మార్గమని చెప్పే మతాన్నీ – ఆత్మ పరిగణనలను కాదని విషయ గణాంకాల జాబితాలతో వట్టి పట్టిక లాంటి శాస్త్రాన్నీ – ఒకదాన్ని మరొకటి నియంత్రించే శక్తిగా, ద్వంద్వానుబంధాన్ని కొనసాగించాలి" అన్నది ఆ తీర్మానం!




**ఆచార్య చందు సుబ్బారావు**

**విశాఖపట్టణం - 17**

**సెల్ : 944 136 0083**


**బైరన్** చదివి...

ఈ ఉదయం 5.30 – 6.00 మధ్యలో

*ది గ్రేట్ లార్డ్ బైరన్* నా చేతుల్లో

తుదిశ్వాస విడిచాడు.

....ఒక నిర్వేదం

నన్ను ఆవహించింది...

*– రోహిణీకుమార్*

**బైరన్** జీవిత చరిత్రను తెలుగు చదువరులకు అందించిన మీకు ధన్యవాదాలు. కవిగా జీవించటం, కవిగా మరణించటం అప్పుడు అద్భుతమే కాదు – అట్టి గొప్ప సాహసవంతుల కవుల బ్రతుకుల కథనం ఇప్పుడూ కళ్ళను తడిపినాయి. మీకు మరొకమారు దండాలు.....

*– జగన్నాథం*

### ఇల్లిందల సరస్వతీదేవి

# స్వర్ణకమలాలు

*- రావినూతల సత్యనారాయణ*

ప్రస్తావన :

మానవునిలో దాగిన మహనీయ లక్షణాలైన దయా, సానుభూతీ, సమదృష్టి, మైత్రీ, ఆదర్శప్రియత్వమూ, ఆవిష్కరించాలనే ఆశయంతో రచనలు చేసే రచయితలు తక్కువమంది. అలాంటి వారిలో స్వర్గీయ శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి ఒకరు. తాత్కాలికమైన ఉల్లాసం కోసం కాక, మారని విలువల కోసం, శాశ్వత సత్యాలను ప్రతిపాదన చేయడం కోసం ఆమె కలం పట్టారు. పాఠకులలో ఉన్నత ఆదర్శాలను, ఉత్తమ మార్గాలను పెంపొందించే దృష్టితో తీర్చిదిద్దిన గ్రంథాలు ఆమె రచనలు. ఆమె పుస్తకాలలో ప్రధానంగా ఆకర్షించే విశేషం వస్తు వైవిధ్యం. తరతరాల మనుష్యులు, ఎన్నో తరహాల వాళ్ళు పాత్రల రూపంలో మనముందు మెదులుతారు. రక్తమాంసాలతో జీవించే నరనారీ జనాన్ని తమ రచనలలో పాత్రలుగా మలచుటలో సరస్వతీదేవి అపూర్వ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

కథా రచనలో, నవలా నిర్మాణంలో, వ్యాస విన్యాసంలో విజయం సాధించిన విదుషీమణి సరస్వతీదేవిగారు. అయిదు దశాబ్దాల పాటు సాహిత్య సేవ చేసి, ఒక రచయిత్రిగా విశిష్ట స్థానాన్ని ఆర్జించిన ప్రముఖ రచయిత్రి ఆవిడ. ఆమె సాహిత్య ప్రస్థానాన్ని జీవిత విశేషాలతో చేర్చి పాఠకుల ముందుంచడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం. ఈ నా ప్రయత్నాన్ని విజ్ఞులైన పాఠకులు హర్షిస్తారని ఆశిస్తాను.

### సరస్వతీదేవి జీవిత విశేషాలు :

సరస్వతీదేవి కామరాజు వెంకటప్పయ్య, రత్నమ్మ దంపతులకు పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురంలో జూన్ 15వ తేదీన 1918వ సంవత్సరంలో జన్మించారు. సరస్వతీదేవికి మొత్తం ఆరుగురు అప్పచెల్లెండ్రు. ఆమెకు ఇద్దరు అన్నయ్యలు. ఆవిడ తల్లి బాల్యంలోనే మరణించింది. వెంకటప్పయ్య అన్న స్వర్గస్తులైనందున, అన్న కుటుంబ బాధ్యత వెంకటప్పయ్యే నిర్వహించవలసి వచ్చింది. ఆయన వదిన రమణమ్మ పిల్లల పెంపకంలో అత్యంత శ్రద్ధ వహించారు. రమణమ్మకి రామాయణ, భాగవత, భారత కథలే గాక, స్త్రీల పాటలు, జానపద గేయాలు కంఠతా వచ్చేవి. ఆమె, పిల్లలకు వారి వయసుకు దగిన రకరకాల కథలు వినిపించేవారు. పెద్దతల్లి ప్రభావం సరస్వతి పైన బాగా ప్రసరించింది. సరస్వతీదేవి జన్మించే నాటికి, అంటే, 1918వ సంవత్సరము నాటికి దేశం రాజకీయంగా బానిసత్వంలో మగ్గిపోతూ – బానిసత్వపు సంకెళ్ళు తెంచుకునే ప్రయత్నంలో గాంధీ మహాత్ముని నాయకత్వంలో పోరాటం సాగిస్తున్నది. విదేశీ వస్తు బహిష్కరణ, ఖద్దరు ప్రచారం, ఉప్పు సత్యాగ్రహం మొదలైన ఉద్యమాలలో జనం పాల్గొని, స్వాతంత్ర్య సముపార్జనకు పాటుబడుచున్నారు.

సాంఘిక పరిస్థితిని పరికిస్తే మూఢాచారాలు, మూఢ నమ్మకాలు సమాజాన్ని అణచివేస్తున్న రోజులవి. ముక్కుపచ్చలారని పసిపిల్లలకు, వృద్ధులతో వివాహాలు, బాల్య వితంతువుల సమస్యలు, కన్యాశుల్కం లాంటి దురాచారాలు దేశంలో తాండవిస్తూ, సంఘాన్ని పీడిస్తున్న సమయమది. కందుకూరి వీరేశలింగం లాంటి సంఘసంస్కర్తలు పోరాటం సాగిస్తున్న కాలమది. సంఘసంస్కర్తలు సాహిత్యాన్ని ఆయుధంగా గ్రహించి రచనలు చేయ ప్రారభించారు. అన్ని ప్రక్రియలలోను సాహిత్య వికాసం మొదలైంది. దేశభక్తి, సాంఘిక చైతన్యం ముఖ్యమైన ఇతివృత్తాలుగా పరిణమించాయి. సరస్వతీదేవి చిన్న వయసులోనే, పైన పేర్కొనిన ఉద్యమాల ప్రభావానికి గురికాక తప్పలేదు. ఆ రోజులలో ఆడపిల్లలకు ఒక పండితుని పిలిపించి ఇంట్లోనే చదువు, సంగీతం, నేర్పించేవారు. చదువంటే గజేంద్ర మోక్షం, రుక్మిణీ కళ్యాణం మొదలైనవి తప్పక నేర్చుకోవాలి. ఆడపిల్లలు ఎంత చురుగ్గావున్నా, తెలివిగా వున్నా, చదువులపైకన్నా, వివాహం పైనే తల్లిదండ్రులు దృష్టిపెట్టేవారు. సరస్వతీదేవి విషయంలో కూడా అదే జరిగింది. ఆమె 15వ ఏటనే ఇల్లిందల సీతారామారావు అనే చదువుకున్న యువకునితో వివాహం జరిగింది. చదువుకోవాలనే ఆమె కోరికను మన్నించి భర్త ఆవిడను మెట్రిక్ వరకు చదివించారు.

సరస్వతీదేవి గృహిణిగా, మాతృమూర్తిగా జీవితాన్ని

సాగిస్తున్నా, ఆమెలో పఠనాసక్తి పెరిగింది కాని తరగలేదు. రకరకాల పుస్తకాలను చదువుట ఆరంభించారు. ఈ విషయంలో ఆమెకు భర్త ప్రోత్సాహం నిరంతరం లభించింది. ఆ రోజులలో గొప్ప కథకులుగా ప్రసిద్ధులైన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి మొదలైన వారి రచనలు చదివి ఆవిడ తన అవగాహన పెంచుకున్నారు. విస్తారంగా చదువుట వల్ల సృజనాత్మకతతో పాటు, సామాజిక స్పృహ కూడా ఆమెలో అంతర్గతంగా భాసించింది. ఆమెలో తన చదువుకు మెరుగు దిద్దుకోవాలనే అభిలాష పెరిగింది. 1956వ సంవత్సరంలో జర్నలిజం సర్టిఫికెట్ కోర్సు క్లాసులకు హాజరు కావటానికి ఆమెకు యూనివర్సిటీ నుండి అనుమతి లభించింది. ఆ క్లాసులు హాజరవటం వలన సరస్వతీదేవికి రచనకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కలిగింది. సొంత రచనలు చేయ ప్రయత్నించారు. సరస్వతీదేవికి డెక్కన్ రేడియోలో కథానికలు చదివే అవకాశం మొదటిసారి 1943లో లభించింది. తర్వాత కాలంలో ఆమె నిర్వహించిన ***కాలమ్స్*** (పత్రికా వ్యాసాలు వ్రాయుట)లో ఆ అనుభవం ఉపకరించింది.

## సరస్వతీదేవి సాహిత్య ప్రస్థానం :

విస్తృతమైన పఠనం సరస్వతీదేవిలో గొప్ప సాహితీ వికాసాన్ని కలిగించింది. వివిధ సాహిత్య ప్రక్రియలపై ఆమె అభిమానం పెంచుకున్నారు. అంతేకాక, తాను కూడా సృజనాత్మక రచనలతో సాహిత్య సేవ చేయుటకు నిశ్చయించుకున్నారు. సరస్వతీదేవికి డెక్కన్ రేడియోలో కథలు చదివే అవకాశం 1943లో లభించింది. ఆమె మొదటికథ *పితృహృదయం*. అదే కథ *భారతి* సాహిత్య మాస పత్రికలో ప్రచురితమైనది. హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనమైన తర్వాత డెక్కన్ రేడియో ఆలిండియా రేడియోగా మారింది. సరస్వతీదేవికి, రేడియో ద్వారా తెలుగు దేశంలో ఉన్న కథా, నవలా రచయితలు పరిచయమయ్యారు.

బాల్యంలో పెద్దతల్లివల్ల ప్రభావితమైన ఆమె, మెట్టిన తెలంగాణా ప్రాంతంలోని ఆనాటి సాంస్కృతిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాలు చైతన్యాన్ని కలిగించి రచయిత్రిగా ఆమెలో గొప్ప స్పందనను కలిగించాయి. ఆనాటి సమాజంలోని, ముఖ్యంగా నిజాం రాష్ట్రంలోని స్త్రీల స్థితిగతులను గమనించిన ఆమె హృదయం భరించరాని ఆవేదనకు లోనయింది. ఏవిధంగా స్త్రీలను వెలుగు బాటలో నడిపించగలమని నిరంతరం ఆలోచించేది. సాంఘిక సేవాకార్యాల ద్వారా ఎందరో స్త్రీలకు ఊరట కలిగించగలననే భావంతో ముందడుగు వేశారు ఆమె.

*"నేను సంతోషాతిరేకంలో ఉన్నప్పుడు పొంగిపోకుండానూ, స్తోత్రసుధకు లొంగిపోకుండానూ, నేను ఆవేదనతో క్రుంగిపోయినప్పుడు సమాశ్వాసిస్తూ, నన్ను అహరహము కనిపెట్టి కాపాడుతున్న ఈ రచనా వ్యాసంగం నా ఆరాధ్య దైవము, నా అభిమాన కళ"* అంటారు ఆవిడ. కథలు, నవలలు, వ్యాసాలు, బాలసాహిత్యం, అనువాద రచనలు అనే విభిన్న ప్రక్రియలు చేపట్టిన సరస్వతీదేవి, తెలుగు సాహిత్యంలో ఖ్యాతి గడించిన రచయిత్రి. ఏబది సంవత్సరాల పాటు సాహిత్య లోకాన్ని పరిమళింపజేసిన సాహితీ నిర్మాత. ఆమె తన సుదీర్ఘ జీవిత కాలంలో 3 కథా సంపుటాలు (స్వర్ణ కమలాలు, రాజ హంసలు, తులసీ దళాలు) దాదాపు 275 కథలు, 13 నవలలు, 3 జీవిత చరిత్రలు, 3 బాల సాహిత్య సంపుటాలు, 8 వ్యాస సంపుటాలు, రెండు అనువాద రచనలూ, మరియూ స్త్రీల పాటలు రచించారు.

సరస్వతీదేవి రచనలన్నిటిలో కొన్ని ముఖ్యాంశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కుటుంబం, ఇల్లు, పిల్లలు వరకే పరిమితం కాకుండా, జాతీయ సమైక్యతని, భావ సమైక్యతనీ కోరి, మానవత్వాన్ని ప్రబోధించే అంశాలు ఆమె రచనల్లో హెచ్చుగా గమనించవచ్చు. సాంఘిక సమస్యలెన్నిటినో ఆమె "కళ్యాణ కల్పవల్లి" ద్వారా చర్చించారు.

సరస్వతీదేవి సాహిత్యానికి మకుటాయ మానంగా పరిగణింపదగినవి ఆమె కథా సంపుటములు. ఇందులో ***'స్వర్ణకమలాలు'*** అనే కథా సంపుటిని 1982 లో ఆంధ్ర సాహిత్య అకాడెమీ ఉత్తమ గ్రథంగా ఎంపికజేసి అవార్డు ప్రకటించారు. అదే ***'స్వర్ణకమలాలు'*** కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ, నూఢిల్లీ వారు సహితం తమ 1982వ సంవత్సరపు జాతీయ పురస్కారంతో రచయిత్రి సరస్వతీదేవిని సత్కరించారు. అదే విధంగా *తులసీ దళాలు* అనే కథా సంపుటి రచయిత్రి సాహిత్య సరస్వతికి అర్పించిన కంఠహారం.

*తులసీ దళాలు* కథల సంపుటిని గురించి రచయిత్రి చెప్పిన మాటలు గమనించదగినవి. "ఈ సంపుటిలో దేశకాల పరిస్థితుల ప్రభావం మానవాళి మీద ఎంత పడ్డదో, దేశాభివృద్ధికి తోడ్పడుతుందని ఆశించిన శాస్త్రవిజ్ఞానం దేశ వినాశనానికే విధంగా దారితీస్తుందో, మానవ స్వభావంలో రజస్తమోగుణాలు ఏ విధంగా చోటు చేసుకుని, దేశాభివృద్ధికి

అవరోధం కలిగిస్తున్నాయో, అన్ని రంగాలలోను, నూతనంగా ఆవరించుకున్న నాగరికతా మేఘాలు మానవాళిని సత్వ గుణాన్నుండి ఏ విధంగా దూరం చేస్తున్నాయో, నా శక్తి మేరకు చూపించాను. సంఘంలో ప్రదర్శింపబడుతున్న విశృంకలతకు అక్కడక్కడా అద్దం పట్టాను". *తులసీ దళాలు* సంపుటిలోని కథలన్నీ ఆధునిక సమాజ వ్యవస్థకు, వ్యక్తుల స్వభావాలకూ అద్దం పట్టినవే!

*రాజ హంసలు* అను సంపుటిలో ఐదు పెద్ద కథలున్నవి. ఈ సంపుటిని ఒక విధంగా నవలిక అనవచ్చు. ఈ కథలను గూర్చి ముచ్చటిస్తూ "సమాజంలో కంటితో చూచిన దృశ్యాలనే ముడిసరుకుగా వాడుకున్నాను. ఆయా ప్రదేశాలకు వెళ్ళినప్పుడు కలిగిన అవకాశాలను, అనుభవాలనూ కూడా వాడుకున్నాను. నా దృష్టిలో ఈ ఐదు కథలూ రాజ హంసలే"! అంటారు రచయిత్రి.

తెలుగులో నవల, కథ అనే రెండు ప్రక్రియలను చేబట్టి విజయవంతంగా నిర్వహించిన రచయిత్రులలో ప్రముఖురాలు శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి. సరస్వతీదేవి కలము నుండి 1968 నుండి ప్రారంభమై, దాదాపు 13 నవలలు వెలుగు జూచాయి. ఈ నవలలన్నిటిలోనూ సామాజిక సమస్యలు, మనస్తత్వాలు, ఆర్థిక ఇబ్బందులు, విద్యా, ఉపాధి, కులతత్వం అనేవి ముఖ్యాంశాలు. సరస్వతీదేవి నవలలన్నిటిలోను, విశేష ప్రచారాన్ని, పాఠకుల అభిమానాన్ని, ప్రశంసలను అందుకొనిన నవల *నీ బాంచను కాల్మొక్త.* ఈ నవల *ఆంధ్రప్రభ* ఆదివారపు సంచికలో ధారావాహికంగా ప్రచురింపబడింది. పుస్తక రూపంలో 1976లో ముద్రితమైనది. ఈ నవలను గురించి ప్రసంగిస్తూ "ఈ నవల *ఆంధ్రప్రభ* ఆదివారపు సంచికలో సీరియల్‌గా వెలువడుతున్న కాలంలో పాఠకులనేకులు, ఈ నవల పేరు బాగుండలేదని, మాకు అర్థం కాలేదు అని, నాకు ఉత్తరాలు వ్రాశారు". బాబూ, నాయనా, తండ్రీ అని ఆంధ్రదేశంలోని కొన్ని ప్రాంతాలలో పిల్లలను బతిమలాడే ధోరణిలో పెద్దవాండ్లు అన్నట్టు, తెలంగాణాలో "నీ బాంచను కాల్మొక్తా" అంటారు కొందరు. బానిసలు, ప్రభువులు మెలిగే ఈ సంఘంలో "చిత్తం బాబయ్యా" అని కొన్ని ప్రాంతాలలో ఉన్నట్టే, తెలంగాణాలో "నీ బాంచను కాల్మొక్తా" అనటం ఉంది. తెలంగాణా మాట మరింత బానిసత్వాన్ని సూచించేదిగా వున్నది. కులాలలో తరతమ భేదాన్ని కొట్టవచ్చేటట్లు తెలిపేదిగానూ ఉన్నది. ఈ నవలకు ఇంతకన్నా మంచిపేరు స్ఫురించ లేదు" అంటారు.

మూడు రోజులు వాన కురిసి వెలిసింది. ఆ ఊళ్ళో జానకమ్మ చాపమీద అన్నం పరచి, రాచ్చిప్పలో వున్న పులుసుతో కలిపి, రెండు చేతులతో పెద్దపెద్ద ముద్దలు చేసి చుట్టూరా మూగిన జనం తెచ్చుకున్న చిప్పలలో పడేస్తోంది. రెండు గుండిగలు ఖాళీ అయ్యాయి.

"దొడ్డమ్మ నాకోముద్ద పెట్టవా" చిప్పపట్టుకు చెయ్యి ముందుకు చాచాడు ఏడెనిమిది సంవత్సరాల పిల్లాడు. రాగివెంట్రుకలు ముఖమ్మీద పడుతున్నాయి. ఒంటికి చొక్కా గుడ్డైనా లేదు. గోచీ పెట్టుకుని, ఓచిన్న గుడ్డపీలిక భుజంమీద వేసుకున్నాడు. కళ్ళు చిన్నవే కాని చురుకైనవి. "కాశిగా నడువు అవతలికి" ఎవరో అరిచారు. గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ నిలబడ్డాడు కాశి. రాచ్చిప్పలో పులుసు, గంగాలంలో మిగిలిన అన్నం కలిపి ముద్దచేసి చిప్పలో వేసింది జానకమ్మ. "నీ బాంచను కాల్మొక్తా" అంటూ కాశి వెళ్ళిపోయాడు వెనక్కి చూచుకుంటూ!! ఈ పిల్లవాడు ఈ నవలలో ముఖ్యమైన పాత్ర. హీన కులజుడని, అందరికి చులకన. ఆ వూర్లో ఎరికల సూరిగాడి కొడుకని అందరికి తెలుసు. కాని ఆ పిల్లవాడెవరో, అతని పుట్టుకేంటో తెలిసింది జానకమ్మ కొక్కర్తికే!!

జగన్నాథం పెద్ద కోడలిగా ఇంటి బాధ్యతలన్నీ వహించే జానకమ్మపై మరుదులు నరసింహానికి, గోపాలానికి కోపం చాలా మలుపులు తిరిగింది. కాశీరాం తన మరిది నరసింహానికి, సోమయ్య కూతురు సీతారత్తానికి, పుట్టిన అక్రమ సంతానమని జానకమ్మకు తెలుసు. ఆర్థికస్థితి వీటినన్నిటినీ తుడిచి వేస్తుందని గ్రహించిన జానకమ్మ, కాశీరాం బతుకు ఎలాగైనా మార్చేయాలని ప్రయత్నించింది....

మెడికల్ కాలేజిలో సీటు రావటానికి కులం సర్టిఫికెట్ ఉపయోగించుకొని, కులం తెలియని అమృతను భార్యగా స్వీకరించాడు కాశీరాం. జానకమ్మ ఒక పరిస్థితిలో స్పృహ తప్పి పడిపోయింది. కాశీరాం "దొడ్డమ్మా, దొడ్డమ్మా కళ్ళు తెరచి చూడవూ, నాకు మెడికల్ కాలేజిలో సీటు వచ్చింది" – కాశీరాం కన్నీరు కార్చాడు. దొడ్డమ్మ పాదాల మీద తలవాల్చి "నీ బాంచను, నీ బాంచను, నన్నింత వాడిని చేశావు, నీ ఋణమెలా తీర్చుకోనూ" కాశీరాం గుండెలు కరిగిపోయేలా ఏడ్చాడు. ఇది ఒక పెద్ద నవల. ఈ నవలలో సమాజంలో వేళ్ళూనకపోయిన కులాల కుమ్ములాట అద్భుతంగా చిత్రించారు సరస్వతీదేవి. "నీ బాంచను కాల్మొక్తా"లో జానకమ్మ పాత్ర చాలా ప్రత్యేకమైంది. తుఫాను నాటి భీబత్సంలో, జానకమ్మ అక్కడి బీదవారి నందరినీ ఆదుకొని,

పులుసన్నం ముద్దలు అందిచ్చిన దగ్గరినుంచి, కాశీరాంని పెంచి పెద్ద చేసి, డాక్టరును చేసేవరకు సాగిన ఆమె జీవిత యానంలో మహోన్నత వ్యక్తిగా, సాంఘిక న్యాయం కోసం పోరాడే సంఘ సంస్కర్తగా, మానవీయ విలువల్ని రక్షించే స్త్రీమూర్తిగా చిత్రంచబడింది. అంతేకాదు, సమాజంలో కులాలవల్ల పిల్లలు బాధలు పడగూడదని ఆశించిన కరుణామయి జానకమ్మ. ఈ నవలలో ఎన్నోపాత్రలు, ఎన్నెన్నో సంఘటనలు చోటుచేసుకున్నాయి. కథనం చక్కగా నడిపి పాఠకులలో ఉత్కంఠను పెంపొదింపజేశారు రచయిత్రి. జానకమ్మ లాంటి త్యాగమూర్తులు, సహన శీలురు, కార్య దక్షులైన స్త్రీలు సమాజంలో ఉంటే, ఆ సమాజం తప్పక పురోగమిస్తుందన్న దృఢ నమ్మకాన్ని ఈ రచన ద్వారా నిరూపించారు సరస్వతీదేవి. ఈ నవల ఆవిడకి గొప్ప ఖ్యాతిని గడించి పెట్టింది. ఇందులోని పాత్ర చిత్రణ మరపురానిది. నవల యొక్క విశిష్టతకి మూలం పాత్ర చిత్రణమే, అన్న అంశాన్ని ఆవిడ చాలా స్పష్టంగా చూపించారు ఈ నవలలో.

సరస్వతీదేవి ఇతర నవలలు కూడా అందరూ చదివి ఆనందింపవలసినవే. స్థలాభావంచేత వాటినన్నిటినీ గూర్చి వివరంగా చర్చించజాలనందుకు విజ్ఞులైన పాఠకులు మన్నిస్తారని ఆశిస్తాను.

రచయిత యొక్క మేధాశక్తి, జ్ఞాన సముపార్జన వెలికి రావడానికి వ్యాసం ఒక గొప్ప వాహిక. సుప్రసిద్ధులైన వ్యాసకర్తలతో పాటు సరస్వతీదేవి కూడా ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించారు. నారీజగత్తు, వెలుగు బాటలు, జీవన సామరస్యము, వ్యాస తరంగిణి, కళ్యాణ కల్పవల్లి, తేజోమూర్తులు, అనే వ్యాస సంకలనాలు సరస్వతీదేవిని వ్యాస రచయితగా నిలబెట్టాయి. ఈ వ్యాస సంకలనాలు వేటికవి ముఖ్యమైనప్పటికీ, తేజోమూర్తులు అను వ్యాస సంకలనమెన్నో విధాల ప్రత్యేకమైనది. సరస్వతీదేవితో పరిచయమూ, స్నేహము కలిగిన వ్యక్తుల జీవిత విశేషాలెన్నో ఇందులో చోటుచేసుకున్నాయి. “తేజోమూర్తులు వ్యాస సంకలనం తెలంగాణా కోడలిగా తెలుగు దేశానికి నా భక్త్యాంజలి” అంటారు రచయిత్రి.

వివిధ పత్రికలలో వ్యాసములు వ్రాయటమే కాక, ప్రముఖ కాలమిస్టుగా ప్రసిద్ధులు. *కృష్ణాపత్రిక* లో “ఇయం గేహే లక్ష్మి”, (1962 - 65) అనే శీర్షిక, *ఆంధ్రసచిత్ర* వారపత్రికలో వనితాలోకం శీర్షిక నిర్వహించారు. ఆవిడ వ్యాసాలు విస్తృత గ్రంథ పఠానుభవానికీ, భావసమైక్యతకీ, శైలీ విన్యాసానికి ఉదాహరణలు. సార్వజనీనమైన అంశాలు వ్యాస విషయాలుగా స్వీకరించడం వలన సరస్వతీదేవి వ్యాసాలు అందరికి పఠనీయ యోగ్యమైనవి.

శ్రీమతి సరస్వతీదేవి బాలసాహిత్య శాఖలో కూడా విశేష కృషిచేశారు. పిల్లల కోసం చాలా కథలు, నాటకాలు, పాటలు రచించి, బాలబంధు అవార్డు కూడా పొందారు. “వ్రాసేవన్నీ పిల్లలు కేవలం ఊసుపోక, తమాషాగా చదువు కోవడానికే కాక, ఆ చదువుకున్నది వారి గుణము, అలవాట్లు బాగు పరచడానికి తోడ్పడేవిగా ఉండాలని నా ఆశయం” అంటారు ఆమె. ఆవిడ పిల్లలకై వ్రాసిన రచనలు మూడు సంపుటాలుగా ప్రచురింపబడ్డాయి. కేవలం సృజనాత్మక రచనలే కాక, కొన్ని అనువాద రచనలు కూడా చేశారు సరస్వతీదేవి.

ఇంతవరకు జరిగిన చర్చలో ఇల్లిందల సరస్వతీదేవి రచనా వ్యాసంగాన్ని గూర్చి స్థూలంగా చర్చించడమైనది. ఇప్పుడు స్వర్ణ కమలాలు పుస్తకాన్ని గురించిన విశేషాలు విపులంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

## స్వర్ణకమలాలు :

*నూరు కథల సంపుటిగా ఖ్యాతి గడించిన స్వర్ణకమలాలు సంపుటి వివిధ పత్రికలలో ప్రచురింపబడిన, రేడియోలో ప్రసారమైన కథలతో కూడిన కథా సంపుటి. ఈ సంపుటి 1981లో ప్రథమ ముద్రణ పొందింది. స్వర్ణకమలాలకు ఆంధ్ర సాహిత్య అకాడమీ అవార్డు, కేంద్రీయ సాహిత్య అకాడమీ పురస్కారం (1982) రెండూ లభ్యమైనవి. ఒకే గ్రంథానికి, ఒకే సంవత్సరములో రెండు అకాడమీల బహుమానాలు లభించుట అరుదైన సంఘటన. ఇది ఎంతో ప్రశంసనీయం. స్వర్ణకమలాలు సంపుటి ముందుమాటలో “మానవనైజంలో మార్పు ఉండదనీ, హృదయ స్పందనకు దేశ, కాల, ప్రాంతాలనే అవధులు లేవనీ, సార్వజనీనమైన భావాలను ఏరాజకీయ సూత్రాలు బంధించలేవని నమ్మే వాండ్లలో నేనొకదాన్ని. ఈ విశ్వాసముతో రచింపబడినవే ఈ కథానికలు'' అని పేర్కొన్నారు రచయిత్రి. స్వర్ణకమలాలలోని నూరు కథలు నూరు రకాలైనవి. ఈ కథల ద్వారా కుటుంబ వ్యవస్థను, సామాజిక స్థితిగతులను, మనస్తత్వ సమస్యల్ని, వృత్తిపరమైన అంశాల్ని విభిన్న దృక్కోణాలలో పాఠకులకు అందజేశారు రచయిత్రి సరస్వతీదేవి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఎలా ఉండేదో ఈ కథల నుండి తెలుసుకోవచ్చు.*

ఈ కథా సంపుటిలోని మొదటి కథ *కొండమల్లెలు.* పేరువినగానే కొండమల్లెలంటే వాసనలేని, ఉపయోగములేని

పూలనే అభిప్రాయం పాఠకులలో కలుగుతుంది. కాని అది పొరపాటు. ఈ కథలో ఇద్దరు వ్యక్తులు శివనాథం, గురువడు అనే వారు. అగస్మాత్తుగా కలిసి, స్నేహితులుగా అభిమానం పెంచుకుంటారు. శివనాథం చిన్న ఉద్యోగి. ఉన్నదాంట్లో సుఖంగా బతకాలనే మనస్తత్వం కలవాడు. కాని, అతని భార్య శకుంతల ఎప్పుడూ ఏదో లేదనే అసంతృప్తితో వుంటుంది, శివనాథం జీవితాన్ని సమస్యా భరితంగా మారుస్తుంది. గురవడు, వాని భార్య పోచి కూలీ చేసుకునే వారైనా చాలాహాయిగా జీవిస్తారు. బుడ్డి దీపపు వెలుగులో వండి, వడ్డించి ఊసులాడుకుంటూ ఒకే పళ్ళెంలో తినే పోచీ ఎప్పుడూ ఆనందంగానే కనిపిస్తుంది. ఇలా ఉండగా దీపావళి పండుగనాడు పటాసుల మూలంగా కాలిన గురవడి చెయ్యి చచ్చు పడిపోతుంది. గురవడు కూలీపని చేసి సంపాదించే స్థితిలో లేడు. అయినా, పోచి కష్టపడి డబ్బు సంపాదించి ఇల్లు నడుపుతుంది. ఇంతలో శివనాథానికి మరోవూరు బదిలీ అవుతుంది. కొత్త వూరు వెళ్ళినా అతనికి మనశ్శాంతి లేదు. ఎప్పుడూ గురవడు, అతని భార్య పోచీయే గుర్తుకు వస్తారు. తనకు మనశ్శాంతి గురవడిని తలుచుకుంటేనే అని శివనాథం నమ్ముతాడు! ఈ చిన్నకథలో, మానవ జీవితానికి సుఖశాంతులిచ్చేది తృప్తి ఒక్కటే అనే అంశాన్ని అనాగరికులైన గురవడు పోచీల ఆదర్శ దాంపత్యం ద్వారా చక్కగా వ్యక్త పరచారు రచయిత్రి. ఈ రెండు పాత్రలూ కథకు ప్రాణం పోసి, గృహమే కదా స్వర్గసీమ అనే భావాన్ని రుజువు చేస్తాయి.

ఇదివరలో ఉల్లేఖించినట్లుగా స్వర్ణకమలాలు కథలన్నీ వాసి కలిగినవే! ఒకొక్క కథలో ఒక్కో ప్రత్యేకత పసికట్టవచ్చు! ఒకసారి చదివితే మనసులో గూడుకట్టుకుని నిలిచిపోయేవి గొప్ప కథలు. అటువంటి లక్షణాలున్న కథలు ఈ సంపుటిలో చాలానే ఉన్నాయి. అవి ఏవో పాఠకులే గుర్తుంచుకోవాలి. ఎవరి అభిరుచి వారిది. నా అభిరుచి అనుభూతులను అనుసరించి కొన్ని కథలను చర్చించడమైనది. ఈ నా ప్రయత్నం పాఠకులను మూల గ్రంథం వైపు ఆకర్షిస్తుందని నా నమ్మకం. అలాగే, సంపుటిలోని మరో ఉల్లేఖనీయమైన కథ చీకటిలో చెదరని మనిషి. ఇందులోని ముఖ్యపాత్రలు డా. అమర్‌నాథ్, అతని బావమరిది సర్వేశ్వరరావు. సర్వేశ్వరరావు భార్య రజని, రామ్‌ప్రసాద్, అతని భార్య పద్మాసని, కూతురు పారిజాతం, కొడుకు శీను. రామ్‌ప్రసాద్ కథలోని ప్రధాన పాత్ర. ఒక విధంగా చెప్పాలంటే రామ్‌ప్రసాద్ జీవితం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చినది. అన్ని కష్టాలకు గురైనప్పటికీ రామ్‌ప్రసాద్ గుండె నిబ్బరంతో జీవితాన్ని ఎదుర్కొంటాడు. చుట్టుముట్టిన అంధకారానికి బెదరక చెదరక నిలిచిన మనిషి అతడే!

ఈ కథ డా. అమర్‌నాథ్, గంగులు సంభాషణతో మొదలవుతుంది. గంగులు తను రోజూ చేయవలసిన పనులు అమర్‌నాథ్ వివరించిన విధంగా చేయడు. అంతేకాదు, అతడు ముందు రోజు ఆసుపత్రిలో జరిగిన విచారకరమైన సంఘటన డా. అమర్‌నాథ్‌ను అత్యంత విచలితుని చేస్తుంది. అందుచేత ఆరోజు నర్సింగ్‌హోమ్ చేరుతూనే తనురాగానే వచ్చి కారు తలుపు తెరిచి, చేయవలసిన పనులు యథావిధిగా చేయనందుకు గంగులుపై కోపగించుకొని చివాట్లు పెడతాడు! మరుసటి రోజునుండి పనిలోకి రావద్దని శాసిస్తాడు. వచ్చిన రోగులతో సహితం వింతగా ప్రవర్తిస్తాడు. డబ్బు ముందుగా ఇవ్వనిదే వైద్యం చేయనంటాడు. అదే సమయంలో రామ్‌ప్రసాద్ స్వంత పనిమీద అమర్‌నాథ్‌ని కలుసుకోవటానికి వచ్చి పరిస్థితి గమనించి రోగికి (వెంకటరమణ) పది రూపాయలిచ్చి వైద్యం చేయించుకోమని ప్రోత్సాహిస్తాడు.

రామ్‌ప్రసాద్‌కు తలవని తలంపుగా ఉద్యోగం పోతుంది. అమర్‌నాథ్‌ని కలుసుకుని, అతని క్లబ్ స్నేహితుడైన కలెక్టర్‌తో చెప్పించి తన కొడుకు శీను ఉద్యోగం ఖాయం చేయించుకొనే ప్రయత్నములో అమర్‌నాథ్‌ని కలుసుకొనటానికి వస్తాడు. అయితే, అమర్‌నాథ్ ఉన్నస్థితి గమనించి అతనిని కలుసుకో కుండానే ఇంటికి దారి తీస్తాడు. తీరా ఇంట్లో కొడుకు శీనుని చూచి ఆశ్చర్యపడి, ఆఫీసు నుండి ఎందుకు తిరిగి వచ్చావని అడుగుతాడు. శీను తనని ఉద్యోగం నుంచి తొలగించిన విషయం తండ్రితో చెప్తాడు. తండ్రి దగ్గరి నుండి కొంత పైకము తీసుకుని ఉద్యోగ ప్రయత్నం కోసం పక్క నగరానికి వెళ్ళిపోతాడు. ఇంతలో కూతురు పారిజాతం కాలేజీ నుండి తిరిగి వచ్చి విసుగుతో పుస్తకాలను మూలన పారవైచి పడుకుంటుంది. అది గమనించిన రామ్‌ప్రసాద్ విషయమేమిటని కూతురిని ప్రశ్నించి, పరీక్షలను గూర్చి విచారించాడు. పారిజాతం, కాలేజిలో ఉపాధ్యాయినులు చదువు సరిగ్గా చెప్పుట లేదని, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సవ్యంగా జవాబు లివ్వరని, చదువు సరిగా జరుగుట లేదని, అందుచేత పరిక్షలు వ్రాసే ఉద్దేశం లేదని తండ్రికి చెబుతుంది.

రామ్‌ప్రసాద్ భార్య క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతోంది. అన్ని విధాల ట్రీట్‌మెంట్ చేయించారు. ఆవిడ ఎక్కువకాలం జీవించదని డాక్టర్లు అభిప్రాయం వ్యక్తపరచారు. పద్మాసని

తను బ్రతికి ఉండగానే కూతురి పెళ్ళి జరిపించమని భర్తను కోరుతుంది. రామ్‌ప్రసాద్ వృత్తిరీత్యా రచయిత. రచయితగా మంచి పేరు ప్రఖ్యాతులు గడించాడు. అతని రచనలంటే పాఠకులు చాలా యిష్ట పడుటయేగాక, అతని రచనల మూలంగానే కొన్ని పత్రికలు జీవిస్తున్నాయన్న అభిప్రాయాన్ని పాఠకులు పత్రికా సంపాదకులకు ఉత్తరాల ద్వారా తరచు తెలియపరచేవారు. రామ్‌ప్రసాద్‌కు ఇంతగా పేరు ప్రతిష్టలు రావటం పత్రికా సంపాదకులు సహించలేకపోయారు! కొన్ని పత్రికలు అతని రచనలు ప్రచురించుట మానివేస్తే, మరికొన్ని అతని రచనలు స్వీకరించుటయే మానివైచాయి. ఏ పత్రికలో రామ్‌ప్రసాద్ ఉపసంపాదకుడిగా ఉద్యోగం చేస్తున్నాడో ఆ పత్రిక అకారణంగా అతనిని ఉద్యోగం నుంచి తొలగించింది. అతని ఆర్థిక పరిస్థితి రోజురోజుకి క్షీణిస్తున్నది. ఇంతటి విషాద స్థితిలోనూ రామ్‌ప్రసాద్ తన రచనా వ్యాసంగాన్ని విరమించడు. *చీకట్లో చెదరని మనిషి* అనే కథలో ఒక రచయిత జీవితంలో ఎంత హాలాహలం ఉన్నదో ఆయన దాన్ని గరళ శంకరుడై ఎట్లా భరిస్తున్నాడో, అయినప్పటికీ రచనల్లో సదాశివ రూపాన్ని ఏవిధంగా ఆయన ప్రదర్శిస్తున్నాడో చిత్రించి ఒక ధీరోదాత్త పాత్రను సృష్టించారు సరస్వతీదేవి. కథ ముగింపు నాటక ఫక్కీలో ఉండి, ఒక గొప్ప కథను చదివిన అనుభూతిని పాఠకుని మనస్సులో సృజింపజేస్తుంది. *స్వర్ణకమలాలు* లో ఉమ్మడి కుటుంబాలకు సంబందించిన కథలు చాలానే ఉన్నాయి. ఉమ్మడి కుటుంబాలలో ఉన్న సాధక బాధకాలు చక్కగా చిత్రించారు సరస్వతీదేవి. నిరుద్యోగి ఒక కుటుంబంలో ఉంటే, అతను, అతని భార్య పడే కష్టాలు కళ్ళకు కట్టినట్లు చూపించారు రచయిత్రి అసమర్థుడు అనే కథలో.

కరి జగ్గయ్య శాస్త్రికి రంగడు పెద్ద కుమారుడు. రంగడి (రంగారావు) చిన్నతనంలోనే తల్లి మార్పిడి జరిగింది. రెండో పెళ్ళానికి మరో ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. జగ్గయ్య శాస్త్రి భూకామందు. ఆర్థికస్థితి ఒకవిధంగా బాగా ఉన్నదనే చెప్పాలి. తండ్రి జగ్గయ్యశాస్త్రికి రంగడి తెలివి తేటలపైన చిన్నప్పటి నుండే మంచి అభిప్రాయం లేదు. అతనిని అసమర్థునిగా భావించి, చీటికి మాటికీ మాటలని చులకనగా చూచేవారు. రంగడు ఇంటరు పరీక్ష పాసైన తరువాత మెడిసిన్ చదవాలని అభిలాష పడతాడు. కాని, తండ్రి ఏవో కుంటి సాకులు చెప్పి రంగని చదువు మానిపిస్తాడు. అంతేకాదు, వివాహం సహితం చేస్తాడు. భార్య జానకమ్మ త్వరలోనే కాపురానికి వస్తుంది. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు రంగారావు దంపతులను సరిగ్గా చూడరు. నిరుద్యోగి అనే సాకుతో అతనిని ఎందుకూ పనికిమాలిన వానిగా అస్తమానం ఏవో అవమానాలకు లోను చేసేవారు.

తల్లిదండ్రులు చూపే అనాదరణ, అవమానాలను భరించలేక, రంగారావు భార్యతోసహా చెప్పకుండా ఇల్లు వదలి వెళ్ళిపోతాడు. భార్య సొమ్ములు అమ్మి ఆ సొమ్ముతో బొంబాయిలో ఒక చిన్న గదిలో అద్దెకుంటూ, పెద్ద రోడ్డు పక్కన ఒక కాలి బాట మీద కూర్చుని స్కూలు పిల్లల పుస్తకాల అమ్మకం ప్రారంభించాడు. క్రమేణా ఆవ్యాపారం పెద్దదై, అన్ని రకాల పుస్తకాలు దొరికే దుకాణంగా మారుతుంది. ఆ దుకాణం పెద్ద రోడ్డుమీద పేరుపొందిన బట్టల దుకాణం పక్కన కరి బుక్‌హౌస్ గా రూపొందుతుంది. అచిరకాలంలోనే తృప్తికరమైన రాబడి వస్తుంది. బొంబాయి నగరంలో మూడు అంతస్తుల భవనంలో, నాలుగు గదుల భాగం అద్దెకు తీసుకుని, భార్యా పిల్లలతో కాపురం చేస్తున్నాడు ఇప్పుడు కరి రంగారావు (ఉరఫ్ రంగడు).

కాలచక్రం తిరిగి పోయింది. ఆరు సంవత్సరాలు గడిచి పోయాయి. అనుకోకుండా ఒకనాడు రంగారావు గ్రామస్థుడైన సుబ్బారావు అనే అతనికి తెలిసిన వ్యక్తి బొంబాయి వస్తాడు. దుకాణంలో ఉన్న రంగడిని చూచి గుర్తుపట్టి "రంగా నువ్వు ఇక్కడ ఉన్నావా? ఈ దుకాణంలో పనిచేస్తున్నావా?" అని ఆశ్చర్యంతో అడుగుతాడు. "ఈ విషయాన్ని మీ నాన్నగారికి తెలియ పరచలేదెందుకు?" అని అంటాడు. రంగారావు తనను గురించిన విషయాలన్నీ సుబ్బారావుకు చెప్పి తన ఇంటికి తీసుకు వెళతాడు. సుబ్బారావు బొంబాయిలో ఒకటి రెండు రోజులుండి, తిరిగి స్వగ్రామానికి వెళ్ళుతూ రంగడు తన తల్లిదండ్రులకు విశేష సమాచారాన్ని అందజేస్తాడని ఆశిస్తాడు. కాని, రంగడు క్లుప్తంగా మేము బాగున్నామని, మీరు చూచిన విశేషాలు తెలియజేయమని చెప్తాడు. భార్య జానకి స్వగ్రామం వెళ్ళి తల్లి తండ్రులనొకసారి చూచి, వారికి పిల్లలను చూపిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తపరుస్తుంది. కాని, రంగడు అందుకు సిద్ధపడడు. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు అతనిని చిన్ననాటి నుంచి చూచిన విధానం, అన్న మాటలు, అతనిని పనికి మాలినవానిగా పరచిన అవమానాలు అతనిలో ఆత్మస్థైర్యాన్ని క్రుంగదీసి మానసికంగా గాయపర్చాయి. ఆ రోజులు అతడు మరువలేకపోయాడు. కొంత కాలానికి తండ్రి

జగ్గయ్యశాస్త్రి రంగడికి ఉత్తరము వ్రాస్తాడు. అతడి క్షేమసమాచారాలు విచారించి, భార్యా పిల్లలతో సహా, గ్రామానికి వచ్చి చూచి పొమ్మని అర్థిస్తాడు. అయితే, అందుకు రంగడి గాయపడిన మనసు ఒప్పుకోదు. తండ్రికి తను పిల్లలతో సహా గ్రామానికి రాదలుచుకోలేదని, అయితే, తల్లిదండ్రుల పట్ల తన ఋణం తీర్చుకొనుటకై నెలనెలకూ వారికి 50 రూపాయలు పంపిస్తానని తెలియజేస్తాడు! కథ రంగడి మనోవ్యథ చక్కగా చిత్రిస్తుంది!

విద్యార్థి జీవితంలో వ్యక్తపరిచే అభ్యుదయ భావాలు, నిజజీవితంలో పాటించరు కొందరు యువకులు. ఆ కోవకు చెందినవాడే శాంతించిన సముద్రం అనే కథలోని పాత్ర రంగథామారావు. రంగథామారావుకు మంచి తెలివితేటలతో పాటు, అందచందాలు ప్రసాదించాడు సృష్టికర్త. విద్యార్థిదశలో చదువుతోపాటు, ఆటపాటలలోను, సాంస్కృతిక కలాశాలలోను, ముఖ్యంగా నాటకాలు, నటనా విషయాలలో అతను కనబరచిన శ్రద్ధాసక్తులు తోటి విద్యార్థులనేకాక, విశ్వవిద్యాలయములోని ఆచార్యులను సహితం అతని వైపుకు ఆకర్షితులను చేస్తాయి. రంగథామారావు పోటీలేని విద్యార్థి నాయకుడయ్యాడు. ఆ రోజులలో అతడు ఆంధ్రా యూనివర్సిటీ లో ఆనర్సు చదివేవాడు. మంచి వక్తగా, ఆదర్శ అభ్యుదయ భావాలతో నిండిన యువకునిగా పేరు తెచ్చుకున్నాడు. ఆంధ్రా యూనివర్సిటీ లోనే అదే సమయంలో ఇంటరుమీడియట్ చదువుతుండేది సావిత్రి. మంచి అందగత్తె. కొంతవరకు ఆదర్శ భావాలతో పెరిగిన యువతి. ఆ సంవత్సరపు యూనివర్సిటీ వార్షికోత్సవాలు జరుగుతున్నవి. ఆ సందర్భంలో నాటక పోటీలు నిర్వహించాలని రంగథామరావు ఉబలాటం. అయితే నాటకంలో స్త్రీ పాత్ర పోషణకు ఏ విద్యార్థినీ ముందుకు రాలేదు. ఆ సందర్భములో మొదటిసారి సావిత్రిని కలిశాడు రంగథామరావు. వారు ప్రదర్శింపదలచిన నాటకంలో యువరాణీ పాత్రలో నటించ వలసినదిగా కష్టపడి ఒప్పించాడు సావిత్రిని అతను. నాటక ప్రదర్శన విజయవంతమై అందరి ప్రశంసలు అందుకొన్నది. యువరాణి పాత్రధారిణి సావిత్రికి మంచి నటిగా గుర్తింపు, బహుమతి లభించుట జరిగింది. ఆ తర్వాత సావిత్రి రంగథామరావును తరచుగా కలియుట, అతడి జీవితాశయాలను గురించి తెలుసుకొని, అతని వైపు ఆకర్షించబడుట జరిగిపోయాయి. . . .

సంవత్సరాలు గడిచాయి. రంగథామరావు ఆనర్సు పాసై లా చదువుకొని ఉద్యోగంలో చేరాడు. కట్నం తీసుకొని ఎక్కువ చదువుకోని తాయారమ్మ అనే యువతిని పెండ్లి చేసుకున్నాడు.... సావిత్రి ఆనర్సు పాసైంది. తండ్రి పై చదువులు మాన్పించి వివాహ ప్రయత్నం చేస్తున్నాడు. ఒక మంచి సంబంధం వచ్చినప్పుడు ఆ సంబంధాన్ని గూర్చి సావిత్రి అభీష్టమేమిటో తెలుసుకోగోరాడు. సావిత్రి ఆ సంబధంవైపు శ్రద్ధ చూపలేదు. తల్లిలేని పిల్ల కనుక సావిత్రిని తండ్రి ముద్దుగా పెంచుకున్నాడు. వయోవృద్ధుడైన ఆయన కూతురికి త్వరలో వివాహము చేయదలచి కొడుకును పిలిపించి సావిత్రి మనసులో ఎవరైనా ఉన్నాడేమోనని వివరాలు తెలుసుకో గోరుతాడు. సావిత్రి అన్నయ్య విచారించి, సావిత్రి రంగథామరావును ప్రేమిస్తున్నదని గ్రహించి, అందు నిమిత్తమై రంగథామరావును కలుస్తాడు. రంగథామరావు కాలేజీ చదువులు చదివి – నాటకాలలో వేషాలు వేసే ఆడపిల్లలపై తనకు సదభిప్రాయము లేదని, చులకనగా మాట్లాడి, సావిత్రిని పెండ్లి చేసికొనుటకు తన అసమ్మతిని తెలియజేస్తాడు. ఈ విషయాన్ని గురించి తండ్రీ – కొడుకు (నాన్నా, అన్నయ్య)ల మాటలు చాటుగా విన్న సావిత్రి నిరాశతో తన తండ్రీ, అన్నయ్య నిర్ణయించిన అబ్బాయి (వెంకటరమణ)ని పెండ్లి చేసుకుని కాపురానికి వెళ్తుంది. వెంకటరమణ బీదవాడు. కష్టపడి బి.కాం. పరీక్ష అయి ఉద్యోగంలో ఉన్నాడు. బీదవాడైనందున అతనికి చాలా విషయాలు తెలియవు, అమాయకుడు.

ఇలా కొంత కాలం గడుస్తుంది. సావిత్రి దంపతులు అద్దెకుంటున్న పక్కవాటాలోనికి ఎవరో కొత్తగా వస్తారు. ఒకటి రెండు రోజులు గడిచిన తర్వాత, ఒక ముసలమ్మ సావిత్రితో పరిచయం చేసుకుని తన కుటుంబ విషయాలు చెబుతుంది. తన కొడుకు రంగథామరావని, ఆంధ్రా యునివర్సిటీలో ఆనర్సు లా చదివి ఉద్యోగంలో చేరాడని, ఈ ఊరికి బదిలీ అయి వచ్చామని, తన కోడలి పేరు తాయారని, తనకు ఒక మనుమడనీ చెప్తుంది. ఈ విషయం తెలుసుకొనిన సావిత్రికి అమితమైన మనస్తాపం కలుగుతుంది. ఆనాటి నుండి ఆమె ప్రవర్తన మారుతుంది. తన వివాహ జీవితం సుఖశాంతులతో, ఎంతో అన్యోన్యంగా జరుగుతున్నదన్న భావం రంగథామరావులో కల్గించి, అశాంతియుతమైన అతని జీవితానికి కారణం అతడు తనను (సావిత్రిని) వివాహం చేసుకొననందులకు పొందుతున్న శిక్ష అనే భావం కల్గించుటకు, సావిత్రి దంపతులపై అసూయ కగించుటకు

ఆమె రోజూ ప్రయత్నము చేసేది. ఇలా ఉండగా రంగథామరావుకు అకస్మాత్తుగా మరోఊరు బదలీ అయి వెళ్ళిపోవుటతో కథ ముగుస్తుంది. ఈ కథలో విఫల ప్రేమికురాలైన సావిత్రి మనోవైచిత్రిని చక్కగా చిత్రీకరించారు రచయిత్రి. శాంతించిన సముద్రం అనే శీర్షిక కథకు చక్కగా అతికింది.

కులాంతర వివాహాలవల్ల కొందరు ఎదుర్కొనే సమస్యలు అతి చక్కగా వ్యక్తీకరించారు రచయిత్రి సరస్వతీదేవి. కథ వెనుక దాగిన నిజం అనే కథానికలో. ఈ కథలోని పాత్రలు మాణిక్యం (ప్రధాన పాత్ర), గౌరీశంకర్ మాణిక్యం భర్త. శారద మాణిక్యం స్నేహితురాలు. లిల్లీ, ఆసుపత్రిలో నర్సు. మాణిక్యం అనే అమ్మాయి తల్లి తండ్రులను ఎదిరించి, గౌరీశంకర్ అనే యువకుడ్ని కులాంతర వివాహం చేసుకొంటుంది. మంచి వాడనుకున్న గౌరీశంకర్ పరమ దుర్మార్గుడిగా మారుతాడు. మాణిక్యం శాఖాహారి. మాంసాహారం తయారుచేసే పద్ధతి ఆమెకు తెలియదు. భర్త బలవంతానికి తట్టుకోలేక, మాంసాహారం తయారుచేయుట నేర్చుకుంటుంది. భర్త నిమ్నజాతి వాడగుటచే, తన గొప్పదనాన్ని నిరూపించు కొనుటకు తనవారందరికీ మాంసపదార్థాలను వండి వడ్డించాలని ఆమెను నిర్బంధిస్తాడు. ఆతని కృత్యాలు అంతటితో ఆగవు. భర్త తినే పదార్థాలన్ని భార్య తినాలని ఆమెచేత మాంసాహారం బలవంతాన తినిపిస్తాడు. ఈ పరిస్థితి మాణిక్యానికి మనస్తాపం కలిగిస్తుంది. అయినప్పటికీ పిల్లలకోసం కాపురం నిలబెట్టుకోవటానికి ప్రయత్నిస్తుంది. తల్లిదండ్రులను వ్యతిరేకించి వివాహం చేసుకొనబట్టి పుట్టింటికి వెళ్ళేటందుకు అమెకు మనస్కరించదు. తల్లిదండ్రులు కూడా దగ్గరకు తీయరు. కొంతకాలానికి మనోవ్యథతో బాధితురాలైన మాణిక్యానికి రక్తపు పోటుతో గుండెజబ్బు వస్తుంది. స్కూలు టీచరుగా పనిచేస్తూ తన ఇద్దరి పిల్లలనూ ఏదోవిధంగా పోషించుకుంటూ వుంటుంది. భర్త గౌరీశంకర్ కుటుంబ పోషణా బాధ్యతలు స్వీకరించకపోగా, మధ్యమధ్యలో వచ్చి మాణిక్యాన్ని ఏదోవిధంగా బాధపెట్టేవాడు. వెలివేయబడ్డ మాణిక్యానికి జీవితం దుర్భరమైపోయి, గుండెజబ్బుతో కొద్దిరోజులు ఆసుపత్రిలో ఉండి, పిల్లల భవితవ్యానికి డాక్టరు ఏదో ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వగానే, మరణిస్తుంది. తర్వాత అసలు నిజం తెలియ వస్తుంది. గౌరీశంకర్ యువకుడుగా ఉండగా ఎవరో పెద్ద కుటుంబానికి చెందిన అమ్మాయిని ప్రేమించి, వివాహం చేసుకోవాలని ఆశిస్తాడు. ఆమె తల్లితండ్రులు తక్కువ జాతికి చెందిన గౌరీశంకర్‌కి తమ పిల్లను ఇవ్వకుండా, అతనిని తమ ఇంటి దరిదాపులకు కూడా రానివ్వరు. విఫల ప్రేమికుడైన అతడు కసితో మాణిక్యాన్ని ప్రేమించినట్లు నటించి, పెండ్లి అయిన తర్వాత, ఆమెపై కులకక్ష తీర్చుకుంటాడు! మాణిక్యం దుర్భర జీవితాన్ని, ఆసుపత్రిలో ఆమె గడిపిన రోజులను, రచయిత్రి హృదయ విదారకంగా చిత్రించారు. తొందరపాటుతో పెద్దలను ఎదిరించి చేసుకొనిన కులాంతర వివాహాలు అనుకోని కష్టాలకు, పరిణామాలకు దారితీస్తాయని, సరస్వతీదేవి ఈ కథానిక ద్వారా తెలియజేశారు.

బ్రహ్మానందం ధనిక కుటుంబానికి చెందినవాడు. లా చదువుకుని జిల్లా జడ్జి పదవి అలంకరించినవాడు. తనకంటే తక్కువ పదవిలో ఉన్నవారంటే ఆయనకు చులకన. చుట్టపక్కాలలో సహితం తన స్థాయివారితోనే సంబంధాలు పెట్టుకుంటాడు. బ్రహ్మానందం నివాసమున్న వీధిలో దాదాపు 20కి పైగా కుటుంబాలు ఉన్నప్పటికీ, కేవలం, ముగ్గురు గొప్ప పదవిలో ఉన్నవారితోనే అతనికి రాకపోకలు. బ్రహ్మానందం లోకల్‌క్లబ్బులో సాధారణ సభ్యుడేకాక, క్లబ్బు కార్యవర్గంలో సభ్యుడు. పదవీ దర్పానికి ఇదికొంత ఆజ్యంలా పనిచేసి అతనిలో అహంభావం బాగా పెరుగుటకు తోడ్పడింది! ఆరోజు క్లబ్బులో ఎవరోగొప్ప వ్యక్తికి సన్మానం. కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేసుకుని ఇల్లు చేరాడు బ్రహ్మానందం. చక్కగా తయారై సాయంత్రం కార్యక్రమం ఆరంభించుటకు ముందుగానే క్లబ్బుకు వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ఒక చిన్న చిక్కు వచ్చి పడింది. ఏదో పనిపైన పంపిన తన కారు ఆలస్యంగానే వస్తుంది. టాక్సీవాడికి క్లబ్బు చిరునామా ఇచ్చినందున, అది కూడా ఇంటికి రాదు. ఈ లోపల ఒక పెద్ద కారు వచ్చి తమ వీధిలోని ఒక చిన్న ఇంటినుండి ఒక వ్యక్తిని (జ్యోతిష్కుని) తీసుకుని వెళ్ళుట గమనిస్తాడు. తాను ఆలస్యంగా క్లబ్బు చేరుకునే సమయానికి క్లబ్బు అధ్యక్షుడు క్లబ్బు కార్యకర్తలను ముఖ్య అతిథికి పరిచయం చేస్తూ ఉంటాడు. వారితోపాటు తమ వీధినుండి వచ్చిన ఆ వ్యక్తిని గొప్ప జ్యోతిష్కుడని ప్రశంసించి, ముఖ్య అతిథికి పరిచయం చేస్తాడు. ఆ విషయం కనులారా చూచిన బ్రహ్మానందం ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత తన భవిష్యత్తును గురించి తెలుసుకో వలయునన్న స్వార్థ బుద్ధితో ఆ జ్యోతిష్కుని ఇంటికి వెళ్తాడు! ఆ పండితుడు ఎంతగొప్ప జ్యోతిష్కుడో అంతటి సంస్కారవంతుడు, నిగర్వి. ఆయన భోజనం ముగించుకొని

జిల్లా జడ్జి బ్రహ్మానందంతో ఆదరపూర్వకంగా మాట్లాడి, బ్రహ్మానందం వచ్చిన పని తెలిసికొని, అతడు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికరంగా జవాబులిస్తాడు. బ్రహ్మానందం ఆపండితునికి చెక్కుద్వారా పరిహారం ఇవ్వబోతాడు. కాని, ఆ మహాజ్యోతిష్య పండితుడు ఆ చెక్కు స్వీకరించడు. ఆ మహాపండితుని సభ్యతా సంస్కారం అందుకు అనుమతించదు! ఈ సంఘటన బ్రహ్మానందాన్ని ఆశ్చర్య పరుస్తుంది! అతని అల్పత్వాన్ని గుర్తు చేస్తుంది! అధికార దర్పంవల్ల తెచ్చి పెట్టుకొనే గొప్పలకీ, విశిష్ట విద్యా సంస్కారాల ద్వారా లభించే ఉన్నతికీ, ఎంతటి వ్యత్యాసమో, మహోన్నతుడు అనే ఈ చిన్న కథలో గొప్పగా ప్రకటించారు సరస్వతీదేవి.

స్వర్ణకమలాలు సంపుటిలోని మొదటి కథ *కొండమల్లెలు* అయితే, చివరికథ స్వర్ణకమలాలు. ఏ కథాంశము పరిశీలించినా పాఠకుణ్ణి ఆలోచింపచేయడమే రచయిత్రి ప్రధాన లక్ష్యంగా తోస్తుంది. *స్వర్ణకమలాలు* వినాయకచవితి పూజకోసం కమలాలు కోసిన పేదవాడైన ఏడుకొండలు కథ. రంగారావు ఆ గ్రామానికి మునసబు. ఆ వూరి కొలనులో ఉన్న ఎరుపు, తెలుపు కమలాలను కోసి తెల్లవారేసరికి తెమ్మన్నాడు. ఏడుకొండలు రాత్రే చెరువు గట్టున చింతచెట్టు క్రింద బట్టపరుచుకుని పడుకున్నాడు. అకస్మాత్తుగా బ్రహ్మాండమైన వాన కురుస్తుంది! ఏడుకొండలు చెరువులోకి దూకి, కట్టుకున్న బట్ట నడుముకు జోలెగా కట్టుకున్నాడు, ఎన్నో కమలాలు కోశాడు. గట్టుపైకి వచ్చి లెక్కపెడితే, అవి నూరు కమలాలు. అయ్యగారు చేసే వినాయకచవితి పూజకోసం కోశాడు అన్నిటిని. ఆ చెరువులోని జలగ ఏడుకొండలు రక్తం పీలుస్తోంది. అయినా, భరించి అయ్యగారి పూజకోసం కోశాడు, ఆ కమలాలను.

ఇన్ని బంగారు పూలు, మునసబుగారి మనుమడు చేసే వినాయకచవితి పూజకే! తటాలున ఏడుకొండల మనసులో ఏదో మెరుపు మెరిసింది. ఈ పూలతో తనెందుకు పూజ చేసుకోకూడదూ! ఏడుకొండలు వేలితో ఆ ఇసుకపై వినాయకుని బొమ్మ గీశాడు. స్వర్ణకమలాలతో పూజ చేశాడు. మునసబుగారు, వారి మనవడు, వారింటి వినాయక పూజా, ఏమీ గుర్తు రాలేదు ఏడుకొండలికి!

ఎనిమిది దాటినా, ఇంటికిరాని ఏడుకొండలకై కబురు పెట్టాడా, తెలుసుకోడా, శిక్షించడా – అమాయకుడికి భక్తి తత్పరతే కాని, మరొకటి తెలియలేదు ఆ సమయంలో! భాణా కర్రలు తీసుకుని, మీసాలు మెలివేస్తూ, ఏడుకొండలను తీసుకు వెళ్ళాలనుకున్న వెంకటేసు, మల్లేసు విస్తుపోయారు! ఆ వినాయక పూజకి, స్వర్ణకమలాలు చూచి "మీరు కూడా ఆ చెరువులో మునిగి, తడి బట్టలతో వచ్చి సాగిలపడి కళ్ళుమూసుకోండి. ఏరా మన మెప్పుడైనా ఈటితో పూజలు చేసామా?" అని ఏడుకొండలు అంటుంటే, "మునసబుగారు పంపింది ఎందుకో సాగిల పడటానికా" అని మల్లేసు కర్ర ఎత్తాడు. "నేను రాను ఏమన్నా చేసుకో" అన్నాడు ఏడుకొండలు. పేదవాడి శక్తిని దోస్తున్న ధనిక వర్గాన్ని, పేదరికపు రూపాన్నీ చూపి, సామాజిక తారతమ్యాలను చక్కగా వెల్లడించారు ఈ కథలో సరస్వతీదేవి. ఇదో అద్భుతమైన కథ.

పైన విశ్లేషించిన కథలు స్వర్ణ కమలాలికి మచ్చు తునకులు మాత్రమే! సంపుటిలోని కథలన్నీ చదివితే, ఒక మంచి పుస్తకాన్ని చదివిన అనుభూతి పాఠకుల హృదయాలలో తప్పక ఉత్పన్న మవుతుంది.

**సంఘసేవాకర్త :**

ఇల్లిందల సరస్వతీదేవి కేవలం రచయిత్రి మాత్రమే కాదు, ఒక గొప్ప సంఘ సేవాకర్త. జైలు విజిటరుగా జైళ్ళలోకి వెళ్ళి నేరస్థులను అధ్యయనం చేసి, వారి మనసులు మార్చి, వారిలో నేర ప్రవృత్తిని తగ్గించడానికి ఆమె విశేష కృషి చేశారు. ఆంధ్ర యువతీ మండలి ఏర్పాటులో సరస్వతీదేవి చేసినకృషి అనేక పెద్దల మన్ననలకు పాత్రమైనది. ఒక సాహిత్య వేత్తగాను, సాంఘిక సేవాకర్తగాను ఆమె తన జీవితంలోని అధికభాగాన్ని మహిళాభ్యుదయానికి అంకితం చేశారు.

**పదవులు, పురస్కారాలు :**

**(ముఖ్యమైనవి)**

సరస్వతీదేవి తన సుదీర్ఘ జీవితకాలంలో సమాజం నుండి ఎంతో గౌరవాన్ని, ఆదర ఆప్యాయతలను చూరగొన్నారు. ఆనేక సంస్థల నుండి సన్మాన పురస్కారాలనే కాకుండా, బాధ్యతాయుతమైన కొన్ని పదవులను సహితం విజయవంతంగా నిర్వహించారు.

**పదవులు :**

1958 – 1966 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్‌కౌన్సిల్ నామినేటెడ్ సభ్యురాలిగా వ్యవహరించారు. 1967 –1972 లో ప్రాంతీయ చలనచిత్ర అవార్డు కమిటీ సభ్యురాలు. 1974లో జాతీయ చలనచిత్ర కమిటీలో సభ్యురాలు. 1977 – 1978 ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర అవార్డుల కమిటీ సభ్యురాలు.

**సాహిత్య రంగము నుండి పురస్కారాలు :**

1964 – గృహలక్ష్మి పురస్కారం, కేసరీ కుటీరం,

మద్రాసు. 1974 – ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ రచయిత్రి అవార్డు. 1982 – స్వర్ణకమలాలు కథా సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ వారి జాతీయ పురస్కారం లభించాయి. 1996 – పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు పట్టా పొందారు.

**ముగింపు :**

విశ్వజనీనమైన భావాలను దృష్టిలో పెట్టుకుని రచన చేయటానికి ప్రయత్నించారు సరస్వతీదేవి. చక్కని ఇతివృత్తం ఎక్కడ లభ్యమైతే, అక్కడికల్లా వెళ్ళారు రచయిత్రి. తన రచనలు కేవలం మధ్యతరగతి కుటుంబాలకే పరిమితం చేయలేదామె. ఆమె రచనలలో ముఖ్యంగా అనేక స్త్రీ పాత్రలను సృష్టించారు. తాను సృజించిన స్త్రీ పాత్రలను గూర్చి ముచ్చటిస్తూ “నేను సృష్టించిన స్త్రీ పాత్రలన్నీ క్షమ, ఓరిమి, మంచితనం, ముందుచూపు, ఆత్మగౌరవం, ఆత్మస్థైర్యం కలిగి ప్రవర్తిస్తాయి. స్త్రీలలో ఉండే ఓర్మిని చేతకాని తనం క్రింద ఎప్పుడూ అనుకోకూడదు. నా రచనలలో స్త్రీ–పురుష సమైక్యతను చాటిచెప్పే విశ్వజనీన భావాన్ని పొందుపరచడానికే ప్రయత్నించాను. కాని ఏ వొక్కరినో సమర్థంచడానికో, లేదా విమర్శించడానికో ప్రయత్నించలేదు” అంటారు ఆమె.

సరస్వతీదేవి కథలన్నీ సూక్ష్మంగా పరిశీలిస్తే, కథాశిల్పం కుంటు పడకుండా, ఆసక్తిదాయకంగా చదివించే లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. సరళ సుందరమైన భాష, మంచి కథా కథన శైలి, సహజంగా సాగిపోయే సంభాషణలు కథలకు విశిష్టత చేకూరుస్తాయి. పఠితలను ఆకర్షిస్తాయి. కొన్ని కథలు ఒకసారి చదివితే మనస్సులో చెరిగిపోకుండా నిలిచిపోతాయి. స్వర్ణకమలాలు కథాసంపుటి అందరూ చదివి ఆనందించ వలసిన పుస్తకం. ఇంతటి గొప్ప రచనకు తమ జాతీయ పురస్కారన్ని అందజేసిన కేంద్ర సాహిత్య అకాడమీ వారు అభినందనీయులు. స్వర్ణకమలాల కథాసంపుటి మార్కెట్టులో లభ్యం కానందువల్ల, ఈ వ్యాసము కినిగె వారి ఇ–సంకలనం కథలు చదివి రచించడమైనది.

**ప్రొ. రావినూతల సత్యనారాయణ**
**హైదరాబాద్.**
**ఫోన్ : 961 852 4702**

*తెలుగు భాషలో 'కేంద్ర సాహిత్య అకాదెమీ పురస్కారం' పొందిన వారి రచనలను, సమీక్షించాలని మిసిమి సంకల్పించింది. అందుకు తగినట్లు ప్రొ. రావినూతల సత్యనారాయణ గారు స్పందించారు.*


ప్రొ. రావినూతల సత్యనారాయణ

*ఇదొక బృహత్ కార్యం. ఇందులో రచయితల రచనలే కాకుండా ఒక్కొక్కప్పుడు వారి జీవితంలోకి తొంగిచూడవలసిన అవసరం రావచ్చు. కేవలం రచనలు చదివితే సరిపోదు. రచయిత స్వభావంపట్ల కూడా అవగాహన ఉండకపోతే సమీక్ష తేలిపోతుంది. రచయితలు తాము రాసే రాతకు, జీవించే జీవితానికి పొంతనే ఉండదు. వీటిని సమన్వయపరుస్తూ వారి రచనలను విశ్లేషించగలగాలి. కవిత్వమైనా, కథయైనా, నవల అయినా, నాటకమైనా, విధానమేదైనా అన్నీ వ్యక్తిత్వ సూచికలే. రచయిత అనుభూతి పరిసరాల వీచికలే.*

*ప్రతి రచయితా తన మనసులో ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుంటాడు. ఆనందం, ఆవేశం, ఆవేదన, ఆర్తి – ఇవన్నీ తన రచనలలో ప్రతిబింబింపచేస్తాడు. రచయితలకు భావావేశం ఎక్కువ. దానికి భిన్నమైన తర్కం కూడా ఉంటుంది. అవన్నీ పాఠకులలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. రచయితను, పాఠకుడిని ఎదురెదురుగా నిలబెట్టి కరచాలనం చేయించగలిగినవాడే నిజమైన సాహితీ సమీక్షకుడు. ఆయన తన సమీక్షలో ఆయా రచయితలకు సంబంధించిన ఏ పుస్తకాన్నీ వదలలేదు.*




*తెలుగు భాషలో వెలుగు చూసి, పురస్కారం పొందిన రచనలన్నింటినీ, రచయితలెందర్నో సమీక్షించి, పరిచయం చేసి తెలుగు పాఠకులకు గ్రంథ రూపంలో అందిస్తున్నారు. ఇది విజ్ఞులైన పాఠకులకూ, పరిశోధనాశీలురైన విశ్వవిద్యాలయ విద్యార్థులకూ కరదీపికగా ఉండగలదని ఆశిస్తున్నాం.*

(ప్రతులకు *మిసిమి* కార్యాలయాన్ని సంప్రదించండి.)

# సంస్కృతుల ప్రభావం

– వేలూరి కృష్ణమూర్తి


ఖచిజోజి, టోకియో మహానగరపు బయట వలయంలోనున్న ఒక చిన్న నగరం. ఈ పేరున్న నగరానికి అర్థమేమిటో తెలుసా? ఖబోదేవి యొక్క దేవాలయమని! ఇంతకూ ఈ ఖబోదేవి మన మహాలక్ష్మి యొక్క జపాను అవతారం! అందువల్ల ఖచిబోజి అంటే మహాలక్ష్మీదేవి నగరమని!

ఇదెందుకు చెబుతున్నానంటే కొద్ది వారాల క్రితమే జపాను ప్రధాని మనదేశం వచ్చివెళ్ళారు. కాశీపట్టణంలోని గంగానది ఒడ్డున జపాన్ ప్రధాని శింజోఅబె, నదికి హారతి చేస్తూ నిలబడినపుడు వారు వేరే దేశం నుండి వచ్చినవారని ఎవరికీ అనిపించలేదు. ఎందుకో తెలుసా? ఎన్నో వేల ఏళ్ళ నుండీ, మొదటినుంచి జపాను దేశం భారతదేశంవల్ల ప్రభావితం చెందినది. ఈ ప్రభావం ఎంతటి లోతులకు వెళ్ళినదంటె జపాను దేశస్థులు భారతదేశాన్ని 'తెంజీకు' అని కావ్యాత్మకంగా పిలుస్తారు. అలా అంటే 'స్వర్గ'మని అర్థం!

భారతీయ సంస్కృతి భారతదేశంలోకన్నా చాలా సుభద్రంగా జపానుదేశంలో నాటివున్నదని చెబితే అది అతిశయోక్తి కాదు. జపాను దేశస్థుల అత్యంత ప్రియమైన దేవత సరస్వతి. మన దేశంలో వీణ పట్టివున్న సరస్వతి (రవివర్మ చిత్రం)లాగానే అక్కడి దేవిని చిత్రించి వున్నారు. ఆ దేవతను సరస్వతీనదితో పోల్చి, జలదేవతయని కూడ పూజిస్తారు.

క్రీ.శ. 722లో టొడాయ్జి దేవాలయంలో లక్ష్మి, సరస్వతులను ఒకటిగా పూజించిన మొదట ఉల్లేఖనమున్నది. తదనంతరం ప్రతి సంవత్సరమూ యీ యిరువురి దేవతల పూజ చాలా విజృంభనతో జరుగుతుంది ఇప్పటికీ! 1836లో సైటోసాచియే వ్రాసిన ఒక గ్రంథంలో, టోకియో భాగంలో ఖ్యాతి చెందిన దేవతంటే సరస్వతియని ఉల్లేఖించబడినది. 1934లో చుబెన్ సాన్వో అన్న మహిళ తనను, 'తాను సరస్వతీ అవతారమని చాలా గట్టిగా నమ్మడమేగాక, ఆమె సంస్కృతంలో కృతి రచన చేయడం ప్రారంభించినది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే అప్పటికి ఆమె సంస్కృత భాషను నేర్చి వుండలేదు! ఆమెవల్లనే అచట సరస్వతీ పంథం ఉద్భవించినది. సరస్వతీ పంథమంటె అది అధ్యయన శీలతకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చినదని వేరుగా చెప్పాల్సిన పని లేదుకదా? ప్రాచీన కాలం నుండి మొదలుకొని 1934 వరకు లెక్కకు చిక్కలేనటువంటి ఈ దేశం యొక్క సాంప్రదాయం ధారాప్రవాహంవలె ఎలా సాగి వచ్చినదో ఆలోచించవచ్చు. ఎందులో సత్యముంటే అది దుష్టుల – పోకిరీల ఆక్రమనానికి దొరికి నాశనమవదని చెప్పడానికి దీనికంటే బలమైన సాక్ష్యం ఏదైవుంటుంది? జపాను దేశం నలువైపులా సంస్కృత భాష వ్యాపకంగా విస్తరించినది. దక్షిణ భారతదేశం నుండి బయలుదేరిన భరద్వాజ గోత్రులైన బోధిసేనులు దీనికి కారణమంటారు. బాల్యం నుండే అఖండ విరాగులైనవారు బుద్ధుడి సాహిత్యంతో చాలావరకు ప్రభావితులైనారు. ఒకవైపు పుట్టినింట నుండి వచ్చిన హిందూసంస్కృతి. మరొకవైపు ఆసక్తిచేత గడించిన బౌద్ధ సంస్కృతి నుండి తగిన రీతిలో మిశ్రితమైన బోధిసేన గణితం. జ్యోతిష్యంలోనూ పాండిత్యం సంపాదించారు. సహజంగానే అప్పటి అందరి పండితులవలెనే వారు కూడా చైనా దేశంవైపు ప్రయాణం సాగించారు. వీరి పాండిత్యాన్ని అచట చాలా కొనియాడి గౌరవించారు.

చైనా దేశంలోని ఒక పర్వతంపై వారు తపోనిరతులై వున్నపుడు జపాను దేశపు భిక్షులు అచటికి వచ్చి వారిని కలిసి తమ ఊరికి రమ్మని వారిని వేడుకొన్నారు. అప్పుడు ప్రారంభమైనది



టోక్యోలో శివలింగం

వారి జపాను యాత్ర. జపాను దేశపు రాజ బోధి సేనులవారిని స్వాగతించి ప్రధాన ధర్మాచార్యులని బిరుదు ప్రధానంచేసి గౌరవించారు. ఆచార్యులు బోధిసనుల ప్రయత్నం వల్లనే జపాను దేశంలో సంస్కృత అధ్యయనం మొట్టమొదట ప్రారంభమైనది. అప్పుడు 'నారా' జపాను దేశానికి రాజధానిగా ఉండేది. ఇక్కడి మందిరాలు, విహారాలు వారి రాకవల్ల ప్రారంభమైనవి. బోధిసేనులు కూడా తమ సామర్థ్యంతో భిక్షులకు అనేకమైన ఆధ్యాత్మిక అనుభవానుభూతిని ఒదిగించారు. అచట నిరంతరంగా పండితోత్తముల ప్రవచనాలు నడుస్తుండేవి. ఊర్ధ్వ కంఠంలో సంస్కృత మంత్రాల పఠనం మారుమ్రోగుతుండేది. ఈ కారణంవల్లనే ఆ కాలాన్ని 'నారాయుగ' అనే పిలుస్తుంటారు. అనుమానమే లేదు, అది భారతదేశం నుండి ప్రభావితం చెందిన జపాను యుగం!



టోక్యోలో హిందూ దేవాలయం

అక్కడి ప్రజలు సంస్కృతాన్ని మాట్లాడగలిగేవారు, నేర్పించిన మంత్రాలను ఉచ్చరించగలవారై ఉండినది నిజమే. కానీ వ్రాయడం – చదవడం యింకా కఠినంగా వుండేది. ఆచార్యులు కోబేదాయిశి ఈ సమస్యకు పరిహారం కనుగొన్నారు. చైనా లిపి మరియు భాష వ్యాప్తి చెందివున్న జపానులో వారు సంస్కృతం లిపిని పరిచయం చేశారు. చైనా మరియు దేవనాగరి లిపిని మిళితం చేసిన ఒక కొంగ్రొత్త లిపిని ఆవిష్కరించారు. జపాన్ భాషకు యిది ఒక క్రొత్త శక్తిని నింపినది. వారి భాషయొక్క వర్ణమాల సంస్కృతానికి చాలా దగ్గరగా వుంటుంది. అ, ఇ, ఉ, ఎ, ఈ స్వరాలు వారి భాషలోనూ ఉపయోగంలో వున్నవి. క, కి, కు, మన హల్లుల వలెనే ఉచ్చరించబడతాయి. కఠినమైన చైనా చిత్ర లిపిలకంటె, దేవనాగరి లిపివల్ల ప్రభావితమైన ఈ లిపి సులభంగా వుండినది. అందువల్ల రాజపరివారం మరియు పండితుల బిడ్డలకు మాత్రం పరిమితమైవున్న విద్యాశిక్షణ యిపుడు సార్వత్రికమైనది. అందరూ చదవడం – వ్రాయడం నేర్చుకొన్నారు. అంత మాత్రమే కాదు. సంస్కృత సాహిత్యాన్ని మూలంలోనే చదివి అర్థం చేసుకోవడానికి సమర్థులయ్యారు!

ఇప్పటికీ జపానువారి గోరీల వద్దకు వెళ్ళి నిలబడితే యిప్పటి జపానీయులు చదివి అర్థం చేసుకోలేని ఒకిన్ని అక్షరాలను చెక్కివుంటారు. ఇవన్నీ సంస్కృతం నుండి ప్రభావితమైన సిద్ధ లిపి వున్న అక్షరాలు! ఇప్పటికీ బుద్ధమందిరాలలో బీజాక్షరాలను సంస్కృతంలోనే వ్రాయడం కనబడుతుంది. ఈ అక్షరాలను, దైవీశక్తి వున్నటువంటివని భావించి, బుద్ధ దేవాలయాలకు వెళ్ళినపుడు ఆ అక్షరాల ముద్రలను ఒత్తిపించుకొన్న పుస్తకాన్ని (శింజిన్) జపాను దేశస్తులు అక్షరశః దేవుడి గదిలో వుంచి పూజిస్తారు. జపాను దేశపు కోయసాన్ మందిరంలో యిప్పటికీ సంస్కృతం నేర్పించే పద్ధతి వున్నది. భారతదేశంతో వున్న బాంధవ్యపు లోతును తెలుసుకోవాలంటే బహుశా ఈ ఒక సంగతిని గమనిస్తే చాలనిపిస్తుంది. జపాను దేశం దేవాలయ నగరం. వారి పూజాపద్ధతి, సాంప్రదాయాలు చాలావరకూ హిందూ సంస్కృతిని పోలినటువంటిదే. వారు మందిరాలకు వెళితే అక్కడ వున్న గంటను మ్రోగిస్తారు. మనలాగే నమస్కరిస్తారు. అక్కడి అర్చకులు ఎన్నో సంస్కృత మంత్రాలను జపిస్తూ పూజచేస్తారు. హోమాన్ని వీరు 'గోమ' అని పిలుస్తారు. జపానులోని 1200 కంటే ఎక్కువ దేవాలయాలలో సంస్కృతంతో కూడిన మంత్రాలతో ఆచరించడం యిప్పటికీ జరుగుతూ వుంటుంది.

టోకియో నగరంలో వున్న ఇంద్రుడి మందిరం చాలా విశిష్టమైవుండి ప్రతి సంవత్సరం ఇరవై లక్షలకు మించిన జపానీయులు యిక్కడికి వచ్చి వేడుకొంటారు. వరుణుడి పూజ కూడా అన్నిచోట్లా వ్యాపకంగా జరుగుతుంది. క్రొత్తగా వివాహమైనవారు కామదేవుడి పూజ చేయడం కూడా యిక్కడి సాంప్రదాయం. ఆశ్చర్యమనిపించేలాగా యముడికీ చాలా మందిరాలు వున్నవి యిక్కడే. టోకియోలోని మాత్సుచియామ్ బోటిన్ మందిరం గణేశ్వరుడి దేవాలయం. ఇది వేల ఏండ్ల నాటి పాత దేవమందిరం. విద్యార్థులు, వ్యాపారస్తులు తమ అభివృద్ధి కోసం ప్రార్థించుటకై యీ దేవాలయానికి రావటం రివాజు. కొంతమంది జపాన్ పండితులంతా ఎన్నో వేల సంవత్సరాల నుండి విడువకుండా గణేశుడి పూజ జరిపిస్తుండడం ప్రపంచంలోని ఏకైక దేవాలయమని గర్వంతో చెప్పుకొంటారు!

మందిరాల విషయానికి వస్తే జపాను దేశంలోని ప్రతి యొక్కరి యిల్లూ ఒక దేవాలయమే. ప్రతి యొక్కరి


యింటిలోనూ ఏడుమంది మంగళకరమైన దేవతలు వుంటారు. కొన్నిచోట్ల ఆ దేవతల మూర్తులు వుంటాయి. దేవుళ్ళ పటాలు వుండడమంత ఖచ్చితం. దండం ధరించివున్న మహాకాలుడిగా దాయికేతు, 'బిశామన్' అన్న పేరుతో కుబేరుడిమూర్తి, బెంతేన్ పేరుతో వీణాధారి సరస్వతి, అలాగే శివపార్వతుల ప్రియతమ కుమారుడు గణేశుడు 'కాంగితిన్ శోటేన్' పేరుతో ప్రతి యింటిని అలంకరించి వుంటాడు.

జపాన్ దేశంలో పాతోమ్యూ అని పేరున్న సాంప్రదాయమే వున్నది. ఇది అచలుడైన శివుడి పరంపర. జ్వాలలతో చుట్టుముట్టబడివున్న చేతిలో ఖడ్గం మరియు పాశాన్ని పట్టిన శివుడు ప్రళయానికి సిద్ధమైవున్నట్టు అగుపడుతాడు. ఇతనికీ ప్రతి యింటిలోనూ పూజలు సలుపుతారు. ఏడవ శతాబ్దంలో శత్రువులనందరినీ నిర్మూలం చేసి జపాన్ సామ్రాజ్యాన్ని నిర్మించిన శోటోకో భారతదేశం గురించి అపారమైన గౌరవాన్ని ప్రదర్శించేవాడు. అతడు రచించిన సంవిధానం (Constitution) మూడవ అధ్యాయంలో స్పష్టంగా చెప్పివున్నాడు. ఈ సంవిధానం త్రిరత్నాలను అవలంబించి వున్నదని అవి బుద్ధుడు, ధర్మం మరియు సంఘం!

ఔను, బుద్ధుని ఆలోచనలు జపాను జనుల లోతులలోనికి దూరినవి. జెన్‌పంథం యిక్కడి ప్రజలను చాలా ప్రబలంగా ప్రభావితం చేసినది. ఏ బోధి ధర్మం చైనా దేశపు ప్రజలపై ప్రభావం చూపినదో అదే బోధిధర్మం జపాను దేశంపై తన వెలుగును ప్రసరించినది. ఇచట అతనిని బోదాయ్ దరుమ అని పిలిచి గౌరవం చూపుతారు. జెన్ మనుష్యుడిని నేరుగా ముట్టి తెలుపుతుంది. జీవితాన్ని ఖరారుగా రూపించుకోవడానికి ప్రేరేపించేటటువంటిది. జపానీయులు ప్రస్తుతం తమ జీవితాలను కట్టునిట్టుగా, అన్నిటిలోనూ సమర్పకంగా రూపించుకోవడానికి సాధ్యమై వుండడం యీ విధమైన ధ్యానకళ వలననే.

జపానీయులు చాలా బుద్ధిమంతులు. హిందూ ధర్మం ద్వారా జీవిత సారాన్ని పీల్చుకోవడం నేర్చుకొన్నారు. బుద్ధుని మార్గం ద్వారా సమగ్రమైన జీవితాన్ని గడపడాన్ని నేర్చుకొన్నారు. మొత్తంలో వారి జీవితాలు పరిపూర్ణమైనవి. లోతులకూ వెళ్ళారు, చాలా ఎత్తుకూ ఎదిగారు. భారతీయులమైన మనం, యీ సిద్ధాంతాలను, ఆలోచనలను ప్రపంచానికి ధారపోసినవారము. కాని, యిప్పుడు వెలుగు తెలియక కన్నీరు పెట్టుకొని మథనపడుతున్నాము. అలా అని, జపాను భారతదేశాన్ని మరచిపోలేదు. ఇప్పటికీ అచట బోధిసేన బారద్వాజలకు ప్రత్యేకమైన పూజలు జరుగుతాయి. ప్రతి సంవత్సరం లక్షలాదిమంది జపాను దేశీయులు భారతదేశానికి వచ్చి ఇక్కడి ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించిపోతారు. వేలకొద్దీ జపానీయులు ఈశాన్య రాష్ట్రమైన అరుణాచలంలోని జీరో జిల్లాను సందర్శించి, తమ పూర్వీకులను చూచి ధన్యులవుతారు. ఔను, అరుణాచలంలో వుండే 'అపాతాని' అనే గిరిజనులు జపాను దేశస్తులను పోలివుంటారు. వారి ఆహారం, రంగు, సంస్కృతి, పూజాపద్ధతులు అన్నీ ప్రాచీన జపానీయులదే. ఈ అన్ని కారణాలవల్ల జపాను దేశీయుల పాలిట భారతదేశం యిప్పటికీ స్వర్గంలాంటిదే! రెండవ మహాప్రపంచ యుద్ధం సమయంలో భారతదేశం స్వాతంత్ర్యం కోసం పరితపిస్తున్నపుడు, సుభాష్ చంద్రబోస్ సైన్యాన్ని సమీకరించే సమయంలో చాలా పెద్ద ప్రమాణంలో సహాయం చేసినది జపానుదేశపు నాయకులే. ఇప్పటికీ అంతే. చైనా దేశపు విస్తరణావాదానికి అడ్డుపడి నిలబడిన జపాన్ దేశం భారతదేశానికి తోడుగా నిలిచినది.

ఒకటిమాత్రం సత్యం. జపాను దేశీయులపై హిందూ సంస్కృతి ప్రభావమున్నది. బుద్ధుడి ఆలోచనల ప్రభావమున్నది. జపాను దేశం నుండి భారతదేశాన్ని తీసివేస్తే అది శూన్యానికి దగ్గరవుతుందనిపిస్తుంది. అలా చూస్తే, జపాను మనపై చేసిన ప్రభావం చాలా తక్కువే! కానీ, రెండవ మహాప్రపంచ యుద్ధపు దారుణమైన ఓటమి తరువాత జపాను దేశం తనను తాను అభివృద్ధి చేసుకొన్న విధానం పూర్తి ప్రపంచాన్నే ఆశ్చర్యంలో ముంచివేసినది. హిరోషిమా ఘటనానంతరం, ఐదవ శతాబ్దంలో జపాను సాధించిన ప్రగతి, నడచి వచ్చిన, మార్పు చెందిన దారి బోధప్రదమైనది. వారు తీసుకొన్న గొప్ప నిర్ణయమేమంటె చైనా దేశపు ఆక్రమించే కమ్యూనిస్టు దారిని వదలడం. భారతదేశపు భక్తిమయమైన, క్రియా యోగపు ఆలోచనలను అనుసరించడం. మనమిపుడు అదే దారిని అనుసరించాలి. కొన్ని సందర్భాలలో శిష్యుడి నుండి గురువు పాఠం నేర్చితే తప్పులేదు కదా?



కన్నడం: చక్రవర్తి సూలిబెలె
తెలుగు: వేలూరి కృష్ణమూర్తి 'అనన్య'
శ్రీరాంపురం, మైసూరు.
ఫోన్ : 0 944 897 7877

# చరిత్రలో చెరగని జ్ఞాపకాలు


**- కె. వెంకటేశ్వర్లు**

ఒక మహా నిర్మాణం వెనుక ఒక చరిత్ర ఉంటుంది. ప్రపంచంలో మానవ నిర్మితమైన నాగార్జునసాగర్ కట్టడం వెనుక శ్రమైక జీవన సౌందర్యం, మానవ ఇతిహాస సాంకేతిక చరిత్ర వుంది. ప్రపంచ ఇతిహాసాలలో సర్వమానవ సమానత్వం, శాంతి సౌభ్రాతృత్వాలను కాంక్షించిన బుద్ధభగవానుని బోధనలు పల్లవించిన పవిత్ర ప్రదేశం నాగార్జున సాగరం. క్రీస్తుపూర్వం 2500 సంవత్సరాల క్రితమే నాగరికత, ఆధ్యాత్మిక సౌరభాలు గుభాళించిన మహోన్నత బుద్ధభూమి ఈ పవిత్ర స్థలి. ఇచ్చోటనే ప్రపంచ మహోన్నత మానవ నిర్మిత కట్టడం శిఖరాయమానంగా రూపుదిద్దుకొని 2015 డిసెంబర్ 10 నాటికి అరవై ఏళ్ళు పూర్తి చేసుకున్నది. ఇది మానవ ఇతిహాస చరిత్రలో షష్ఠిపూర్తి సంరంభం. సకల మానవాళి ఆకలిదప్పులను తీర్చుతున్న అన్నపూర్ణ. మానవ శ్రేయస్సుకోరే సౌభాగ్య మందిరం.

అందుకే ఆనాడు శంకుస్థాపన సందర్భంగా *భారత తొలి ప్రధాని పండిత జవహర్ ఆధునిక దేవాలయంగా, మానవాళి సౌభాగ్య మందిరంగా అభివర్ణిస్తూ పలికిన వాక్కులు చెరగని శిలాశాసనాలుగా చరిత్ర పుటలలో నిలిచిపోయాయి.* ఏడువందల వేల కోట్ల ఆహార ఉత్పత్తులను, లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పాదన, లక్షలాది జన, జీవజలానికి దాహార్తి తీరుస్తూ, కోట్లాది రూపాయల సంపదను నిస్వార్థంగా అందిస్తున్నది ఈ మహాసాగరం. ప్రకృతి మానవాళికి ప్రసాదించిన వరాలు నదీజలాలు. గంగ, యమునా, గోదావరి, కృష్ణ సజీవ నదీమతల్లుల పుణ్యఫలమిది. ఇంతటి మహోన్నత కట్టడం వెనుక వంద సంవత్సరాలకు పైబడిన చీకటి వెలుగుల చరిత్ర మూలాలు వున్నాయి. ఎందరెందరో మహనీయుల నుంచి సామాన్య జన స్వామ్యం కృషి ఈ ప్రాజెక్టులో ఇమిడి ఉంది. అసమాన త్యాగాలు, సామాన్యుల సాహసాలు, మొక్కవోని దీక్ష దక్షతలు, అకుంఠిత పట్టుదలలు అబ్బుర పరచక మానవు. ఒక్కసారి సాగర నిర్మాణ చరిత్ర పుటలను 60 ఏళ్ళ సందర్భంగా అవలోకనం చేయడం మన కనీస కర్తవ్యం, భవిష్యత్ తరాలకు చరిత్ర తెలియవలసిన అవసరం ఉంది.

సరిగ్గా నూట ఇరవై ఏళ్ల క్రితం భయంకరమైన డొక్కల దుర్భిక్ష, కరువు, క్షామం వచ్చింది. ఆనాడు ఒక్క కృష్ణా, గుంటూరు జిల్లాలలోనే దాదాపు నలభైశాతం మంది అంటే సుమారు రెండు లక్షలకు పై బడిన జనం ఆకలితో ప్రాణాలు పోగొట్టుకున్నారు. దానికి ఆనాడు ప్రజలు డొక్కల కరవుగా పేరు పెట్టారు. అంతటి భయంకరమైన కరవు ప్రజలను భీతావహులను చేసింది. ఆనాడు అది బ్రిటిష్ ఏలుబడిలో వున్న ప్రాంతమది. తెల్ల దొరల పాలకులను కరవు ఒక్క కుదుపు కుదిపింది. భవిష్యత్తులో కరవుకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని బ్రిటీష్ ఇంజనీర్లచే కమిటీ వేసింది. నదీజలాల వినియోగం గురించి యోచన చేసింది. ప్రాజెక్ట్ పథకాలను రూపకల్పన ప్రభుత్వం చేయాలని కోరింది. కరవును నివారించడంతోపాటుగా ప్రభుత్వానికి ఆదాయ మార్గాలను కూడా అన్వేషించాలని వారి ఆలోచన. ఇందుకు ఆనాటి ప్రముఖ బ్రిటీష్ ఇంజనీర్లైన కల్నల్ మేఖంజి, కల్నల్ ఎల్లీస్, సి.పి. మిల్లింగ్స్ లను వివిధ దశలలో కృష్ణానదిపై సర్వేలకు నియమించింది.

మొదటగా కృష్ణానది ఎగువన గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం పల్నాడు తాలూకా దైదలి గ్రామంవద్ద 1900 సంవత్సరంలో బ్రిటీష్ ఇంజనీర్ జాన్ రైడ్ మూడుసార్లు సర్వే జరిపారు. 'దైదలి' ప్రాజెక్ట్ గా పేరు పెట్టారు. తదుపరి కల్నల్ ఎల్లిస్, మిల్లింగ్స్ బృందం ముక్త్యాలను ప్రధాన కేంద్రంగా చేసుకొని పులిచింతలవద్ద సర్వేను 1908 వరకు నిర్వహించారు. ముక్త్యాల సంస్థాన పరిపాలన రాజా వాసిరెడ్డి వంశజుల ఏలుబడిలో వుండేది. కృష్ణా డెల్టా రైతుల భూముల దాహార్తిని తీర్చాలన్నదే పులిచింతల ప్రాజెక్ట్ ఉద్దేశ్యంగా సర్వే జరుపబడింది. అందుకు ముక్త్యాల రాజా వారి నుంచి కూడా తగిన సహాయసహకారాలు వారికి లభించాయి. పులిచింతల ప్రాజెక్ట్ రూపకల్పనకు సంబంధించి 1903 లో రెండువేల పుటలు, మూడు అధ్యాయాలతో కూడిన నివేదికను బ్రిటీష్ ప్రభుత్వానికి నివేదించారు. అంతకుముందు గోదావరి జిల్లాలో 1790–91 నాటి కాలంలో కరవుకాటకాలు విలయతాండవం చేశాయి. వేలాదిమంది ప్రజలు కరవు కాటుకు బలైపోయారు.



పరంజా నిర్మాణం

అంతకు మించిన కరవు 1833 నందన నామ సంవత్సరంలో సర్కార్ జిల్లాలను మింగేసింది. 1876-77 మధ్య మరో కరవు మృత్యురూపంలో కబళించింది. ఎక్కడ చూసినా కరవు హాహాకారాలే. ఇటువంటి పరిస్థితులలో గోదావరిపై ఆనకట్ట కట్టాలని బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించింది. నాటికే జలవనరులపై, ప్రాజెక్టుల నిర్మాణాలపై అపార అనుభవాన్ని గడించిన ప్రముఖ ఇంజనీర్ అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ కు అప్పగించింది. ప్రభుత్వ సలహామేరకు 1847లో గోదావరి నదిపై ఆనకట్ట పనులు ప్రారంభించి 1852 నాటికీ అనతి కాలంలోనే అతి తక్కువ వ్యయంతో ఆనకట్టను పూర్తిచేసి ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడిగా మిగిలిపోయారు. ఆనాడు గోదావరి ఆనకట్టకు ప్రభుత్వం మంజూరు చేసింది కేవలం రూ. 4,75,572 లు మాత్రమే. ఆయన కృషిమేరకు ప్రజలను కార్యోన్ముఖులను చేసి ఆనకట్టను పూర్తిచేసిన కల్నల్ కాటన్ ప్రజలపాలిట అపర భగీరథుడే.

అట్టి అనుభవాలను, ఆదాయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం కృష్ణానదిపై ఆనకట్ట నిర్మించి డెల్టా రైతులకు జలాల నందించాలని నిర్ణయించింది. గోదావరి నదిపై ఆనకట్ట కట్టాలనే ఆలోచనే లేని రోజులలో కృష్ణానదిపై ఆనకట్ట కట్టాలని 1792 లో మేజర్ అలెగ్జాండర్ బిట్సన్ ప్రతిపాదించాడు. ఆ నాటికే ఆ ప్రాంతం అనేక కరవులను చూసింది ఈ ప్రాంతం. చిట్టచివరకు కరవు రక్కసి బారినపడి లక్షలాదిమంది ప్రజలు బలయ్యారు. అనేక ఏళ్లకు 1851లో కృష్ణానదిపై ఆనకట్టను కట్టడానికి ప్రభుత్వం ఆమోదించింది. 1852 లో పనులను కెప్టెన్ ఓర్ కు అప్పగించింది. 1855 నాటికి కోటీ 5 లక్షలతో పూర్తైంది. నిర్మాణంలో కాటన్ సూచనలు ఎంతగానో దోహదపడ్డాయని ఆయన కీర్తించారు.

కృష్ణాజలాల పథకానికి ఆద్యుడు మేజర్ బిట్సన్. 1792లోనే ఆయన ఆలోచనలను ప్రభుత్వానికి నివేదించాడు. ఆయన ప్రతిపాదనలను ప్రభుత్వం తోసిపుచ్చింది. మరలా 1779 లో అదే ప్రతిపాదన ముందుకు వచ్చింది. 1832-33 దుర్భిక్షం ప్రభుత్వాన్ని మరలా ఆలోచనలోకి నెట్టిన ఫలితమే కృష్ణానదిపై సర్వేకు అనుమతి లభించింది. ఇది తొలి విజయం. ఆనాటి ఆలోచనల ఫలితమే విజయవాడ ఆనకట్ట నిర్మాణం.

1903లో పులిచింతలపై ఆనకట్టకు ప్రతిపాదనలు వచ్చాయి. అదేమంత బహుళ ప్రయోజన ప్రాజెక్ట్ కాదని బ్రిటీష్ ప్రభుత్వం తోసిపుచ్చుతూ వచ్చింది. స్వాతంత్ర్యానంతరం ఈ ప్రాజెక్ట్ 1962 నుండి ముచ్చటగా మూడుసార్లు ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య మొదలుకొని ఎన్.టి.ఆర్., వై.స్. రాజశేఖర్‌రెడ్డి వరకు శంకుస్థాపనలు జరుపుకున్నది. 1957 లో తొలుత 65 కోట్ల అంచనాతో మొదలై 2004 నాటికి 560 కోట్లతో 2016 నాటికి 1200 కోట్లు దాటుతూ పొడిగించుకుంటూ పూర్తికావస్తున్నది. డెల్టా రైతుల కలల ప్రాజెక్ట్‌గా దీనిని చెప్పుకుంటారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణములో ప్రముఖపాత్ర వహించిన ఇంజనీర్ డాక్టర్ కానూరి లక్ష్మణరావు (కే.ఎల్. రావు) ప్రాజెక్ట్‌గా చివరకు పులిచింతలకు నామకరణం చేశారు.

పులిచింతల ప్రాజెక్ట్ 1903లో ముందుకు వచ్చిన అనేక కారణాల వలన వాయిదాపడుతూ రావడానికి అనేక కారణాలు. అందులో బ్రిటీష్ పాలకుల అలసత్వం, స్వాతంత్రం సిద్ధించిన తదుపరి మన పాలకుల రాజకీయాలు ఇలా అనేక కారణాల మధ్య తెల్ల దొరల పాలనలో 18 కోట్లతో ప్రతిపాదనలతో మొదలైన పులిచింతల 1957 లో ఉమ్మడి రాష్ట్రంలో 65 కోట్లకు ఎగబాకి 1962 లో 102 కోట్ల అంచనాలతో దామోదరం సంజీవయ్య ఆమోదించారు. 1988 లో ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రి గా 1268.86 కోట్లకు చేరుకుంది. నాలుగవసారి 2004 లో వై.ఎస్.ఆర్. హయాంలో 560 కోట్ల అంచనాలతో మూడవసారి శంకుస్థాపన చేసుకున్నది. కేవలం 30 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్నది ఆనాటి ప్రభుత్వ నిర్ణయం. 2015 ముగుస్తున్న పలు దఫాలుగా అంచనాలు పెంచుకుంటూ సాగిపోతున్నది. 2016 నాటికైనా ప్రాజెక్ట్ పూర్తి చెయ్యాలన్నది ప్రస్తుత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. 45.77 శతకోటి ఘనపుటడుగుల జలాశయం ద్వారా 60 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనతో 13

లక్షల ఎకరాల డెల్టా భూములకు నీరందించాలన్నది పులిచింతల ప్రాజెక్ట్ లక్ష్యం. పులిచింతలకు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలోనే అనేక ఆటంకాలు ఎదుర్కొన్నది. కాంగ్రెస్ హయాంలో అంతర్గత, ప్రాంతీయ రాజకీయాల ప్రాబల్యాల నడుమ నలిగిపోయింది. మరి కొంతకాలం కాంగ్రెస్, తెలుగుదేశం రాజకీయాల మధ్య వివాదాలకు నెలవైంది. 1903 నుండి 2016 వరకు శతాబ్దానికి పైగా ప్రాజెక్ట్ నిర్మాణం ఒక కొలిక్కి రావడమంటే ఎన్ని మలుపులు తిరిగిందో ఊహించవచ్చు. కే.ఎల్. రావు కలల ప్రాజెక్ట్‌గా 2016 నాటికైన సాకారం కాగలదేమో. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం వెనుక ఎన్నో చారిత్రాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. పులిచింతల వాయిదాపడుతూ రావడమే నందికొండ ప్రాజెక్ట్ ఆలోచనలకూ అంకురార్పణ జరిగింది. నందికొండ ప్రాజెక్ట్ ఆలోచనలకు ఆద్యుడు నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్. నైజం సర్కార్. 1930 దశకంలో నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు కృష్ణానది జలాలను, నందికొండ ప్రాజెక్ట్‌ను నిర్మించి సాగునీరు అందించాలని నాటి నిజాం సర్కార్ ఆలోచన. అందుకు నిజాం ప్రభుత్వంలోని ప్రముఖ చీఫ్ ఇంజనీరు హైదర్ అలీ బృందం నాయకత్వంలో ప్రభుత్వం సర్వే జరిపించింది. ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ నందికొండ ప్రాజెక్ట్ స్థలాన్ని సర్వే బృందానికి దారి చూపించింది మొదటిగా రాములును పేర్కొంటారు.

తర్వాత కాలంలో నందికొండ రాములుగా ఆయన ఇంటిపేరు మారిపోయింది. నిజాం సర్కార్ మద్రాస్ ప్రెసిడెన్సీ ముందు ప్రతిపాదనలను పెట్టింది. ఉమ్మడి మదరాసు రాష్ట్రం ఇందుకు ససేమిరా అనడంతో అట్టి ప్రతిపాదనలు మరుగున పడ్డాయి. చరిత్రలో మాత్రం నందికొండ ప్రాజెక్ట్ ఆలోచనలకు శ్రీకారం చుట్టిన నైజాం రాజు చరిత్ర పుటలలో నిలిచిపోయాడు. ఆనాడు ఆంధ్ర రాష్ట్రం మదరాసు ఉమ్మడి రాష్ట్రంలో ఉండటంతో ప్రాజెక్ట్ నిర్మాణానికి తగిన రాజకీయ బలం తోడవ్వలేకపోవడం ఒక చారిత్రిక కారణం. ఆనాడు ఆంధ్ర ప్రాంతీయుల దృష్టి అంతా పులిచింతల నిర్మాణం మీద కేంద్రీకరించి ఉండటం కూడా ఒక కారణం కావచ్చు.

**ముక్త్యాల జమిందార్ రాజా వాసిరెడ్డి రామ గోపాల కృష్ణ మహేశ్వర ప్రసాద్ ఉరఫ్ ప్రాజెక్టుల ప్రసాద్ :**

మద్రాస్ ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతానికి చిన్నచూపే. కరవు కాటకాలు వచ్చిన తగిన సహాయ సహకారాలు అంతగా లభించేవి కావు. ఈ నేపథ్యంలో ఉమ్మడి మద్రాస్ శాసనసభలో ప్రాజెక్టులపై వాదోపవాదాలు, చర్చలు సాగుతుండేవి. కలిసిమెలసి వున్నా తెలుగు ప్రజలపట్ల తమిళులకు చిన్న చూపే వుండేది. రాజాజీ ముఖ్యమంత్రిగా వుండగా పులిచింతలకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వకపోగా, నందికొండ ప్రాజెక్ట్ సర్వేకు కూడా అనేక ఆటంకాలు ఏర్పరచారు. *తమిళులకు నీళ్ళు లేవు, ఆంధ్రులకు ధనం లేద* ని ఒక దశలో వ్యాఖ్యానించారు. పులిచింతల విషయంలో ముక్త్యాల జమిందారు రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ ఎంతగానో చొరవ తీసుకున్నారు.

తదుపరి కాలంలో ప్రాజెక్టుల ప్రసాద్ గా ప్రజలకు వారు చిరపరిచితులు. ఆయన గురించి ఇక్కడ ప్రస్తావించడం ఎంతైనా సమంజసం. రాజా వాసిరెడ్డి 1917, అక్టోబర్ మాసంలో వాసిరెడ్డి వంశములో కృష్ణాజిల్లా జగ్గయ్యపేట సమీపంలోని ముక్త్యాల జమిందారులైన వాసిరెడ్డి వంశంలో జన్మించారు. వారి సంస్థానం కృష్ణానది పరివాహక ప్రాంతంలో వుండటం. వారి నివాసమనబడే జమిందార్ కోట కృష్ణానది తూర్పు నుంచి ఉత్తర వాహినిగా దిశగా మల్లినచోట వుండటం, కోట పైనుండి చూడగానే ఉత్తర వాహిని దృశ్యమానంగా గోచరించడం, కృష్ణానదితో రాజా వాసిరెడ్డి జీవితం ముడిపడి ఉండటానికి ప్రధానంగా దోహదపడింది. మొదటినుంచి ప్రజల గురించి అలోచనలు వుండటం, జల వనరులపై ప్రత్యేక ఆసక్తిని పెంచుకోవడంవల్ల కరవు నివారణకు జలవనరుల వినియోగం ద్వారా మాత్రమే పరిష్కారమని భావించారు. అందుకు ప్రాజెక్టులను నిర్మించి రైతాంగానికి, వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడవచ్చన్నది ఆయన నిచ్చిత అభిప్రాయంగా వుండేది.

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఉండగానే రాజా వాసిరెడ్డి పులిచింతలపై ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఎనలేని కృషిని కొనసాగించారు. ఆయనకు ప్రధానంగా అండగా నిలిచినవారు నాటి ప్రముఖ ఇంజనీర్ కానూరు లక్ష్మణరావు. రాజకీయంగా అండదండలుగా నిలిచినా వారు ఎన్.జి. రంగా, మోటూరి హనుమంతరావు, వావిలాల గోపాల క్రిష్ణయ్య, పిల్లలమఱ్ఱి ప్రముఖ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరావు తదితరులు ఆయన కృషికి సహకారంగా నిలిచారు. పులిచింతల కోసం తమ వాగ్ధాటిని వాదనా పటిమను కేంద్ర, రాష్ట్రాలలో పెద్దలవద్ద సభలలో వినిపించారు. సర్వేల నివేదికలను ఆంధ్ర ప్రాంత కలెక్టర్ కార్యాలయాలను శోధించి చివరకు అనంతపురం కలెక్టర్

కార్యాలయంలో వాటి ప్రతులను సాధించి కే.ఎల్. రావు కు అందించారు. అందుకు తన సొంత ధనాన్ని వెచ్చించారు. అనేక పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్లానింగ్ కమిషన్ చివరకు పులిచింతలను తోసి పుచ్చింది. తాత్కాలికంగా పులిచింతల ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో కనుమరుగైనది.

మద్రాస్ ఉమ్మడి రాష్ట్రంలో 1951 లో కృష్ణా నదిపై కొత్త ప్రాజెక్టులకు మద్రాస్ రాష్ట్రం తెరలేపింది. కృష్ణా, పెన్నార్ పథకం ద్వారా సిద్ధేశ్వరం, సోమశిలవద్ద ఆనకట్టలను నిర్మించి కావేరి, కృష్ణా జలాలను అధికభాగం తమిళనాడుకు తరలించాలని అట్టి పథకం యొక్క ఉద్దేశ్యం. దీని వలన భవిష్యత్తులో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు తీరని అన్యాయం జరుగుతుందని కే.ఎల్. రావు గమనించారు. దీనిని ఎలాగైనా అడ్డుకోవాలని రాజా వాసిరెడ్డి ద్వారా సందేశమిచ్చారు. అప్పటికే పులిచింతల ప్రతిపాదన పక్కనపడటంవలన నందికొండ ప్రాజెక్ట్ ప్రతిపాదన ముందుకు తెచ్చారు. 1930లోనే నైజాం నవాబ్ హయాములో అలియావార్ జంగ్ ద్వారా సర్వే జరిపించి పరిశోధన ప్రణాళికలను, నివేదికలను కే.ఎల్. రావు ద్వారా సాధించారు. వాటి ఆధారంగా నల్లగొండ, గుంటూరు జిల్లాల మధ్య అనువైన ప్రదేశంగా నందికొండ ప్రాంతాన్ని ఎంచుకొని నిర్మించాలన్నది బలమైన వాదన. ఇది అందరికీ ఆమోదయోగ్యం కాగలదని రాజా వాసిరెడ్డి వాదనలకు ఆంధ్ర రాష్ట్రంలోని ప్రముఖ నాయకులూ తోడుగా నిలిచి కేంద్రం వద్దకు రాయభారాలు నడిపారు. తమిళనాడు పన్నాగాలను, ఆంధ్రకు జరుగుతున్న అన్యాయాలను తమ వాదనల ద్వారా బలంగా వినిపించ గలిగారు. మరికొందరు ఆంధ్ర నాయకులే నందికొండ పందికొండగా అవహేళన చేసినవారూ వున్నారు. రాజా వాసిరెడ్డి లో ఈ సంఘటనలన్నీ మరింత పట్టుదలను పెంచాయి. 1947 లో భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించడం, తొలి ప్రధాన మంత్రిగా పండిట్ జవహర్ లాల్ నాయకత్వములో కేంద్ర ప్రభుత్వం ఏర్పడటం ఎన్నో కీలక పరిణామాలు చోటుచేసుకున్న సందర్భమది. ఇటు తెలంగాణాలో పటేల్ నాయకత్వంలో జనరల్ సి. చౌదరి నేతృత్వంలో భారత మిలటరీ సైన్యాలు దిగడం, నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ఎటువంటి ప్రతిఘటన లేకుండానే లొంగిపోవడం చకచకా జరిగిపోయాయి. దీనితో చివరి నిజాం రాచరిక పాలన అంతమైంది. 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనంతో నిజాం ప్రభుత్వం



నిండుగా నాగార్జునసాగరం

అంతరించిపోయింది. హైదారాబాద్ స్టేట్ గా నూతన ప్రభుత్వం ఏర్పడింది. తొలి నైజాం స్టేట్ ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు నాయకత్వములో మంత్రివర్గం ఏర్పడింది. ఇదే సందర్భంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఆందోళన ముందుకొచ్చింది. ఆంధ్రలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఆందోళన తీవ్రతరమైంది. మద్రాస్ రాష్ట్రం ఇదే సందర్భంలో 1951లో కృష్ణ పెన్నార్ పథకం ప్రయత్నాలు వేగిరం చేసింది. తుంగభద్ర, సిద్దేశ్వరం, సంఘమేశ్వరం ఆనకట్టలకు కృష్ణ, కావేరి నదీజలాల అనుసంధానంతో తమిళనాడుకు తరలించాలనేది దీని వెనుక వున్న అసలైన పథకం. ఇందుకోసం తమిళనాడు నిర్విద్వంగా నందికొండ ప్రాజెక్ట్ ను తిరస్కరించింది. ఎన్నో ఆటంకాలను నిజాం కాలంనుండే కల్పించడం మొదలుపెట్టింది.

ఈ నేపథ్యంలో కేంద్రంలో వుండి ముంచుకొచ్చే ప్రమాదాన్ని గమనించిన కే.ఎల్. రావు నందికొండవద్ద ప్రాజెక్టును చేజార్చుకుంటే భవిష్యత్ అంధకారం కాగలదని హెచ్చరించారు. రాజా వాసిరెడ్డి అందుకు తగిన ప్రయత్నాలను సాగించాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని రాజకీయంగా తేవాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం వద్దకు 1952లో నందికొండ ప్రాజెక్ట్ విషయంలో బలమైన వాదనలు వినిపించడానికి తగిన ప్రతిపాదనలు రాజా వాసిరెడ్డి కే.ఎల్ రావు సూచనల మేరకు ప్రణాళికలను సిద్ధపరచడానికి తన సొంత ధనాన్ని లక్షలాది రూపాయలను వ్యయం చేసారు. నిజాం కాలంలో చీఫ్ ఇంజనీర్ గా నందికొండ ప్రాజెక్ట్ ను సర్వే చేసిన అలీ నవాబ్ జంగ్ రూపొందించిన నివేదికలు ఆధారం చేసుకున్నారు. 1948 లో మైసూరు ప్రభుత్వంలో ఇరిగేషన్‌శాఖలో చీఫ్ ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వహించి

పదవీ విరమణ చేసిన నరసింహయ్య, పి.డబ్లు.డి. రిటైర్డ్ ఇంజినీర్ గోపాలాచార్యులకు నెలసరి వేతనాలను చెల్లించి నియమించుకున్నారు. నందికొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి కావలసిన మ్యాపులను, ప్లానులను అంచనా వ్యయాలను, ప్రణాళికలను, స్వరూప స్వభావాలను సిద్ధం చేయించారు. మొదటగా నిజాం సర్కార్ మద్రాస్ ప్రెసిడెన్సిలో సంయుక్త పథకంలో నందికొండ ప్రాజెక్ట్ చేపట్టాలని చేసిన ప్రతిపాదనలకు సహాయ నిరాకరణ చేసి ప్రాజెక్ట్ ను అడ్డుకున్న అంశాలను కూడా దృష్టిలో పెట్టుకున్నారు. నాటి పార్లమెంటులో అనుకూలమైన సభ్యులను మరియు ప్రధాని నెహ్రూను కలిసి ఒప్పించగలిగే సమర్థులైన నాయకత్వం ద్వారా రాయభారాలను నడిపించారు. ఎన్జీ రంగా, రఘురామయ్య, మోటూరు తదితర కమ్యూనిస్ట్ పార్టీల నాయకుల ద్వారా ప్రయత్నాలను సాగించారు.

ప్రముఖ దినపత్రిక సంపాదకులైన నార్ల వెంకటేశ్వరరావు రాజా వాసిరెడ్డి ప్రయత్నాలకు పత్రికాముఖంగా అండగా నిలిచారు. అంతేకాకుండా ఆంధ్రాలోని తొమ్మిది జిల్లాలను కలుపుకొని కృష్ణాజిల్లా రైతు వికాస సంఘాన్ని ఏర్పరచారు. అన్ని జిల్లా రైతులను ఏకం చేసారు. రైతు వికాస సంఘానికి చల్లపల్లి రాజా శివరామ ప్రసాద్‌ను అధ్యక్షులుగా, జంధ్యాల వెంకట సోమయాజులును కార్యదర్శిగా, పర్వతనేని బ్రహ్మయ్యను కోశాధికారిగా, రామకృష్ణ ప్రసాద్, చెరుకూరి రామనాథంబాబు తదితరులను కార్యవర్గ సభ్యులుగా నియమించి నందికొండ ప్రాజెక్ట్ సాధన ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఉద్యమ సారథులుగా రాజా వాసిరెడ్డి నాయకత్వంలో కానూరి కన్నయ్య, వట్టికొండ రామయ్య చౌదరి, గుర్రం మల్లయ్య, కానూరి వెంకయ్య మొదలగువారితో నందికొండ ప్రాజెక్ట్ సాధన కమిటీ ఏర్పడింది. రైతాంగ ఉద్యమ ఒత్తిడితో కేంద్రం జలవనరులపై ప్లానింగ్ కమిషన్ ను ఏర్పాటు చేసింది. అందులో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఒక్క సభ్యుడు కూడా లేకుండా తమిళనాడు ప్రభుత్వం చూడగలిగింది.

జరిగిన అన్యాయంపై మోటూరి, ఎన్జీ రంగా తదితర ప్రభృతుల ద్వారా నాటి కేంద్ర మంత్రి ప్రకాష్ కు నివేదించడం జరిగింది. అంతటితో ఆగకుండా రాజా వాసిరెడ్డి నాయకత్వంలో సాధన సమితి పేరుతో జరుగుతున్న అన్యాయాలపై కరపత్రాలు ముద్రించి ప్రజలకు ఉరురా పంచారు. స్వయంగా ప్రాజెక్ట్ సాధన కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది జిల్లాలు 38 వేల మైళ్ళు పర్యటనలు జరిపి రైతంగంలో, ప్రజలలో ఉద్యమానికి సమాయత్తం చేయడమే కాకుండా కేంద్రంపై ఒత్తిడిని తీసుకురాగలిగారు. దీనితో ఏకపక్ష ప్లానింగ్ కమిటీని కేంద్రం రద్దు చేసింది. ఇది నందికొండ ప్రాజెక్ట్ సాధనకు తొలి అడుగుగా చెప్పవచ్చు.

రాజా వాసిరెడ్డి చేసే ప్రయత్నాలు ఫలించే విధంగా ప్రజల, రైతుల, నాయకుల అండదండలు కూడా లభించాయి. అదే రీతిలో అవహేళనలు, ఎదురు దెబ్బలు, నిరుత్సాహం, చేదు అనుభవాలను కూడా ఎదుర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర నాయకులే కొందరు పెద్దమనుషులు అవహేళన చేయడం రాజా వాసిరెడ్డిలో మరింత పట్టుదలను పెంచాయి. తన ప్రయత్నాలను ముమ్మరం చేసారు. దీనితో కేంద్రంపై ఒత్తిడి పెరగడంతో 1952 లో ప్రముఖ ఇంజనీర్ వి.ఎస్. ఖోస్లా కమిటిని కేంద్రం నియమించింది. కమిటీ ప్రధానంగా కృష్ణానది, జలవనరులు, ప్రాజెక్ట్‌లపై అధ్యయనం కోసం నియమించబడింది. కమిటీ పర్యటనలో నందికొండ ప్రస్తావన లేదు. దీనితో కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. చివరకు నందికొండ ప్రాజెక్ట్ స్థలాన్ని కూడా పర్యటనలో కే.ఎల్. రావు, మోటూరి, ఎన్.జి. రంగా, నాగినేని, గొట్టిపాటి, వావిలాల ప్రభృతులు కలిసి చేర్పించగలిగారు.


మోటూరి హనుమంతరావు రేపల్లె నియోజకవర్గం నుంచి మంత్రి కల్లూరి చంద్రమౌళి పై గెలిచిన కమ్యూనిస్ట్ నాయకుడు. మద్రాస్ ఉమ్మడి శాసనసభలో 1953 లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తదుపరి కూడా సభలో ఉపనాయకులుగా వ్యవహరించారు. మంచి వాగ్ధాటి పటిమ గలిగిన నాయకుడు. నాడు కేంద్రంలో జలవనరుల శాఖామంత్రిగా వున్న గుల్జారీలాల్ నందాను కలిసి నాయకులు నందికొండపై విన్నవించగా నందికొండ ప్రాజెక్ట్ కావాలనే ఆకాంక్షలను వ్యక్తం చేస్తూ కేంద్రానికి ప్రజలు పంపిన ఉత్తరాలు, టెలిగ్రాములతో నిండిపోయిన గదిని నాయకులకు చూపించారు. ఖోస్లా కమిటీ పర్యటనకు భరోసా కల్పించారు. ప్రధానమంత్రితో మాట్లాడి ఆ మేరకు పర్యటన ఖరారు చేయించి తన మాటను నిలబెట్టుకున్నారు.

అంతకు ముందే రాజా వాసిరెడ్డి నాయకత్వంలో నిజాం ఇంజనీర్ అలీ నవాబ్ జంగ్ సూచించిన నందికొండ ప్రాజెక్ట్ ప్రదేశాన్ని అనేక వ్యయ ప్రయాసలకోర్చి కాలినడకన వెళ్లి చూసివచ్చారు. ఈ విషయాన్ని కే.ఎల్. రావు తాను రాసిన *క్యూసెక్స్ క్యాండిడేట్* గ్రంథం పుట 35 లో ఆయన

పొందుపరచారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏంతో అనువైన ప్రదేశంగా రెండు కొండల నడుమ నందికొండను ఊహించుకున్నారు. ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే ఆంధ్ర, తెలంగాణా ప్రాంత రైతాంగానికి ఎంతగానో మేలు జరుగుతుందని ఇంజనీర్లు తెలిపారు. ఖోస్లా కమిటీ 76 గంటల వ్యవధిలో నందికొండ పర్యటన ఖరారైంది.

ఖోస్లా కమిటీ నందికొండ ప్రాంతం సందర్శనకు సరైన రవాణా మార్గం లేదని విముఖత చూపింది. రాజా వాసిరెడ్డి రవాణా ఏర్పాట్ల బాధ్యతను స్వీకరించారు. మాచర్ల చుట్టూ వున్న 25 గ్రామాల ప్రజలను సమీకరించారు. చెంచులు, కొండదొరలూ, ఎరుకలు, లంబాడీలు, సుగాలీలు, కొండ జాతుల వారితో ఆనాడు మాచెర్ల నుండి నందికొండ ప్రదేశానికి దాదాపు 20 కిలోమీటర్ల రహదారిని వారం రోజులలో చెట్లను నరికి, ఖండలను తొలగించి ఏర్పాటు చేయించ గలిగారు. స్వయంగా దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ఖోస్లా కమిటీ ఒంగోలు వరకు రైల్ లో వచ్చారు. అక్కడ నుండి రైతు నాయకులు కన్నయ్య, రామయ్య తదితరుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అరవై కార్లు వెంటరాగా కమిటీ తన పర్యటనను ప్రారంభించింది. ఒంగోలు నుండి మాచర్ల వరకు గ్రామగ్రామానా వేలాదిమంది ప్రజల జేజేధ్వానలతో స్వాగతం పలికారు.

ఖోస్లా కమిటీతోపాటువచ్చిన తమిళనాడు ప్రభుత్వ అధికారి, ఇంజనీర్ వెంకటాచారి రవాణామార్గం సరిగా లేదనే సాకుతో గుంటూరులోనే ఆగిపోయారు. వారు నందికొండ ప్రదేశం చూపడానికి ఇష్టపడటంలేదని తేలిపోయింది. వివిధ ఆటంకాలమధ్య కమిటీ తన పర్యటనను కొనసాగించింది. మాచర్ల నుండి నందికొండ ప్రదేశానికి పోతకమూరి అంతయ్య, తలగుడ్డ అంతయ్య అనే రైతులు ఇద్దరు కలిసి తన జీపులో తలగుడ్డ మార్గం మీదుగా కృష్ణానది ఒడ్డుకు చేర్చారు. ప్రజల ఉత్సాహం, ప్రయాణానికి చేసిన ఏర్పాట్లను చూసి ఖోస్లా ముగ్ధులయ్యారు. ప్రాజెక్ట్ కోసం రైతులు చూపిస్తున్న పట్టుదల, రాజా వాసిరెడ్డి సల్పుతున్న నిస్వార్థ కృషి కమిటీని ఎంతగానో ఆకట్టుకుంది. నందికొండ ప్రదేశాన్ని రెండు గిరులమధ్య తిలకించిన *ఖోస్లా నోటి వెంట అప్రయత్నంగానే సృష్టి దేవత నడుముకు వడ్డాణంగా అభివర్ణించారు.* భగవంతుడిచ్చిన సహజ ప్రకృతి వరప్రసాదమన్నారు. నందికొండ ప్రాజెక్ట్ విధాత నిర్ణయంగా అభివర్ణించారు. ఖోస్లా కమిటీ పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో రాజా వారు ముక్త్యాల కోటలో ఏర్పాటు చేసిన ఆతిథ్యాన్ని స్వీకరించారు. తదుపరి ఖోస్లా కమిటీ నందికొండ ప్రాజెక్ట్ అనువైన ప్రదేశంగా, బహుళ ప్రయోజనాలను కలిగినదిగా పేర్కొంటూ తన నివేదికను కేంద్రానికి సమర్పించింది. ఉమ్మడి తమిళనాడు ప్రభుత్వం నందికొండకు అడ్డు పడటానికి తనవంతు ప్రయత్నాలను సాగించింది. కమిటీ నివేదిక ఆమోదం పొందకుండా సంవత్సరం పాటు తన ప్రయత్నాలన్నీ చేసింది. ఈ నేపథ్యంలోనే పరిపాలన సౌలభ్యం కోసం భాషాప్రయుక్త రాష్ట్రాల ఆందోళన ఉధృతం కావడం, పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం గావించడం. 1953 అక్టోబర్ 1 న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడటం, కృషికార్ లోక్ పార్టీ ఆవిర్భావం, కమ్యూనిస్టుల రైతాంగ ఉద్యమాలు, ఈలోగా మధ్యంతర ఎన్నికలు రావడం, తమిళనాడులో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవడం, గవర్నర్ సి.ఆర్. చతుర్వేది పాలన చేతిలోకి అధికారాలు రావడం, గవర్నర్ క్షుణ్ణంగా నందికొండ ప్రాజెక్ట్ నివేదికలను అధ్యయనం చేయడం నేరుగా ప్రధానమంత్రి నెహ్రూతో చర్చలు జరపడం, ప్రధాని సానుకూలంగా స్పందించి ఖోస్లా కమిటీ నివేదికకు అంగీకారం తెలపడంవంటి ఎన్నో కీలక పరిణామాలు చకచకా జరిగిపోయాయి. 1954 డిసెంబర్ 17 న నందికొండ ప్రాజెక్ట్ నిర్మాణ అనుమతిపై గవర్నర్ విధాన నిర్ణయ ప్రకటన చేశారు. ప్రధానమంత్రిని ఒప్పించడంలో గవర్నర్ త్రివేది పాత్ర శ్లాఘనీయం. నందికొండ ప్రాజెక్ట్ పై ఆంధ్ర, హైదరాబాద్ స్టేట్ ప్రభుత్వాలు ఒక అంగీకారానికి రావడంతో నందికొండ ప్రాజెక్ట్ కోసం కన్న కలలకు రూపం ఏర్పడింది. రాజా వాసిరెడ్డి, రైతాంగం ఆనందానికి అవధులు లేవు. జమిందారీ రద్దుతో ప్రభుత్వం తనకు చెల్లించిన ధనంలో ఎక్కువభాగం నందికొండ కోసం లక్షల ధనాన్ని అలవోకగా వ్యయం చేసారు.



దీపాల వెలుగులో సాగర్

అపర భగీరథునిగా ప్రజల మనసులలో నిలిచిపోయారు.

ఈ సందర్భంలో మరో సంఘటన ఇక్కడ గుర్తు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతమున్న ప్రకాశం బ్యారేజీ మొదటిసారి కృష్ణానదిపై కట్టిన ఆనకట్ట. తొలిదశలో 4.7 లక్షల ఎకరాలకు నీరందించబడింది. డెల్టా రైతులకు వరప్రసాదంగా మారింది. 1925 నాటికీ 11.5 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చింది. 1952 లో వచ్చిన వరదకు ఆనకట్టకు వంద అడుగుల పొడవున గండిపడింది. రైతులకు నష్టం వాటిల్లకుండా గండిని పూడ్చే ప్రయత్నంలో నాటి ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వేప కృష్ణమూర్తి మరి కొందరు ప్రమాదానికి గురై నదిలో కొట్టుకుపోయి మరణించారు. ఈ సంఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. నూతన బ్యారేజి నిర్మాణం కోసం ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. 1954 మార్చ్ 1 న నాటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు ఆమోదం తెలిపారు.

1957 డిసెంబర్ నాటికీ నూతన బ్యారేజి నిర్మాణము పూర్తైంది. ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఆనకట్టకు ప్రకాశం బ్యారేజిగా నామకరణం చేసి ప్రారంభించారు. ఆనకట్టకు 50 వేల టన్నుల సిమెంట్, 5 వేల టన్నుల ఇనుమును ఉపయోగించారు. 70 గేట్లను అమర్చారు. వేలాదిమంది కూలీలు శ్రమించారు. 12.5 లక్షల ఎకరాలకు ప్రకాశం బ్యారేజి సాగునీరందిస్తుంది. ఏటా 8 నుంచి పదివేల కోట్ల విలువ చేసే ఆహార ఉత్పత్తులను రైతాంగం పండిస్తున్నది. ప్రకాశం బ్యారేజి, ధవళేశ్వరం ఆనకట్టల ద్వారా నదీజల ప్రయోజనం రైతంగాంలో, ప్రజలలో బాగా అవగాహనకు తోడ్పడింది. అందుకే చైతన్యవంతమైన ప్రజలు నందికొండ ప్రాజెక్టను కోరుకున్నారు. ఎందరో మహామహుల త్యాగఫలాలు ప్రాజెక్టులు, ఆనకట్టలు.

నందికొండ ప్రాజెక్ట్ కు తనవంతుగా 52 లక్షల నిధిని విరాళంగా రాజా వాసిరెడ్డి ప్రసాద్ అందజేసారు. ఆచార్య నాగార్జునుడి పేరుమీదుగా 1955 డిసెంబర్ 10 న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ గా నామకరణం చేసుకున్నది. వేల వత్సరాల చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా మానవ నిర్మిత కట్టడ్డంగా ప్రపంచ ప్రసిద్ధికెక్కింది. ఇరు రాష్ట్రాలకు చెందిన ఎందరో మహామహుల సాక్షిగా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన గావించుకుంది. నేటికి 2015 డిసెంబర్ 10 నాటికి షష్టిపూర్తి చేసుకున్నది. ప్రాజెక్టు కోసం తన జీవితంలో అధిక భాగాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి రాజా వాసిరెడ్డి. అహర్నిశలు ప్రాజెక్ట్ కోసం తపించారు. అటువంటి వ్యక్తికి నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ శంఖుస్థాపన సందర్భంలో ఎందరెందరికో ఆహ్వాన పత్రాలు అందజేసిన ప్రభుత్వం రాజావాసిరెడ్డిని విస్మరించడం చరిత్రలో ఒక చీకటి పుటగా నార్ల వారు అన్నారు. రాజా వాసిరెడ్డి తన ఆవేదనను తనను అర్థం చేసుకునే నార్ల వారికి చెప్పుకొని గుండె బరువును దించుకున్నారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని కనులారా చూద్దామనుకున్న రాజావారికి చివరకు ఎందుకలా జరిగిందోనన్నది ఈనాటికి అంతుబట్టని విషయంగానే మిగిలిపోయింది. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని కనులారా తన సతీమణి రామలక్ష్మమ్మ గారితో కలిసి వివిధ దశలలో తిలకించి మహాదనందం పొందారు.

1967 ఆగష్టు 4 న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ కుడి, ఎడమల పంట పొలాలకు నీటిని విడుదల చేయడాన్ని చూశారు. ఆ సందర్భంలో కూడా ఆహ్వానం లేదు. కానీ రైతుల కళ్ళలో వెలుగులను చూసి ఎంతగానో అంతులేని ఆనందాన్ని పొందారు. తన కన్న కలలు నేరవేరినందుకు సంతృప్తిగానే 1972 ఆగష్టు 28 న కృష్ణమ్మా పరవళ్ళను, పరిపూర్ణ కట్టడాన్ని చూసి సగర్వంగా 56 ఏళ్లకే కన్నుమూసారు. శంకుస్థాపన సందర్భంగా "ఒక సామాన్య రైతు అన్న మాటలు ఆ మహానిర్మాణంలో పాలుపంచుకున్నవారందరికి వర్తిస్తాయి. ఇది మీరు వెలిగించిన దీపమే అంటాడు".

ఆ రైతన్న ఎన్నో దీపాలను వెలిగిస్తున్న ప్రాజెక్ట్ చరిత్రలో ఎందరో అజరామరులున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో అసువులు అర్పించిన తొలి మహిళాకూలీ గురవమ్మ. ఎందరో శ్రామికులు అజ్ఞాతంగానే తమ ప్రాణాలను ప్రాజెక్ట్ కోసం అర్పించారు. మరెందరో క్షతగాత్రులయ్యారు. వెలకట్టలేనివి వారి త్యాగాలు. ప్రాజెక్ట్ నిర్మాణంలో నందికొండ లోతట్టు ప్రాంతాలకు చెందినా దాదాపు 52 గ్రామాల ప్రజలు వలసలు వెళ్లిపోయారు. వారి త్యాగాలకు వెలకట్టగలమా! నేటికీ పునరావాసం లేని జీవితాలనే గడుపుతున్నారు. ఎందరి జీవితాలలో వెలుగులు నింపిన సాగరం కొందరి జీవితాల మాత్రం చీకటి కోణంలోనే వుంచింది. ఒక మహత్తరమైన నాగార్జునసాగరం ప్రాజెక్ట్ వెనుక వున్న చరిత్రను రేఖామంత్రంగానైనా ఈ సందర్భంగా **మిసిమి** ద్వారా అవకాశం కల్పించిన యాజమాన్యానికి, సంపాదకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. పాఠక దేవుళ్ళ ప్రోత్సాహం ఇందుకు మూలం.

✧✧✧

# సుప్రసిద్ధ ఇంజనీర్ ప్రాజెక్టుల రూపశిల్పి
# డాక్టర్ కె.ఎల్. రావు



డాక్టర్ కె.ఎల్. రావు

(1902-1986)

జగమెరిగిన ప్రఖ్యాత ఇంజనీర్, ఆధునిక ప్రాజెక్టుల రూపశిల్పి డాక్టర్ కానూరి లక్ష్మణరావు. ప్రజలు ఇష్టపడి పిలుచుకునే పేరు కె.ఎల్. రావు.

మానవ నిర్మిత ప్రాజెక్టుల రూపకల్పనలో, ఆలోచనలలో ఆధునికుడు. నిరంతర కృషీవలుడిగా, మేధావిగా పేరెన్నికగన్నవాడు. స్వశక్తితో ఎదిగినవాడు. ప్రాజెక్టుల రూపకల్పనలో ఉన్నత శిఖరాలనధిరోహించాడు. వ్యవసాయ కుటుంబములో పుట్టి, పేదిరికంలో, బాల్యంలో గడిపిన తన నీడలను, నిజాలను మరవని మహనీయుడు. సివిల్ ఇంజనీరింగ్‌లో నైపుణ్యం గడించి, ఖండతరాలను చుట్టి వచ్చాడు. ప్రపంచ ప్రాజెక్టులను చూశాడు, అధ్యయనం చేశాడు. భారతదేశంలోని జీవనదులను బీడుభూములకు మళ్ళించి, సిరులు పొంగే పంటలకు నీటి ప్రదాత అయ్యాడు. నాగార్జునసాగర్‌లాంటి మహా మానవ నిర్మిత కట్టడాలకు కల్పన చేసి మానవ శ్రమ, శక్తికి ప్రతీకగా ప్రపంచ దేశాల ముందు నిలిపాడు. అనేక ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించి, భవిష్యతరం ఇంజినీర్లకు ఆదర్శప్రాయంగా నిలిచారు. అహింసమూర్తి గాంధీజీ స్ఫూర్తి, అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ కర్తవ్య పరాయణత, నీతీ-నిజాయితీలు ఆయన జీవితముతో పెనవేసుకుపోయాయి. "మానవ సేవలో, ఆలోచనలలో, ఆచరణలో మానవుని వయస్సుకు, వృద్ధాప్యం ఏమాత్రం అడ్డు కాజాలవని" అంటాడు - అనడమే కాదు, తన జీవితములో ఆచరించి చూపాడు. 1965లో నాటి ప్రధానమంత్రి లాల్ బహుద్దూర్ శాస్త్రి దేశంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న సందర్భములో బియ్యాన్ని పరిత్యజించి స్వచ్ఛంద సేవకులు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అట్టి పిలుపునందుకున్న రావు దశాబ్దాలపాటు పరిత్యజించాడు. తన చరమ జీవితం వరకు మరల వరి ఆహారాన్ని ముట్టుకోలేదు. అంతటి నిబద్ధత ఆయనది.

డాక్టర్ కె.ఎల్. రావు కృష్ణా జిల్లాలో విజయవాడకు సమీపానగల కంకిపాడు గ్రామములో 1902 జూలై 15 న జన్మించారు. తొమ్మిదేళ్ల ప్రాయములోనే తండ్రిని కోల్పోయాడు. ఆ కుటుంబం చితికిపోయింది. అన్నగారి ప్రాపకములో చదువు సాగించాడు. ఉన్నత విద్య కోసం మద్రాస్ వెళ్లాడు. ప్రెసిడెన్సీ కళాశాలలో ఇంటర్లో అత్యధిక మార్కులు పొందాడు. అక్కడే గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశాడు. తదుపరి చెన్నైలోనే వున్నా పి.డబ్ల్యు.డి. వర్క్‌షాప్‌లో శిక్షణ తీసుకున్నాడు. అనంతరం విశాఖపట్నం జిల్లా బోర్డులో అసిస్టెంట్ ఇంజనీర్‌గా నియమితులయ్యాడు. వివిధ నిర్మాణాల పనులలో నిమగ్నమయ్యాడు. ఆయనలో విదేశాలకు వెళ్ళాలనే తృష్ణ మాత్రం వీడలేదు. మొదటగా బర్మా వెళ్లాడు. అక్కడ కొంతకాలం వివిధ సంస్థలలో పని చేసాడు. అక్కడ కొంత ధనం సంపాదించుకొని యూరోప్ దేశాలలో పర్యటించి, అక్కడ నిర్మాణ రీతి మెలకువలను గ్రహించాలన్నది అయన ఆలోచన. రంగూన్ కార్పొరేషన్‌లో నీటి సరఫరా, మురుగు నీటి నివారణ విభాగాలను పర్యవేక్షించాడు. కొన్నాళ్లకు మరో సంస్థలో చేరి మిగ్దలన్ కంటోన్మెంట్ పనులను చూశాడు. మళ్లీ బోధన వృత్తిపై తన మనసును మరలించుకున్నాడు. అక్కడే ఇన్సీన్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. స్వస్థలములో బంధుమిత్రుల వత్తిడి పెరగడంతో జన్మభూమికి తిరిగి వచ్చారు. ఓడ ప్రయాణంలో శాఖాహారాన్నే తీసుకున్నాడు. తిరిగి బర్మా వెళ్ళాలనే తన కోరిక నేరవరలేదు. తన సామానులను కూడా అక్కడే వదిలేశాడు. ఇక్కడకు వచ్చిన తర్వాత మద్రాస్ పి.డబ్ల్యు.డి. శాఖలోనే తిరిగి జూనియర్ ఇంజనీర్‌గా జాయిన్ అయ్యాడు. మెట్టూరు ప్రాజెక్ట్ పనుల పర్యవేక్షణలో భాగంగా తంజావూరు జిల్లా వదవూరు, వట్టివాక గ్రామాలలో పనిచేస్తూనే ప్రజల ద్వార వారి జీవన విధానాలను, స్థితిగతులను అధ్యయనం చేశాడు. తిరిగి వచ్చి తను చదివిన గిండీ ఇంజనీరింగ్ కళాశాలలోనే అధ్యాపకులుగా చేరాడు.



నాగార్జునసాగర్ ప్రారంభోత్సవంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీతో కె.ఎల్. రావు

డాక్టర్ రావు "రీ ఎన్ఫోర్స్‌డ్ కాంక్రీట్" అంశంపై పరిశోధన చేశారు. ఇంజనీరింగ్‌లో పరిశోధన చేయటం చాలా క్లిష్టమైనదని ఒక బలమైన అభిప్రాయం, అపోహలతో కూడి ఉండేది. మద్రాస్ విశ్వవిద్యాలయంలో డాక్టరేట్

పొంది గణుతికెక్కారు. మద్రాస్ సెంట్రల్ స్టేషన్ ఎదురుగా ఉన్న కూవు నదిపై కట్టిన రీన్ పోర్స్‌డ్ కాంక్రీట్ వంతెన నిర్మించారు.

ఫ్రెంచ్ దేశానికి చెందిన ప్రేసియానే రీ ఎన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ అంశంలో అనుభవశాలి. డాక్టర్ రావు వివాహానంతరం తన శ్రీమతితో కలిసి ఫ్రాన్స్ వెళ్లారు. అక్కడ ఆయనకు భాష విషయంలో ఇబ్బంది ఎదురైంది. అక్కడ నుండి లండన్ చేరారు. అప్పటికే పేరున్న డిజైనర్ ఇంజనీర్‌గా పేరుగాంచిన పి.ఇ. రేనాల్డ్స్, ఎల్. టర్నర్ దగ్గర చేరారు. థేమ్స్ నదిపై నిర్మించిన పొడవైన వారధిలో ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణంగా పేర్కొనేవారు. బ్రిడ్జికి ఉపయోగించిన పొడవైన పీయర్స్ దూలాల సర్దుబాటు అంశంపై తొలి విజయం సాధించారు. అదే సమయంలో ప్రఖ్యాత ఇంజనీర్, ప్రొఫెసర్ బాతో దగ్గర చేరారు. ఆయన తన ఆదాయం కోసం పాఠాలు బోధించేవారు.

లండన్‌లో సాయంత్రపు వేళలలో కాలినడకనే వెళ్లేవారు. కనీసం బస్సు ఛార్జీలు మిగిలినా మరో అవసరానికి ఉపయోగపడతాయని వీలైనంతమేరకు సాదా సీదాగానే విదేశాలలో జీవన యాత్ర సాగించారు. యుద్ధ సమయంలో కూడా ఆయన వెనక్కి తిరిగి రావాలనే తలంపును దరిచేరనీయలేదు. అక్కడే సివిల్ ఇంజనీర్ సీనియర్ అధ్యాపకునిగా చేరి, నిర్మాణాల సిద్ధాంతం, సర్వేలు చేపట్టడం, హైడ్రాలిక్ లాంటి కష్టసాధ్యమైన అంశాలను సరళతరం చేసి బోధించడం ఆయనలోని ప్రత్యేకత.

1943లో మద్రాస్ ప్రభుత్వం, నీటిపారుదల విభాగాపు చీఫ్ ఇంజనీర్‌గా వున్న రావుని అమెరికాలోని సెల్యులర్ కాఫర్ డ్యాం పరిశీలనలకు పంపారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత అప్పటి చీఫ్ సెక్రెటరి శొంఠి వెంకటరామ మూర్తి ఆదేశాలననుసరించి రామపాద సాగర్ ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. అదే సందర్భంలో మద్రాస్ ప్రభుత్వంలో మార్పులు సంభవించడంతో ప్రాజెక్ట్ శంకుస్థాపనకు ముందు అర్థాంతరంగా ఆగిపోవడం, అది రావులో తీరని బాధను కలిగించింది.


తర్వాత కాలంలో నాగార్జునసాగర్ నిర్మాణ నిర్వహణలో ప్రముఖపాత్ర వహించారు.

## సంక్షిప్తంగా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ విశేషాలు :

- క్రీస్తుపూర్వం బౌద్ధానికి సంబంధించిన అవశేషాలు, శిల్పసంపద లభించినచోటనే ద్వీపకల్ప మ్యూజియం నాగార్జున కొండపై నిర్మించి భద్రపరిచారు.
- నాగార్జునసాగర్ పూర్తిగా భారతీయ సాంకేతిక పరిజ్ఞానంతో, భారతీయ ఇంజనీర్లచే రూప కల్పనా నిర్మాణం చేయబడినది. నందికొండ గ్రామమే మొదట ప్రాజెక్ట్ పేరుతో పిలిచేవారు. ఆ గ్రామానికి 0.9 కి.మీ. దిగువన ప్రాజెక్ట్ కట్టబడినది. మొదటిసారిగా నందికొండ వద్ద ప్రాజెక్ట్ కట్టాలనే తలంపు చివరి నైజాం నవాబ్ మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ కు వచ్చింది. ఆయన ప్రభుత్వంలోని చీఫ్ ఇంజనీర్ హైదర్ అలీ జంగ్ చే సర్వే చేయబడినది. ప్రాజెక్ట్ రూపకల్పనకు హైదర్ అలీ ఆద్యుడు. డాం స్పిల్ వే పై నుండి దూకే జలపాత తరంగాలు పదనిసలను వినిపిస్తుంటాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయ్యేనాటికి కేవలం 97.5 కోట్లు మాత్రమే ఖర్చు అయినది. 1974 నాటికి రెండు కాలవల త్రవ్వకాలకు రూ. 650 కోట్లు అయినది. 2005 నాటికి 1300 వందల కోట్లు నిర్వహణకు వ్యయమైనది. 2000 మార్చ్ నాటికి ప్రాజెక్ట్, కాలువల మొత్తం నిర్మాణ వ్యయం రూ. 1183.94 కోట్లు మాత్రమే. 2010 అధునీకరణ కోసం ప్రపంచ బ్యాంకు, ఉమ్మడి ప్రభుత్వంలో 4444.41 కోట్లతో చేపట్టారు. తక్కువ వ్యయం, ఎక్కువగా మానవ శ్రమను, భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని వినియోగించుకోవడం జరిగింది. 9 ఏళ్ల పాటు రోజుకు సగటున 45 వేలమంది కూలీలు, 5 వేలమంది వర్క్ చార్జెడ్ సాంకేతిక సిబ్బంది, 400 ఇంజనీర్స్ పని చేసారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో 54 గ్రామాలు ముంపుకు గురయ్యాయి. 17,800 కుటుంబాలకు పాక్షికంగా పునరావాసం కల్పించారు. కొన్ని వందలమంది ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రాణాలు కోల్పోయారు, వేలాదిమంది క్షతగాత్రులయ్యారు. జలాశయ వైశాల్యం 110 చదరపు మైళ్ళు. 408 శతకోటి ఘనపుటడుగుల నీటి నిలువ సామర్థ్యం కలిగినది. ప్రస్తుతం పూడికవలన 312 టి.ఎం.సి. లకు పడిపోయింది.
- 2000 నాటికి బచావత్ ట్రిబ్యునల్ తీర్పు అమలు ముగిసింది. ప్రస్తుతం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పడినది. ప్రపంచంలోనే మానవ నిర్మితమైన అతి పెద్ద కట్టడము, 197 మిలియన్ టన్నుల గ్రానైట్ రాతిని కట్టడానికి ఉపయోగించారు. ఈజిప్ట్ పిరమిడుల కన్నా మూడు రెట్లు ఎత్తు కలిగినది. ప్రపంచంలోనే అతి పొడవైన కాలువలు కలిగినది. కుడి కాలువ 203 కి.మి. ఎడమ కాలువ 295 కి.మీ. కుడి కాలువ ద్వారా 11.131 లక్షల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 9.558 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నది. 1955 లో శంకుస్థాపన జరుపుకొని 1956 లో పనులు ప్రారంభించి 1969 నాటికి మొనదటి పనులు పూర్తిచేసుకున్నది. 1964 సెప్టెంబర్ 30 న భారీ వరదకు లో లెవెల్ ప్రధాన బ్రిడ్జి కొట్టుకుపోయింది. 2004 లో నూతన వారధికి ముఖ్యమంత్రి వై.స్. రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. 1967 ఆగష్టు 4 న భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ

కుడి, ఎడమల జవహర్, లాల్ బహద్దూర్ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేసారు. ప్రాజెక్ట్ పరిరక్షణ నిర్వాణ పరిశీలన కోసం మూడు గ్యాలరీలు అంతర్భాగంలో వున్నాయి. 250,350,450 వున్నాయి.

- 2009 అక్టోబర్ లో కనీ విని ఎరుగని వరదలు వచ్చాయి. 18 లక్షల గరిష్ట ప్రవాహాన్ని అంచనా, అందుకు భిన్నంగా 26 లక్షల ప్రవాహ వేగాన్ని శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ఎదుర్కొన్నై. నీటి యొక్క బరువు 212 కోట్లగా అంచనా, అంతటి ప్రవాహ వేగాన్ని ఈ రెండు ప్రాజెక్టులు తట్టుకొని నిలిచాయి. ఇదొక రికార్డు.
- నాగర్జునసాగర్ ప్రాజెక్ట్ పూర్తిగా రాయి, సిమెంట్, ఇసుకతో నిర్మించబడింది. ఆనకట్ట నిర్మాణ శక్తిని అమెరికాలోని లాబొరేటరిలో పరీక్షించి అచ్చెరువొందారు.
- ప్రాజెక్టుల రూపశిల్పి ప్రముఖ ఇంజనీర్ పద్మశ్రీ డాక్టర్ కానూరి లక్ష్మణ రావు (కే ఎల్.రావు) పర్యవేక్షణలో రూపకల్పన, నిర్మాణ నిర్వహణ కొనసాగింది.
- ఒక టి.ఎం.సి. జలాలతో కనిష్టంగా రూ.25 కోట్ల నుంచి 30 కోట్ల విలువ చేసే 2,40,000 బస్తాల ఆహారోత్పత్తులను పండించవచ్చు.
- ఒక టి.ఎం.సి. నీటితో 6000 వేల ఎకరాలలో వరి పంట పండించవచ్చు. ఒక టి.ఎం.సి. నీటితో 10 వేల ఎకరాలలో ఆరుతడి పంటలను పండించవచ్చు. సాగర్‌ప్రాజెక్ట్ ద్వారా కుడి, ఎడమల ఆయకట్టు దాదాపు 22 లక్షల ఆయకట్టు ద్వారా ఖరీఫ్, రబీ కలిపి దాదాపుగా రూ. 10 వేల కోట్ల పంటలు పండిస్తారు. కృష్ణానదిపై మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లలో 15 వరకు భారీ మధ్యతరహ ప్రాజెక్ట్స్ వున్నాయి. కృష్ణానది మహాబలేశ్వర్ పడమటి కనుమలలో 2999 అడుగుల ఎత్తులో వున్న శివాలయములోని గోముఖ్ నుంచి ధారగా మొదలై అనేక ఉపనదులను కలుపుకొని ఆంధ్రపదేశ్‌లోని కృష్ణాజిల్లా హంసలదీవి ప్రాంతంవరకు 1400 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో సంగమిస్తుంది.
- శంకుస్థాపన సందర్భంగా ఒక సామాన్య రైతు కర్పూరపు కోటయ్య నెహ్రూకు అతి సమీపంగా వచ్చి *"అయ్యా ఇది నీవు వెలిగించిన దీప"*మని అంటాడు. దానిని నెహ్రూ తర్జుమా చేయించుకొని మహదానందంతో ఉపన్యసిస్తాడు. కోటయ్య మాటలు ప్రాజెక్ట్ చరిత్రలో శిలాక్షరాలుగా నిలిచి పోయాయి. ప్రాజెక్ట్ కాంక్రీట్, మేసనరి తో కట్టాలనే చర్చ జరిగింది. తక్కువ ఖర్చు, ఎక్కువ గట్టిదనం, అధిక సంఖ్యలో కూలీలకు ఉపాధి, విదేశీ మారక ద్రవ్యం అవసరం లేకుండా కట్టవచ్చని కే.ఎల్. రావు ప్రతిపాదిస్తారు. సిమెంట్ రాతి కట్ట నమూన పలకలను అమెరికాలోని డెన్వర్ ప్రయోగశాలకు తరలించి పరిక్షలు నిర్వహిస్తారు. నాణ్యత, గట్టిదనమని తేల్చడంతో ప్రాజెక్ట్ పనులను ప్రారంభిస్తారు.
- ప్రాజెక్ట్ రూపకల్పన నిర్మాణం, పర్యవేక్షణ పూర్తిగా భారతీయ ఇంజనీర్లచే నిర్మించబడిన ప్రాజెక్ట్. ప్రతి రోజు 15000 టన్నుల వరకు నిర్మాణ సామాను ఉపయోగించారు. డాం నిర్మాణంలో ప్రతి రోజు ప్రమాదాలు, ఒక్కో సందర్భములో మరణాలు సంభవించేవి, అయినా పనులు ఆగేవి కాదు. కూలీలలో ప్రాణాలు కోల్పోయింది ఎం.గురువమ్మ, డి.టి. టన్నెల్, ప్రమాదంలో రంగయ్య మరో ఇంజనీర్‌తోసహా మొత్తం ఏడుగురు మరణించారు. పరంజలు కూలీ పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయ్యారు. క్వారీ వివిధ ప్రమాదాలలో వందల సంఖ్యలోనే మరణిచారు. రికార్డుల ప్రకారం కేవలం 154 మంది మరణించారని రికార్డులలో నమోదైన సంఖ్య. 2005 లో స్వర్ణోత్సవాల సందర్భంగా నాటి ముఖ్యమంత్రి అమరులైన కార్మికుల స్థూపం ఆవిష్కరించారు. తొలి చీఫ్ ఇంజనీర్ మీర్ జఫర్ అలీ విగ్రహాన్ని కూడా అదే సందర్భంగా డాక్టర్ కే.ఎల్. రావు విగ్రహాలను ఆవిష్కరించారు. ప్రతి ఏటా విద్యుత్ ద్వారా 4 వందల కోట్లకు పైగా ఆదాయం లభిస్తుంది. మొత్తం 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదక కేంద్రాల ద్వారా ఏటా 1300 మిలియన్ యూనిట్ల ఉత్పాదన సగటున జరుగుతుంది. లాల్ బహద్దూర్ ఎడమ కాలువ ద్వారా 9.76 లక్షల ఎకరాలు, జవహర్ కుడి కాలువ ద్వారా 11.18 లక్షల ఎకరాలు సాగవుతుంది. ఇందుకు గాను 264 టి.ఎం.సి.ల నీటిని ప్రతి ఏటా కేటాయిస్తారు. తక్కువ వ్యయం ఎక్కువ ఆదాయం వచ్చే ప్రాజెక్ట్ గా ప్రపంచంలో గుర్తించబడింది.
- 4, 5 లక్షల ఏండ్లకు పూర్వమే మానవ నివాసాలు, వారు ఉపయోగించిన పరికరాలు లభించినై. క్రీ.శ.3 వ శతాబ్దము నాటి నాగార్జునునిచే నిర్మితమైన సింహళ విహారం, అశ్వమేధ యజ్ఞ వాటిక, శాతవాహనుల కాలంనాటి చారిత్రిక సంపద లభించినాయి. మహాయాన ప్రచారాన్ని నాగార్జునకొండ శ్రీపర్వత నేటి విజయపురి నుండే ప్రారంభించారు. దక్షిణాదికి చెందిన మునిపల్లె గ్రామానికి చెందిన అర్జునశర్మ తదుపరి నాగార్జునుడిగా రసవాద విద్యలో ఆరితేరిన పండితునిగా, నాగార్జున ఆయుర్వేద విశ్వవిద్యాలయ స్థాపకునిగా చరిత్ర ప్రసిద్ధినొందారు. నాటి నందికొండ ప్రాజెక్ట్ నేడు ప్రపంచ ప్రసిద్దిగాంచిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌గా విలసిల్లుతున్నది. ఆచార్య నాగార్జునుడు తన శేష జీవితమును ఇచటనే గడిపారు. శ్రీపర్వతము పైననే చివరి శ్వాస విడిచారు. ఇంతటి చరిత్ర ప్రసిద్ది చెందిన ప్రాంతమిది. బుద్ధుని జీవిత చరిత్రను తెలియపరచే నమూనాలు విజయపురి హిల్‌కాలనీ సమీపంలో 275 ఎకరాల శ్రీపర్వత స్థూప నిర్మాణాన్ని పర్యాటకశాఖ నిర్మిస్తుంది. ప్రపంచ బుద్ధుని నమూనాలను ఈ మ్యూజియంలో పొందుపరుస్తుంది.



కె. వెంకటేశ్వర్లు
నాగార్జునసాగర్.
ఫోన్ : 944 085 4149

# అట్టమీది బొమ్మలు



దీనానాథ్ దలాల్
1916-1971

"పండితులు పామరులు నా కళను సమంగానే ఆదరించారు. కానీ ఎక్కడో ఏదో వెలితి నా మనస్సును కలచి వేసేది. చిత్రకళలో ప్రసిద్ధ విమర్శకులను, కళానిర్ణేతలను నేను అంతగా ఆకట్టుకోలేకపోతున్నాను. కారణం నేనెక్కడో ఒకచోటే ఆగిపోయాను. వ్యాపారాత్మక ప్రపంచంలో ఇరుక్కుని ముందుకు వెళ్ళలేకపోయాను. ఇక మహోజ్వలమైనది, చిరకాలం నిలబడే కళను సృష్టిస్తాను" అని చెప్పుకున్నాడు దీనానాథ్ దలాల్ 1970 వ సంవత్సరంలో. కానీ తాను అనుకున్నది సాధించకుండానే ఆ మరుసటి సంవత్సరమే కాలంతో పాటు ఆయన నీటిరంగుల్లో కరిగిపోయాడు.

పైన చెప్పిన మాటలు దీనానాథ్ కే కాదు సమస్త కళాకారులకు వర్తిస్తుంది. కళాకారుడెప్పుడు తాను చేసిన పనితో సంతుష్టిపడడు. ఈ అసంతృప్తే కళకు, సృజనకు నవనవోన్మేషతకు తలుపులు తెరుస్తుంది.

21 సంవత్సరాల వయసులో దలాల్ గోవా నుంచి బొంబాయి మహానగరం చేరుకున్నాడు. అప్పట్లో స్వతంత్ర పోరాటం గాంధీ నాయకత్వంలో ముమ్మరంగా సాగుతుంది. ఎందరో ఆ మహాయజ్ఞంలో సమిధలు కావడానికి ముందుకు వచ్చారు. అందులో దూరినవారిలో దీనానాథ్ కూడా వున్నాడు. J.J. School of Art కు అనుబంధ సంస్థగానున్న కేల్కర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్ నుంచి దలాల్ డిప్లమో తీసుకున్నారు. క్లాసికల్ ఆర్ట్ గురించి పరిశోధించి మరింత అవగాహన పెంపొందించుకోవాలనుకున్నా ఆర్థిక పరిస్థితులతన్ని ఉద్యోగాన్వేషణలో పడేశాయి. అప్పట్లో చిత్రకారులకు అడ్వర్‌టైజింగ్ ఏజన్సీలలో సులువుగానే ఉద్యోగం లభించేది. అదే సమయంలో బొంబాయిలో చలనచిత్ర పరిశ్రమ వేళ్ళూనుకుంటుంది. భారతీయ స్వతంత్ర కాంక్షతో వార్తపత్రికలు అంతకు ముందు లేని కొత్త గొంతుకతో స్వతంత్ర భావాన్ని సమర్థిస్తూ వార్తలు వ్రాస్తున్నాయి. దానికి తోడు వ్యంగ్య చిత్రాల ప్రచురణ ఊపందుకున్నాయి. దలాల్ కొన్ని వ్యంగ్య చిత్రాలు గీసి ప్రసిద్ధి పొందాడు.


Bombay Art Society, Art Society of India లు అతని చిత్రాలను ప్రదర్శించాయి. వ్యాపార చిత్రాలలో భాగంగా కాలండర్ ఆర్ట్ అతని ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేస్తూ అక్కడే స్థిరపడిపోయేలా చేసింది. నిజమైన కళకు దూరమవుతున్నానని అతనికనిపించింది.

క్యాలెండర్ ఆర్ట్ అతన్ని ఆర్థికంగా ఆదుకోవటంతో అది వరమో, శాపమో అర్థం కాని వలలో చిక్కుకున్నట్లనిపించింది. నెమ్మదిగా కమర్షియల్ ఆర్ట్‌లో తాను చదువుకున్న క్లాసికల్ శైలిని నింపే ప్రయత్నం చేశాడు. రేఖలే చిత్రానికి ప్రాణం అని అతను నమ్మేవాడు. రేఖలలోనే వైవిధ్యాన్ని తీసుకునివచ్చే ప్రయత్నంలో ఎన్నో స్కెచ్‌లు వేశాడు. Portriats అతని ప్రత్యేకత. అందులో అతని కృషికి గుర్తింపు లభించింది. కేవలం వ్యాపార ప్రకటనలకే పరిమితమైన చిత్రాలు, పేరుగాంచిన ప్రముఖుల చిత్రాలు, ఊహాత్మకంగా గీసిన కల్పనాత్మక చిత్రాలలో అతను పేరుగాంచాడు. కమర్షియల్ ఆర్టిస్టుల మధ్య క్లాసికల్ ఆర్టిస్టుగా, క్లాసికల్ ఆర్టిస్టుల మధ్య కమర్షియల్ ఆర్టిస్టుగా, మధ్యేమార్గంలో ప్రయాణం చేయటమేకాదు, అందులో రాణించాడు. ఎందరో మరాఠీలను తన చిత్రకళ ద్వారా ప్రభావితం చేశాడు. వారిలో చిత్రకారులు కావాలనే కోర్కెలను రగిల్చాడు. రంగులను కాగితంపై ప్రవహింపచేసి, తప్పులను దిద్దుకునే అవకాశమివ్వని, నీటిరంగుల మీడియా అతనికి ఇష్టం. లేత రంగులతో సహజత్వంతో తొణికిసలాడే ఈ నెల **మిసిమి** ముఖచిత్రం అందుకు నిదర్శనం. అమాయక మనస్తత్వం, అందమైన ముఖం – ఆరోగ్యవంతమైన శరీర లావణ్యం, చిలక భుజంపై నున్న పల్లెపడుచు అందాలను చూస్తూ మనం మన కళ్ళను మరల్చుకోలేము. ఇందుకు భిన్నంగా కామ, క్రోధ, లోభాలను 'దీపావళి' ముఖచిత్రాలుగా ముద్రించాడు. 'దీపావళి' అనే పేరుతో 1945 వ సంవత్సరంలో ఒక వార్షిక పత్రికను ప్రారంభించి రంగుల చిత్రాలను ముద్రించేవాడు. ప్రజాభిమానంతో వార్షిక పత్రికను 1956 వ సంవత్సరంలో మాసపత్రికగా మార్చాడు.

ప్రజల స్థాయినిబట్టే చిత్రకళ ఉండాలని, అందుకు భిన్నంగా ఉంటే ప్రజాదారణ లభించదని నిజాయితీగా నమ్మినవాడు దలాల్.

# మనసున్న రాయుడు

సాహిత్యం ఒక గొప్ప నాగరికతకు సంకేతం. క్షరం కాని అక్షరానికి నివాళి పట్టటం. సమాజ శ్రేయస్సు సాహిత్యపు మౌలిక ప్రయోజనాలలో ముఖ్యమైంది. నేను విద్యార్థిగా నున్నప్పుడు నాకు ఒక కల వుండేది. తెలుగులోని ఉత్తమ సాహిత్య సాంద్రతను ఒక్కచోట చేర్చటం, దానిని అతి తక్కువ వెలతో పాఠకుల ముందు పెట్టటం. ఒక ఉత్కృష్ట సంస్కృతీ సంప్రదాయంగా ఇంటింటా లైబ్రరీ ఉద్యమాన్ని తిరిగి పునఃప్రతిష్టించటం. కాని ఇది కల. కాని సాధ్యం కాదు అనుకున్నాను. నాలానే మరెందరో భావించారు. వారందరి సాహితీ స్వప్నాలను నేనున్నానంటూ నిజం చేస్తున్న ఒకే ఒక్కడు రాయుడు. ఆర్థికంగా సుసంపన్నమైన కుటుంబంలో నుంచి వచ్చాడు. నిలువెల్లా హార్థికతను నింపుకున్న మనసుతో ఎదిగాడు. ఒక ప్రభుత్వం, ఒక యూనివర్శిటీ వేలు, లక్షలు, కోట్లు గడిస్తున్న ఎన్.ఆర్.ఐ. లకు సాధ్యం కానిది అతను సుసాధ్యం చేసి చూపించాడు. మనం మంచి పని చేస్తున్నప్పుడు లాభనష్టాలు బేరీజు వేసుకోని సాహిత్య బేహారి అతను.



మన్నం రాయుడు

కొందరు వ్యక్తులు ఏకవచనం కాదు, బహువచనం. ఈ కృషిలో అన్నదమ్ములలో పెద్దవాడైన రాయుడుకి ఇరువైపులా నిలిచారు తమ్ముళ్ళు. ఒకరు హైదరాబాదులో స్టార్ హాస్పిటల్స్ స్థాపించి కార్డియాలజిస్ట్‌గా సేవచేస్తున్న డాక్టర్ గోపీచంద్. రెండవవారు టి.వి.9 న్యూస్ కో–ఆర్డినేటర్‌గా, జర్నలిస్టుగా, పుస్తక రచయితగా పేరుగాంచిన చంద్రమౌళి. వీళ్ళంతా కలిసి, పండుటాకు రాలుతున్నంత నిశ్శబ్దంగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. పాఠకులు తమను గుర్తుపెట్టుకోవాలని, తమ పేరు పదేపదే తలచుకోవాలని ఏనాడూ భావించలేదు. ఒకే ఒక లక్ష్యం. ఒకే ఒక నిర్దేశం. అదే తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయటం.

సాహిత్యంలో సమాజాన్ని ప్రభావితం చేసిన తెలుగు రచయితల సమగ్ర రచనలను ఒకే సంకలనంగా పాఠకులకు అందుబాటులోకి తేవటం, వారి రచనలతోపాటు లభిస్తున్న ఫోటోలు, డైరీలు, ఉత్తరాలు కూడా కలిపి ప్రచురించటం ముఖ్య ఉద్దేశం. సుసంపన్నమైన తెలుగు భాషను కాలగర్భంలో కలిసిపోకుండా రక్షించటం – దీనివల్ల పరిశీలనా, పరిశోధనా చేసే విద్యార్థులకు సులువుగా సాహిత్యాన్ని అందుబాటులోకి తీసుకురావటమే లక్ష్యంగా ఈ మహాయజ్ఞం కొనసాగుతోంది. పాదులు తీసిన ఈ సాహిత్య కల్పవృక్షానికి నిత్య సేద్యునిగా నిలబడిన శ్యాంనారాయణ అభినందనీయులు.

రాయుడు గారి తండ్రి పేరు **మ**న్నం **న**రసింహం, తల్లి పేరు **సు**బ్బమ్మ. వీరిద్దరి పేర్ల మొదటి అక్షరాలను తీసుకొని తమ ఫౌండేషన్‌కు ***మనసు ఫౌండేషన్*** అని పేరుపెట్టారు. ఇప్పటివరకు *రావిశాస్త్రి, కాళీపట్నం, చెప్పులు కుడుతూ కుడుతూ, శ్రీశ్రీ, బీనాదేవి, గురజాడ, కాటన్, మార్గదర్శి, జాషువ, Inspiral, పతంజలి, కథాసాహిత్యం* (రెండు భాగాలు), *శ్రీపాద* (తయారులో వుంది) – పుస్తకాలను సేకరించి, ప్రచురించటం జరిగింది. తెలుగులో ఇంతవరకు 20 లక్షలు పైగా పేజీలను సేకరించారు.

ఇప్పటికీ 5 లక్షల పేజీలు స్కాన్‌చేసి శుభ్రపరచబడ్డాయి.

తెలుగు సాహిత్యాన్ని భద్రపరచి రాబోయే తరాలకు అందించడం కోసం తెలుగులో వచ్చిన ప్రతి పత్రికను సేకరించారు. దానిని డిజిటలైజ్డ్ చేసి సంరక్షిస్తున్నారు. ఈ పనిని వేగవంతంగా చేయడం కోసం ప్రత్యేకించి ఒక కార్యాలయాన్ని ప్రారంభించి, సమర్థులైన నిపుణులను నియమించుకున్నారు.

18, 19 వ శతాబ్దాలలో మన దేశంలోను, సమాజంలోను వచ్చిన పరిణామాల వర్తమాన పరిస్థితులకు మౌలిక కారణం అన్న అవగాహనతో తెలుగు సమాజపు పరిస్థితుల గురించి చెప్పే ఇతర భాషాగ్రంథాలను అనువదించి అందించాలన్నది పుస్తక ప్రచురణా కార్యక్రమాలలో ఒక భాగం. *చెప్పులు కుడుతూ కుడుతూ, సర్ ఆర్థర్ కాటన్* జీవిత గ్రంథాల ప్రచురణ తర్వాత అనువాద రచయితల రచనకు తగిన ప్రోత్సాహం లభించకపోవటంతో ఈ ప్రక్రియ కొంచెం మందగించింది.

ఇంత ఉత్తమోత్తమ సాహిత్యాన్ని అందంగా అచ్చువేయటంలో తనదైన సహాయసహకారాలందించిన **మిసిమి** మాసన పత్రిక గల కళాజ్యోతి వారు అభినందనీయులు.

# రాయలసీమ నవలా చరిత్ర

*– పొదిలి నాగరాజు*

**తొ**లి తెలుగు నవలా పరిశోధకులు బి.వి. కుటుంబరావు నుండి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి వరకు ఉన్న వాళ్ళలో ఒకరిద్దరు మాత్రమే రాయలసీమ నుండి 1950 లోపల మూడు నవలలు వచ్చాయని తెలియజేశారు. అవి నరహరి గోపాలకృష్ణమసెట్టి *శ్రీ రంగరాజు చరిత్ర* (1872), కల్వటాల జయరామారావు *రేనాటి వీరుడు* (1925), అంతటి నరసింహం *ఆదర్శం* (1946). ఇవి తప్ప రాయలసీమలో నవలలు ఉన్నట్లు ఎవ్వరూ ఎక్కడా పేర్కొనలేదు. రాయలసీమ ఆధునిక సాహిత్యానికి అద్దం పట్టిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య రచించిన గ్రంథం *రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ.* ఈ గ్రంథంలో వల్లంపాటి వారు 1950 తరువాతనే రాయలసీమలో నవలా సాహిత్యం కనిపిస్తుంది అంటూ తొలితరం రచయితలుగా కె. సభా, నాదమునిరాజులను పరిచయం చేశారు. 1925వ ప్రాంతంలో కల్వటాల జయరామారావుతో ఆగిపోయిన సామాజిక చింతన 1950 దశకం వరకు పేర్కొనలేదు. ముందు వచ్చిన రాయలసీమ నవలా సాహిత్యాన్ని గూర్చి మాట్లాడుతూ "1950 దశకం దాటే వరకూ వీటితో సమానమైన నవలలు కాదుకదా సాధారణ ప్రతిభ ఉన్న నవలలు కూడా రాయలసీమ నుంచి రాలేదు" (పుట. 91) అని పేర్కొన్నారు. గ్రాంథిక భాషలో రచనలు చేసిన రచయితల్ని అప్పుడు మంచి రచయితలుగా, నవలాకారులుగా గుర్తించటం సాంప్రదాయంగా ఉండేదనిపిస్తుంది.

యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి తెలుగు అధ్యక్షులుగా ఉన్నప్పుడు మొదటి బ్యాచ్‌లో పరిశోధకులుగా చేరిన అయిదుగురిలో పొదలి నాగరాజు ఒకడు. ఈయన డా॥ జి. పార్వతి పర్యవేక్షణలో "రాయలసీమ నవల – తొలిదశ (ప్రారంభం నుండి 1950 దాకా)" అనే అంశం మీద పరిశోధన చేశాడు. రాయలసీమ ఆధునిక సాహిత్య చరిత్ర పునర్లేఖన, పునర్నిర్మాణ ప్రయత్నాలు ఇటీవల ఊపందుకొన్నాయి. ప్రధానంగా సీమ తొలికథలు, తొలి నవలలు అన్వేషణలో, అధ్యయనంలో పరిశోధక విద్యార్థులు అత్యంత శ్రద్ధ కనపరుస్తున్నారు. 1950కి ముందు వచ్చిన నవలల్ని నాగరాజు విశ్లేషించడం చదివితే నవల విషయంలో రాయలసీమ ఇప్పటిదాకా అందరూ అనుకుంటున్నంతగా వెనకబడిపోలేదు అన్న అభిప్రాయం కలుగుతుంది. అంతేకాదు తెలుగు నవలా చరిత్రను తిరిగి రాయవలసిన అవసరం వుందని వీరి పరిశోధన తెలుపుతుంది. ఆయన తన పరిశోధన గురించి చెపుతూ....

"విశ్వవిద్యాలయం గ్రంథాలయంలోని 'తెలుగు సాహిత్యకోశము' (1850–1950), నాకు ఆధారమయింది. ఈ గ్రంథం నుండి 1950 ముందు వచ్చిన 25 నవలల పేర్లను సేకరించాను. తర్వాత సి.పి. బ్రౌన్ గ్రంథాలయంలో మరో 25 నవలల పేర్లను సేకరించాను. ఈ 50 నవలల పేర్ల ఆధారంతో పట్టుదలను మరింత గట్టి చేసుకొని కడప, వేటపాళెం, ప్రొద్దుటూరు, అనంతపురం, బళ్ళారి, ధర్మవరం, హిందూపురం, బద్వేల్, తిరుపతి, చాగలమర్రి లాంటి ప్రాంతాలు తిరిగి 1950కి ముందు వచ్చిన 30 నవలలను సేకరించాను. లభించిన కొన్ని నవలలకు రచయితల జీవిత వచ్చిన విశేషాల సమాచారం అసమగ్రంగా ఉండడంతో 24 నవలలతోనే నా పరిశోధనను పూర్తి చేయాలనుకొన్నాను. ఈ 24 నవలలకు చెందిన రచయితలు 20 మందికి పైగా ఉన్నారు. నాకు లభించిన 24 నవలలకే ఈ పరిశోధనా వ్యాసం పరిమితం అయింది. తెలుగు నవలా చరిత్రలో రాయలసీమ నవలలకు స్థానం దక్కకపోవడం వల్ల పెద్ద ఖాళీ ఏర్పడిందని, దానిని పూరించడమే తాను చేసిన పని" అని నిబ్బరంగా పేర్కొన్నాడు.

5 అధ్యాయాలలో తనకు లభించిన నవలలను నాగరాజు విశ్లేషించాడు. వాటిని చారిత్రక, పౌరాణిక, సాంఘిక, రాజకీయ, అపరాధ పరిశోధక నవలలుగా విభాగించాడు. ఒక్కొక్క నవలలను విశ్లేషించేటప్పుడు మొదట రచయిత జీవితాన్ని పరిచయం చేశాడు. తర్వాత నవలలోని కథను పరిచయం చేశాడు.

నాగరాజు 1908లో దేవమణి సత్యనాథన్ రాసిన *లలిత* అనే నవలను సంపాదించి వివరించాడు. తొలి తెలుగు, సాంఘిక నవలా రచయిత్రి దేవమణి సత్యనాథన్. ఆమె తొలి తెలుగు దళిత నవలా రచయిత్రి కూడా. ఇదే నిజమైన తొలి తెలుగు నవలా రచయిత్రి అయితే ఈ కీర్తి రాయలసీమకే దక్కుతుంది. రాయలసీమ నవల పూర్వ పరిశోధకుల విమర్శల కృషిని ప్రస్తావిస్తూ, పూర్వ పరిశోధకుల అభిప్రాయాలను నాగరాజు పరాస్తం చేస్తూ 1925 ప్రాంతంలో కల్వటాల జయరామారావుతో ఆగిన సామాజిక చింతన 1950 దశకం వరకూ వల్లంపాటి పేర్కొనలేదని అంటూ గతంలో జరిగిన పొరపాట్లను ఎత్తి చూపాడు. తెలుగు నవలపై వచ్చిన విమర్శ గ్రంథాలు కానీ, పరిశోధనా గ్రంథాలు కానీ ప్రధానంగా ఇతర ప్రాంతాలకు చెందిన వారివి కావడం వల్ల వాటిలో సీమ నవలా సాహిత్యానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదనీ, సమగ్రంగా చర్చించలేదనీ స్పష్టీకరించాడు. 'ప్రేమ సుందరి' రాసిన విద్వాన్ హనుమగుత్తి దేవదానము కూడా దళితుడే కావడం విశేషం.

రాజశేఖర చరిత్రను పరిశీలించి రెండు వర్గాల సాహిత్యకారుల అభిప్రాయాలను సేకరించారు. చివరి నిర్ధారణగా *శ్రీరంగరాజు చరిత్ర* నే తొలి తెలుగు నవలగా పేర్కొన్నారు. ఇది రాయలసీమ నవల కావడమే ఈ గ్రంథంలో సుదీర్ఘ చర్చకు కారణం. ఆధునిక సాహిత్యంలో రాయలసీమ వెనుకబడిన ప్రాంతం అన్న మాట ఎప్పటి నుండో వినిపిస్తూనే ఉంది. అయితే నవలా సాహిత్యంలో అది ఎంతవరకు సమంజసమో, తెలపడానికి ఈ విమర్శనాత్మక పరిశోధన మనముందుంచారు. రాయలసీమ సాహిత్యం మీద పరిశోధించేవాళ్ళకు రాయలసీమ చారిత్రక నేపథ్యం తెలియాలన్న శాస్త్రీయ సిద్ధాంతానికనుగుణంగా నాగరాజు రాయలసీమ భౌగోళిక చరిత్రను మొదటి అధ్యాయంగా రాశాడు. రాయలసీమ ప్రాంతానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. ప్రస్తుతం రాయలసీమగా పిలువబడుతున్న ఈ ప్రాంతాన్ని ముందుగా హిరణ్యకా రాష్ట్రమనీ, రేనాడనీ, మహారాణి వాడి అనీ, దత్తమండలం అనీ పిలిచేవాళ్ళు. కడప, కర్నూలు, అనంతరపురం, బళ్ళారి ప్రాంతాలను దత్త మండలాలు అని పిలచేవాళ్ళు. 1928 చిలుకూరి నారాయణరావు రాజమండ్రి నుండి అనంతపురానికి ఉద్యోగం చేయడానికి వచ్చారు. అప్పట్లో ఆయనకు 'దత్త మండలం' అనే పేరు వినిపించింది. ఈ దత్త అనే మాట నారాయణరావుకు బానిసత్వానికి గుర్తు అనిపించడంతో ఆయన 'దత్త' అనే పేరుతో సీమ గొప్పతనాన్ని గూర్చి 128 పంక్తులతో మంజరీ ద్విపద రాశారు.

నిజాం నవాబు బ్రిటీష్ వాళ్ళకు ఈ ప్రాంతాన్ని దత్తత ఇచ్చినట్లు ఆ విధంగా దత్తత ఇవ్వడానికి ఎవరికీ అధికారం లేదని చెబుతూ నారాయణరావు దత్త మాటను వ్యంగ్యంగా వివరించారు. 1928 నవంబరు 18న నంద్యాలలో కడప కోటిరెడ్డి అధ్యక్షతన మొదటి 'దత్తమండల మహాసభ' జరిగింది. ఈ సభలో ఉన్న చిలుకూరి నారాయణరావు 'దత్త మండలం' పేరును తీసివేసి ఈ ప్రాంతానికి 'రాయలసీమ' అని నామకరణం చేశారు. నారాయణరావు ఈ పేరు పెట్టకముందే *అభిషిక్త రాఘవము* అనే గ్రంథంలో ఈ ప్రాంతానికి రాయలసీమ అనే పేరు ఉన్నట్లు సిహెచ్. ఆచార్య తన తన *రాయలసీమ స్వాతంత్ర్య సమరచరిత్ర* అనే పుస్తకంలో తెలియజేశారు.

1881-82న బళ్ళారి జిల్లాను రెండుగా చేసి అనంతపురం జిల్లాను ఏర్పాటు చేశారు. ఈ జిల్లాకు చెందిన చాలా ప్రాంతాలు ఒకప్పటి రాయల పాలనలో ఉండేవి. గుత్తి, పెనుగొండలలో ఉన్న కోటలు విజయనగర రాజులు నిర్మించినవే. 1869లో అనంతపురం మున్సిపాలిటీ అయింది. తర్వాత జిల్లా అయింది. కర్నూలు జిల్లాను పూర్వం కందనవోలుగా పిలిచేవాళ్ళు. కాలక్రమేణ ఇది కర్నూలు అయింది. ఉత్తర అర్కాట్, కడప జిల్లాలోని కొన్ని ప్రాంతాలను కలుపుకొని 1911లో చిత్తూరు జిల్లా ఏర్పడింది. కడపను పూర్వం కృపనగరం అనీ, ద్వారం అనే అర్థంలో కడప అంటూ చివరికి కడప అనే పేరు స్థిరపడిపోయింది. ప్రస్తుతం కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు ప్రాంతాలను మాత్రమే రాయలసీమ అంటున్నాం. తెలుగులో మొదటి శాసనం రాయలసీమ ప్రాంతంలో ఉండడం వల్ల రాయలసీమ చారిత్రక విశేషం గొప్పదని అర్థమౌతుంది. కడప జిల్లా, కమలాపురం తాలుకా, ఎర్రగుడిపాడులోని శాసనం తెలుగులో మొదటి శాసనం. క్రీ.శ. 575లో రేనాటి చోళుడైన ఎరకల్ ముత్తురాజు ఈ శాసనాన్ని వేయించాడు. ఇదేగాక రాయలసీమలో పెద్దముడియం శాసనం, తాళ్ళ ప్రొద్దుటూరు శాసనం, పార్నపల్లి శాసనం, దేవుని కడప శాసనాలు ముఖ్యమైనవి.

రత్నాలసీమగా వెలుగొందిన రాయలసీమకు చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. వజ్ర వైఢూర్యాలను రాశులుగా పోసి అమ్మిన ఈ సీమ ఇప్పుడు ఇంత వెలవెలపోవడానికి చారిత్రక వైఫల్యమే కారణం. సీమ అంటే కరువు ప్రాంతం

అయింది. రాయలసీమ చరిత్ర అంటే కరువుల చరిత్రగా మిగిలిపోయింది. అశోకుడు బుద్ధుని బోధనలు ప్రచారం చేస్తూ ఈ ప్రాంతాన్ని దర్శించాడు. తొలి తెలుగు శాసనం ఈ గడ్డలోనే నిలిచింది. భారత, రామాయణాలు సీమను ఘనంగా కొనియాడాయి. హరిహరబుక్కరాయలు విద్యారణ్యస్వామి చేత విజయనగర సామ్రాజ్యాన్ని నిర్మింప చేసుకొని రాయలసీమతో పాటు దక్షిణాపథాన్నంతా తన అధీనంలోకి తెచ్చుకొన్నాడు. విజయనగరం రాజ్యంలో కూడా ఒక్క సంవత్సరం వర్షం కురవకపోతే భయంకర కరువు వస్తుందని *ఆంధ్రుల సంస్కృతి – చరిత్ర* గ్రంథం తెలియజేస్తుంది. "ఈ దేశంలో అన్నీ అపారంగానే ఉన్నాయి. కాని, ఒక్క ఏడాది వర్షం కురవకపోతే, దేశంలో కరువు వచ్చేస్తుంది. ఎందరో చచ్చిపోతారు. రెండు మూడు అణాలకి పిల్లల్ని అమ్మేసుకుంటారు."

"రాయలసీమ ప్రజలు అప్పులతో పుట్టి, అప్పులతో పెరిగి అప్పులతో చనిపోతున్నారని, ప్రజలు ఒక కరువు నుండి బయటపడే సమయానికి మరొక కరువు ప్రత్యక్షమవడం వల్ల ఆర్థిక పరిస్థితులు తారుమారవుతున్నాయని ప్రొఫెసర్ గంగూలీ అన్న మాటలు అక్షరాలా సత్యం" అని *తరతరాల రాయలసీమ* 'కరువు సమస్యల ప్రత్యేక సంచిక' తెలియజేసింది. కరువు కాటకాలతో రాయలసీమ అల్లాడిపోతుంటే ప్రభుత్వం ఆనకట్టలను కోస్తాకు పంచి పెట్టింది. రాయలసీమ నుంచి ప్రవహించే పెన్నా, తుంగభద్రా నదులకు కట్టిన ఆనకట్టలు కూడా కోస్తాకు ప్రాంతానికే దక్కాయి. ఇప్పటికీ సీమ దారిద్ర్యం అలాగే ఉంది. రంగరాజ చరిత్ర గురించి చెపుతూ ఇందులోని కథాకాలం రచనాకాలం కంటే నాలుగు వందల సంవత్సరాల క్రితంది. అంటే ఆంధ్రదేశాన్ని 'మూరు రాయర గండడు' పరిపాలిస్తున్న కాలానికి చెందింది. 'మూరు రాయర గండడు' అన్నది కృష్ణదేవరాయలకున్న బిరుదు. కానీ అతనికి శ్రీరంగరాజు అన్న కొడుకు ఉన్నట్టుగా ఎలాంటి చారిత్రక ఆధారమూ లేదు. అంటే దీన్ని చారిత్రక నవలగా పరిగణించడానికి కూడా వీలులేదు. రాయలసీమ నవలా సాహిత్యం బావిలో కప్పలా అలాగే ఉండిపోయింది. ఇలాంటి సీమ నవలా సాహిత్యానికి బయటి ప్రపంచాన్ని చూపించిన విమర్శకులుగానీ, రచయితలుగానీ, మేధావులుగానీ ఎవరూ ముందుకు రాలేకపోయారు. అందుకే రాయలసీమ నవలాసాహిత్యం తెలుగుసాహిత్యానికి పరిచయం కాక మరుగునపడిపోయింది.

"ఊరినానుకొని మూడు ఫర్లాంగుల దూరంలో మాలవాడ ఉంది. మావాడ ప్రక్కనే కాలవ కూడా ఉంది. అది కోట ప్రక్కగా పారి, కోట చెరువులో పడుతుంది. మాలవాడ వున్న ప్రదేశం కాస్త ఎత్తైనదే. కాని అంత ఆరోగ్యంగా ఉండదు. మాలవాడలో వీధులంతా అసహ్యంగా ఉంటాయి. ఆవుదూడలు, బఱ్ఱెదూడలు వచ్చి చెత్తలోని గడ్డిపోగులు తింటూ వుంటాయి. చిన్నపిల్లలు వీధులలోనే మలవిసర్జన చేస్తారు. కోళ్ళు దాన్ని వీధిలోకంతా చిమ్ముతూ ఉంటాయి. వారానికొకసారయినా చనిపోయిన పశువును కోస్తారు. ఎముకలంతా ఎక్కడంటే అక్కడ పడివుంటాయి. కుక్కలు పటపటా యెముకలు కొరుకుతూ, కాట్లాడుతూ, కోళ్ళనూ, ఆవుదూడల్నూ తరుముతూ వుంటాయి. మురుగుడు గుంతలలో పొర్లాడి మదించి తిరుగుతూ వుంటాయి పందులు. కుక్కలతో చెర్లాటమాడుతూ వుంటాయి పందిపిల్లలు. దిగంబర దేహాలతో ప్రకృతి మానవుల్లాగా, ఆ పందులతో కుక్కలతో ఆడుకుంటూ, వాటిపై రాళ్ళు విసుర్తూ ఉంటారు పిల్లలంతా. ఇంతగా వర్ణించటం కంటే అక్కడ దరిద్రదేవత నానా వేషాల్తో తాండవనృత్యం చేస్తూందంటే చాలు."

"రాయలసీమలో లేకపోవడం ఒక ముఖ్య కారణం. అయినప్పటికీ దేశవ్యాప్తంగా నడుస్తున్న సంఘ సంస్కరణ ఉద్యమాలు, జాతీయోద్యమాలు, వామపక్ష ఉద్యమాలు – ఇవి రాయలసీమ మీద ఎంతోకొంత ప్రభావం వెయ్యకపోలేదు. పత్రికలు ముద్రణాలయాలు అతి తక్కువగా ఉండడం, పత్రికల మీద కోస్తా ప్రాంత ఆధిపత్యం ఉండడం కూడా కొంతకారణం.

ఇన్ని అసౌకర్యాలమధ్య కూడా రాయలసీమ నుంచి పరిమిత సంఖ్యలోనైనా ఇన్ని నవలలు రావడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ 7 దశాబ్దాల రాయలసీమ నవలల్ని పరిశీలిస్తే, కోస్తా ప్రాంతం నుంచి వచ్చినంత సంఖ్యలో గుర్తింపదగిన సామాజిక స్వభావం కలిగిన నవలలు రాయలసీమ నుంచి ఎక్కువగా రానిమాట వాస్తవమే. ఇందుకు రాయలసీమ అభివృద్ధిలోని వెనుకబాటుతనమే కారణం అనిపిస్తుంది."



డా. పొదిలి నాగరాజు
కడప.
ఫోన్ : 905 203 8569

# క్రోమోసోమ్ కథనమ్ – X & Y

– ము.పా.సా.

## ఘర్షణ

**X**q 28- xq Thanks for the genes mom. (1990లలో ఆడ, మగ స్వలింగ సంపర్కుల T షర్టుల మీద కనిపించన స్లోగన్).

భాష గురించి మాట్లాడే క్రమంలో మనం పరిణామవాద మనోవైజ్ఞానిక శాస్త్రం (ఎవల్యూషనరీ సైకాలజీ)లోకి ప్రవేశించాలి. "భాషాపరమైన, మానసికపరమైన విషయాలన్నీ జన్యుపరంగా ముందే నిర్ధాంతమైపోతాయి కాబోలు" అనుకున్నారు మీరు. కాని అది తప్పని చెప్పటానికే ఈ వివరణ. జన్యువులన్నీ కలిసి శరీర నిర్మాణానికి సహకరిస్తాయని మన అవగాహన. వాస్తవానికి, అవన్నీ, స్వాతంత్ర్యం ప్రకటించుకున్న చిన్నచిన్న ప్రదేశాలలాగ వ్యవహరిస్తాయి. పరస్పరం ఆధిపత్యం నిరూపించుకోవటానికి ప్రయత్నిస్తుంటాయి.

క్రోమోసోమ్ – 7 తర్వాత అతి పెద్దది X క్రోమోసోమ్. దీనిలో జతకట్టింది, దీనికి పూర్తిగా విరుద్ధమైన Y క్రోమోసోమ్. (mammals) లోని స్త్రీల లోనూ, పక్షుల్లోనూ 2 X క్రోమోసోమ్‌లుంటాయి.

X, Y క్రోమోసోమ్‌లను సెక్స్ క్రోమోసోమ్‌లనటం సబబే. స్త్రీ, పురుష నిర్ధారణ చేయాస్తయివి. అందరికీ, తల్లి నుండి సంక్రమిస్తుంది X క్రోమోసోమ్. కాని తండ్రి నుండి Y క్రోమోసోమ్ సంక్రమిస్తే పురుషుడిగానూ X క్రోమోసోమ్ సంక్రమిస్తే స్త్రీ గానూ మీ సెక్సు నిర్ణయమవుతుంది. ఈ పద్ధతికి మినహాయింపులు లేకపోలేదు. కాని అవి అత్యంత అరుదుగా సంభవిస్తాయి.

ఇదంతా స్కూలు బయాలజీ పుస్తకాల్లో వున్న సమాచారమే. రంగులలో తేడా చూడలేకపోవటం (కలర్ బ్లైండ్‌నెస్), గాయాలైనప్పుడు రక్తస్రావం ఆగకపోవటం (హెమోఫిలియా) మొదలైన లక్షణాలు కూడా X క్రోమోసోమ్ మనకు ప్రసాదించినవే. పురుషులలో ఒకటే X క్రోమోసోమ్ వుంటుంది గనుక, స్త్రీ వీళ్లలోనే లక్షణాలు (స్త్రీలకన్న) అధికంగా కనిపిస్తాయి.

అయితే X, Y క్రోమోసోమ్‌ల గురించి మనం తెలుసుకోవలసిన విషయాలు, ఆందోళన చెందవలసిన విషయాలు మరికొన్ని వున్నాయి. ప్రామాణిక శాస్త్రగ్రంథాలలో వీటి గురించి రాస్తూ 'యుద్ధం', విజేతలు – 'పరాజితులు', 'శత్రువులు' 'పలాయనం చిత్తగించిన DNA మాలెక్యూత్స' లాంటి పదాలుపయోగించారు. "Philosophical Transactions of the Royal Society" లాంటి ప్రచురణలు సామాన్యుల కోసం వుద్దేశించినవి కాదు. ఈ జటిలమైన విషయాలను సరశంగా వివరిస్తుంది మరో పుస్తకం Evolution : The Four billion year war (1996 : రచయితలు Majerus, M., Amos, W & Hurst, G.)

ఊహకు అందని గతకాలంలో జరిగిన మార్పులివి. సరీసృపాల గుడ్లలో, టెంపరేచర్ ఆధారంగా సెక్సు నిర్ణయించబడుతుంది. కాని ఒకదశలో, యిది జన్యు ఆధారంగా నిర్ణయించబడటం ప్రారంభమైంది. మనుషుల విషయంలో సెక్సును నిర్ణయించే జన్యువు ఆధారంగానే ఆడ, మగగా పుడుతున్నారని మనకు తెలుసు. కాని పక్షుల్లో ఈ పద్ధతి పూర్తి విరుద్ధంగా జరుగుతుంది. మగ సెక్సుకు ఆధారమైన జన్యువును కూడా ఆడ సెక్సుకు ఆధారమైన జన్యువు ఆకర్షించటంవల్ల పక్షులన్నింటిలోనూ బలమైన కండరాలు, పెత్తనం చలాయించే స్వభావం వగైరా వస్తాయి. వీటిని Sexually antagonistic genes అంటారు. దుప్పికి కొమ్ములు పెరగటానికి, తల్లిపాలలో కాల్షియం రావటానికి కూడా Y క్రోమోసోమ్ కారణం. అలా, తొలుత సాధారణ జన్యువులకు ఆశ్రయంగావున్న రెండు క్రోమోసోమ్‌లు (X, Y) సెక్సు నిర్ణేతలుగా, మిగతావాటికన్న భిన్నంగా మార్పుచెందాయి. Y క్రోమోసోమ్ మీద మగ సెక్సుకు సహకరించే జన్యువులూ X క్రోమోసోమ్ మీద ఆడ సెక్సును నిర్ణయించే జన్యువులూ వుంటాయి. ఇటీవల X క్రోమోసోమ్‌ను అంటిపెట్టుకొనివున్న DAX జన్యువు గురించి తెలిసింది. అరుదుగా కొందరు ఒక 'X' క్రోమోసోమ్, ఒక Y క్రోమోసోమ్‌తో జన్మిస్తారు. కాని వీళ్లలో 'X' క్రోమోసోమ్

మీద రెండు జతల DAX జన్యువులుంటాయి. ఫలితంగా, జన్యుపరంగా వీళ్ళు పురుషుడే అయినప్పటికీ సాధారణ స్త్రీలుగానే జన్మిస్తారు. Y క్రోమోసోమ్‌ను అంటిపెట్టుకుని వున్న SRY జన్యువు దీనికి కారణం కావచ్చు. (Y క్రోమోసోమ్‌కు మగ సెక్సును నిర్ణయిస్తుందని మనకు తెలుసు). పరస్పర వైరుధ్యాలున్న ఒక SRY ఒక DAX ను నిర్వీర్యం చేసినా, రెండు DAX లు కలిపి ఒక SRY ని నిర్వీర్యం చేస్తాయి.

జన్యువుల మధ్య వున్న వైరుధ్యాలు, శతృస్వభావం ప్రమాదకరమే. అంటే, జన్యువులన్నీ సమిష్టి లక్ష్యంతో శరీర నిర్మాణంలో పాల్గొనటం లేదు. X క్రోమోసోమ్‌కు మంచి చేసిన జన్యువులు, Y క్రోమోసోమ్‌కు అపకారం చేస్తాయి. మొత్తంమీద రెంటిమధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందన్నమాట.

ఉదాహరణకు X క్రోమోసోమ్‌కు మీది జన్యువులను తీసుకుందాం. వీటి దగ్గర X క్రోమోసోమ్ చేరవేస్తున్న వీర్యాన్ని నాశనం చేసే విషముంటుంది. అయితే (యితడికి) పిల్లలు పుట్టరని కాదు. కాని అందరూ ఆడపిల్లలే అయివుంటారు – మగపిల్లలు మాత్రం పుట్టరు.

క్రోమోసోమ్‌ల లైంగిక వైరుధ్యాల గురించి పరిశోధనలు చేసినవాళ్లలో ముఖ్యుడు యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన విలియం రైస్. ఈయన ప్రకారం పురుష లక్షణాలకు ఆలవాలం Y క్రోమోసోమ్ (ఎందుకంటే యిది స్త్రీలలో వుండదు). అంతేకాదు స్త్రీలకు వుండకూడని లక్షణాలను యివి పోగుచేసుకుంటూ వుంటుంది. పళ్లమీద వాలే ఈగల మీద పరిశోధనలు చేసి ఈయన మరికొన్ని విషయాలు తెలుసుకొన్నారు. వీర్యంలో (జన్యువుల వుత్పత్తి ఫలితమైన) ప్రొటీన్‌లుంటాయి. సంభోగ ప్రక్రియ తర్వాత యివి స్త్రీ రక్తంలో ప్రవేశించి, మెదడుకు చేరుకుని సెక్సు కోరికను వుపశమింపచేస్తాయి. అలాగే, అండోత్పత్తి వేగం పెంచుతాయి. "వీర్యం, స్త్రీల ప్రవర్తన మీద ప్రభావం చూపించటమేకాదు, అది ఆడ ఈగల పట్ల విషంగా కూడా పనిచేస్తుంది" అంటాడు రైస్.

లైంగిక వైరుధ్యం అన్ని జీవజాతుల్లోనూ వుందంటాడీయన. పురుషుడు, అనేకమందిలో ఒక స్త్రీని ఎంపిక చేసుకొంటున్నాడంటే, అది లైంగిక వైరుధ్యానికే చిహ్నమంటాడు రైస్. ఈ భూగోళం మీద సామాజిక జీవితం గడుపుతున్న, పరస్పరం అభిప్రాయాలు వ్యక్తపరచుకోగలిగిన సామర్థ్యం ఎక్కువగా వున్నవి మానవ జాతిలోనే. మరి ఎందుకు సంబంధాలు అత్యంత సంక్లిష్టంగా పరిణమించాయీ జాతిలో! ఎందుకింత అసంతృప్తి? దీనికి ఒకే కారణం కనిపిస్తుంది. సెక్సు సంబంధాలను నిర్ణయించేది మన యిష్టాయిష్టాలు కాదు. క్రోమోసోమ్‌ల ప్రవర్తన ఈ విషయాల్లో మన ప్రవర్తనను, స్వభావాలను శాసిస్తుంది.

ఇక, అత్యంత వివాదాస్పదమైన మరో జన్యు ఆవిష్కరణ గురించి మాట్లాడుకుందాం. 1993లో X క్రోమోసోమ్ మీది ఒక జన్యువు లైంగిక ప్రవర్తనమీద ఎక్కువ ప్రభావం చూపుతున్నదని తెలుసుకున్నాడు డేవిడ్ హేమర్. మీడియావాళ్లు వెంటనే ఈ జన్యువుకు "గే (gay) జీన్" అని పేరుపెట్టారు. స్వలింగ సంపర్కం పట్ల యిష్టం కలగటం కొందరి శరీర స్వభావమన్న భావన బలపడుతున్న రోజులివి. స్వయంగా స్వలింగ సంపర్కులైన కొందరు శాస్త్రజ్ఞులు ఉదా: మ్యారో సైంటిస్ట్, సైమన్ లీవే కూడా ఈ రంగంలో పరిశోధనలు చేశారు. కొందరికి యిది సహజసిద్ధంగా వస్తుందని అవగాహన పెంపొందించటం ద్వారా, "గే"ల పట్ల వున్న ఏహ్యాభావం కొంతవరకన్నా తగ్గుతుందనుకున్నారు. మొత్తంమీద హోమోసుక్సువాలిటీ ఒక వారసత్వ లక్షణమని నిర్ద్వంద్వంగా నిరూపించబడింది. అయినప్పటికీ ఈ విషయాలన్నీ అర్థం చేసుకోవటం కొంచెం కష్టమే. ఒకరిద్దరు మగపిల్లల తర్వాత పుట్టిన పిల్లాడు 'గే' కావటానికి ఎక్కువ అవకాశముందని తెలుసుకొన్నారు. (అంటే, తమ్ముళ్ళు మాత్రమే వున్నా, ఆడపిల్లల తర్వాత పుట్టినా 'గే' అయ్యే అవకాశాలు తక్కువ). కాని స్వలింగ సంపర్కులైన (లెస్బియన్) మహిళలకు ఈ వివరణ వర్తించదు.

జన్యువులన్నీ పరస్పరం తగువులాడుకుంటాయనీ, జీనోమ్ అనబడేది ఒక యుద్ధ యుగమనీ, యిటీవలే గ్రహించారు. ఇదంతా Evolutionary Biologists కృషి ఫలితమే. జీవశాస్త్ర పునాదులను కదిలించి వేసిన వాస్తవమిది.

## క్రోమోసోమ్ కథనమ్ – 8

## స్వప్రయోజనం

**మ**నం సజీవ యంత్రాలం. జన్యువులు అనబడే స్వార్థపరమాలెక్యూల్స్‌కి నివాస యోగ్యమైన రోబో యంత్రాలు ఈ శరీరాలు. వాస్తవాన్ని యిప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నాం.

రిచర్డ్ డాకిన్స్ (ది సెల్ఫిష్ జీన్ రచయిత) ఏదైనా కొత్త gadget కొంటే, దాని వెంట ఒక ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్ యిస్తారు. అది చదివి అర్థంచేసుకోవటం ఎంత కష్టమైనా అందరికీ తెలుసు. ఒక్క విషయమూ స్పష్టంగా, సరళంగా రాయరందులో. మనం కొన్నది 'మేడిన్ చైనా' వస్తువైతే సమస్య మరింత సంక్లిష్టమవుతుంది. చైనీస్‌లో రాసిందాన్ని ఇంగ్లీషులోకి అనువాదం చెయ్యాలాయె మరి. ఇంతకూ ఈ హెచ్చరికలన్నీ ఎందుకంటే మనం హ్యూమన్ రెటినో బ్లాస్టోమా జన్యువు గురించి మాట్లాడుకోబోతున్నాం. ఇరవై ఆరు పేజీల అప్రస్తుత సమాచారం మధ్య దాగిన ఇరవై ఏడు చిన్న పేరాగ్రాఫుల జన్యువు యిది.

"ఏడు సముద్రాలు దాటిన తర్వాత, చీమలు దూరని చిట్టడవిలోని ఒక మర్రిచెట్టు తొర్రలో దాగుంది రహస్యం" అన్నట్టుగా జీనోమ్‌ను ఎవరికీ ఓ పట్టాన అర్థంకానంత సంక్లిష్టంగా తయారుచేసింది ప్రకృతి. జన్యునిర్మాణం యింత సంక్లిష్టంగా వుండనవసరం లేదు. Exons అనబడే పేరాగ్రాఫుల్లో మాత్రమే దీన్ని చదవగలం. పైగా ఈ పేరాగ్రాఫుల మధ్య Lutrons అనబడే నాన్సెన్స్ బోలెడంత వుంటుంది. కొన్ని ఇంట్రాక్స్‌లో మాత్రం కొంత ముఖ్య సమాచారం దాగివుంటుంది.

ఈ వ్యవహారమంతా యింత గందరగోళంగా వుండటానికి ముఖ్యకారణం జీనోమ్ తన పుస్తకం తను రాసుకోవటమే (ఈ రచనా ప్రక్రియ నాలుగు బిలియన్ సంవత్సరాలకు పైగా కొనసాగింది). ఇలా నిరంతరంగా కొనసాగిన క్రమంలో కొంత సమాచారం అనేకసార్లు రాయబడింది. ఈ పునశ్చరణే జీనోమ్ పఠనాన్ని క్లిష్టతరం చేస్తున్నది. ఉదాహరణకు ఎవరైనా ఎయిర్‌పోర్ట్‌లో బాంబు పెట్టామని బెదిరింపు కాల్ వచ్చిందనుకోండి. బాంబు లేకపోయినా వెదకటంలోనే కొన్ని గంటలు వృథా అవుతుంది. కొన్ని వందలమంది యిబ్బందిపడతారు. ఇదీ అంతే. ఏ పేరాగ్రాఫులో ఏముందోననే భయంతో మొత్తం చదవక తప్పదు.

జీనోమ్ అంటే జన్యువులు అనే అర్థంలో మనం యిప్పటివరకూ చదువుకున్నాం. ప్రొటీన్ రెసిపిలున్న DNAలే జన్యువులు. అయితే జీనోమ్‌లో వున్నవన్నీ నిజమైన జన్యువులు కావు. ఇందులో కొంత Junk DNA (చెత్త DNA) కూడా వుంటుంది. (అంటే సూడోజీన్స్, రెట్రో సూడోజీన్స్, సేట్‌లైట్స్, మిని సేట్‌లైట్స్, మైక్రోసేట్‌లైట్స్, ట్రాన్స్‌పాసాన్స్, రిట్రోనిట్రాన్స్‌పాసాన్స్ వగైరాలను జంక్ DNA గా గుర్తిస్తారు.) ఈ Junk DNA కే మరో పేరు సెల్ఫిష్ DNA. ఈ DNA ను ప్రొటీన్ భాషలో రాయటం వీలుపడదు. అన్ని క్రోమోసోమ్‌లమీదా వుంటుంది జంక్ DNA. నిజానికి DNA వేలిముద్రల ప్రక్రియకు దోహదం చేసింది ఈ జంక్ DNA.

జన్యువులంటే ప్రొటీన్ రెసిపిలని చదువుకున్నాం. కాని అన్ని రెసిపిలూ వుపయోగకరమైనవి కావు. హ్యూమన్ జీనోమ్‌లో వున్న అత్యంత సాధారణమైన ప్రొటీన్ రెసిపి పేరు రివర్స్ ట్రానిస్క్రిప్టేస్. దీనివల్ల శరీరానికి పెద్దగా వుపయోగం లేదు. దీన్ని శరీరం నుండి పూర్తిగా తొలగించటం సాధ్యపడితే (సాధ్యపడదు. అది వేరేవిషయం) వ్యక్తి జీవితకాలం పెరుగుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ రివర్స్ ట్రానిస్క్రిప్టేస్, కొన్ని రకాల పరాన్నభుక్కులకు చాలా అవసరం. AIDS వైరస్ జీనోమ్‌లో వుండే ముఖ్య భాగం యిదే. దీనివల్ల శరీరానికి ఎప్పుడు ఏ ముప్పు వాటిల్లుతుందో తెలియదు. మానవ క్రోమోసోమ్‌లలో ఈ రివర్స్ ట్రానిస్క్రిప్టేస్ వేలాది ప్రతులుగా వ్యాపించివుంది. దీని గురించి మరో ఉదాహరణ కూడా చెప్పుకోవచ్చు. కార్లెందుకున్నాయి? దొంగలు పారిపోవటానికా, దొంగల్ని పట్టుకోవటానికా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే రివర్స్ ట్రానిస్క్రిప్టేస్ గురించి తెలుసుకోవాలి. ఈ జంక్ DNA ఒక జన్యువుకు చెందిన RNA ప్రతిని తీసుకొని, DNA గా మార్చి తిరిగి దాన్ని జీనోమ్‌లోనికి ప్రవేశపెడుతుంది. ఉదాహరణకు ఈ ప్రక్రియవల్ల AIDS వైరస్ తన జీనోమ్‌ను, హ్యూమన్ జీనోమ్‌లో లీనం చేయగలదు. అలా దాని పునశ్చరణ ప్రారంభమవుతుంది. ఇలాగ రివర్స్ ట్రానిస్క్రిప్టేస్ వల్ల ప్రవేశపెట్టబడిన వేలాది వైరల్ జీనోమ్‌లు మనలో వున్నాయి. (అంటే హ్యూమన్ జీనోమ్‌లో ఈ human endogenous retroviruses (Herves) 13% వరకూ వుంటాయి). ఇంతేకదా అనుకుంటున్నారా? 'మంచి' జన్యువులు కూడా 3% కన్నా ఎక్కువేమీ లేవు. మనం కోతులకే కాదు, వైరస్‌లకు కూడా వారసులమే.

ఈ వైరల్ జీనోమ్ అన్నీ విసర్జించినా, రివర్స్ ట్రానిస్క్రిప్టేస్‌ను మాత్రం వదలదు. అలా ఆవిర్భవించిన ఈ కొత్త పరాన్నభుక్కు మనిషి నుండి మనిషికి గాక, తరం నుండి తరానికి సంక్రమిస్తుంది. జన్యు పరాన్నభుక్కుకు యింతకన్న మంచి ఉదాహరణ మరేముంటుంది! రిట్రో ట్రాన్స్‌పాసాన్స్‌లో మనకు అతి సాధారణంగా కనిపించే అక్షరాలు LINE-I.

ఇది DNA లోని ఒక పేరాగ్రాఫు. దీని పొడవు 1000 నుండి 6000 అక్షరాలు. వీటిమధ్యన వుంటుంది రివర్స్ ట్రాన్స్క్రిప్టేస్. LINE-I ల లక్షప్రతులు కూడా జీనోమ్‌లో వుండే అవకాశముంది – అంటే 14.6%. వీటి సంఖ్య, మంచి జన్యువుకన్నా అయిదురెట్లు ఎక్కువ అని తెలిసిపోతూనేవుంది. “పెద్ద చేపలు చిన్న చేపల్ని తింటాయి. చిన్న చేపలు యింకా చిన్న చేపల్ని తింటాయి” అన్నట్టుగా వుంటుందీ LINE-I వ్యవహారం. అనేక ప్రతులుగా ఎదిగిన ఈ జంక్ DNA ఒక పెద్ద పరాన్నభుక్కు.

LINE-I కన్న చిన్న పేరాగ్రాఫుల్ని Alu అంటారు. ఒక్కొక్క Alu లో 180 నుండి 200 అక్షరాలుంటాయి. ఇవికూడా యితర రివర్స్ ట్రాన్స్క్రిప్టేస్ ఆధారంగా తమ సంఖ్యను పెంచుకొంటూనే వుంటాయి. కొన్నిసార్లు ఈ Alu 10 లక్షలసార్లు కూడా రిపీట్ అవుతుంది. అంటే జీనోమ్ పుస్తకంలో 10% అన్నమాట.

మంచి జన్యువు నుండి Alu ను గుర్తించటం చాలా కష్టం. జీనోమ్‌లో పెరిగే వైరస్ యించుమించు కంప్యూటర్ వైరస్‌లాగే వుంటుంది. జంక్ DNA, మంచి జన్యువులను ఆహారంగా చేసుకొని అతి త్వరగా ఎదిగి జీనోమ్ అంతా వ్యాపిస్తుంది. అంటే మనందరం డిజిటల్ అక్షరాల మూలలమే. హ్యూమన్ DNA లో సుమారు 35% జంక్ DNA వుంటుంది. అంటే జన్యువులు పునశ్చరణ కావటానికి 35% ఎక్కువ శక్తి అవసరమవుతుంది.

మొదటిసారి జీనోమ్‌ను చదివినప్పుడు యిలా వుంటుందని ఎవరూ ఊహించలేదు. ఒక శరీరంలోని జన్యువుల మధ్య యిలా నిరంతరంగా అంతర్యుద్ధం కొనసాగుతుందా! కొన్ని జన్యువులు, యితర జన్యువుల మీద పరాన్నభుక్కులుగా బతుకుతున్నాయి. జంతువుల జీర్ణాశయాల్లో పురుగులుంటాయి. రక్తంలో బాక్టీరియా, Cell లో వైరస్‌లుంటాయి. మరి, జన్యువుల్లో రెట్రో ట్రాన్స్‌పాన్స్ మాత్రమెందుకు వుండవు?

1970 ల నాటికి, ఇవల్యూషనరీ బయాలజిస్టులకీ విషయాల గురించి కొంత స్పష్టత వచ్చింది. “జీవజాతుల పరిణామం వాటి మధ్య పోటీవల్ల జరగలేదు. 'Survival of the fittest' ప్రధాన కారణం కాకపోవచ్చు. జన్యువులు కొన్నిసార్లు వ్యక్తుల్నీ మరికొన్నిసార్లు మానవ సమూహాల్ని లేదా సమాజాల్ని తమ యుద్ధశకటాలుగా చేసుకొని ఒకదానితో ఒకటి తలపడటంవల్ల (పరిణామం) జరిగింది.” ఉదాహరణకు మనుషులైనా, జంతువులైనా పిల్లల్ని కనదలచుకోకపోతే హాయిగా, ఆరోగ్యంగా, దీర్ఘకాలం బతకవచ్చు. కాని సంతానోత్పత్తి జరగక తప్పదన్నట్టుగా ప్రవర్తిస్తాయి జీవులు. పిల్లల్ని కనటంలో రిస్కువుంది. ప్రమాదం పొంచివుంది. ఆరోగ్యం పాడుకావచ్చు. అయినా ప్రాణం పోయినా సరే పిల్లల్ని కంటామంటాయి (మొక్కలు కూడా యిందుకు మినహాయింపు కాదు). నిజానికి సంతానోత్పత్తి వయస్సు తర్వాత శరీరం బలహీనపడిపోతుంది. స్కిడ్, పాసిఫిక్ సేమన్ లాంటి చేపలు పిల్లల్ని కన్న వెంటనే మరణిస్తాయి. ఇదంతా జన్యువుల హోరాహోరీ యుద్ధ ఫలితమే. శరీరం గురించి కాదు. తమ వునికి గురించే వాటి పోరాటం. పరిణామ క్రమమంటే జన్యుపరిణామమేనని తొలిసారి గ్రహించారు శాస్త్రజ్ఞులు.

జీనోమ్‌లో కొన్ని జన్యువులు లేని ప్రాంతాలున్నాయి. దీనికి వివరణ యిస్తూ కొందరు “ఇక్కడ సెల్ఫిష్ జన్యువులుంటాయి. తన మనుగడతప్ప వీటికి వేరే ప్రయోజనం లేదు అన్నారు”. 1980లో ఈ ఆవిష్కరణ జరిగినప్పుడు యితర శాస్త్రజ్ఞులు దీన్ని అర్థరహితమైన వాదన అన్నారు. “జీనోమ్‌లో వున్న జన్యువులన్నింటికీ ఏదో ప్రయోజనం వుండాలి. కేవలం స్వంత మనుగడ మాత్రమే కాదు” అన్నది వాళ్ళ నమ్మకం. జన్యువులకు స్వంత లక్ష్యాలు, స్వంత ప్రయోజనాలుంటాయనేది నాన్‌సెన్స్. కాని తరువాతి పరిశోధనల్లో ఈ సెల్ఫిష్ జన్యువులకు స్వంత ప్రయోజనమే తప్ప మరేమీ లేదని నిరూపితమైంది.

సెల్ఫిష్ DNA ఒక్క దగ్గర నిలకడగా వుండదు. ఒకచోటినుండి మరొకచోటికి ప్రయాణిస్తుంది. తనను తాను కాపీ చేసుకుంటూ వ్యాపిస్తుంది. మంచి జన్యువుల మధ్యకు చేరివాటిని గందరగోళపరుస్తుంది. జన్యువిభజన (Mutation)కు కారణమవుతుంది. బార్బరాం మాక్లింటాక్ అనబడే జెనెటిసిస్ట్ 1940లలోనే ఈ విషయం ఆవిష్కరించింది (1983లో ఈవిడకు నోబెల్ బహుమతి వచ్చింది).

(ఇంకావుంది)

(Matt Ridley రచన ఆధారంగా)

తెలుగు : ము.పా.సా.

హైదరాబాదు.

ఫోన్ : 917 767 8708

# కురుక్షేత్రం

*– సాయి పాపినేని, జయశ్రీ నాయని*

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యద్యాత్మవిదులు వేదాంతమనియు, నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవివృషభులు మహాకావ్యమనియు, లాక్షణికులు సర్వలక్షణ సంగ్రహమని, ఐతిహాసికులితిహాసమనియు బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్ఛయంబని, మహిగొనియాడు...

**భా**రతం ఎలాంటిదయ్యా అంటే, ధర్మం, నీతి, వేదాంతం, పురాణసారం వీటిలో ఎవరికి కావల్సింది వారికి అందించే కావ్యసంహిత. ఒక్కమాటలో చెప్పాలంటే భారతీయ సంస్కృతికి ఎన్సైక్లోపీడియా వంటిది. శ్రుతి, స్మృతి, పురాణాల్లో ఏ సందేహం వచ్చినా తీర్చేది భారతమే! నేటికీ సమాజంలో మంచి చెడ్డలు నిర్ణయించాలంటే భారతాన్నే ప్రామాణికంగా తీసుకొనేటంతగా మన భారతీయుల జీవనవిధానంతో ముడివేసుకుపోయింది.


ఈ మహాభారతం వేదవ్యాస ప్రణీతం. 8800 శ్లోకాలతో కూడిన 'జయ' అనేది దీని మొదటి పేరు. తరువాత అది 24000 శ్లోకాలతో కూడి 'భారతం' అయింది. నేటికి మరింత పరిపుష్టమై లక్షకు పైగా శ్లోకాలతో 'మహాభారతం' అయింది.

వేదవ్యాసుడు భారతయుద్ధానికి సమకాలీనుడైతే, 8800 శ్లోకాలలో ఇమిడిన 'జయ' అంటే నేడు లభ్యమౌతున్న గ్రంథంలో తొమ్మిది శాతం మాత్రమే అతడు రచించిన మూలకథ అనుకోవాలి. సుమారు మూడువేల సంవత్సరాల పాటు, రాజకీయ, సామాజిక, ఆర్థిక, మత వ్యవస్థల్లో వచ్చిన మార్పులు ఎప్పటికప్పుడు భారతంలో ప్రక్షిప్తాలుగా చేరుతూవచ్చాయి. ఏది మూలవమో, ఏది ప్రక్షిప్తమో తేల్చుకోవడం సులభమేమీ కాదు. కానీ ధర్మార్థ కామ మోక్షాలకు, వర్ణాశ్రమ నియమాలకూ సంబంధించిన వ్యాఖ్యానాలనూ, స్థల, వన, క్షేత్ర మాహాత్మ్యాలనూ, నీతిబోధలనూ, ఉపాఖ్యానాలనూ పక్కనపెట్టి, భారతయుద్ధానికి దారితీసిన రాజకీయ నేపథ్యాన్ని, కారకులైన వ్యక్తుల యొక్క వారితో ప్రాథమిక వైవాహిక సంబంధాలు నెరపిన ముఖ్యపాత్రల యొక్క వృత్తాంతాలను మాత్రమే మూలకథగా గ్రహిస్తే, వేదవ్యాసుడి మూలభారతాన్ని కొంత దగ్గరనుండి చూడవచ్చు.

భారత యుద్ధకాలం గురించి చరిత్రకారుల్లో నెలకొని ఉన్న వాదోపవాదాలనూ, పురాణ వాఙ్మయంలోని సూచనలనూ, పురాతత్త్వ అన్వేషణల్లో వెలుగుచూసిన అనేక అంశాలనూ పరిశీలించి, అది క్రీపూ. 15వ శతాబ్దిలో జరిగిన పరిణామంగా ప్రతిపాదించాము (**మిసిమి** ఫిబ్రవరి, 2015). క్రీ.పూ. 1400 తుది హరప్పా పురాతత్త్వ సంస్కృతులకి చివరి స్తరం. ఆ తరువాత మరో ఆరొందల యేళ్ళు ప్రాచీన భారత నాగరికతకి చీకటి యుగం. ఇతిహాస పురాణ సంప్రదాయంలోని ద్వాపర యుగ క్షత్రియ చరిత్రల్లో, ఆనాటి నాగరికత పరిధులనూ, పతనానికి దారితీసిన సంఘటనలనూ సూచించే అంశాలు కొన్ని కనిపిస్తాయి.

### తుది హరప్పా యుగం :

త్రేతాయుగాంతానికి ఐక్ష్వాకుల సామ్రాజ్యం అంతమైంది. క్రీ.పూ. 2000 నాటికి పరిణత హరప్పాయుగం విచ్ఛిన్నమైంది. పర్యావరణంలో వచ్చిన మార్పులు, క్షీణించిన విదేశీ వాణిజ్యం, ఈ నగరాల పతనానికి ముఖ్యకారణాలుగా తోస్తాయి. అయితే హరప్పా సంస్కృతి ఒక్కసారిగా అదృశ్యమవలేదు. పరిణత హరప్పాయుగంలో కనిపించే ఏకీకృత వ్యవస్థనుండి విడిపడిన ప్రాంతీయ సంస్కృతులు పుట్టాయి. భేదాలు ఎన్నైనా వీటిలో కనిపించే హరప్పా వాస్తు సంస్కృతి వారసత్వంవల్ల, పురాతత్త్వ శాస్త్రజ్ఞులు వీటిని 'తుది హరప్పా సంస్కృతులు' అని వ్యవహరించారు. మూలస్థానమైన మధ్యసింధు, దిగువ సరస్వతీ మైదానాల్లో నాగరికత క్షీణించినా, పరిధుల్లో కొత్త పట్టణాల నిర్మాణం, గ్రామీణ వ్యావసాయక సమాజాల విస్తరణ కొంతవరకూ కనిపిస్తుంది. క్రీ.పూ. 2000 నుండి 1400 వరకూ ఆరు శతాబ్దాల కాలం




కొనసాగిన తుదిహరప్పా యుగం, వంశానుక్రమణికల్లోని ద్వాపరయుగానికి సరితూగుతుంది. ఇతిహాసపురాణ సంప్రదాయంలో ద్వాపరయుగానికి చెందిన చిన్నచిన్న రాజ్యాలు, వాటి భౌగోళిక పరిధులు, మధ్యయుగంనాటి ఫ్యూడల్ రాజకీయ వ్యవస్థని ప్రతిబింబిస్తాయి.

తుదిహరప్పాయుగానికి చెందిన నాలుగు భిన్నమైన వాస్తు సంస్కృతులు కూడా, నిర్దిష్టమైన భౌగోళిక పరిధుల్లో కనిపిస్తాయి. వీటిలో సరస్వతీ యమునలు కేంద్రంగా 'హరప్పా H స్మశాన' సంస్కృతి, సౌరాష్ట్రలో 'రంగ్పూర్' సంస్కృతి, దిగువ సింధు, బలుచిస్తాన్ ప్రాంతాల్లో 'ఝుకర్' సంస్కృతి, ఎగువ సింధు, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లోని 'గాంధార సమాధుల' సంస్కృతి ముఖ్యమైనవి. ఇవిగాక, హరప్పా సంస్కృతి నుండి గాక స్వతంత్రంగా ఎదిగిన స్థానిక వ్యావసాయక సమాజాలున్నాయి. ఇవి ఆరావళీ శ్రేణిలో 'అహర్-బానస్' సంస్కృతి, వింధ్య ప్రాంతంలో 'సవల్దా', 'మాల్వా' సంస్కృతులు, గంగా మైదానంలో 'జేగురురంగు' పాత్రలు, దక్షిణాదిలో 'బృహచ్ఛిలా' సంస్కృతులు. వీటిలో చారిత్రక యుగానికి చెందిన లక్షణాలు కొన్ని కనిపిస్తాయి. నిర్ధారిత ఆధారాలు లేకున్నా, తుదిహరప్పా సంస్కృతులను వివిధ వంశాల రాజ్యాలుగా భావిస్తే, నాగరికత పరిధుల వెలుపల కనిపించే స్థానిక సమాజాలను మహాభారత నేపథ్యంలోని నాగ, గరుడ, యక్ష జాతులుగా ఊహించవచ్చు. వంశానుక్రమణికల్లోని రాజ్యాల వర్ణనలనూ, పురాతత్వ సంస్కృతుల భౌగోళిక పరిధులను బట్టి, ఆయుగంలోని రాజకీయ విభాగాలను వివరించవచ్చు.

### కురుక్షేత్రం :

భౌగోళికంగా కురుక్షేత్రం భారతేతిహాసానికి మూలస్థానం. హరప్పా నాగరికత నేపథ్యంలో ఇనుము వాడకంలోకి రాలేదు. దట్టమైన అడవులను కొట్టి వ్యవసాయం విస్తరించేందుకు ఇనుప గొడ్డలి అవసరం కనుక కాంశ్యయుగ

## తుదిహరప్పా పట్టణాలు - ద్వాపరయుగంలోని రాజకీయ విభాగాలు


| తుదిహరప్పా సంస్కృతి (క్రీపూ. 2000 - 1400) | గ్రామీణ ఆవాసాలు | ముఖ్య పురాతత్వ స్థావరాలు | ద్వాపరయుగ జనపదాలు, రాజధానులు |
|---|---|---|---|
| H స్మశాన సంస్కృతి (ప) | <20 | హరప్పా, కుడ్వాలా | అయోధ్య, విదేహ |
| H స్మశాన సంస్కృతి (తూ) | >560 | బన్వాలి, రూపర్, భగవాన్పుర్, మిరాతల్, ఆలంగిర్పూర్, | కురు, ఉ.పాంచాల, ద.పాంచాల, పౌరవ, ద్వీమీఢ, మద్ర, కేకేయ, విరాట |
| ఝుకర్ సంస్కృతి | <50 | ఝుకర్, చన్హుదారో, అమ్రీ | సింధుసౌవీర, ఆనవ |
| గాంధార సమాధుల సంస్కృతి | <10 | అలిగ్రామ | గాంధార |
| రంగ్పూర్ సంస్కృతి | >520 | ద్వారక, సుర్కోటడ, రోజ్డి, రంగపూర్, భగత్రవ్, దిమాపూర్ | వృష్ణి, అంధక, అనర్త, భోజ, విదర్భ |

నాగరికతలు వర్షాభావ ప్రాంతాల్లోని నదీలోయలకే పరిమితమై కనిపిస్తాయి. పురాతత్వ ఆధారాలనుబట్టి, క్రీ.పూ. 1900కి హరప్పా నగర జీవనం పతనమై, ఆ శిధిలాలపైన ఒక తక్కువ స్థాయికి చెందిన సంస్కృతి స్తరం కనిపిస్తుంది. నగర వాస్తు పాటించక చెదురుమదురుగా కట్టిన గృహసముదాయం, దిగజారిన పారిశుద్ధ్య వ్యవస్థ, ముద్రలూ తూకపురాళ్ల వాడకం తగ్గిపోవడం మొదలైన అంశాలు నాగరికత పతనావస్థను సూచిస్తాయి. పురాతత్వ శాస్త్రజ్ఞులు ఈ స్తరానికి, 'సిమెట్రీ H' సంస్కృతి అని పేరుపెట్టారు. తుదిహరప్పాయుగంలో ఈ సంస్కృతి పంజాబ్, హర్యానా, ఉత్తర రాజస్తాన్ ప్రాంతాల్లో విస్తరించి కనిపిస్తుంది.

క్రీ.పూ. 2000 నుండి 1400 వరకూ పశ్చిమ పంజాబ్ ప్రాంతంలో ఆవాసాల సంఖ్య తగ్గిపోయి, తూర్పున సత్లూజ్, యమునల మధ్య ప్రాంతంలో పెరిగింది. పరిణత హరప్పాయుగంలో 50కి మించని స్థావరాలున్న ఈ ప్రాంతంలో, తుదిహరప్పా యుగంలో 560 పైగా గ్రామీణావాసాలు గవేషణల్లో వెలుగుచూసాయి. దాదాపు 20కి పైగా స్థావరాలు, హస్తకళలకూ వ్యవసాయోత్పత్తులకూ పునఃపంపిణీ కేంద్రాలుగా, చెప్పుకోదగ్గ పెద్ద పట్టణాలుగా ఎదిగాయి. వీటిలో పంజాబ్లో సత్లూజ్ తీరంలోని రూపర్, హర్యానాలోని బన్వాలీ, యమున గట్టున భగవాన్పూర్, ఆలంగిర్పూ.ర్, మితాతల్ ముఖ్యమనవి. సంప్రదాయకంగా, కురు జనపదం సరస్వతీ తీరంలో, పాంచాల జనపదాలు యమునకి కుడియెడమలుగా చెప్పబడ్డాయి. నేడు కొత్తఢిల్లీకి వాయవ్యంగా హర్యానాలోని కురుక్షేత్ర పట్టణమే నాటి కురు పాంచాల జనపదాలకీ మధ్యనున్న యుద్ధభూమి అన్న విషయం వాస్తవానికి దగ్గరగా తోస్తుంది.

### హస్తినాపురం :

ప్రొ. B.B. లాల్ మొదలైన పురాతత్వవేత్తలు కొన్ని జైన తీర్థాల స్థానిక ఐతిహ్యాలను బట్టి, గంగా తీరంలో రెండవ పట్టణీకరణ దశలోని ఇనుపయుగానికి చెందిన స్థావరాలను హస్తినాపురం, కాంపిల్యం, అహిచ్ఛత్రం వంటి నగరాలుగా సూచించారు. ఈ స్థావరాలు క్రీ.పూ. 800 తరువాతి కాలానికి చెందినవి. ఒకవేళ పటంలో సూచించిన నగరాలే భారత గాథకి రంగస్థలంగా భావిద్దామంటే, మరో చిక్కుముడి ఉంది. భారతయుద్ధం మౌలికంగా కురు పాంచాల సంఘటనాల మధ్య సరస్వతీ తీరంలోని కురుక్షేత్రంలో జరిగింది. నేటి కురుక్షేత్రం ఈ రెండు జనపదాలకూ మధ్య గాక వాటికి ఉత్తరంగా ఉంది. రెండు రాజ్యాల మధ్య యుద్ధం ఆ రెంటి మధ్య జరగాలి కానీ, దూరంగా మరోచోట కాదు.




పైగా హస్తినాపురం భారతయుద్ధానంతరం (క్రీపూ. 1400) పతనమైందని సంప్రదాయం. గంగా మైదానంలో క్రీ.పూ. 800కు ముందు నగర నిర్మాణ ప్రక్రియ కనిపించదు కనుక యమునకి తూర్పు ప్రాంతాన్ని మహాభారత రంగస్థలంగా నిర్ధారించలేము.

ఇతిహాస పురాణ సంప్రదాయంలో సగరుని జైత్రయాత్ర అనంతరం భరత భారధ్వాజ వంశానికి మూలపురుషుడైన దుష్యంతుడు సరస్వతీ ఎగువ ప్రాంతాల్లో వలస రాజ్యం స్థాపించినట్లు (**మిసిమి** నవంబర్, 2015) చెప్పుకున్నాం. భరతుని వారసులలో హస్తి (క్రీ.పూ. 2250) పేరున హస్తినాపురం నిర్మించబడిందని ఐతిహ్యం. హస్తి సంతానంలోని ద్విమీఢుడు భారత యుద్ధకాలంలో కనిపించే పౌరవ, ఉత్తర దక్షిణ పాంచాల రాజులకు మూలపురుషుడు. మరో కొడుకు అజామిఢుడు కురు వంశానికి ఆద్యుడు. వీరందరూ దశరాజ్ఞ యుద్ధంలోని సుదాసునికి సమకాలీనులై ఉండవచ్చు. పట్టికలోని కాలనిర్ణయాన్నిబట్టి పౌరవులలోని చీలికలకు, సుదాసుని విజయమూ, పెరిగిన ఐక్ష్వాకుల ప్రాభవం కారణాలుగా ఊహించవచ్చు.

బన్వాలీ ప్రాంతంలో హరప్పా స్థావరాలు

| | స్థలం | విస్తీర్ణం (హెక్టేర్లు) | జనాభా |
|---|---|---|---|
| 1 | బన్వాలి | 240 | 45000 |
| 2 | ధాలెవాన్ | 150 | 20000 |
| 3 | గుర్నీ కలన్ I | 143 | 20000 |
| 4 | లక్ష్మీర్వాలా | 225 | 40000 |
| 5 | బాగిలన్ ద తెహ్ | 100 | 15000 |
| 6 | హాసన్‌పూర్ II | 100 | 15000 |
| | మొత్తం జనాభా (అంచనా) | | 155000 |

Joshi J.P., M. Bala & J. Ram, 1984, **The Indus Civilization: A Reconsideration on the Basis of Distribution Maps**, *FIC*, pp. 511-30

భరధ్వాజుల రాజధాని, అహిచ్ఛత్రం, ద్రుపదుని రాజధాని కాంపిల్యం, ఈ రెండూ ఒకప్పటి భరతుని వలస రాజ్యంలో భాగాలే. కనుక ఈ పట్టణాలను కూడా కురుక్షేత్రం దాపులలో ఊహించడం సమంజసం.

కురుక్షేత్ర పట్టణానికి వందమైళ్లు పశ్చిమంగా వెలుగుచూసిన బన్వాలీకి దగ్గరలో హరప్పా సాంస్కృతిక సముదాయంతో కప్పబడిన మరో ఐదు పెద్ద దిబ్బలను గుర్తించారు. దిబ్బల వైశాల్యాన్ని బట్టి ఇండ్ల సంఖ్యనూ, జనాభాలను అంచనా వేయవచ్చు. అదే కురుక్షేత్రకి తూర్పు-ఆగ్నేయాల్లో, నేటి ఢిల్లీకి దగ్గరలో యమునానదిపై ఆలంగిర్పూర్, భగవాన్పూర్, మితాతల్ గాక మరికొన్ని హరప్పా యుగానికి చెందిన పట్టణాల ఆనవాళ్లున్నాయి. నేటి కురుక్షేత్ర పట్టణానికి వందమైళ్ళ పరిధిలో కనిపించే ఈ నాగరికత క్రీ.పూ. 1400 ప్రాంతంలో అంతరించింది. ఈ పట్టణాలే గాక, గవేషణల్లో ఇదే దాపుల్లో వెలుగుచూసిన 560 పైగా గ్రామీణ ఆవాసాలు, నేటి కురుక్షేత్రమే మహాభారత యుద్ధానికి మూలస్థానమనే ప్రాచీన భారతీయ చారిత్రక సంప్రదాయంలోని వాదనని బలపరుస్తాయి.

## యుద్ధం - పర్యవసానం :

పురాణ వాఙ్మయంలో ద్వాపరయుగాంతానికి భారతయుద్ధమే ఒక ముఖ్య కారణంగా చెప్పబడింది. చారిత్రకుల అభిప్రాయంలో క్రీ.పూ 1500 నాటి ప్రపంచ జనాభా 5 కోట్లను మించదు. దీనిలో అరకోటిమంది భారత ఉపఖండంలో వుంటే, వారిలో మూడింట రెండొంతులు (30 లక్షలు) తుదిహరప్పా నాగరికతకి చెందివుండవచ్చు. ప్రాచీన సంస్కృతుల్లో ఆనాటి ఆహార వనరులు, జీవనోపాధి వ్యవస్థలను బట్టి తుదిహరప్పా నాగరికతకి చెందిన జనాభాని కొంతవరకూ అంచనావేయవచ్చు. గ్రామీణ ఆవాసాలు, పట్టణాల సంఖ్యనుబట్టి యుద్ధంలో పాల్గొన్న జనపదాల్లోని జనాభాని దాదాపు ఇరవై లక్షలుగా, వారిలో మగవారు పది లక్షలుగా అంచనా వేయవచ్చు.

మహాభారతంలోని ఉద్యోగపర్వంలో యుద్ధంలో పాల్గొన్న సైనికుల సంఖ్యా ప్రమాణాలు చూస్తే, వాటిలో పృతనం, చమూ అనే ప్రమాణాలు వేరువేరుగా చూపబడ్డాయి. అదే నిజమైతే సైనికుల సంఖ్య మరో మూడురెట్లు పెరుగుతుంది. కానీ ఈ రెండు పదాలూ అనేకమార్లు అదే గ్రంథంలో సమానార్థకాలుగా వాడబడ్డాయి. మరోచోట అక్షౌహిణి కొన్ని లక్షలకు పైచిలుకుగా చూపబడింది. ఈ వివరణలు భారతయుద్ధంలోని సైనికుల సంఖ్యని అతిశయంగా చూపే ప్రయత్నమే. భీష్మపర్వంలో భీముని సైన్యం వర్ణన ఒక అక్షౌహిణిని దాదాపు 25 వేలుగా చూపింది. పై పట్టికలోని ఏనుగుల, గుర్రాల సంఖ్య మాత్రం అనురూపంగా కనిపిస్తుంది. కానీ కౌటిల్యుని అర్థశాస్త్రంలోని అతిచిన్న సైన్యప్రమాణం పదిమంది యోధులు. అది మహాభారతంలోని 'పత్తి'కి సరితూగుతుంది. యోధుల సంఖ్య మాత్రమే వాస్తవంగా గ్రహిస్తే, సహాయకుల సంఖ్య కూడా కొంత తగ్గుతుంది. ఏదియేమైనా కౌటిల్యుని అర్థశాస్త్రంలోని సైన్య ప్రమాణాలూ, అలెక్జాండర్ దండయాత్ర వృత్తాంతాలతో బేరీజు వేసుకొని చూస్తే యుద్ధంలో పాల్గొన్న సైనికుల సంఖ్య దాదాపు ఏడు లక్షల వరకూ ఉండవచ్చు. ఈ సంఖ్య కూడా అతిశయోక్తి అనుకున్నా, ఆనాటి సమాజంలో ఆయుధం పట్టగల ప్రతి ఒక్కరూ యుద్ధంలో పాల్గొని ఉండవచ్చునేది నిర్వివాదాంశం. దీన్నిబట్టి నాటి ఆర్థిక, ఉపాధి వ్యవస్థలపై యుద్ధంలో చచ్చినవాళ్లు, గాయపడ్డవాళ్ల సంఖ్య యొక్క ప్రభావాన్ని ఊహించవచ్చు. ద్వాపర యుగాంతానికీ, కలియుగమనే చీకటి యుగం ఆవిష్కారానికి మహాభారత యుద్ధం ఒక ముఖ్యకారణమనే పౌరాణిక సంప్రదాయంలో కొంత నిజం ఉందనిపిస్తుంది.

## ముగింపు :

తుదిహరప్పా యుగానికి చెందిన మరో ప్రాంతీయ సంస్కృతి గుజరాత్ పరిసరాల్లో విస్తరించి కనిపిస్తుంది. ఈ ప్రాంతంలో ద్వారక, రంగ్పూర్, రోజ్డీ, దైమాబాద్ వంటి

| మహాభారతయుద్ధంలో సైనికుల వాస్తవిక సంఖ్య | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | సైనికులు | | | | | | | | సహాయకులు | | |
| | పత్తి (10) | సేనా ముఖం | గుల్మం | గణం | వాహిని | పృతనం చమూ | అక్షౌహిణి (x 10) | 18 అక్షౌహుణులు | సేవకులు | సారథి మావటి | మొత్తం |
| రథం | 1 | 3 | 9 | 27 | 81 | 243 | 2430 | 43740 | 2 | 1 | 65610 |
| గజం | 1 | 3 | 9 | 27 | 81 | 243 | 2430 | 43740 | | 1 | 65610 |
| అశ్వం | 3 | 9 | 27 | 81 | 243 | 729 | 7290 | 131220 | 2 | | 262440 |
| కాల్బలం | 5 | 15 | 45 | 135 | 405 | 1215 | 12150 | 218700 | | | 0 |
| మొత్తం | 10 | 30 | 90 | 270 | 810 | 2430 | 24300 | 437400 | 4 | 2 | 393660 |
| | | | | | | | | | | | 787320 |

పట్టణాలే గాక 520కి పైగా గ్రామీణ స్థావరాలూ, రేవులూ వెలుగుచూసాయి. సంప్రదాయంలో ద్వారక యాదవులకు ముఖ్యపట్టణం. మహాభారతం ఈ ప్రాంతాన్ని అనర్త, అరత్త (ప్రా) అనే పేర్లతో పిలిచింది. ఇక్కడి ప్రజలను అంధక, భోజ, వృష్ణి జనజాతులుగా సంబోధించింది. కురుపాంచాల రాజ్యాల మధ్య జరిగిన మహాభారతయుద్ధంలో ఈ యాదవుల పాత్ర ఎంతవరకూనన్నది వివాదస్పదం. ఉదాహరణకి వృష్ణి వంశానికి నాయకుడైన బలరాముడు యుద్ధంలో పాల్గొనలేదు. అలాగే ద్వారకకు చెందిన శ్రీకృష్ణుడు యుద్ధంలో ఆయుధం పట్టలేదు. విదర్భ రాజైన రుక్మి యుద్ధానికి దూరంగా ఉన్నాడు. కృతవర్మ, సాత్యకి యుద్ధంలో పాల్గొన్నట్లు భారతం చెప్తుంది కానీ వారి వివరాలు తక్కువ.

కానీ తరువాతి కాలాల్లో భారతకావ్యంలోనూ, భారతానికి జోడించిన చిరుపొత్తం హరివంశంలోనూ యాదవుల పాత్ర విస్తారమైంది. కృష్ణుడు యుద్ధానికి కారణభూతుడుగా కనిపిస్తాడు. మహాభారత యుద్ధానంతరం బలరాముడు హస్తినాపురాన్ని పెళ్ళగించి యమునలో ముంచడం, సాంబుడు కురురాజ్యాన్ని పాలించడం అనే వృత్తాంతాలు, గంగామైదానంలో యాదవుల విస్తరణ ప్రక్రియను సూచిస్తాయి. తుదిహరప్పా నాగరికత పతనమైన అనంతరం ఆ సంస్కృతి ఆనవాళ్లను తరువాతి తరాలకు అందించడంలో యాదవుల పాత్ర విశేషంగా కనిపిస్తుంది. హరప్పా నాగరికతకు చెందిన విభిన్న స్రవంతులు నేటి భారతీయ భాషా సాంస్కృతిక నేపథ్యాన్ని ఏ విధంగా ప్రభావితం చేసాయో వచ్చే సంచికలో చూద్దాం.




సాయి పాపినేని
బెంగుళూరు.
ఫోన్ : 0 984 503 4442


## అనసూయ పువ్వుల



అనసూయ
పువ్వుల

అనసూయ రంగస్థల, సినీనటి. కృష్ణాజిల్లా, గన్నవరం తాలూకా మేడూరు గ్రామంలో జన్మించింది. పదిహేను సంవత్సరాల వయస్సులోనే రంగస్థల ప్రవేశం చేసి వేలాది నాటకాలలో వైవిధ్యంగల పాత్రలు పోషించి, పండిత పామరుల మన్ననలు అందుకొన్న నట విదుషీమణి. ద్రైతాగోపాలం శిక్షణలో 'చంద్రమతి' పాత్ర ధరించి, యావదాంధ్ర కీర్తిని అర్జించింది. చక్కని వాచికం, మధురమైన కంఠం, అద్భుతమైన నటనా కౌశల్యం ఆమె సొత్తు. ద్రౌపది, చింతామణి, మండోదరి, కైక, యశోద, సత్య, ప్రసిద్ధ నటులందరి సరసన నటించి, సహనటుల ప్రశంసలు పొందిన నటీమణి అనసూయ. రాజేశ్వరి, పూర్ణిమ ఈమె సమకాలికులు. అనసూయ కళాసేవను గుర్తించి ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఈమెను ఘనంగా సన్మానించింది. ఆంధ్రదేశంలో ప్రసిద్ధ సంస్థలెన్నో అనసూయను సత్కరించాయి. అలనాటి *రైతుబిడ్డ, మాలపిల్ల, తెనాలి రామకృష్ణ, చండిక* వంటి చలనచిత్రాలలో నటించి, ప్రేక్షకాదరణను చూరగొన్న అసమాన నటి అనసూయ.

# మధుసేవ

– ఓరుగంటి సరస్వతి

మనిషినీ, సమాజాన్ని విడదీసే సాహిత్యాన్ని ఊహించలేం. కాబట్టి మనిషికీ, సమాజానికీ అవినాభావ సంబంధం ఉంది. అలాంటి అవినాభావ సంబంధం గల మనిషినీ, సమాజాన్ని పట్టి పీడించే సమస్యలు ఎన్నో ఉన్నాయి. ఈ సమస్యలు అప్పుడు ఇప్పుడు అన్న తేడా లేకుండా ప్రతి దశలోనూ ఒక్కోరకంగా మనిషి మనుగడకు, సమాజాభివృద్ధికి ఆటంకంగా కారణభూతాలవుతున్నాయి.

తెలుగులో సాంఘిక సమస్యలను గురించి ఎన్నో నాటకాలు వచ్చాయి. తెలుగులో వచ్చిన మొదటి సాంఘిక నాటకం వావిలాల వాసుదేవశాస్త్రి 'నందకరాజ్యము'.

ఈ నాటకం 1880లో వచ్చింది. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు వంటి గొప్ప సంఘ సంస్కర్తలు సాంఘిక సమస్యలను పరిష్కరించడానికి చేసిన కృషి మరువలేం. వీరేశలింగం పంతులు 'బ్రహ్మవివాహం', గురజాడ అప్పారావు గారు 'కన్యాశుల్కం' వంటి గొప్ప నాటకాలను రచించి సమాజంలో నెలకొని ఉన్న దురాచారాలను గురించి ప్రజల్లో అవగాహనను కల్పించి, వారు మేల్కొనేలా సందేశాన్నిచ్చారు. అలాగే ధర్మవరం గోపాలాచార్యులు 1933లో 'అస్పృశ్య-విజయం', కులాంతర వివాహాల్ని గూర్చి 1947లో కొండముది గోపాలరాయశర్మ 'ఎదురీత', పినిశెట్టి శ్రీరామమూర్తి 1951లో 'కులంలేని పిల్ల' వంటి నాటకాలు రాశారు.

సమాజాభివృద్ధికి ఆటంకాలుగా మారిన సాంఘిక సమస్యలపై దృష్టి సారించి ప్రదర్శనయోగ్యమైన, సంస్కరణాత్మకమైన నాటకాలు రచించిన నాటక కర్తలలో కాళ్ళకూరి నారాయణరావుగారు చెప్పుకోదగినవారు. కొత్త భావాలను, మార్పు చెందాల్సిన సమస్యలను నాటకాల రూపంలో రాసి పండిత పామర జనుల మెప్పు పొందిన గొప్ప రచయిత. ఈయన పశ్చిమగోదావరి జిల్లా మచ్చాపురి గ్రామంలో ఏప్రిల్ 28, 1871న సుప్రసిద్ధ పండిత కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు బంగారురాజు, అన్నపూర్ణమ్మ. నారాయణరావు తండ్రి కూడా కవి. 'కవిరాజు' బిరుదాంకితుడు.

బాల్యంలో నారాయణరావు మొదట తండ్రివద్దనే విద్యాభ్యాసం ప్రారంభించి తరువాత కాకినాడలో పాడి వెంకటనారాయణ వద్ద కావ్య, నాటకాలంకార గ్రంథాలను అధ్యయనం చేశాడు. నారాయణరావు నాటకకర్తే కాక నటుడు. ప్రకాశంపంతులు దమయంతి పాత్ర వేయగా నారాయణరావు నలుని పాత్ర వేసి ప్రజల మన్ననలను పొందారు. నారాయణరావు 1922లో వరవిక్రయము, 1909లో చిత్రాభ్యుదయము, 1918లో పద్మవ్యూహము, 1920లో చింతామణి నాటకాలను రాశారు. వీరు రాసిన నాటకాలలో చింతామణి, వరవిక్రయము, మధుసేవ సుప్రసిద్ధ సాంఘిక నాటకాలు. నారాయణరావు గారిపై కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడుల ప్రభావం ఉంది. నారాయణరావు సోదరి బాల వితంతువు. ఆమెకు పునర్వివాహం చేయాలనే పట్టుదలతో తండ్రితో గొడవపడి ఇంట్లో నుండి వచ్చారు. ఆ రోజుల్లోనే కట్నకానుకలు లేకుండా ధైర్యం చేసి చంద్రమ్మ అనే శూద్ర స్త్రీని వివాహమాడిన గొప్ప సంఘ సంస్కర్త. నారాయణరావు పుష్పగిరి పీఠాధిపతులు ద్వారా 'మహాకవి' బిరుదు పొందారు. కవిఘంట, కంకణము, గండపెండేరము మొదలైన బిరుదులు పొందారు. 1927 జూన్ 27న పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతం గ్రామంలో స్వర్గస్థులయ్యారు.

**మధుసేవ నాటకం ఇతివృత్తం :**

సమాజాభివృద్ధికి మహత్తర శత్రువైన మద్యపానం వ్యసనం వల్ల కలిగే దుష్ఫలితాలను, చిన్నాభిన్నం అయిన సంసారాన్ని కాళ్ళకూరి నారాయనరావు 'మధుసేవ' అనే సాంఘిక నాటకం చిత్రించింది.

'మధుసేవ' నాటకంలో రఘునాథరావు కథానాయకుడు. ఇతడు దివాణాధిపతి. తాత, తండ్రుల కాలం నుంచి పెద్దరికంతో దివాణాన్ని పాలిస్తుంటాడు. రఘునాథరావుకి

నిర్మలతో పెళ్ళవుతుంది. పెళ్ళై మూడేండ్లైనా భార్యని కాపురానికి తీసుకురాడు. రఘునాథరావు దివాణం, ఎస్టేటు వ్యవహారాలన్నీ మేనేజరు విశ్వాసరావు చూస్తాడు. రఘునాథరావు స్నేహితుడు శర్మ. అతనిని స్నేహితుడు అనడంకన్నా అంతకన్నా దుష్ట స్నేహితుడు మరొకడుండడేమోనని ఈ నాటకం చదివిన ప్రతి ఒక్కరికీ అన్పించకమానదు. శర్మ చెడు స్నేహముతో రోజురోజుకి తాగుడుకి అలవాటై రఘునాథరావు తన బాధ్యతల్ని మర్చిపోయే స్థితికి వస్తాడు.

చివరికి శర్మ తన దుష్టపన్నాగములో రఘునాథరావుని ఇరికించాలనుకొంటాడు. తాగుడికి బానిసైనవాడికి ఏ చెడ్డపనైనా గొప్పగానే కన్పిస్తుందని పెద్దలు ఊరికే అనలేదేమోనన్న విషయం రఘునాథరావు విషయంలో స్పష్టమవుతుంది. అదేమిటంటే శర్మ రఘునాథరావుని కస్తూరి అనే వేశ్యకి అలవాటు చేస్తాడు. కస్తూరికి ఎవరితో సంబంధం లేదని, రఘునాథరావుతోనే ఉంటుందన్న అబద్ధపు మాటలతో శర్మ అతనిని నమ్మిస్తాడు. అంతకుముందు నుంచే కస్తూరితో సంబంధం ఉన్న శర్మ, రఘునాథరావుని పావులా వాడుకొని కస్తూరితో సంతోషంగా గడపవచ్చని పన్నాగం పన్ని, ఆ పన్నాగం ప్రకారమే రఘునాథరావుని కస్తూరిని చూడలేనిదే ఉండలేనంతగా మత్తులో ముంచుతారు. ఈ తతంగమంతా దివాణానికి మేనేజరుగా, నమ్మకస్తునిగా ఉన్న విశ్వాసరావుని బాధకు గురి చేస్తుంది. ఒకప్పుడు దివాణంలో రంగడు అనేవాడు తాగినందుకే అసహ్యించుకొన్న రఘునాథరావు, ఇప్పుడు ఇలా చేయడం తలచుకొని బాధపడ్తాడు మేనేజరు విశ్వాసరావు. తనకు ఎవరితో సంబంధం లేదని, నమ్మపల్కి, డబ్బు, సొమ్ముకోసం కాసింసాహెబు లాంటి వ్యక్తితో సంబంధం పెట్టుకొన్న కస్తూరికి, ఆమె వంకతో, రఘునాథరావుని బలహీనుణ్ణి చేసి రోజురోజుకి దివాణం సొమ్ముని హారతి కర్పూరంలా కరగదీస్తున్న శర్మ బండారాన్ని ఎలాగైనా విశ్వాసరావు బయటపెట్టాలనుకుంటాడు.

రోజులు గడుస్తుంటాయి. రఘునాథరావు దివాణా సంగతి పట్టించుకొనే స్థితిలోనే ఉండడు. రఘునాథరావు లేచింది మొదలు కస్తూరి జపమే. చివరికి అప్పులు ఎక్కువవుతాయి. ఈ విషయాన్ని విశ్వాసరావు రఘునాథరావు దృష్టికి తీసుకెళ్తాడు. ఎస్టేట్ అమ్మమని విశ్వాసరావుకి చెప్తాడు. రఘునాథరావు ఎస్టేట్ అమ్మే వ్యవహారాన్ని కూడా శర్మకే అప్పగిస్తాడు. తక్కువ ధరకి అమ్మానని నమ్మబలికి శర్మ ఆ తక్కువ మొత్తాన్ని కూడా కస్తూరికే ఇప్పించేలా చేస్తాడు.

భర్త రఘునాథరావు కొరకు మూడు సంవత్సరాలు ఎదురుచూసి, తనను తీసుకురావడానికి రాడని తెలిసి నిర్మలే భర్త దగ్గరికి వస్తుంది. ఆమె వచ్చేసరికి రఘునాథరావు పరిస్థితిని చూసి తట్టుకోలేకపోతుంది. చివరకు కస్తూరికి భర్త అలవాటైన సంగతి, దివాణాన్ని అప్పులపాలు చేసి తాగుడులోనే మునిగితేలుతున్న భర్తను చూసి నిర్మల తట్టుకోలేకపోతుంది.

భర్తను ఎలాగైనా మార్చుకోవాలనుకుంటుంది. నిర్మల తండ్రి చనిపోగా అతని ఆస్తి అంతా ఆమె పేరు రాస్తాడు. ఆ ఆస్తిని కూడా రఘునాథరావు పేర రాయించుకొని రమ్మని కస్తూరి శర్మ సలహాతో చెప్తుంది. కానీ ఒకనాడు నిర్మల భర్తకు తాగుడికి బానిసై దీనావస్థకు వచ్చిన పరిస్థితుల్ని, మేల్కోవాల్సిన అవసరాన్ని చెప్తుంది. భర్తను తాగుడు మానేయమని ప్రాధేయపడ్తుంది. అతడు కూడా మారాలని అనుకుంటాడు. ఆ సందర్భంలో శర్మ, కస్తూరితో పన్నాగం పన్ని రఘునాథరావు ద్వారా నిర్మల ఆస్తిని రాయించుకొని ఆ ఆస్తిని కూడా కాజేయాలనుకుంటారు. ఈ తతంగానికి నిర్మల అడ్డు అని భావించిన శర్మ రంగనికి డబ్బిచ్చి ఆమెపై విషప్రయోగం చేయిస్తాడు. భర్త తాగుడికి బానిసై చివరకు తన ప్రాణాలమీదికి వచ్చిన దుస్థితికి నిర్మల బాధపడ్తుంది. చివరి క్షణాల్లో మద్యం మహమ్మరి దుశ్చర్యలను తలచుకొని, చనిపోతుంది. తెలివిగా నిర్మలను చంపిన నేరాన్ని శర్మ రఘునాథరావుపై వేస్తాడు. పోలీసులు రఘునాథరావుని కోర్టుకు తీసుకెళ్తారు. చివరకు విశ్వాసరావు ప్రయత్నముతో రఘునాథరావు నిర్దోషిగా బయటపడ్తాడు.

భార్యను కోల్పోయిన రఘునాథరావు కుమిలిపోతాడు. రఘునాథరావు తను మద్యానికి బానిస కావడం వల్లే, వేశ్యతో సంబంధం పెట్టుకొని బాధ్యతల్ని మర్చిన తీరుకు దుఃఖిస్తాడు. ఇంతటి వినాశనానికి కారణభూతమైన మద్యాన్ని ఇక ఎప్పటికీ ముట్టుకోనని రఘునాథరావు ప్రతిజ్ఞ పూనుతాడు. రఘునాథరావు తన భార్య నిర్మల ఆస్తిని, తన మిగిలిన జీవితకాలాన్ని మద్యపానాన్ని నివారించడానికి ఉపయోగించి, తన భార్య నిర్మల ఆత్మకు శాంతి చేకూరుస్తానని ప్రతిజ్ఞ పూనడం, ఆ ప్రతిజ్ఞకు విశ్వాసరావు కూడా మద్దతు పలకం

నాటకం కొసమెరుపు.

**పాత్రల తీరుతెన్నులు :**

కాళ్ళకూరి నారాయణరావుగారి 'మధుసేవ' నాటకంలో రఘునాథరావు, విశ్వాసరావు, శర్మ, నిర్మల, కస్తూరి, రంగడు పాత్రల్ని ప్రధానంగా చెప్పవచ్చు.

**రఘునాథరావు :**

నాటకంలో కథానాయకుడు. చాలా గౌరవంగా తన దివాణాన్ని చూసుకునే పరిపాలనా స్ఫురద్రూపి. తన కళ్ళ ఎదుటే దివాణంలో తాగి ఉన్న రంగడు అనే వ్యక్తిని పోలీసులు తీసుకెళ్తున్నప్పుడు తాగినందుకు తగిన శాస్తి జరిగిందని అలాంటి తాగుబోతుల్ని క్షమించగూడదనుకొన్నవాడు. అన్నివిషయాల్లో మంచి సలహాల్నిచ్చే మేనేజరు విశ్వాసరావు పట్ల చాలా గౌరవంగా ఉండేవాడు. విశ్వాసరావు సలహాల్ని, సూచనల్ని మర్యాదపూర్వకంగా గ్రహించేవాడు. ఎలాంటి దుర్వ్యసనాలు ఉండకూడదని విశ్వాసరావుతో ముక్కు పొడుమును కూడా వాడకుండా చేస్తాడు.

*ఏటవాలుగా బాఱెడి యేటినుండి;*

*వ్రణమువలె సల్పు తలమంచు ఋణము నుండి;*
*నాటుకొనినట్టి దుర్వ్యసనములనుండి*
*మొకని గాపాడినను జన్మమొప్పునంద్రు*

అని ఒక దుర్వ్యసనం నుండి ఒక వ్యక్తిని కాపాడినాను అన్న ఆనందాన్ని పొందుతాడు. రఘునాథరావు ఒకరోజు అనుకోకుండా గుర్రం స్వారీ చేస్తుండగా కిందపడ్డాడు. తలపగిలిన రఘునాథరావుకి రంగడు నోట్లో సారాయిపోసి లేపుతాడు. ఆరోజు మొదలు మద్యం సేవించనిదే తలపోటుగా భావించిన రఘునాథరావుకి అదే దినచర్య అవుతుంది. దానికితోడు శర్మ అనే అతని దుష్టస్నేహం, అతని ద్వారా కస్తూరి అనే వేశ్యకి అలవాటు కావడమే రఘునాథరావుని ఈ దుస్థితికి తీసుకువస్తుంది. రఘునాథరావు జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది. చివరికి రఘునాథరావు భార్య నిర్మలను కూడా పెళ్ళై మూడు సంవత్సరాలైనా కాపురానికి తెచ్చుకోడు. రఘునాథరావు కస్తూరి అనే వేశ్యాలోలుడై, తనను వెతుక్కుంటూ వచ్చిన భార్యను కూడా పట్టించుకోడు. మద్యపానం, కస్తూరి మత్తులో ఉన్న రఘునాథరావు దివాణం పరిస్థితి ఎలా ఉందో కూడా పట్టించుకోడు. మేనేజరు విశ్వాసరావు రఘునాథరావుని ఆ వ్యసనాల్ని వదలమని చెప్పినా వదులుకోలేకపోతాడు. ఆస్తి కోసమే శర్మ, కస్తూరిలు కలిసి రఘునాథరావుని పావులా వాడుకుంటున్నారని తెలుసుకోలేని మత్తులో ఉంటాడు. కస్తూరి ఏది అడిగినా ఇచ్చేంతగా రఘునాథరావు ఆమె మత్తులో మునిగి ఉంటాడు. చివరకు రఘునాథరావు భార్య నిర్మలను శర్మ చంపించి, ఆ నేరం అతనిపై మోపడంతో కళ్ళు తెరుచుకుంటాడు. తన మద్యపాన మత్తుకి, వేశ్యాలోలునిగా మారిన దుస్థితికి, బంగారంలాంటి భార్యను కోల్పోయినందుకు కుమిలిపోతాడు. మేనేజరు విశ్వాసరావు ప్రయత్నంతో ఎలాగో హత్యానేరం నింద నుండి రఘునాథరావు బయటపడ్డాడు. మొదటినుండి నమ్మకస్తునిగా ఉన్న మేనేజరుని అనవసరంగా దుర్భాషలాడినందుకు సిగ్గుపడ్డాడు. ఆ మేనేజరే లేకపోతే చేయని తప్పుకు జీవితకాలం శిక్ష అనుభవించేవాడినని పశ్చాత్తాపపడ్డాడు. రఘునాథరావు తాను చేసిన తప్పులు క్షమించరానివిగా భావించుకొని, అందుకు ప్రాయశ్చిత్తముగా తన భార్య నిర్మల ఆస్తిని తన జీవితాన్ని మొత్తం కూడా మద్యపాన నిషేధంకు ఉపయోగిస్తానని, ఆ విధంగానైనా తన భార్య ఆత్మకు శాంతి చేకూర్చినవాడినవుతానని ప్రతిజ్ఞబూనుతాడు. రఘునాథరావు తను మద్యపానానికి బానిస కావడంవల్లే తన బుద్ధిని కోల్పోయి, మంచీ, చెడూ ఆలోచించకుండా, విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయానని బాధపడ్డాడు. చెడుమార్గంలో నడిచి ఆస్తిని చివరకు తనను ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమించే భార్యను కోల్పోయాడు. దీనికంతటికి కారణం మద్యపానం అని, దాని నివారణకు తన జీవితాన్ని, భార్య ఆస్తిని ఉపయోగిస్తానన్న అతని నిర్ణయంతో రచయిత మద్యం మహమ్మారిని తరిమికొట్టాల్సిన సందేశాన్ని, ఆవశ్యకతను, రఘునాథరావు పాత్రలో చిత్రించారు.

**నిర్మల :**

నాటకంలో కథానాయకుడైన రఘునాథరావు భార్య. పెళ్ళై మూడు సంవత్సరాలు గడిచినా భర్త తనకోసం రాడని తెల్సి, ఆమే భర్త కోసం వెళ్తుంది. భర్త ప్రేమానురాగాలు పొందాలని పరితపించే ఇల్లాలు నిర్మల. ఎంతో జీవితాన్ని, భర్తను ఊహించుకొని వచ్చిన నిర్మలకు అడియాసే ఎదురవుతుంది. భర్త తాగుబోతుగా మారి ఒక వేశ్యకు అలవాటయ్యాడన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతుంది. ఎంతో గొప్ప గుణాలున్న భర్త అలా మద్యానికి బానిసై దివాణాన్ని అప్పులపాలు చేయడంచూసి తట్టుకోలేకపోతుంది.

చివరికి భర్తకి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తుంది. మంచి, చెడులను చెప్తుంది. రాజభోగాలనుభవించే నిర్మల తన భర్త అప్పుల చిట్టాతో ఒక మామూలు ఇంట్లో ఉంటుంది. ఆ ఇంటిని కొనడానికి తన నగలు, విలువైన చీరల్ని సైతం అమ్మడానికి వెనుకాడని గొప్ప ఇల్లాలుగా, సహనవతిగా నిర్మల ఈ నాటకంలో కన్పిస్తుంది. నిర్మల తండ్రి చనిపోయాక తన పేరున వచ్చిన ఆస్తితో భర్త చేసిన అప్పుల్ని తీర్చేయాలనుకుంటుంది. ఎంతో గొప్పవారిని హీనస్థితికి తెచ్చే మద్యాన్ని తిట్టుకుంటుంది. మద్యపానం వల్ల ఎన్నో జీవితాలు నాశనమయ్యాయని, ఎలాంటి రాజ్యాలైన, ఎంతటివారినైనా బానిసలను చేసుకొని నాశనం చేసే మహమ్మారిని మనసులోనే తిడ్తుంది. చివరికి ఆస్తికోసం రఘునాథరావు స్నేహితుడు శర్మ పన్నాగం వలన రంగని చేత విషప్రయోగంతో చనిపోతుంది. చనిపోయేముందు నిర్మల ఆవేదన వర్ణనాతీతం.

"స్వరాజ్యము కొఱకు నిన్నర్థింపను-సాయుజ్యము కొఱకు నిన్ను బ్రార్థింపను. మా దేశమున మద్యపానము లేకుండ జేసితివా, మాకు కోటి స్వరాజ్యముల గోటి సాయుజ్యములు బ్రసాదించినట్లు భావించెదను!" అని పరమేశ్వరుణ్ని వేడుకోవడం చూస్తే, చివరిక్షణాల్లో కూడా మద్యం వల్లనే తన భర్తకి అలాంటి దుస్థితి వచ్చిందని అలాంటి మహమ్మారిని లేకుండా చేస్తే కోటి స్వరాజ్యాలిచ్చినట్లన్న అర్థమవుతుంది. ఆమె ఆవేదన, మహావిపత్తులకి మద్యపానమే కారణమన్న సత్యాన్ని తెలియజేస్తుంది.

నిర్మల మద్యపానలోలుడై ఉన్న భర్తను తలచుకొని దుఃఖిస్తుంది.

*కానలోన మొఱడు గా బుట్టవచ్చును*
*నీటికుక్కగా జనింపవచ్చు;*
*పరగ, త్రాగుబోతు భార్య కా గూడదు*
*కలనునైన నాటకముననైన!*

అని భర్త ఉండి కూడా ఒంటరిగా ఉన్న దుస్థితిని తలచుకొని నిర్మల చివరిక్షణాల్లో బాధపడ్తుంది.

### విశ్వాసరావు :

'మధుసేవ' నాటకంలో విశ్వాసరావు పాత్ర చాలా కీలకమైన పాత్రగా పేర్కొనవచ్చు. అడుగడుగునా రఘునాథరావుకి తగిన సలహాలిచ్చే ఉత్తమ వ్యక్తి. మోసకారి గుణం కాదు విశ్వాసపాత్రుడు. తాగిన వాళ్ళంటేనే పడని రఘునాథరావు మద్యపానం సేవిస్తూ, వేశ్య కస్తూరికి అలవాటుపడి, ఆస్థిని, గౌరవాన్ని కోల్పోయిన రఘునాథరావుని కాపాడాలనుకొన్న విశ్వాసపాత్రుడు. రఘునాథరావుని శర్మ స్నేహం నుండి తప్పించాలని, అతని కుట్రని రఘునాథరావుకి తెలియజేయాలని ఎంతో ప్రయాసపడిన వ్యక్తి. ఒకానొక సందర్భంలో రఘునాథరావు చేత నిందించబడినా నిగ్రహం కోల్పోకుండా, రఘునాథరావు జీవితాన్ని కాపాడాలనే దృఢనిశ్చయం కల్గిన గొప్ప వ్యక్తి.

రఘునాథరావు ఒకరోజు దుర్వ్యసనములను గురించి చెప్తున్న సందర్భంలో విశ్వాసరావు తనకున్న ఒకే ఒక అలవాటు ముక్కుపొడుమును ఆరోజు నుండి వదిలివేస్తాడు. రఘునాథరావు భార్య నిర్మలకు అండగా నిలబడిన వ్యక్తి. శర్మ కుట్రలో భాగంగా నిర్మల రంగడిచేత చంపబడితే, ఆ నింద నుండి తెలివిగా రఘునాథరావుని నిర్దోషిగా కాపాడిన విశ్వాసపాత్రుడు. మద్యపానం మత్తు నుండి బయటపడి, ఎంతో జీవితాన్ని కోల్పోయిన రఘునాథరావు మద్యపాన నిషేధ ఉద్యమానికి తన మద్దతు కూడా తెలియజేసిన గొప్ప సంఘ సంస్కారవంతునిగా విశ్వాసరావు పాత్ర ఈ నాటకంలో కన్పిస్తుంది.

### శర్మ :

ఈ నాటకంలో మంచి గుణాలున్న వ్యక్తి. రఘునాథరావుతో స్నేహితుడిగా ఉంటూనే, అతని బలహీనతైన మద్యపానాన్ని ఆసరా చేసుకొని, అతనిని ఎంతవరకు నమ్మించి, దిగజార్చాలో అంతవరకు దిగజార్చుతాడు. చివరకు కస్తూరి అనే వేశ్యకి అలవాటు చేస్తాడు. రఘునాథరావు దివాణానికి సంబంధించిన డబ్బులన్నీ కాజేయడానికి కస్తూరిని ప్రయోగిస్తాడు. కస్తూరిని కూడా శర్మ తెలివిగా వాడుకుంటాడు. ఆమెతో సంబంధాన్ని కొనసాగిస్తూనే, రఘునాథరావుని అలవాటు చేస్తాడు. శర్మ డబ్బు కోసం ఎంతటి దురాగతానికైన వెనుకాడని దుష్టుడు. రఘునాథరావు ఆస్తిని అప్పులపాలుచేసి, చివరకు అతని భార్య నిర్మలకు వచ్చిన ఆస్తిని కూడా కాజేయాలని, అందుకు ఆమె అడ్డుని భావించి, రంగని ద్వారా విషప్రయోగం చేసి చంపిస్తాడు. ఆ నేరాన్ని ఎలాగూ తాగుబోతు, తిరుగుబోతుగా అనుకుంటున్నారు కాబట్టి రఘునాథరావుపైన మోపుతాడు. చివరకు విశ్వాసరావు వల్ల సాక్ష్యాలు దొరకడంతో దోషిగా దొరికిపోతాడు. దుష్టమైన స్నేహానికి, దుష్ట స్నేహితునికి ప్రతీకగా శర్మ పాత్రను ఈ నాటకంలో గుర్తించవచ్చు.

**కస్తూరి:**

ఈ నాటకంలో కస్తూరి వేశ్యపాత్ర. ఎవరు సొమ్ము ఎక్కువగా ఇస్తారో, వారికి అప్పటికప్పుడు రాచమర్యాదలు చేసి కపట ప్రేమను నటించే తత్త్వం. ఈమెకు ప్రేమ, అనురాగాలతో పని ఉండదు. శర్మ సహాయంతో రఘునాథ నాయకుడు సంపన్నుడని తెలుసుకొని అతని సొమ్మునంతా కాజేసి, చివరికి అతనిని అప్పులపాలు చేసి, తాగుబోతుని చేస్తుంది. ఉన్న ఆస్తినంతా కాజేసి, చివరకు రఘునాథరావు భార్య నిర్మలపేర ఉన్న ఆస్తిని కూడా కాజేయడానికి అతనిని లోబర్చుకుంటుంది. చివరకు ఆస్తికోసం రఘునాథరావు భార్య నిర్మలను చంపించడానికి శర్మ కుట్రలో భాగస్తురాలవుతుంది. చివరకు నేరం రుజువై శర్మతోపాటు దోషిగా మిగులుతుంది.

**వెంకటేశము :**

'మధుసేవ' నాటకంలో వెంకటేశము కస్తూరి తమ్ముడి పాత్ర. అక్క చేసే వేశ్యపనికి తన సహాయ సహకారాలు కావాల్సిన దానికంటే ఎక్కువగా అందించే పాత్ర. అక్క చేసే పని మంచిదా? కాదా? అన్న ఆలోచన మచ్చుకి కూడ ఇతనికి ఉండదు. ఆమె కోసం బేరాల్ని కుదిర్చి, వచ్చిన ప్రతివారినీ పొగుడ్తూ, బావగారు అని సంబోధిస్తూ, అక్క వలలో పడేసి వారి సొమ్ముల్ని సొంతం చేసుకుంటాడు. కాసేంసాహెబును పొగిడి అక్క వలలో వేసి ఆమె కోసం సిల్కు చీరలు తీసుకువస్తాడు. రఘునాథరావు లాంటి వ్యక్తిని కూడా బావగారు అని పిలిచి అతని సొమ్ము కాజేయడంలో అక్కకు సహకరించే తమ్ముని పాత్రగా ఈ నాటకంలో వెంకటేశము పాత్రను గుర్తించవచ్చు.

**కాసింసాహేబు :**

ఈ నాటకంలో కాసింసాహేబు సిల్కుబట్టల వ్యాపారి. కస్తూరిని చూసి ఆశపడ్తాడు. ఆమె కోసం ఏదడిగినా ఇవ్వడానికి సిద్ధపడ్తాడు. అతనితోనే సంబంధం పెట్టుకొన్నాన్న కస్తూరి మాటల్ని నమ్ముతాడు. కస్తూరి కోసం వెనుకా ముందు ఏమీ ఆలోచించని వేశ్యాలోలుడిగా కాసింసాహేబు పాత్ర కన్పిస్తుంది. వేశ్య కస్తూరి పొగడ్తలకు పొంగిపోయి, తన ఉంగరం, నగలు ఇస్తాడు. ఇంకా ఆమె కోరుకున్న సిల్కుచీరలు పంపిస్తాడు.

**రంగడు :**

ఈ నాటకంలో రంగడు తాగుబోతు పాత్ర. తాగి భార్యను కొట్టబోతే, ఆ దెబ్బ అడ్డుగా వచ్చిన అతని అత్తకి తగిలిందని పోలీసులు అతన్ని పట్టుకున్నా, రఘునాథరావు వదిలివేయమని పోలీసులకు చెప్పలేదన్న కోపం రంగనికి ఉంటుంది. ఒకసారి రఘునాథరావు గుర్రం బెదిరి కిందపడిపోగా, ఆ సందర్భంలో అక్కడ ఉన్న రంగడు సారాయిపోసి అతనిని లేపుతాడు. అది మొదలు రఘునాథరావుకి తలనొప్పి రావడం, మద్యం సేవిస్తేనే తగ్గడం పరిపాటయ్యి, చివరికి అతనికి తాగుడు అలవాటుకావడం ఆశ్చర్యపడాల్సిన విషయం. శర్మ మాటలు విని డబ్బుకోసం రఘునాథరావు భార్య నిర్మలపై విషప్రయోగం చేసి, ఆమె తలగడ కింద ఒక ఉత్తరం పెడ్తాడు. ఆ ఉత్తరం నిర్మల రాసిందికాదు. ఆ ఉత్తరంలోని తప్పుల్ని కనిపెట్టి నిర్మల రాసిన ఉత్తరంలో అన్ని తప్పులుండవన్న మేనేజరు విశ్వాసరావు నిరూపించడంతో భయానికి చేసిన తప్పును రంగడు ఒప్పుకుంటాడు.

సమాజంలో నేటి ఆధునికయుగంలో కూడా మద్యం మహమ్మారి అందరి జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తుంది. సంఘవిద్రోహకశక్తిగా, సమాజాభివృద్ధిని కుంటుపడేలా చేసే మద్యం మహమ్మారిని తరిమికొట్టాల్సిన ఆవశ్యకత, అవసరం అందరిపైనా ఉంది.

ఆ దిశగా ప్రతి ఒక్కరూ మద్యపాన నిషేద ఉద్యమానికి తమవంతు కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వర్తించి సమాజాభివృద్ధిని, తద్వారా దేశాభివృద్ధికి దోహదం చేయాలన్న సందేశాన్నిచ్చిన కాళ్ళకూరి నారాయణరావు 'మధుసేవ' నాటకం. తెలుగు సాహిత్య చరిత్రలో మైలురాయి. ఈ నాటకం చదివినవారు, ఈ నాటకాన్ని గురించి తెలుసుకొన్నవారు చాలామంది వారికున్న మద్యపాన వ్యసనాన్ని వదులుకొని జీవితాల్ని బాగుచేసుకున్న నిజజీవితాలు ఉన్నాయి. అలాంటి సందేశాన్నిచ్చిన 'మధుసేవ' నాటకాన్ని తెలుగు సాహితీలోకానికి అందించిన కాళ్ళకూరి నారాయణరావు చిరస్మరణీయులు.



**డా. ఓరుగంటి సరస్వతి**
పొట్టి శ్రీరాములు తెలుగు
విశ్వవిద్యాలయం
నాంపల్లి, హైదరాబాదు
ఫోన్: 970 448 2892

# పిల్లల పాటలు

– సందినేని రవీందర్

కొండ్ల రామచంద్ర కరీంనగర్ జిల్లా, బెజ్జంకి మండల కేంద్రమునకు చెందినవాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి పిల్లలతో గురువుగా బోధనలో ఉన్నవాడు. పిల్లలంటే ఆయనకు అంతులేని మమకారం. భావి జీవితానికి బాల్యం ముందు బాటగా ఉంటుంది. వారిని ఆటపాటలో తీర్చిదిద్దాలనే సంకల్పం కలిగినవాడు. అందుకే ఆయన బాలచంద్రిక పిల్లల పాటలు రచించినాడు. మానవుల పుట్టుక ఇతర జంతుజాలాలకన్నా విశిష్టమైనది. పశుపక్ష్యాదులు, జంతువులు, మానవులైనా జన్మనిచ్చిన తల్లి ఋణం తీర్చుకోలేనిది. పండంటి బిడ్డలను కని, మమకారాన్ని పంచి, పాలిచ్చి, చంకలో ఎత్తుకొని ఓదార్చే తీరు చూచినపుడు మనసు చలించగలదు. మానవులే కాదు జంతువులు, కోతులు ఇతరేతర కొన్ని జీవరాశులు తమ సంతతిని ఒళ్ళో చక్కగా ఎత్తుకొని లాలించగలవు. క్రూరమృగాలైన సింహాలు, పులులు, ఎలుగుబంట్లు ఎన్నో జంతువులు తమ పిల్లలను ఆడిస్తూ ఓదార్చగలవు. గోమాత (ఆవు) అంబా అనగానే తన పిల్లలు తల్లిని వెతుక్కుంటూ పరుగెత్తే సంఘటనలు చూసినప్పుడు కన్న ప్రేమ ఎంత గొప్పదో అర్థం కాగలదు. మూగజీవాలది మూగ ప్రేమ. మానవులు మాటలు నేర్చినవారు కనుక తన మనసులోని మాటలను పాటలుగా పాడి పిల్లలను ఓదార్చగలరు.

బాల్యం మధురమైనది. పుట్టింది మొదలు పరిసరాలను గమనిస్తూ, తల్లితో ఊ, ఊ అంటూ ముచ్చట్లాడే పసి వయస్సు, బోర్లపడి అటూ ఇటూ పాకుతూ తల్లిని ఆటపట్టించే చిన్నారి, అంబాడి, కూర్చుండి, అవీ ఇవీ పట్టుకొని గంతులేసే లేత వయస్సు. తల్లిది ఎంత ఆరాటమో పిల్లవాడికీ అంతలా ఆడుకోవాలనే తపన. తల్లి పిల్లవాడు మారాం చేసినప్పుడు గోరుముద్దలు తినిపిస్తూ జోలపాట పాడుతుంది.

**"జోజోజో పాపాయి – జోలపాడెదా బుజ్జాయి**
**కళ్ళు మూసుకో పాపాయి – హాయిగా పడుకో అమ్మాయి ॥జోజో॥**
**చిట్టిపొట్టి చేతుల చినపాప – బుడిబుడి నడకల పాప**
**హాయిగ నిదురపోవాలి – కమ్మని కలలే రావాలి ॥జోజో॥**

తల్లి శ్రావ్యంగా జోజో ముకుందా! జో అచ్యుతానందా! జోజో పాపాయి, జోజో అంటూ! పాడే గీతాలను రసరంజితమైన రాగంగా మార్చుతుంది. ఆ రాగానికి ముగ్ధుడై తల్లివంకే చూస్తాడు. అలా చూస్తూనే నిదురపోతాడు. ఈ లోకంలో కుట్రలు, కుహానా సంస్కృతులు తెలియనివారు పసి బాలలు కడుపు నిండగానే హాయిగా నిద్రపోతారు. నిద్ర లేవగానే ఆడుకుంటారు. ప్రేమగా చూస్తే నవ్వుతూ ఆనందిస్తారు. గద్దిస్తే బాధపడతారు. ఏదైనా పెద్ద శబ్దం విన్నా వారు భయపడతారు.

***"కొమ్మమీద కోయిలమ్మ కుహూ అన్నది / గోడమీద పెద్దబల్లి కిటకిటన్నది / బండ కింద కప్పలేమో బెకబెకన్నవి / గట్టుమీద / లేగదూడ అంబా అన్నది / గేటు మీద కుక్కపిల్ల భౌభౌమన్నది తొట్టెలోన చిట్టిపాప క్యారుమన్నది"***

పిల్లవాడు ఏదైనా శబ్దానికి భయపడ్డప్పుడు తల్లి తన చంటిపాపను గుండెలకత్తుకొని పాటపాడుతుంది. పిల్లలు అప్పుడప్పుడు కుక్కపట్టి ఏడుస్తారు. తల్లి ఎంతో ప్రయాసపడి పాటలు పాడి గుండెలకత్తుకొని ఓదార్చుతుంది. తల్లి ప్రేమను కొలవలేము. తల్లిదండ్రుల ఋణం తీర్చుకోలేం. అందుకే...

***"చింతకాయ పుల్లన – పాలు పెరుగు కమ్మన / చాకిలేటు తియ్యన – ఐసుక్రీము చల్లన / అమ్మమాట కమ్మన – అమ్మ మనసు చల్లన"***

పిల్లలకు ఆటలంటే ఇష్టం. పిల్లలంతా కూడి ఏవోవో ఆటలాడ్తారు. బొమ్మలతో ఆడుకుంటారు. తల్లిలాగే వాటిని ఓదార్చి నిద్రపుచ్చుతారు. తల్లి నుండే పిల్లలు మార్ధవ భావాల్ని నేర్చుకొంటారు. పిల్లలు అల్లరి కూడా చేస్తారు. మనల్ని ఆటపట్టిస్తారు.

***"చిట్టిపొట్టి కుట్టిగాడు చిన్నవాడు – అక్క పుస్తకాలు అన్ని చింపినాడు / తాత చేతికర్ర దాచిపెట్టినాడు – మంచినీళ్ళకుండ పగులగొట్టినాడు / అన్న చెప్పు తెంపి పారిపోయినాడు – పారిపోయి అమ్మచాటు దాగినాడు"***

పిల్లలు అల్లరితో ఆనందిస్తారు. అక్క పుస్తకాలు చింపి, తాత చేతికర్ర దాచి, నాన్న కళ్ళజోడు పగులగొట్టి, అన్న చెప్పు తెంపి చివరికి తల్లిచాటుగా దాగి అన్ని తప్పులను క్షమింపచేసుకొంటారు. ఈ విధంగా పిల్లలు అల్లరి చేసినా పెద్దలు విసుక్కున్నా వద్దురా నాన్నా అంటూ తల్లి హితబోధలు చేస్తుంది. చిన్నారి పిల్లల్లో కోపం, హాస్యం, అలక వంటివి సహజ స్వభావాలుగా ఉండును. కోపం వచ్చినపుడు అలుక

వహిస్తారు. అన్నదమ్ములిద్దరుంటే చెప్ప వశం కాని అల్లరి చేస్తారు.

*"కుక్కపిల్ల కుక్కపిల్ల భౌవ్వుమన్నది - పక్కనున్న తమ్మునికి ఝల్లుమన్నది / ఏమైందని అన్నయ్య ఉరికివచ్చెను - ఉరికి వచ్చి కుక్కపిల్ల తోక తొక్కెను / కుక్కపిల్ల కైకైమని పారిపోయెను - తమ్ముడు ఆనందపడుతూ నవ్వుచుండెను"*

అన్న కుక్కపిల్ల తోక తొక్కగానే అది కయ్యిమంటు అరువగానే తమ్ముడు చిరునవ్వుతో కడుపుబ్బ నవ్వాడు. పిల్లలకు నీతికథలు పెద్దలు పాటల ద్వారా కొన్ని సామాజిక విషయాలు నేర్పుతారు. పిల్లికి ఎలుకకు పడదు. ఎలుక పిలికి మాత్రమే భయపడుతుంది. కనుక శత్రువులతో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలనేది పెద్దల నీది మాటలు.

*"చింతకింద తొర్రలోన ఎలుక ఉన్నది - గుర్రుపెట్టి హాయిగ నిద్రించుచున్నది / జోరుగాలి వీచి వాన కురుయుచున్నది - ఐన ఎలుక హాయిగా నిద్రించుచున్నది / బరబరమని మేఘం గర్జించుచున్నది - ఢాంఢాంమ్మని చింతకింద పిడుగుపడినది / ఐన ఎలుక హాయిగ నిద్రించుచున్నది - పిల్లి ఒకటి కలుగువద్ద మ్యావ్‌మన్నది - అదిరిపడి బెదిరి ఎలక మేలుకొన్నది"*

సమాజంలో వైరి వర్గాలతోనే ప్రమాదం పొంచివుంటుంది. శత్రువునెపుడు నమ్మవద్దు. పులి - మేక ఆట కూడా పిల్లలు ఆడుతారు. మేకకు పులితోనే ప్రమాదం. అందుకే పులి కనిపించగానే అది పరుగెడుతుంది. శత్రువునెప్పుడు నమ్మరాదు అనేది నీతి. పిల్లల పాఠశాల సంచిలో చిట్టి ఎలుక దూరి పుస్తకాలను కొరుకగలదు. సెలవులప్పుడు ఇలాంటివి జరుగగలవు.

"పుస్తకాల సంచిలోన ఎలుక దూరెను - బల్లకింద పొంచివున్న పిల్లిచూచెను / ఒక్క గెంతు గెంతి సంచిలోన దూరెను - సంచి నుండి ఎలుక కాస్త పారిపోయెను / ఎలుక కొరకు పిల్లి పుస్తకాలు వెదికెను - సంచిలోన పర్రుమనుచు శబ్దమాయెను / చింటుగాడి పుస్తకాలు చినిగిపోయెను - బావురుమని చింటుగాడు ఏడ్వసాగెను"

పిల్లవాడి పుస్తకాల సంచిలో ఎలుక దూరినది పిల్లిచూసి చిట్టి ఎలుకను పట్టుకోవాలని పిల్లి సంచిలో దూరినది. అది అటూఇటూ కదలగా సంచిలోని పుస్తకాలు చినిగిపోయినవి, చింటుగాడు ఏడ్వసాగినాడు. బుడిబుడి అడుగులతో పాఠశాలకు తొలినాడు వెళ్ళిన పసిపాప పంతులు చెప్పిన అక్షరాలు దిద్దుతాడు, తప్పులు చేస్తాడు. పంతులు గద్దించగానే ఏడుస్తాడు.

"పలుకా బలపం పట్టుకొని - అ ఆ ఇ ఈ రాశాను / అమ్మానాన్నకు చూపాను - అక్కకు అన్నకు చూపాను / పక్కింటాంటీకి చూపాను - సున్నాలన్నీ చుట్టావంటూ / అందరూ కలిసి నవ్వారు"

ఈ విధంగా పిల్లలను పెద్దలు వారి రాతలోని తప్పులను చూసి హాస్యం చేస్తారు. పల్లెటూరిలో ప్రకృతి రమణీయంగా ఉంటుంది. తెల్లవారిందనేదానికి గుర్తు కోడిపుంజు కూతతో అందరూ మేల్కొంటారు. చిన్నపిల్లవాండ్లు అలాగే కండ్లు తెరచి, మూసి మళ్ళీ పడుకొంటాడు.

"కోడిపుంజు గుడిసెమీద - కొక్కొరొకో అన్నది / తెల్లవారిపోయిందని - తెలియజెప్పుతున్నది / తెల్లని వెన్నెల లాంటి - వెలుగు వచ్చుచున్నది / ముసిరిన చీకట్లన్నీ - మటుమాయమైనవి / అమ్మ, బామ్మ, నాన్న, తాత - అప్పుడే మేల్కొన్నారు / అక్క, చెల్లి, బుజ్జిగాడు - మెల్లమెల్లగా లేచారు"

చీకటి నిద్రబుచ్చుతుంది. తెల్లవారితే పిల్లలు ఆటపాటలలో పడిపోతారు. వారి జీవితం ఆనందమయమైనది. చీకూచింతా లేనిది. పిల్లలలో పోటీతత్వం ఉంటుంది. ఆటపాటలలో గెలవాలనే తపన ఉంటుంది. ఓడిపోతే బాదపడతారు.

*"గచ్చకాయలాట లోన కమల గెలిచెను - తాడుదుంకుడాటలోన ఓడిపోయెను / దాగుడుమూతాటలోన పద్మ గెలిచెను - తొక్కుడుబిళ్ళలాటలోన ఓడిపోయెను / సూది పరుగులాటలోన సుమతి గెలిచెను - దొంగ దొరలాటలోన ఓడిపోయెను / మమత అన్ని పాఠాలలో మొదట ఉండెను - మా క్లాసుకు ఇప్పుడామె లీడరాయెను"*

గెలుపెటములను పిల్లలు సమంగా పంచుకోవాలని, జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు ఎదుర్కోవడానికి వారికి ఇది మార్గంగా ఉంటుంది.

*"చిన్నిచిన్న పిల్లలు - చిన్నారి పాపలం / ప్రొద్దున్నే లేచెదం - పండ్లు బాగ తోమెదం / గ్లాసు పాలు తాగెదం - స్నానాలు చేసెదం / వేళకు బడికెళ్ళెదం - పాటలెన్నో పాడెదం / పాఠాలను చదివెదం - కలిసిమెలిసి ఆడుతాం / చెట్లు నాటి పెంచుతాం"*

పాఠశాల ప్రాంగణాన్ని పిల్లలు అందంగా తీర్చిదిద్దుకునేలా వారికి గురువులు మార్గదర్శనం చేయాలి. పచ్చని చెట్లు పెంచి వాటికి నీళ్ళుపోయడం పిల్లలకు అలవాటు చేయించాలి. చక్కని పరిశుభ్రత వారికి అలవర్చాలి. అందరితో కలిమిడిగా ఉండే విధంగా వారిని తీర్చిదిద్దాలి. పిల్లలు భవిష్యత్తుకు జ్ఞానజ్యోతులు. భావిభారతం వారిదే. అందుకే వారిపట్ల ఇల్లు, పాఠశాల ప్రధాన కేంద్రంగా వారి భవిష్యత్తుకు చక్కని మార్గాన్ని చూపించగలరు.

డా॥ సందినేని రవీందర్, తెలుగు శాఖాధ్యక్షులు
కరీంనగర్. ఫోన్ : 944 04 88 515

# రామ్‌దర్శ్ మిశ్ర :
# సాహిత్య అకాడెమీ పురస్కారం

**- వెన్నా వల్లభరావు**

కేంద్ర సాహిత్య అకాడెమీ 2015 సంవత్సరానికి గాను 23 భాషల్లో పురస్కారాలు అందించటానికి ఆయా భాషల్లో ప్రతిభామూర్తులైన సాహిత్యకారుల్ని ఎంపిక చేసి ఇటీవల ప్రకటించింది. జాతీయ భాష హిందీలో ప్రఖ్యాత రచయితగా పేరు పొందిన రామ్‌దరశ్ మిశ్ర ఈ పురస్కారానికి ఎంపిక కావటం హిందీ సాహిత్య జగత్తుకు ఎంతో సంతోషకరమైన విషయం.

రామ్‌దరశ్ మిశ్ర బహుముఖ ప్రతిభా సంపన్నుడైన హిందీ రచయిత. 91 సంవత్సరాల వయసుగల మిశ్ర స్పృశించని సాహిత్య ప్రక్రియ లేదు. కథారచయితగా, నవలాకారునిగా ఆయన అనన్య సామాన్యమైన ఖ్యాతిని ఆర్జించారు. నిరంతర సాహిత్య సృజనలో జీవితాన్ని చరితార్థం చేసుకుంటున్న రామదరశ్ మిశ్ర 24 కవితా సంపుటుల్ని, 27 కథా సంపుటుల్ని, 13 నవలల్ని వెలువరించటంతో పాటు 5 వ్యాస సంకలనాలు, 2 యాత్రావర్ణనలు, 11 విమర్శ గ్రంథాలు, 3 స్మృతి గ్రంథాలు, 4 భాగాలుగా తన ఆత్మకథ రచించారు. ఒక రచయిత లెక్కకు మించిన సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసినప్పటికీ, ఒకటి-రెండు ప్రక్రియల్లో మాత్రమే ఆ రచయిత సఫలీకృతుడు కావటం, తద్వారా కీర్తి ప్రతిష్టల్ని సొంతం చేసుకోవటం సర్వసాధారణం. కాని ఇందుకు భిన్నంగా చాలా కొద్దిమంది అసమాన ప్రతిభతో తాము చేపట్టిన ప్రతి ప్రక్రియలోను సమర్థంగా రచన గావించి పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేస్తారు. ఏ భాషా సాహిత్యంలో గమనించినా ఈ కోవకు చెందిన రచయితలు వ్రేళ్లమీద లెక్కించగలిగినంత మంది మాత్రమే ఉంటారు. అలాంటి బహుకొద్దిమంది మేటి రచయితలలో హిందీ కవి, రచయిత రామ్‌దరశ్ మిశ్ర ఒకరు.



రామ్‌దర్శ్ మిశ్ర

రామ్‌దరశ్ మిశ్ర ఉత్తరప్రదేశ్‌లో గోరఖ్‌పూర్ జిల్లాలోని డుమరీ అనే గ్రామంలో 1924 ఆగస్టు 15వ తేదీన జన్మించారు. తండ్రి పేరు రామచంద్ర మిశ్ర. తల్లిపేరు కమల్‌పాతి మిశ్ర. రామ్‌అవధ్ మిశ్ర, రామ్‌నవల్ మిశ్ర పేర్లు గల ఇద్దరు అన్నలలో రెండవ అన్న భోజపురీలో గొప్ప కవి. ఒకే చెల్లెలు - పేరు కమల. రామ్‌దరశ్ మిశ్ర స్వగ్రామంలో ప్రాథమిక విద్య, పొరుగు గ్రామంలో మిడిల్ స్కూల్ చదువు పూర్తి చేసి, ధరసీ అనే గ్రామంలోని 'రాష్ట్రభాషా విద్యాలయ్'లో విశారద, సాహిత్య రత్న పరీక్షలు ఉత్తీర్ణులయ్యారు. 1945లో వారణాసిలో మెట్రిక్, ఇంటర్ పాసై, కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో బి.ఏ., హిందీలో ఎం.ఏ., పిహెచ్.డి. పూర్తి చేశారు. 1956లో బరోడాలోని సయాజీరావ్ గాయక్‌వాడ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా బోధనా రంగంలోకి అడుగు పెట్టారు. 1958లో గుజరాత్ విశ్వవిద్యాలయంలో చేరి, 8 సం॥లు అక్కడ హిందీ సాహిత్యం బోధించారు. ఆ తర్వాత 1964లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రవేశించి, సుదీర్ఘకాలం సాహిత్య బోధన చేసి 1990లో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశారు.

రామ్‌దరశ్ మిశ్ర గత 65 సం॥ల నుంచి తన సుదీర్ఘ సాహిత్య ప్రయాణం కొనసాగిస్తున్నారు. 1951లో ఆయన తన తొలి కవితా సంపుటి 'పథ్ కే గీత్' (దారిన పాడే పాట) వెలువరించారు. ఆ క్రమంలో 'బైరంగ్-బేనామ్ చిట్ఠియాం' (స్టాంపు-చిరునామా లేని లేఖలు), 'పక్ గయీ హై ధూప్' (ఎండ పండిపోయింది), 'కంధే పర్ సూరజ్' (భుజంపై సూర్యుడు), 'దిన్ ఏక్ నదీ బన్ గయా' (రోజు నదిగా మారిపోయింది), 'మేరే ప్రియగీత్' (నాకిష్టమైన పాటలు), 'బాజార్‌కో నికలే హైం లోగ్' (ప్రజలు మార్కెట్‌కు బయలుదేరారు), 'జులూస్ కహాం జా రహాహై?' (ఊరేగింపు ఎక్కడికి పోతుంది?), 'రామ్‌దరశ్ మిశ్ర కీ ప్రతినిధి కహానియాం', 'ఆగ్ కుఛ్ నహీం బోల్‌తీ' (నిప్పు ఏమీ మాట్లాడదు), 'శబ్దసేతు' (మాటల వంతెన), 'బారిశ్ మేం భీగ్‌తే బచ్చే' (వానలో తడుస్తున్న పిల్లలు), 'హంసీ ఓఠ్ పర్

– ఆంఖేఁ నమ్‌హైఁ' (పెదాలపై నవ్వు – కళ్లలో చెమరింపు), 'ఐసే మేఁ జబ్ కభీ' (ఇలాగే ఎప్పుడో ఒకప్పుడు), 'ఆమ్ కే పత్తే' (మామిడాకులు), 'తూ హీ బతా ఐ జిందగీ' (జీవితమా! నువ్వే చెప్పు), 'హవాయేఁ సాథ్ హైఁ' (గాలులు తోడున్నాయి), 'కభీ కభీ ఇన్ దినోఁ' (అప్పుడప్పుడు ఈ రోజుల్లో), 'ధూప్ కే టుకడే' (ఎండ తునకలు), 'ఆగ్ కీ హఁసీ' (నిప్పుల నవ్వు), 'లమహే బోల్ తేహైఁ' (క్షణాలు నవ్వుతాయి), 'ఔర్ ఏక్ దిన్' (మరొక రోజు), 'మైఁతో యహాఁ హూఁ' (నేనైతే ఇక్కడే ఉన్నాను), 'అపనా రాస్తా' (తమ దారి) మొదలైన కవితా సంపుటాల్ని వెలువరించి హిందీ కవితా ప్రేమికుల హృదయాలలో ఆయన అమితమైన గౌరవాభిమానాల్ని ఏర్పరుచుకున్నారు.

రామ్‌దరశ్ మిశ్ర కవితా రచనతో సాహిత్య సృజన ప్రారంభించి నవల, కథా రచన వైపు వడివడిగా ముందుకు సాగారు. వీరి నవలలు హిందీ సాహిత్య లోకంలో చాలా ప్రసిద్ధి పొంది, అనేక విశ్వవిద్యాలయాల్లో హిందీలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలుగా కూడా నిర్ధారించబడ్డాయి. ఆయన రాసిన కథలు కూడా సమకాలీన హిందీ కథా రచయితల్లో రామ్‌దరశ్ మిశ్ర గారికి ఒక సమున్నతమైన స్థానాన్ని సంపాదించి పెట్టాయి. చాలాకాలం పాటు విమర్శకులు మిశ్రగారిని ప్రఖ్యాత కథా–నవలా రచయితగానే చెపుతూ వచ్చారు. తన 65 సం॥ల సాహిత్య యాత్రలో రామ్‌దరశ్ మిశ్ర ఏ వాదాన్ని అంటిపెట్టుకోకుండా, ఏ ఉద్యమ జెండాను భుజాన్న వేసుకోకుండా తానున్న కాలం, సమాజంలో తాను నిశితంగా గమనించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల్ని – సమస్యల్ని తన రచనల్లో సమర్థంగా ప్రతిఫలింజేస్తూ వచ్చారు. కాలగమనంలో మారుతున్న విలువల్ని, జీవనశైలిని యథాతథంగా తన నవలలు, కథల్లో చిత్రించే కృషి సల్పారు. రచయితకు గల గ్రామీణ నేపథ్యమే ఆయన ప్రతి రచనకు ప్రేరణ, ఊపిరి, పునాది. గ్రామీణ జీవిత వర్ణన ఆయన రచనల్లో ప్రత్యేకమైన అంశం. ఆయన సృజనాత్మక రచనలన్నింటిలోను బాల్యంలో తన గ్రామంలో కలిగిన అపురూపమైన, ఆనందకరమైన అనుభూతుల ప్రభావం కనిపిస్తుంది. మానవ విలువలకు సంబంధించి ఆయనకు గల దృక్పథానికి మూలాలు కూడా ఆయన గ్రామంలోనే ఉన్నాయి. కారణం – ఆయన గ్రామీణ జీవితపు ఆనందాన్ని పరిపూర్ణంగా ఆస్వాదిస్తూ పెరిగాడు. అక్కడి మానవ సంబంధాల మాధుర్యాన్ని, మానవ విలువల సౌరభాన్ని తనివితీరా చవిచూశారు.

రామ్‌దరశ్ మిశ్ర రచించిన నవలల్లో 'పానీ కే ప్రాచీర్' (నీటి ప్రహరీలు), 'జల్ టూట్‌తా హువా' (తునియలౌతున్న నీరు), 'అపనే లోగ్' (తనవాళ్లు), 'దూసరా ఘర్' (రెండో ఇల్లు) మొదలైనవి చాలా ప్రసిద్ధి గాంచినవి. కథల్లో 'సీమా' (సరిహద్దు), 'సడక్' (రోడ్డు), 'లడకీ' (బాలిక), 'సర్పదంశ్' (పాముకాటు), 'బజతా హువా రేడియో' (మోగుతున్న రేడియో), 'ఖండహర్ కీ ఆవాజ్' (శిథిలపు ధ్వని), 'ముర్దా మైదాన్' (మరణించిన ఆటస్థలం) మొదలైనవి మంచి కథలుగా పేరు గాంచినవి.

రామ్‌దరశ్‌మిశ్ర రచనలపై, ఆయన జీవిత కాలంలోనే ఎన్నో విశ్వవిద్యాలయాల్లో లెక్కకు మిక్కిలి పరిశోధనలు జరగటం ఆయన రచనా ప్రతిభకి తార్కాణం. ఆయన నవలలపై 102 పరిశోధనలు, కథలపై 12, కవిత్వంపై 16 పరిశోధనలు జరగటం వర్తమాన హిందీ సాహిత్యంలోనే ఒక అద్భుతమైన విషయం. ఇంకా ఆయన సాహిత్యంపై పరిశోధనలు దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో జరుగుతూనే ఉన్నాయి. 'జల్ టూట్‌తా హువా', 'అపనే లోగ్', 'ఏక్ వహ్', 'కితనే బజే హై', 'జహాఁ మై ఖడా హూఁ', 'కంధే పర్ సూరజ్' మొ॥న రచనలకు ఉత్తరప్రదేశ్ హిందీ సంస్థాన్ పురస్కారాలు 'రోశనీ కీ పగడండియాఁ' రచనకు ఢిల్లీ హిందీ అకాడెమీ పురస్కారం లభించాయి.

రామ్‌దరశ్ మిశ్ర గద్యరచనలపై జరిగిన శతాధిక పరిశోధనలు, ఇంకా ఎక్కువ సమీక్షలు, వాటికి వచ్చిన పురస్కారాలు ఆయనను ప్రతిభా పాటవాలు గల కథ – నవలా రచయితగా నిరూపిస్తూ ఉంటే, 2011లో ఆయన కవితా సంపుటి 'ఆమ్ కే పత్తే' (మామిడాకులు)కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కె.కె. బిర్లా ఫౌండేషన్ వారి రూ. 2,50,000/–ల 'వ్యాససమ్మాన్' గౌరవం లభించటం రామ్‌దరశ్‌మిశ్రని ఉత్తమోత్తమ కవిగా నిలబెట్టింది. ఇప్పుడు ఆయన మరొక కవితా సంపుటి 'ఆగ్ కీ హఁసీ' (నిప్పుల నవ్వు)ని కేంద్ర సాహిత్య అకాడెమీ 2015వ సంవత్సరానికి గాను (హిందీలో) పురస్కారం కోసం ఎంపిక చేసి, రామ్‌దరశ్ మిశ్రని సాటిలేని మేటికవిగా గుర్తించింది. నిజానికి హిందీ సాహితీప్రియులు ఆయనను దశాబ్దాల క్రితం నుంచి ఉత్తమ కవిగా అభిమానిస్తూనే ఉన్నారు.

రామ్‌దరశ్ మిశ్ర తన కవితల్లో సంఘర్షణశీలమైన మానవజీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించారు.

సామాన్య మానవుని దశ-దిశ, బాధలు-వ్యథలు, ఆశలు-ఆశయాలు మొదలైన వాటికి సహజ సుందరమైన అక్షరాభివ్యక్తి కల్పించారు. తన కవితల ద్వారా యుగధర్మాన్ని చిత్రించిన గొప్ప కవిగా ఆయన మానవ సంబంధాలలో చోటు చేసుకున్న కృత్రిమత్వాన్ని, డొల్లతనాన్ని తేటతెల్లం గావించారు. సామాజిక అసమానతలు, దౌర్జన్యాలు, అన్యాయాలకు కారణభూతమైన వ్యవస్థని తన కవితల ద్వారా సూటిగా ప్రశ్నించి, రచయితకున్న సామాజిక బాధ్యతను నెరవేరుస్తూ వచ్చారు. వైజ్ఞానిక ప్రగతి, పెడద్రోవ పడుతున్న నాగరికత ప్రస్తుత సమాజంపై చూపుతున్న దుష్ప్రభావాల్ని వస్తువుగా స్వీకరించి ఆయన మనిషి ఒంటరిగా మారిపోతున్న వైనాన్ని కవిత్వీకరించారు. గ్రామీణ జీవితంలో వచ్చిన మార్పుని, విలువలు నశించిపోయిన విషయాల్ని ఆయన చాలా బాధతో వ్యక్తీకరించారు. మనిషే ఆయన కవిత్వానికి మూలబిందువు. నిజమైన మానవ ప్రగతే ఆయన ఆకాంక్ష. మానవత్వపు పరిమళాలను వ్యాపింపజెయ్యటమే ఆయన కవిత్వ ఆశయం.

'ఆగ్‌కీ హఁసీ' (నిప్పుల నవ్వు) అనే కవితలో రామ్‌దరశ్ మిశ్ర మనిషిలో సహజంగా ఉండాల్ని ప్రేమ, దయ, కరుణలాంటి గుణాలు కనుమరుగైపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తారు. ఫలితంగా అతని నవ్వు సహజంగా కాక కపటంతో, వికృతంగా, వెూనపూరితంగా, ద్వేషమయంగా మారిపోయిందని, బయటకు నవ్వుతూ కనిపించే మనిషి అంతరంగం విషపూరితంగా తయారైందని బాధాతప్త హృదయంతో తెలియజేస్తారు. కవిత ఇలా సాగుతుంది- ''పొయ్యిలోని నిప్పుల్లో నుంచి / వేడి వేడి రొట్టెలు వెలువడతాయి / అవి మనిషి ఆకలి మంటని చల్లారుస్తాయి / నెమ్మది నెమ్మదిగా / అవే మనిషి నవ్వుగా రూపాంతరం చెందుతాయి / ఏమీ అనుకోకపోతే మహాశయా! / కొంచెం మీరు అద్దం ముందు నిలబడి చూసుకోండి / మీ చల్లని మర్యాదపూరితమైన నవ్వులో / పరుల కళ్లకి కనిపించని ఎలాంటి నిప్పు పొటమరిస్తుందో / ఇక అది క్రమక్రమంగా / మహాజ్వాలగా మారి / దిక్కులన్నింటినీ చుట్టుముట్టి ఎలా కాల్చేస్తుందో / అయినా మీ మాయ ప్రభావం ఎలాంటిదంటే / నిప్పుని పొయ్యే రగిలించిందని / ప్రజలు అనుకుంటారు / / ఓ మాయావీ ! నీ మాయ ఎంత హాస్యభరితం !!"

"ఉంచాయీ" (ఎత్తు) అనే కవితలో రామ్‌దరశ్‌మిశ్ర వైజ్ఞానికంగా అభివృద్ధిని సాధించిన మనిషి సాటి మనుషులకు దూరమై, చివరకు కలత చెందక తప్పదని హెచ్చరిస్తాడు. ఒంటరితనంవల్ల కలిగే భయం, ఎదిగే క్రమంలో అతనికి తెలియదని, అతని అవిశ్రాంత జీవన యానంలో తన నుంచి తాను కూడా దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేస్తాడు. కవిత ఇలా ఉంటుంది. "మెట్లు / మెట్లపై మెట్లు / మెట్లు, మెట్లు, మెట్లు / పైపైకి ఎక్కటమే ఎక్కటం / / ఎంత ఉత్సాహపడ్డాడతను / ఎత్తు నెత్తి నెక్కి గర్వపడ్డాడు / పిచ్చినవ్వొకటి నవ్వి / నిర్లక్ష్యంగా చూశాడు -/ తాను వదిలి వచ్చిన భూమిని / అప్పటికే అక్కడికి చేరిన తెల్లని గుంపు / అన్నది అతనితో మర్మపూరిత స్వరంతో / 'ఈ ఆకాశంలోకి స్వాగతం !' కాని ఇప్పుడతనికి అనిపిస్తుంది- / తాను ఒంటరినై పోతున్నానని / ఎక్కడ కింద పడిపోతానో నన్న భయం / అనుక్షణం అతన్ని నమిలేస్తుంది / కలలో ఎవరో లాక్కునిపోతున్నారు - / అతన్నుంచి అతన్ని / అతనేమో ఇప్పుడు నిద్రలో / ఉలికులికి పడుతున్నాడు!"

"శికారీ" (వేటగాడు) అనే కవితలో అశాంతి, భయం గుప్పెట్లో బ్రతుకుతున్న నిస్సహాయులైన పట్టణ ప్రజల అలజడికి కారణభూతుల్ని అన్వేషించే ప్రయత్నం కవి చేస్తాడు. కవిత ఇలా సాగుతుంది- ''ఇప్పుడు అరణ్యాలుగా మారిపోయాయి పట్టణాలు (గ్రామాలు కూడా) / తుపాకి గుళ్ళ చప్పుళ్ళు గర్జిస్తున్నాయి / పరుగులు తీస్తున్నారు మామూలు ప్రజలు గాయపడ్డ పశువుల్లా / అరుపులు పెడబొబ్బలతో ప్రతిధ్వనిస్తున్నాయి దిక్కులు / 'ఎక్కడ వేటగాడు - ఎక్కడ వేటగాడు?' - / అని అడుగుతున్నారు ప్రజలు శవాల్ని / సమాధానం లేదు / రాత్రిపూట నిశ్శబ్దంలో / ప్రతి మనిషి లోపలున్న చీకటిలో నుంచి / వెలువడుతోంది ధ్వని - / 'నేను ఇక్కడే ఉన్నాను' అని"


"అంధేరే కే విరుద్ధ్" (చీకటికి వ్యతిరేకంగా) అనే కవితలో కవి సామాజిక బాధ్యతతో లోకంలో అలుముకున్న చీకట్లను పారద్రోలటానికి చిరుదీపం వెలిగించటం గొప్ప ప్రయత్నమని భావిస్తాడు- "వాళ్లు జట్లు కట్టి గట్టి గట్టిగా అరుస్తున్నారు- / చీకటికి వ్యతిరేకంగా / ఉండుండి పడిపోతున్నారు తమంతట తామే / చీకటి మరింత గాఢమౌతూ ఉంది / వాళ్లలోనే తిష్టవేసి చిరునవ్వు చిందిస్తుంది// అతను ఒంటరిగా నడుస్తున్నాడు మౌనంగా నిశ్శబ్దంగా / కాని / నడిచేటప్పుడు వెలిగించాడతను ఒక దివిటీ / అవును, అతను ఒంటరి కాదు / చిన్నదే అయినా, ఒక వెలుగు అతనిలో ఉంది / దానివల్ల చీలికలైన చీకటి గజగజ వణికింది / అతనేమో నెమ్మదిగా చిరునవ్వు నవ్వుతున్నాడు."

"జనతా కీ ఓర్" (ప్రజలపక్షం) అనే కవితలో రామ్‌దరశ్ మిశ్ర అధికారమదాంధులైన ప్రజానాయకులకు ప్రజలు బుద్ధి చెప్పి తీరతారని, అందువల్ల వాళ్లు బాధ్యత గుర్తెరిగి దేశహితం-ప్రజా సంక్షేమం సాధించేందుకు నడుంకట్టాలని హితవు చెపుతాడు- "నిలుస్తుందో పోతుందో తెలియదుగాని - / కేజ్రీవాల్ ప్రభుత్వం / తెలియజెప్పాడతను / అధికారం మదం తలకెక్కిన నాయకులకు - / అధికారం ఏర్పరిచిన సౌఖ్యపు రహదారి / ప్రజలవైపుకే వెళుతుందని // మీకు ప్రజలు అందించింది నిరంకుశ అధికారం కాదు / దేశహితం చూడమని ప్రజలు మీకు అప్పగించిన బాధ్యత / ఇప్పుడు మీరు విశిష్ట నాయకుల్లా కాక సామాన్యులుగా మారి / ప్రజలవైపుకు మళ్లాల్సి ఉంది / మీ మీ ధగధగల గలీబు నుండి బయట పడి / వాళ్ల సుఖదుఃఖాలతో మమేకం కావాలి."

సమాజాన్ని సరైన దిశగా నడిపించటం, మాలిన్యం-కాఠిన్యం పేరుకుపోతున్న వ్యక్తుల మనస్సులను ప్రక్షాళన చెయ్యటం పరమాశయాలుగా, తన కవితా సృజన కొనసాగిస్తున్న రామ్‌దరశ్ మిశ్ర తన తల్లిదండ్రులు, సొంత ఊరు, సమాజం ద్వారా తనకు సంక్రమించిన సద్భావాలు, మానవత్వపు విలువల వారసత్వాన్ని భావితరాలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు. "విరాసత్" (వారసత్వం) అనే కవితలో ఆయన ఇలా అంటారు. "అమ్మా! నువ్వు నాకు అందించిన ప్రేమని-సత్యాన్ని / కాపాడుతూ కాపాడుతూ నేను బాగా అలసిపోయాను/ నువ్వు చెప్పావు-/ 'నాయనా! నీలో ఈ సత్యాన్ని నాటుతున్నాను/ దీనిని వృక్షంలా ఎదగనివ్వు / నీకు తెలుసుగా నాయనా ! / చెట్టు తన కోసం జీవించదు / అది తన నీడని, పరిమళాన్ని, ఫలాల్ని / విస్తరింపజేస్తుంది- పంచుతుంది' // అమ్మా ! నేను దాన్ని పెరగనిచ్చాను / కాని లోకులు దాని కొమ్మలు నరుకుతున్నారు, నరుకుతూనే ఉన్నారు / తమ తమ స్వార్థం కోసం / వాళ్లు దానిపై వసంతాన్ని రానివ్వటం లేదు // అమ్మా ! నేను దాని విత్తనాన్నొకదాన్ని జాగ్రత్త చేసుకున్నాను / దాన్ని చేతపట్టుకుని తిరుగుతూనే ఉన్నాను / ఎవరిలోనైనా కొంచెం మట్టి కనిపిస్తే / ఆ విత్తనాన్ని నాటుదామని!"

90వ పడిలో కూడా అలుపెరగని కవితాసేద్యం చేస్తున్న మూర్తీభవించిన మానవత్వం రామ్‌దరశ్ మిశ్రని అభినందిస్తూ, ఆయన పూర్ణాయుష్కుడు కావాలని, హిందీ సాహిత్య దీప్తిని ఆయన విస్తరింపజేస్తూనే ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.

***



డా. వెన్నా వల్లభరావు
విజయవాడ - 520 013.
ఫోన్ : 949 033 7978

## మన్మోని

అంతవరకూ
వెంట ఉండి ఉండీ
అసలు యాల్లకు పిసల్ గయా
తాతకు దొరుకదు కొండిగాడు

మనసుల ఒకటి పెట్టుకొని
మీదికి ఇంకోటి మాట్లాడుతడు
నూనె లేకుండానే బూరెలు పొంగిస్తడు
నిప్పు లేకుండానే పొయ్యి రాజేస్తడు

ఇగ వత్తనని
పత్తా లేకుండా పోతడు
గటు పోతనని
ఇంకెటో నడుత్తడు
ఈ చెయ్యి చేసే పని
ఆ చెయ్యికి తెలువనివ్వడు
ఆ చెయ్యి చేసే పని
ఈ చెయ్యికి ఎరుక కానివ్వడు

నోట్లో నాలుకలెక్క మెదులుతడు
కడుపుల తలకాయ పెడుతడు
ఊ అంటే వగల ఏడుపులు ఏడుత్తడు
కిందికి నీళ్ళు తెచ్చేదాక తెలువనివ్వడు

ఏక కాలంలో
శత్రువుతోని మిత్రునితోని
అలాయ్ బలాయ్ తీసుకోగలడు
కండ్ల నీళ్ళు తుడిచినట్టే కనిపిత్తడు
కడుపుల సొచ్చినట్టే మాట్లాడుతడు

నీళ్ళ మీద దెబ్బ పెట్టినట్టు
నాస్త నాస్తగా ఇల్లు ముంచుతడు
విదియనాడు కాకున్నా
తదియ నాడు తానై తప్పక కనపడుతడు
ఏ మందల కదుతడో
ఏ మందిల ఈనుతడో అరికీసు తెలువనియ్యడు
అక్కెర నొక్కాలె

మూతికి చిక్కం వుండగానే
గడ్డి కాజేత్తడు
తప్పదీసే ఇక్మతులు
వీడు ఒట్టుపెట్టి అబద్ధాలకు
ఓట్లకు నోట్లకు పుట్టినోడు

ముందు
పొద్దుగాల నెత్తిమీద గంగను చల్లుకొని
సూర్యునికి మొక్కెటోడు
అరొక్క పనోల్లు ఇసిరెలకు
దండంపెట్టి పని మొదలు పెట్టేటోడు
ఇప్పుడు
తెల్లారిలేత్తే కల్దారి రూపాయిని
కండ్లకు అద్దుకుంటుండు

జూకంటి జగన్నాథం
సిరిసిల్ల.
ఫోన్ : 944 107 8095

# కథలెందుకు?


"అమ్మా! నిద్ర రావటంలేదమ్మా, ఒక కథ చెప్పమ్మా!"

"అనగనగా ఒక ఊరు! ఆ ఊరిలో ఒక పేదరాసి పెద్దమ్మ..." ఇలా సాగిపోతుంది కథ!

భాష పుట్టినప్పటినుండి కథలు చెప్పుకుంటూనే వున్నారు! ప్రకృతిలో మనుష్యులకున్న ప్రత్యేకత భాష! మిగతా జీవరాశుల నుండి స్పష్టంగా మన ప్రత్యేకతను తెలిపేది భాష! పదాలుకాని, చిత్రాలుకాని, సంగీతంకాని ఏ ప్రక్రియ అయినా మనకున్న విశిష్టతను చాటిచెప్పేవే!

కథలు అల్లడం - చెప్పటం ఒక కళ! అన్ని సంస్కృతులలో ఆదరణ పొందిన పురాతన కళ ఇది! కథలు మనల్ని బయటి ప్రపంచానికి అనుసంధానం చేస్తాయి. సాంఘిక బాధ్యతను, నీతినియమాలను, జీవన విధానాలను లోకంలోని కష్టసుఖాలను కళ్ళెదుట వుంచుతాయి. బ్రతుకు బరువు, బాధ్యతలను - ఆటుపోట్లను భరించటం గురించి మనల్ని సన్నద్ధం చేస్తాయి!

అందుకనే మంచి కథల ఆవశ్యకతను గుర్తించి అవి ఎలా ఉండాలో పరిశీలిద్దాం! వాటి శక్తి ఏమిటో చూద్దాం.



అనగనగా ఒక రాజు...

## మొదటగా...

కథలు మనల్ని అలరిస్తాయి, ఎందుకంటే...

అక్షరాలకు కథ ఆటమైదానం వంటిది! అక్కడ మాటలయొక్క అంతులేని శక్తి వ్యక్తమౌతుంది. పదాలకు ఉన్న అస్పష్టమైన శక్తి, సృష్టించటానికైనా, నాశనం చెయ్యటానికైనా, సంకెలలు వేయటానికైనా, విముక్తి చేయడానికైనా ఈ శక్తి మనకు కథాకథనంలో బహిర్గతమవుతుంది.

అక్కడ భాషకందని భావావేశం, నిఘంటువుల్లో లేని అంతరార్థాలు మన అనుభూతికి వస్తాయి! ప్రతి మంచి కథలోని సన్నివేశాలు మన జీవితాలకు సన్నిహితంగానే అనిపిస్తాయి!

## రెండవది...

కథలు అన్యోన్యతను సృష్టిస్తాయి. చెప్పేవారికి, వినేవారికీ అనుబంధం కథ! అందులో ప్రాదేశిక సాన్నిహిత్యం వుండవచ్చు. ఏకాంత జీవన చిత్రాలు ఉండవచ్చు లేదా ఒక పుస్తకం ఇద్దరు చదివిఉంటే వారికి ఆ కథే పరిచయకర్త! వారు సన్నిహితులై అందులోని సన్నివేశాలు చర్చించుకోవటానికి వేరే వేదిక అవసరం లేదు! ఇక వారు ఎంతమాత్రం అపరిచితులు కారుకదా! అంతేకాదు ఈ అనుబంధాలను, పవిత్రమైన కథలు మరీ బలోపేతం చేస్తాయి. ప్రజలను ఒక సమాజంగా వ్యక్తీకరిస్తాయి.

తథాగతుని కథలు, క్రీస్తు వాస్తవ చరిత్ర, మహమ్మద్ ప్రవచనాలు ఇందుకు చారిత్రక తార్కాణాలు! అంతేకాదు, ఇందులో పొంచివున్న ప్రమాదం - ఈ పవిత్రమైన కథలు, ప్రజలను విడదీస్తాయి కూడా; అందులోనించే 'పవిత్ర యుద్ధాలు', నరమేధాలు జరిగి చరిత్ర పుటలు, రక్తపు మరకలతో ఎండిపోయి వున్నాయి.

ప్రతి శక్తిలాగానే ఈ కథ కూడా ప్రమాదకారే! ఉదాహరణకు ఇప్పటి సినిమా కథలు, టెలివిజన్ సీరియల్స్, యాడ్స్ - ఇవన్నీ మన కాలాన్ని ఎంత వృధాచేస్తున్నాయో మన కోర్కెలను ఎలా వక్రీకరిస్తున్నాయో వివరించవలసిన పనిలేదు! అందులో చూపించే హింస, క్రూరత్వం మనసును మొద్దుబారజేస్తాయి.

అందులో రంగుల్లో చూపే కట్టుకథలు, మనలో ఆలోచనలు రేకెత్తించాల్సినదిపోయి మన బుద్ధిని మందగింపచేసి అనాలోచనాపరులుగాచేసి, రక్తదాహంతో కేకలువేసే మందలా తయారుచేస్తాయి! ప్లాస్టిక్ బొమ్మల్లాంటి పాత్రలు, కృత్రిమ వాతావరణంలో గంతులు వేస్తుంటే కళ్ళప్పగించి చూసే జీవచ్ఛవాలుగా మారిపోతున్నాము!

అమెరికాలో ఇటీవల ఒక చెత్త టెలివిజన్ షో చూసి భరించలేక, తన నిరసనను ప్రపంచానికి తెలియచెప్పటానికి ఒక మహిళ మూడో అంతస్తునుంచి దూకి ఆత్మహత్య

చేసుకుంది! సరిగ్గా ఇప్పుడే, వీటికి విరుగుడుగా మంచి కథలు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కథలు మన ఒంటరితనాన్ని ఎలా మరిపింపచేస్తాయో, అలాగే ఈ మందల నుంచి కూడా మనలను కాపాడగలవు!

## మూడవది....

కథలు మనకు ఇంకొకరి దృష్టిలో నుంచి ప్రపంచాన్ని చూసే అవకాశం కలిగిస్తాయి. ఇంకొకరి అనుభూతులను అవగాహన చేసుకొని కొంతవరకు తాదాత్మ్యం చెందడానికి దోహదం చేస్తాయి. అంతేకాదు కథ నడుస్తున్నప్పుడు చిన్నవాళ్ళు పెద్దవాళ్ళ అనుభవాలను అంచనా వేసుకో గలుగుతారు! వయసుమళ్ళినవాళ్ళు వయసులోని అనుభూతులను నెమరువేసుకోగలుగుతారు!

మగవాళ్ళ, ఆడవాళ్ళ ఆలోచనలను అర్థం చేసుకోవటానికి, ఆడవాళ్ళు మగవాళ్ళ భావావేశాన్ని అంచనా వేసుకోవటానికి ఇది వేదిక! ఈ విధంగా కథల ద్వారా బాల, తరుణ, వృద్ధ వయోపరిమితులను దాటి, స్త్రీ పురుష లింగభేదాలను ఛేదించి, జాతి, మత, వర్గ తారతమ్యాలను అధిగమించి, శత్రుభావాన్ని జయించి, ప్రాదేశిక సరిహద్దులను చెరిపేస్తూ మన ప్రయాణం సాగిపోతుంటుంది!



జిత్తులమారి..

అంతేకాదు! మనుషులు జంతువులతో మాట్లాడడం, వృక్షాలతో సంభాషించటం, నదులతో సరసాలాడటం కూడా గమనిస్తాం! అందులో మంచి బాతులు, కాకులు, తెలివి తక్కువ తాబేళ్ళు, జిత్తులమారి నక్కలు, మంద బుద్ధి మొసళ్ళు మనకు నర్మగర్భంగా పాఠాలు చెప్తాయి.

మగవాడు ఆడదానిగా మారగలడా? స్త్రీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోగలడా? అది ఎంత సంభవమో, మనుషులు జంతువులతో సంభాషించటం కూడా అంతే! కానీ అంతులేని ఊహాలోకంలో ఏదైనా సంభవమేకదా! ఈ విధంగానే కదా ఈ సరిహద్దులన్నీ దాటగలిగేది!

ఇంకొకరి కళ్ళల్లో నుంచి ప్రపంచాన్ని చూడగలమా? అది ఎంత అద్భుతమైన విషయం! కానీ కథల ద్వారా ఆ అద్భుతానికి దగ్గర్లోనికి రాగలం!

## నాలుగవది..

**కథలకున్న శక్తి :** మన క్రియలకు పర్యవసానం తెలుసుకోగలగడం! తద్వారా బాధ్యతాయుతంగా ప్రవర్తించటం, ముందు జరగబోయే మంచి చెడులు అంచనా వేసుకుని, అందుకు అనుగుణంగా మన ఆలోచనలు – ఆచరణలో పెట్టగలగటం! మన గుణగణాలను ప్రవర్తింప చేసుకోగలగటం! ఆలోచన నుండి ఆచరణకు, ఆచరణ నుండి ఫలితాన్ని అంచనావేసి అందుకు అనుగుణంగా మన బుద్ధికి శిక్షణ ఇవ్వగలగటం. మనలను నీతిపరులుగా మలచగల శక్తి కథలకున్నది.

## ఐదవది..

మంచి కథలు మనల్ని మంచిగా మనిషిగా, బ్రతకటానికి దోహదం చేస్తాయి, దారి చూపుతాయి.

కథలకున్న మరొక శక్తి, మన కోరికలను సరైన దారిలో నడపటం. మన స్వార్థపరత్వాన్ని ప్రక్కనపెట్టి, మన భయాలను పారద్రోలి, మంచి కథలు మనకు జీవితంలో విలువైన వాటి రూపురేఖలను, పొందవలసినవాటి ప్రతిబింబాలను, చెయ్యవలసిన కార్యాల ఆకారాలను మన కళ్ళముందు ఉంచగలవు! 'నీతి చంద్రికలు' గాని, 'పంచతంత్రాలు' గాని మనకు నేర్పేది – కోర్కెలను క్రొత్త కోణాలిచ్చి, అంటే స్వార్థం నుంచి ఔదార్యానికి, అనుమానాల నుండి ఆప్యాయతకు నడుపుతాయి. ప్రాపంచిక విషయ లోలత్వం నుంచి దాతృత్వానికి, ఆధ్యాత్మిక చింతనకు దారిచూపిస్తాయి!

5 వేల సంవత్సరాలనాటి "మహాభారతం"లోని పాత్రలు మనకు ఈనాటికీ అడుగడుగునా తారసపడతాయి! మనం ఏ పనిచేస్తే ఏమి ఫలితమో తెలియచెప్పి తెలివిగా నడుచుకోమంటాయి!

## ఆరవది...

కథల్లో వర్ణించే ప్రదేశాలు, నదులు, పర్వతాలు, అరణ్యాలు – మనకు ఎప్పుడూ గుర్తుచేసేది – మనం ఈ భూమ్మీద ప్రాణులమని! మనకూ నేలకు అవినాభావ సంబంధం వుందని! మనం ప్రకృతిలో భాగమని!

కథల్లోని ఈ శక్తి మనకు ఒక విధమైన సుస్థిరతను, ఒక ప్రదేశానికి చెందినవారమనే అభిమానాన్ని, 'ఇంటిలో' వున్నామనే మనోధైర్యాన్ని కలిగిస్తాయి! మనం పనిచేసే ప్రదేశం, మనం నివసించే నివాసం, మనతో కలిసిమెలిసి

ప్రతికే కుటుంబ సభ్యులు వీటన్నింటికీ మనం ఎంత సమీపంలో ఉంటే, మనకు అంత మనోధైర్యం వుంటుందని తెలియచెప్పేవి కథలు; ఇంటిని మించిన స్వర్గం లేదని పదేపదే గుర్తుచేస్తాయి. “నీ గూడు – నీ నాడు వదలకు” అని ప్రబోధిస్తాయి! పూర్వీకులు కొండల గురించి, గుహల గురించి, నదుల గురించి చెప్పిన కథలలో వారి మనసులోని ప్రదేశాలు – ఆ ప్రదేశాల్లోని వారి జీవితం – ఇదేకదా – వారి స్థిరత్వానికి, అభయానికి మూలకారణం!

ఈ కథలనుంచే కదా; మనం ఈ నేలమీద రక్తమాంసాలతో తిరిగే జీవులమని, ఒకరికొకరు చెందుతామని, మిగతా జీవజాలంతో కలిసిమెలిసి జీవనం సాగిస్తామని గుర్తుచేసుకుంటాం! ఈ కథల్లోని పాత్రలన్నీ సజీవ సాక్షులేకదా!

ఈ పురాతనమైన కథల్లోనేకదా, సుదూర గతం నుండి అప్పటి జనజీవనం, పర్యావరణం ప్రకృతితో వారి సర్దుబాట్లు ఇవన్నీ మనకు అవగతం అయ్యేది?

మన పూర్వీకుల సంగతి ఎలా వున్నా మనం ముమ్ముందు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలంటే నేలకు – మనిషికీ ఒక ఆప్యాయకరమైన అనుబంధం పెంపొందించుకోవాలి!



సాహసవీరుడు

## ఏడవది...

కథల్లో కాలం : కథల్లో ప్రదేశం ఎంత ముఖ్యమో 'కాలం' అంతకంటే ముఖ్యమైంది! ఇక్కడ ముఖ్యమైనది తేదీలు, గడియారం కాదు! చరిత్ర బహిరంగమైనది! ఇది తేదీలకు, గడియారం ముళ్ళకు కట్టబడి వుంటుంది! జరిగిన సంఘటనల – సంఘర్షణల క్రోడీకరణ చరిత్ర కథ! కానీ, మానసికమైన 'సమయం' ఆంతరికం! జ్ఞాపకాల నిరంతర ప్రవాహం, ఎడతెగని ఆగామి చింతన, ఇవి మనం స్పృహలో ఉన్నంతకాలం ఆగేవి కావు! కథాకథనం, మనల్ని పై రెండు రకాల కాలజ్ఞానంతో ముడిపెట్టి (బాహిరము, ఆంతరికము) పాత్రల జీవన స్రవంతిలో ఆది నుంచి తుదివరకూ మనల్ని ప్రయాణింపచేస్తుంది. మరొకసారి కథల సాంఘిక బాధ్యతను గుర్తుచేసుకోవలసిన అవసరం ఉన్నది.

కార్యకారణ సంబంధంగా, మనం ఎంచి చేసే ప్రతి కార్యానికి, పర్యవసానం – భవిష్యత్తులో సిద్ధంగా వుంటుందని మరువకూడదు! మనం చేసే పనులు – ఈ విశ్వాంతరాళంలో ఎక్కడో 'రికార్డు'వుతూనే వుంటాయి. మనం వేసే విత్తనాలే మన పంటకు మూలం కదా?

కథలు అనుభూతుల్ని ఆకారాలుగా మార్చి కాలంతో ప్రయాణింపచేస్తాయి! ఆనువంశిక లక్షణాలను డి.ఎన్.ఏ. ముందు తరాలకు అందించినట్లుగా, కథకులు తమ అనుభవాలను భావితరాలకు కథనం ద్వారా అందిస్తారు!

## ఎనిమిదవది...

కాలగమనాన్ని గమనించినపుడు, ఇష్టమైనవి కాలగర్భంలో కలిసిపోతున్నప్పుడు దుఃఖం రాక మానదు! అలాగే రాబోయేవాటి ఆకార వికారాలను ఊహించుకుని భయభ్రాంతులవుతాము.

కథలు మనకు బాధల్ని, విషాదాన్ని పరిచయం చేసి, నష్టాన్ని, మరణాన్ని కళ్ళముందుంచి, వాటి నుంచి ఎలా తట్టుకోవాలో అవగతం చేస్తాయి తమ పాత్రల ద్వారా! ఎన్నో కథల్లో బలహీనులు బలవంతుల్ని జయించటం, బాధపడేవాళ్ళకు ఎవరో అండగా నిలవడం చూస్తాము.

ద్వేషాన్ని ప్రేమతో జయించటం చదివి మన బాధల్ని మరిచిపోతాము! దుఃఖాన్ని నవ్వులతో కొట్టిపారేస్తాము!

ఇది కేవలం – పలాయనం అనుకుంటే – సరికాదు! ఖైదులో వున్నవాడికి బైటపడటం ఆనందదాయకం కదా!

సింద్‌బాద్ కథల్లో – సింద్‌బాద్ ఎన్నిసార్లు మృత్యుకుహరం నుండి బయటపడ్డాడు! ఎన్నిసార్లు తన భయంకర సముద్ర యాత్రల నుంచి తిరిగివచ్చి ఇల్లు చేరాడు! నిరాశానిస్పృహలను దరి రానీయక సాహసంతో – మృత్యువుతో, భయంతో, కష్టాలతో పోరాడాడు!

ఎప్పుడూ కష్టాలు తెలియని, ఇల్లు వదలనివాళ్ళకైనా ఏదో ఒకనాడు ఇవన్నీ దూరమైపోతాయని, చివరికి మరణం కూడా తప్పదని తెలుసుకోవాలికదా! కథలు అందుకు మనల్ని సన్నద్ధులను చేస్తాయి. నిజ జీవితంలో జరుగుతుంటే ఎప్పుడో ఎక్కడో చదివిన గుర్తుగా మనకు మనసులో మెదలుతుంది!

కథలు ఎప్పుడూ ఆనందంగానే ముగుస్తాయి. అంతేకాదు – ఆ ఆనందాన్ని శాశ్వతంగా అన్ని సవాళ్ళకు అతీతంగా వుంచి, మనల్ని జీవితాన్ని ప్రేమించేటట్లు చేస్తాయి.

"అనగా అనగా ఒక రాజ్యంలో (తో) మొదలయి, "రాజు తన ఇద్దరు భార్యల్తో కలకాలం రాజ్యం ఏలాడు" అని ముగిసే కథలో – జీవితానికి శాశ్వతత్వం ఆపాదించటమే – కాలానికీ, మరణానికీ అతీతంగా..! అది సంభవం కాదని తెలిసి కూడా మనం నమ్మటానికే ఇష్టపడతాం! అదేకదా, కథలోని మర్మం!

## తొమ్మిదవది...

కథలు మనకు మనుషులుగా బ్రతకమని మంచిని నేర్పుతాయి. మనం ప్రకృతి జీవులం – కాని కేవలం సహజ జంతు ప్రజ్ఞతోనే జీవించటంలేదు.

జంతువులకు భిన్నంగా అతీతంగా మన ప్రవర్తనావళిని సరిచూసుకోవాలి. సదా జాగరూకులమై మసలుకోవలసిన అగత్యం, సాంఘిక బాధ్యత మనపై వున్నది.

ఇందుకు కథలు – పాత్రలు మనకు త్రోవచూపటానికి వున్నాయి.

ఏదైనా పని చేయటానికి సామర్థ్యం, కుశలత వుండటం వేరు! ఆ సామర్థ్యాన్ని ఎప్పుడు – ఎందుకు ఉపయోగించాలో తెలుసుకోవటమే విజ్ఞత.

కథల్లో – కథనంలో ఎంత సామర్థ్యం, అపారమైన కుశలత అయినా వుండవచ్చు.

కాని అందులో అంతర్లీనంగా వుండే విజ్ఞత మనకు ముఖ్యం!


ఆపదల్లో – ఆయా పరిస్థితుల్లో అప్పటి మనుష్యులు ఎలా స్పందించారు – ఏ విధంగా తమ ముందున్న సవాళ్ళను ఎదుర్కొన్నారు, వారి విజయాలు ఏమిటి – వారి వైఫల్యాలు ఏ విధంగా వున్నాయి, వారి దుఃఖాలు వాటికి కారణాలు ఏమిటి – వారి సంతోషం – సహజీవనం ఇవన్నీ మనకు మార్గదర్శకాలు.

ఎక్కువ కథల్లో – ముఖ్యాంశం – ఏదో ఒక సమస్య! మన జీవితం కూడా నిత్యమూ సమస్యే కదా! ఎన్నో కథల్లోని పాత్రలవలె మనం కూడా జనారణ్యంలో దారితప్పుతాం. అంతులేని సర్కారు వరండాలలో గమ్యం లేకుండా తిరుగుతాం; మనకు సంబంధం లేని రొంపిలో దిగబడి అసహాయంగా చూస్తుంటాం! సరిగ్గా ఇక్కడే ఒక మంచి కథ మీకు దారిచూపితే ఆశ్చర్యపోకండి. మిమ్మల్ని ఇంటికి చేర్చితే రచయితకు కృతజ్ఞతలు తెలుపండి.

## చివరిగా...

మన గూడు – ఈ విశ్వాంతరాళం, ఈ సృష్టి, ఈ ప్రకృతి.

ఎవరైనా ఈ సంక్లిష్టమైన మహాద్భుతమైన విషయాన్ని



చాణక్యుడు

పూర్తిగా అవగాహన చేసుకున్నాను అంటే వాడు పిచ్చివాడైనా అయివుండాలి లేక అసత్యవాదైనా అయివుండాలి! తరతరాలుగా మన పరిశోధకులు తెలిపిన సత్యాలు అలా వుండగా, మనం ఇంకా ఒక మాయలో, తెలియని ఒక అద్భుతమైన రహస్యంలో జీవిస్తున్నాం.

ఈ విశ్వాంతరాళం ఎందుకున్నది?

మనం ఇక్కడకు ఎలా వచ్చాం?

ఈ ప్రాణికోటికి అర్థం ఏమిటి?

మన మనస్సాక్షికి మూలమెక్కడ?

ఈ నాటకమంతా ఏమిటి?

ఎక్కడికి దీని ప్రయాణం?

ఎప్పటికి దీని అంతం?


వీటన్నిటికీ సమాధానాలు మనకు తెలియవు.

ఎంత శక్తిగల కథయినా వీటికి దారిచూపలేదు. కాని, ఈ సృష్టిని, ఈ మర్మాల్ని అంగీకరించినవాడే జ్ఞాని! సరిగ్గా కథలు ఈ పనేచేస్తాయి!

మనం కథల్లో సృష్టించే పాత్రలు, ప్రేమ, దేవతలు, దెయ్యాలు అన్నీ మన చుట్టూ వున్న నిజాలకు అస్పష్టమైన రూపాలే.

భౌతిక శాస్త్రవేత్తలు 'ఈ విశ్వాంతరాళపు మర్మాలు తెలుసుకున్నకొలదీ, మనకు తెలియనిదే ఎక్కువ' అని అంటున్నారు!

అంతుబట్టని కథతో, సంక్లిష్టమైన కథనంతో అనంతంగా సాగిపోయే ఈ సృష్టిరహస్యాలను మానవ మేధస్సు అనే చిరుదీపంతో పరిశోధించటమే ఒక అంతులేని కథ!!



# ఎల్లోరా – కైలాస నాథాలయం

– ఈమని శివనాగిరెడ్డి

అదొక అద్భుతం. నేలమీదే కాదు, నింగిలో కూడా. ఎందుకంటే దేవతలు పుష్పక విమానంలో ఆకాశంలో విహరిస్తున్నప్పుడు ఒక్కసారిగా ఆ అద్భుత కట్టడ వైభవ కాంతులు ఆ పుష్పకాన్ని నిశ్చేష్టను గావించాయట. ఉల్లాసవంతంగా ప్రయాణిస్తున్న దేవతలు ఉన్నఫళంగా విమానం ఆగిపోయేసరికి నిశ్చేష్టులైనారట. ఉలిక్కిపడి తొంగిచూశారట. ఇంకేముంది, అద్భుతం! ఆశ్చర్యం! కడు రమణీయమైన దేవతల రథాన్ని మించిన రూపలావణ్యంతో వాస్తు శిల్ప విన్యాస పరాకాష్టకు మచ్చుతునక అనదగిన కైలాసనాథాలయ రూపురేఖలు తమ విమానయానాన్ని, తమ మనోగమనాన్ని కట్టిపడేసి కదలకుండా చేశాయని తెలుసుకొని దేవశిల్పి విశ్వకర్మ కూడా ముక్కు మీద వేలేసుకొంటాడని మదిలో తలపోశారట!

పశ్చిమ కనుమల మీద పచ్చటి తివాచీ పరచినట్లున్న మనోహర దృశ్యాన్ని ఒకవైపు, ఆకాశంలో దొంతర దొంతరలుగా తెరలు కప్పి, పురులు విప్పుతున్న మేఘాల నరగలు మరోవైపు సాగుతున్నప్పుడు ఒక్కసారిగా ఆగిన విమానంలోంచి కారణమేమై వుంటుందా అని చుట్టూ చూస్తున్నవారికి ఏమీ బోధపడక దిక్కుతోచలేదు. దృష్టి మరల్చి కిందికి చూచేసరికి కనుబొమ్మలు ఎగరవేశారు. తలలను వెనక్కు అనుకున్నారు. కిరీటాలను, వస్త్రాలను సరిచేసుకున్నారు. లిప్తకాలంలో ఏమరుపాటుకు గురియై ఒక మానవ సృష్టికి ఆకర్షితులైనారు. ఇది ఎవరో చెక్కింది కాదని, తనంతట తానుగా పుట్టుకొచ్చిన స్వయంభూశివధామం తప్ప వేరొకటి కాదనుకొన్నారు.

దేవతలే విస్తృతంగా చర్చించుకొనేటట్టు తొలచిన ఈ ఆలయ శిల్పి తన పేరు శాశ్వతం గావించుకొన్నాడని కర్కరాజు బరోడా రాగిరేకు శాసనం చెబుతుంది. ఒక్కసారి ఆ శాసనాన్ని చూస్తే...

ఈలాపుర గతాద్భుత సన్నివేశం యద్వీక్ష్యావిస్మిత విమాన చరమారేంద్రా హే తత్స్యంభుశివధామ నకృత్రిమమ్ శ్రీ దృష్టేదృష్టతి బహుచర్చయంతి భూయన్తథా విధాకృతౌవ్యవసాయహాని ఏతాన్మయాకథ మహోకృతం ఇత్యకస్మాత్ కర్తపియస్యఖలు విస్మయ రూపశిల్పీ తన్నామ కీర్తనమ్ అకార్యత యేన రాజ్ఞా (ఇండియన్ యాంటిక్వరీ – 12, పే. 59) ఆ ఆలయ గొప్పతనం తెలుస్తుంది.



ఎల్లోరా కైలాసనాథాలయం

ఇంతకీ ఇది ఏ ఆలయం? అంతటి అద్భుత శిల్పకళా కౌశలానికి పట్టం కట్టిన ప్రభువెవరు? అనే ప్రశ్నలు పుట్టుకొస్తాయి. పై శాసనంలో చెప్పిన ఏలాపురవే నేటి ఎల్లోరా. ఆ స్వయంభూ శివధామమే కైలాసనాథాలయం. ఒక్క రాయి కూడా చెక్కి అమర్చిన దాఖలాలు లేవు కాబట్టి స్వయంభువులా భ్రమ కల్పించింది.

ఆలయ మండప, ధ్వజస్తంభ పరివారాలయాలు, వాటిమీద చెక్కిన చిత్ర, విచిత్రమైన శిల్పరీతులు దేవతల్ని చర్చకు గురిచేశాయంటే నాటి శిల్పుల ప్రయోగశీల సృజనాత్మక శక్తిని రాటుదేలిన శిల్పులు తప్ప ఇతరులు అంచనా వేయలేదు.

ఈ అద్భుత శిల్ప చాతుర్యానికి కారణభూతుడైన రాజెవ్వరనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది చూపరులకు. అతడెవరో కాదు, రాష్ట్ర కూట రాజైన మొదటి కృష్ణుడు. క్రీ. 776 నుండి 773 వరకు పాలించి చుట్టుప్రక్కల ప్రాంతాలపై పట్టు సాధించి అనేక దేవాలయ నిర్మాణానికి పూనుకొన్నాడు. బాదామి చాళుక్య విక్రమాదిత్యుడు

పట్టడకల్‌లో నిర్మించిన విరూపాక్ష లోకేశ్వర దేవాలయాన్ని చూచి, శిల్పులతో మంతనాలాడి ఇప్పటివరకు తొలచిన, తొలచి మలచిన గుహలు, గుహాలయాలే కాదు, రాళ్ళతో కట్టిన మరే దేవాలయమూ సరితూగనట్లు నాకొక నమూనాను చూపించండని ఆజ్ఞాపించాడు.

శిల్పులు తమ అనన్య ప్రతిభకు పట్టంగట్టి ఒక్కొక్కరు ఒక్కొక్క నమూనాను పలు చిత్రాల ద్వారా, కొయ్య, సున్నం, రాతితో చేసి ప్రదర్శించారు. అప్పటిదాకా తెలిసిన గుప్త వాకాటక విష్ణుకుండిన, పల్లవ, పశ్చిమ చాళుక్య, తూర్పు చాళుక్య ఆలయ నమూనాలకు మెరుగులు దిద్ది మరికొన్ని మార్పులు చేసి కొత్తదనం ఉట్టిపడేలా, చూపరులను కట్టిపడేసేలా ఒకటికి మరొకటి పోటీ అన్నట్లు తమతమ నైపుణ్యాలను ప్రదర్శించి, ప్రతిభకు గుర్తింపు దక్కుతుందనుకొని, ఉత్కంఠభరితులై రాజు నిర్ణయం కోసం ఉవ్విళ్ళూరుతున్నారు. ప్రతిక్షణం మరో క్షణాన్ని అధిగమించడానికి వేగంగా ముందుకు సాగుతుంటే, అదే వేగంతో అంతకు ముందరి క్షణం మందగమనంతో యుగాన్ని తలపింపజేస్తున్నది. రాజు, అతని సలహాదారులు ప్రదర్శనకుంచిన ఒక్కో నమూనాను చూస్తూ, పరికిస్తూ, పరిశీలిస్తూ, నిర్మించిన తరువాత ఈ ఆలయం ఎలా వుంటుందో ఊహిస్తూ, సహచరుల వంక చూస్తున్నాడు. నిర్ణయం మీదేనని వారు మిన్నకుండి పోతున్నారు. ప్రదర్శనశాలలో మరోమారు కలియదిరిగాడు. అన్నీ అద్భుతంగానే ఉన్నాయి. నిర్ణయం తీసుకోలేకపోతున్నాడు.




ఆలయ శిఖరం మరోదృశ్యం

జైత్రయాత్రల్లో తాను చూచిన వివిధ ఆలయ రూపురేఖల్ని మదిలోకి తెచ్చుకొన్నాడు. అతనికి పట్టడకల్లులోని విరూపాక్షాలయం, కంచిలోని కైలాసనాథ స్వామి దేవాలయాలు కదులాడుతున్నాయి. ఒకదానితో మరొకటి పోటీపడుతున్నాయి. సరిగ్గా అదేక్షణంలో విడిగా ప్రదర్శనలో ఉన్న ఒక దేవాలయ సముదాయ నమూనా తన దృష్టినాకర్షించింది. శిల్పులను ప్రశ్నించాడు మీరెక్కడివారని. తాము కన్నడ దేశస్థులమనీ, తమ పూర్వీకులు పల్లవ రాజుల పోషణలో శిల్పకళకు పాటుపడి బాదామి చాళుక్యుల ఆహ్వానంపై తొలి చాళుక్యుల మూడో రాజధాని పట్టడకల్ ఆలయాల నిర్మాణ సందర్భంగా వలస వచ్చి స్థిరపడినామని, తమకు దాక్షిణాత్య (ద్రావిడ) వాస్తు శిల్పంతోపాటు ఉత్తర భారత వాస్తు శిల్పంలో కూడా ప్రావీణ్యముందని తెలిపారు. అంతేకాదు, కొండలను తొలచి గుహలను మలచగలమని, రాళ్ళను విరగగొట్టి, చక్కగా చెక్కి వాటిని పేర్చి ఆలయాలుగా, మండపాలుగా తీర్చిదిద్దగలమని, విడి శిల్పాలతో పాటు గోడలపై, స్థంభాలపై, కప్పులపై, దూలాలపై మీరు కోరుకున్న భారత, భాగవత, రామాయణం మొదలైన ఇతిహాసాలే కాక, పురాణాలు వర్ణించిన అనేక సంఘటనలను కళ్ళకు కట్టినట్లుగా చెక్కగలమని కూడా మనవి చేసుకున్నారు.

*ఈ ఆలయ నమూనా నచ్చింది. తమ పూర్వీకులు కొలువుదీరిన బాదామీ చాళుక్య ప్రభువుల ఋణం తీర్చుకోవటానికి చాళుక్య సంప్రదాయలకు నూత్న వినూత్న ప్రక్రియలకు ఆద్యులైన పల్లవుల సంప్రదాయాలను జోడించి 'ఇదొక్కటే ఇలాంటివి మరెక్కడా లేద'న్నట్లుండాలన్న తన తలంపు, ఈ ఆలయం. నేర్పరులు కవులైన ఆ శిల్పులు సామర్థ్యం తన కలను నిజం చేస్తాయన్న నమ్మకం కుదిరి ఆ నమూనాను ఎంపిక చేసి త్వరలో పని ప్రారంభించమని ఆజ్ఞాపించి, వారితో పాటు ఇతర నమూనాలను ప్రదర్శించిన శిల్పులను కూడా గొప్ప కానుకలిచ్చి పంపించాడు మొదటి కృష్ణుడు. ఆలయ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని ఎన్నుకోవటానికి శిల్పులను పురమాయించి ఎలాపుర పర్వత శ్రేణుల్ని ఎంపిక చేయించాడు. గుహలు వెయ్యేళ్ళనుంచే ఉన్నాయి. ఆలయాలు కనీసం 400 సంవత్సరాల నుంచి ఉన్నాయి. గుహలకు కట్టుబడి ఆలయాలకు భిన్నంగా, రెండింటి కలగలుపుగా కొండను పైనుంచి తొలచుకుంటూపోయి, ఆలయం, మండపం, ధ్వజస్థంభం సమకూరేలా పథకాన్ని రూపొందించి ఆరంభించారు. కొండపై నేలను తొలగించారు. ఎగుడుదిగుడు రాతి నేలను చదును చేశారు శిల్పులు. ఆలయాన్ని కల్పించటానికి*

*ఇప్పటి లెక్కల ప్రకారం మొత్తం 4 లక్షల టన్నుల చెక్కిన రాతి ముక్కలను తొలగించి ఉంటారని నిపుణులు అంటున్నారు. అంటే 18 సంవత్సరాల పని దినాలను మాత్రమే లెక్కకు తీసుకుంటే 4 లక్షల టన్నులు – 18 సంవత్సరాలు. రోజుకు 60 టన్నులు, గంటకు 5 టన్నులు. ఇది అప్పటి రోజులలో ఎలా సాధ్యమైంది? అందుకని ఇది మానవమాత్రులు నిర్మించిందా అని ఆశ్చర్యం కలగక మానదు.*

*అవసరమైన 270x50x100 అడుగుల కొలతలతో ఒకచోట, 150x30x100 అడుగుల కొలతలతో మరొకచోట పనిని ప్రారంభించారు. ప్రధాన స్థపతి సూచనలమేరకు సూత్రగ్రాహి, వర్ధకి, తక్షకుల పర్యవేక్షణలో రోజూ దాదాపు 300 మంది నేర్పరులైన శిల్పులు రంగంలోకి దిగారు. వీరికి కమ్మర్లు, వడ్రంగులు, కుమ్మర్లు, ఇతర సహాయకులు సహకరించారు.*



గజము - కృష్ణుని జయస్థంభం (100 అ.)

తొలగించిన రాతిని బయటకు తీసుకెళ్ళడానికి, శిల్పులు, వారి కుటుంబ సభ్యులు ఉండటానికి శిబిరాలను ఏర్పాటు చేసి, నిత్యావసరాలను సరఫరా చేయటానికి సైనికులతో పాటు పౌర అధికారులను నియమించారు. వేతనాలు లేవు, సమిష్టి కృషికి వారి అవసరాలను తీర్చటం, బహుమతులివ్వటం, జీవితాలు సాఫీగా సాగిపోవటానికి కావలసినవన్నీ ఏర్పాటు చేయటం రాజు తన బాధ్యతగా గుర్తించారు. శిల్పులు కూడా సంతోషంగా పనిలో నిమగ్నమై పైనుంచి ముందుగా విమాన శిఖరాన్ని, కథలను, గర్భాలయ గోడల్ని, అర్థమండప, మహామండపాల్ని తీర్చిదిద్దారు. తరువాత మూడు వైపులా ద్వారాలను తొలచి లోపలి రాతిని తొలగించి స్థంభాలను, ద్వారాలను, దూలాలను వాటిపై అలంకార శిల్పాన్ని కల్పించారు. ఇందుకు దాదాపు 12 నుంచి 18 ఏళ్ళు పట్టి వుంటుందని అంచనా.

ఆలయ అధిష్ఠానంపై మహాభారత రామాయణ దృశ్యాలతోపాటు చక్కటి శార్దూలాలను, ఏనుగులను చెక్కారు. తరువాత ప్రవేశ ద్వారాన్ని తీర్చిదిద్ది, దానిని నంది మండపానికి కలిపారు. తరువాత, మొదటి కృష్ణుడు ఇతర ప్రాంతాలను జయించినందులకు తీపి గుర్తుగా జయస్థంభాన్ని చెక్కారు, రాజు అభిమానాన్ని చూరగొన్న శిల్పులు. ఒక్కోసారి రాజు, మరోసారి కుటుంబ సభ్యులు, ఎక్కువసార్లు ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షిస్తూ, శిల్పులు, ఇతర పనివాళ్ళ అవసరాలను, క్షేమాలను తీరుస్తున్నారు.

ప్రవేశం దగ్గర ఏనుగులు స్నానం చేయిస్తున్న లక్ష్మి, నంది మండపంలోని గుజానుర వధ మూర్తి, యోగముద్రలోనున్న శివుడు, అత్యంత రమణీయంగా మలచబడినాయి. అలాగే మార్కండేయానుగ్రహ మూర్తి శిల్పం, రామాయణ దృశ్యాలైన వాలి, సుగ్రీవ యుద్ధం, రావణాసురుని జటాయువు ఎదుర్కోవటం, ఇంకా విష్ణు, వరాహమూర్తి, రతీమన్మథ శిల్పాలు, మహిషాసురమర్ధని శిల్పం, ఇతర శిల్పాలు ముఖ్యమైనవి.

*ఇవన్నీ ఒక ఎత్తైతే, తన మొర ఆలకించక శివుడు పార్వతీదేవితో ఉన్న కైలాస పర్వతాన్ని రావణాసురుడు ఊపిన శిల్పం అత్యద్భుతం. శివుని దృష్టినాకర్షించటానికి తన బలాన్నంతా కూడగట్టుకొని పర్వతాన్ని కదిలిస్తుండగా, పార్వతి భయంతో శివుని మీద పడటం, ఆ పూవును తట్టుకోవడానికి శివుడు తన కాలితో కైలాస పర్వతాన్ని తొక్కిపట్టి ఉంచటం కథన శిల్పానికి చక్కటి ఉదాహరణ.*

ప్రవేశ ద్వారానికి ఇరువైపులా గంగ, యమున శిల్పాలు గోడలపై త్రివిక్రమ, బ్రహ్మ, లింగోద్భవమూర్తి, ఇంద్రుడు, అగ్ని, వాయువు, వరాహ, నరసింహ శిల్పాలు శిల్పుల పనితనాన్ని రుజువు చేస్తున్నాయి. ఇంతటి అద్భుత సదనాన్ని చూచి శివుడు తన కైలాసాన్ని వీడి ఇక్కడే ఉండాలనుకొన్నందుకే ఈ ఆలయానికి కైలాసనాథాలయమని పేరు కలిగిందంటారు. మహాబలిపురంలో పల్లవుల కాలంలో ప్రారంభమైన గుహాలయ ప్రక్రియ రాష్ట్రకూట రాజైన మొదటి కృష్ణుని కాలానికి పరాకాష్టకు చేరిందనటానికి కైలాసనాథాలయం ఒకే ఒక్క ఉదాహరణ. *కేవలం ఆలయ వాస్తు, శిల్పానికేకాక, కైలాసనాథాలయం వర్ణచిత్రాలకు కూడా పేరుగాంచింది. సభామంటప పశ్చిమభాగాన గల*

*సరస్సులోనున్న ఏనుగులు, నటరాజ, లింగోద్భవ చిత్రాలు, శార్దూలం, విద్యాధరులు, శివుడు, పార్వతి, గణేశ, కార్తికేయ చిత్రాలు ముఖ్యమైనవి.*

ఇవేకాక కైలాసనాథాలయ గోడలపై అనేక శృంగార, మైథున శిల్పాలు కూడా ఉన్నాయి. ఉత్సవ సందర్భాల్లో సందర్శించే గ్రామీణులకు శృంగార విషయాలపట్ల అవగాహన కల్పించటానికుద్దేశించిన శిల్పాల్లో మహామండల స్థంభాలపై దంపతులు, ధ్వజస్థంభంపై ఇద్దరు మగవారితో ఒక స్త్రీ, పరివారాలయ గోడలపై ముగ్గురు స్త్రీలు, ఒక మగ వ్యక్తి మైథున శిల్పానికి ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. మొత్తం భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా దేవాలయ వాస్తులోనూ, హిందూ ప్రతిమాలక్షణాలలోనూ, వ్యూహాత్మక నిర్మాణంలోనూ, గుహాలయాల్లోనూ, కట్టడాలయాల్లోనూ చూడని ప్రణాళికబద్ధమైన, అంకిత భావంతో తీర్చిదిద్దిన కైలాసనాథాలయం అమోఘవర్షునిగా పేరుగాంచిన రాష్ట్రకూట మొదటి కృష్ణునికీ, అతని ఆజ్ఞకు రూపకల్పన గావించిన శిల్పుల పనితనాన్ని యునెస్కో వారు గుర్తించి ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలలో చేర్చారు.



డా॥ ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
మొఘల్ గార్డెన్స్,
విజయవాడ - 10
ఫోన్ : 9848598446

---

## అడబాల, టి.ఆర్.

**న**టుడు, రూపశిల్పి. ఆంధ్ర లలిత కళాసమితిలో స్థాపక సభ్యుడు, రంగస్థల కళల అధ్యాపకుడు. ఈయన 1936, ఫిబ్రవరి 9న జన్మించాడు. తల్లిదండ్రులు సత్యమ్మ, వెంకన్న నాయుడు. నాటక రంగానికి రూపశిల్పిగా సుపరిచితుడు. ఆ శాఖలో లోతుపాతులు కూలంకషంగా, శాస్త్రీయ పద్ధతులలో అధ్యయనం చేసి నైపుణ్యం సంపాదించాడు. జాతీయ స్థాయిలో నాటక విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆహార్యంలో మెళకువలు బోధించాడు.



అడబాల, టి.ఆర్.

అడబాల బాల దశ నుంచే నాటకాల్లో వేషాలు వేశాడు. విద్యార్థి దశలో భమిడిపాటి *ఇప్పుడు* అనే నాటికలో వానయ్య పాత్ర ధరించి శభాష్ అనిపించుకున్నాడు. 1940 నుంచి పినిశెట్టి శ్రీరామమూర్తి నిర్వహించిన ఆదర్శ నాట్యమండలి పక్షాన ప్రదర్శించిన *పల్లెపడుచు, అన్నాచెల్లెలు* తదితర నాటకాల్లో పాల్గొన్నాడు. ఆదర్శ నాట్యమండలి నాటకాలకు అప్పట్లో మేకప్ చేస్తున్న మాస్టారు అడబాల జిజ్ఞాసను పసిగట్టి, మేకప్‌లో తొలి పాఠాలు నేర్పి, ప్రోత్సహించాడు. ఆనాటి నుంచీ అటు నటన, ఇటు రూపశిల్పం – రెండింటినీ నిర్వహిస్తూ వచ్చారు. మద్రాసులో రైల్వేశాఖలో ఉద్యోగం. కె. వేంకటేశ్వరరావు శిక్షణలో ర.స.న. సమాఖ్యలో ఫణి, రాగరాగిణి వంటి ప్రతిష్టాత్మక నాటకాలలో పాల్గొన్నారు. పలుచోట్ల ఉత్తమ నటుడుగాను, హాస్యనటుడుగానూ బహుమతులు అందుకున్నాడు. 1966లో సికింద్రాబాదు వచ్చిన అడబాల 1967లో ఆంధ్ర లలిత కళాసమితిని స్థాపించి వ్యవస్థాపక సభ్యులలో ఒకడయ్యాడు. ఆ సంస్థ ప్రదర్శించిన నాటక నాటికాల్లో పాల్గొన్నాడు. వాటిలో *మాలపల్లి* ప్రముఖంగా పేర్కొనదగింది. *నేరము–శిక్ష, కప్పులు, నీలితెరలు, లేపాక్షి, ఆశ్రయం, అరణి, వీలునామా* మొదలైన నాటకాలు, *మానవుడు, పెళ్ళిచూపులు, పగ, అమ్మ, రాజీవం, రాతిమనిషి* మొదలైన నాటికలు నటుడిగా ఈయనకు పేరుతెచ్చాయి.

ఉస్మానియా, సెంట్రల్ యూనివర్శిటీల్లోని రంగస్థల కళల శాఖలో విజిటింగ్ లెక్చరర్‌గా పనిచేశాడు. ఈయన శిక్షణలో అనేకమంది శిష్యులు ఆహార్యంలో నైపుణ్యం సంపాదించారు.

# "ఆమెకు నవతి - అందుకే ఈ ప్రణతి"

- వోలేటి పార్వతీశం

*ఎందరో పద్మశ్రీలకు, కొందరు పద్మభూషణులకు గురువు శ్రీమతి కోటేశ్వరమ్మ. 75 సం॥ల క్రితం బెజవాడలో మాంటిస్సోరి అనే చిన్న మొక్కను నాటి, పెంచి, ఆ చెట్టు నీడలో ఎందరో బాలికలకు చదువు నేర్పి, బ్రతుకు సమరంలో పోరాట శక్తిని నింపిన సేనాని కోటేశ్వరమ్మ. అచ్చమాంబ, సరోజినీదేవి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ల సరసన, ఉన్నత స్థాయిలో నిలబడగల కోటేశ్వర్వమ్మ తన లక్ష్యం కోసం ఎన్నో పోరాటాలు చేశారు. ఎవరితో? మగమహారాజులనే అసూయాపరులతో. అదీ తన స్వార్థం కోసం కాదు. తీర ప్రాంత జిల్లాలలో ఆడపిల్లల విద్యాబుద్ధుల కోసం, తన బంగారు వాకిలి ఎప్పుడూ తెరిచే ఉంచారు. ఎటువంటి ధన, కనక, కీర్తి కాంక్షలు లేకుండా ఒక తపస్వినిలా ఈ కార్యాన్ని తన జీవితమంతా నిర్వహించారు – ఇప్పటికీ నిర్వహిస్తున్నారు. మీ చెల్లెలో, మీ భార్యామణో ఆమె దగ్గర చదివి వుంటే 'ఏం బాబూ! నువ్వు జయంతి మొగుడివి కదూ' అని అడుగుతారు ఈనాటికి. 50 ఏళ్ళనాటి విద్యార్థినిని పేరుతో గుర్తుపెట్టుకోగల ధ్యాస ఆమెది. ఆమెకు ఏ 'శ్రీ' లు అవసరం లేదు. లక్ష స్త్రీల బ్రతుకు దిద్దిన కోటేశ్వరమ్మకు ఎటువంటి 'శ్రీ' లు 'భూషణం' కాజాలవు.*

మనుషులంతా ఒకే తీరున పుట్టినా, ఒకే విధమైన ఆకారాలు కలిగివున్నా, కోట్లాదిమందితో నిండిపోయిన ఈ జనసమూహంలో తమ అస్థిత్వాన్ని ప్రకటించుకోవడానికి, వెలుగుతున్న దీపాల్లా, ఆ దీపపు వెలుగుల్ని పదిమందికీ పంచడానికి నిలిచిన దీపస్థంభాల్లా పైపైకి ఎదిగి, సమాజంలో దీపస్థంభంలా నిలిచిన మనిషి గొప్పవాడు. తన అస్థిత్వాన్ని తానే తన మేథోబలంతో ప్రకటించుకుంటున్నాడు. అవయవాలన్నీ ఒకేలా ఇచ్చినా, కవళికలలో వైవిధ్యాన్ని ప్రసాదించినందుకు దేవుడు గొప్పవాడు. వ్యక్తులందరూ ఒకటే అయినా, వ్యక్తిత్వం కారణంగా మేము వేరుసుమా! అనే వైలక్షణాణ్ణి ప్రదర్శిస్తున్న మనిషి గొప్పవాడు.




విద్యాప్రదాత కోటేశ్వరమ్మ

ఈ గొప్పవాళ్ళు కోట్లాదిగా వుండరు. పదులు, వందలూ దాటి బహుశా వేల సంఖ్యలో వుంటారు. ఈ వేలల్లో కూడా, వేళ్ళమీద లెక్కపెట్టదగ్గవారు ఇంకా కొందరే వుంటారు. అలా వేళ్ళమీద లెక్కపెడుతున్నప్పుడు, మన లెక్కల్లోకి వచ్చే ఒక గొప్ప మనిషి డా॥ వి. కోటేశ్వరమ్మ. చదువుకునే ప్రతివాళ్ళకి ఈమె తెలుసు అని నేనడంలేదు. కాని అక్షరజ్ఞానం పంచాలనే జిజ్ఞాస వుండి, అందుకు ప్రయత్నించే వాళ్ళకు మాత్రం ఆమె తప్పక తెలుస్తారు. మహిళాభ్యుదయం అన్న మాటకు అర్థంగానూ, ఆచరణగానూ ఆమె నిలుస్తారు. పిల్లలకు పాఠం చెప్పాలి, వాళ్ళను ప్రయోజకుల్ని చేసి సమాజానికి అందించాలి అని సంకల్పించుకున్న అమ్మా నాన్నలకి తొమ్మిది దశాబ్దాలకు ముందు కోటీశ్వరి జన్మించారు. ఇద్దరు పాఠశాల అధ్యాపకుల దాంపత్య ఫలం ఆమె. చిన్న వయసులోనే మంచి బాషని, చక్కగా మాట్లాడే ఓ సుగుణమేదో కోటీశ్వరికి కలిగినట్లుంది. అందుకే అమ్మ మీనాక్షి, ఆమెను సుభాషిణి అని ముద్దుగా పిలుచుకొనేది. మళ్ళీ ప్రసవంలో ఓ చెల్లెల్నిచ్చి, వైద్య సదుపాయాలు లేని లోపం కారణంగా తల్లి పరమపదం చేరింది. పసితనంలోనే అమ్మకు దూరమై, నాన్నమ్మ ఒడిని చేరువై గడిపిన బాల్యం ఆమెది.

*'చులకన జలరుహ తంతువు / చులకన తృభకణము*
*దూది చులకన, చులకన / మరి, తల్లి లేని సుతుడు కుమారా!'*

చిన్నప్పుడెప్పుడో, తెలుగు ఉపాధ్యాయిని నాంచారమ్మ, 'గోవ్యాఘ్ర సంవాదం' పాఠం చెబుతూ, ఈ పద్యం చదవగానే మరో నలుగురు పిల్లలతో కలసి, తరగతి గదిలోనే భోరున విలపించిన బాల్యం ఆమెది. పొరలి పొరలి ఏడ్చిన ఆ కన్నీళ్ళు అమ్మ లేనితనాన్ని కడిగెయ్యడానికి చాలాకాలం పట్టింది. నానమ్మ, అమ్మమ్మ తల నిమిరింది. "పట్టభద్రురాలైతే తప్ప, పాణిగ్రహణం జరిపించకండి సుమా!" అని మృత్యువు ముఖద్వారంలో నిలబడి, తండ్రి దగ్గర తల్లి పుచ్చుకున్న మాట. అదే తల్లి గర్భస్థయై వున్నప్పుడు, ఏ అక్షర తపన కణం తనలో ప్రవేశించిందో కానీ, చదువుపట్ల అమితాసక్తి, రెండూ కలసి, విద్యాపథాలలో దిగ్విజయంగా నడిపించాయి. ఇటీవల ఒక మాట ఎక్కువగా వింటున్నాం. ''డాక్టరు కావాలనుకొన్నాను. కానీ ఇదిగో ఇలా యాక్టర్‌నయ్యాను" అని చాలామంది సినిమా వాళ్ళు చెప్పే మాటలాంటిది కాదు. ఆమె తప్పనిసరిగా డాక్టరు కావాలనే సంకల్పించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ఆమె పట్టుదలతో చదువుకున్నారు. ప్రతి పరీక్షలోనూ, మొదటి శ్రేణిలోనే నెగ్గుకొచ్చినా, ఆఖరి దశలో డాక్టరు చదివేందుకు సీటు రాలేదు. ఆనాటి ఆంధ్రదేశంలో విశాఖపట్నంలో మాత్రమే మెడికల్ కాలేజి. ఆడపిల్లలకు పది సీట్లు మాత్రమే కేటాయిస్తే, అవి ఐదుకి కుంచించుకుపోయిన సందర్భం. ఆ ఐదులో రెండు, యుద్ధ సమయంలో జపాను దేశస్థులు, బందీలుగా పట్టుకుపోయిన ఇద్దరు డాక్టర్ల కూతుళ్ళకి కేటాయించగా, మిగిలినవి మూడు. ఆ మూడింటికి పోటీపడ్డ అమ్మాయిలు, తమ మార్కులతో కోటీశ్వరిని ఓడించారు. అప్పుడలా ఓడించి వుండకపోతే, వందలాది డాక్టర్లలో కోటీశ్వరి పేరు కూడా చేరి వుండేది. ఆమె గెలుపు కథని, మనం ఇలా చెప్పుకునే అవకాశం వచ్చేది కాదు.

అమ్మానాన్నల అధ్యాపక గుణం ఆమెను వెన్నంటే వుంది. బి.ఎ. తర్వాత బి.యిడి. చదవటంతో అది నిజమైంది. తండ్రి చొరవతో, పటమట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయినిగా ఉద్యోగమూ వచ్చింది. కానీ మనసు మాత్రం మాంటిస్సోరి విద్యావిధానంపైన లగ్నమై వుండిపోయింది. శైశవ దశలోని పిల్లల మానసిక పరిణతికి, మాంటిస్సోరి విద్యావిధానం కన్నా గొప్ప పద్ధతి కాదని, ఆరు దశాబ్దాలకు పూర్వం గ్రహించిన దార్శనికురాలు, ధీమాన్య, విద్యావేత్త డా॥ కోటేశ్వరమ్మ. అనుకున్న చోటనే మలుపులు ఎదురైతే దానిని జీవితం అననవసరం లేదేమో!



చదువుల తల్లి

అనుకోకుండా, హఠాత్తుగా మలుపులొస్తేనే జీవితం. అలాంటి మలుపు కోటేశ్వరమ్మ జీవితంలోనూ వుంది.

'మాంటిస్సోరి విద్యామందిర్' పేరిట, విజయవాడలో ఒక విద్యాసంస్థను ఏర్పాటు చేసి పిల్లల తల్లిదండ్రుల దగ్గర, ఫీజుల పేరుతో డబ్బులు బాగా వసూలు చేసి, ఒక గుజరాతీయుడొకడు ఉన్నట్టుండి, ఊరునించి ఉడాయించాడు. విద్యామందిరం కాస్తా వివర్ణమైపోయింది. ఆ సన్నివేశంలోనే, కోటీశ్వరమ్మ స్నేహితురాలి భర్త ప్రసాదరావు ఒక సలహా ఇచ్చారు. ''మాంటిస్సోరి విద్యావిధానం అంటే నీకు ఇష్టం కదా! నువ్వెందుకు ఆ సంస్థను నడపకూడదు?" అని. ఆ సందర్భంలో ఆమె చేసిన ఆలోచన, నిర్ణయమూ రెండూ ఆమె జీవితాన్ని మలుపు తప్పేశాయి. ఆమె కలలు కంటున్న మహిళాభ్యుదయ సాధానికి ఒక సోపాన మార్గాన్ని పరిచేశాయి. విద్యావేత్త, దార్శనికుడు అయిన ఆమె భర్త డా॥ కృష్ణారావు ఈ సమయంలో చాలా కీలకమైనవారు. సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు, సాహితీవేత్త శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు కుమార్తె, మరో దుర్గాబాయమ్మలా భాసించే డా॥ అచ్చమాంబ ఆదర్శ భావాలు, ఈ సమయంలో కోటేశ్వరమ్మ నిర్ణయానికి పునాదులై నిలిచాయి. 'మాంటిస్సోరి శిశువిద్యాలయం' రూపాన్ని సంతరించుకుంది. అప్పటికి అది బీజం. ఈనాడు అదొక భూజం. దశాబ్దాలు దాటుతున్నా విరామమెరుగని తపన అది. ఆరోహణల ప్రక్కనే అవరోహణలు కొలువున్నా, పట్టుదలతో సాగించిన ప్రయాణం అది. విత్తనం మొలకెత్తి ఆ మొలక మొక్కై, ఆ మొక్క మానై, ఆ మాను మహావృక్షమైనట్టు, ఈ శిశు విద్యాలయం, పాఠశాలగా, ఉన్నత పాఠశాలగా, కళాశాలగా, స్నాతకోత్తర కళాశాలగా, ఎన్నెన్నో కోర్సులతో శాఖోపశాఖలుగా విస్తరించిపోయింది.



కోటేశ్వరమ్మ ఆమె భర్త కృష్ణారావులతో
(మధ్యలో) రచయిత వోలేటి పార్వతీశం

ఒక స్వయంప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయం ఎలా వుండాలో, ఆ స్థాయికి చేరింది. అయితే ఆ హోదా ఇంకా అందుకోవలసి వుంది. రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి పదవులను అధివసించిన ప్రముఖులతో మొదలు, ఆ మొగసాల పురపాలక సంఘ కార్యవర్గ సంఘసభ్యుడి వరకు, ఆ విద్యాలయాన్ని దర్శించినవాళ్ళెవరు? ఒకటా, రెండా, ఎన్నేసి రంగాలు ప్రముఖులు ఆ ప్రాంగణంలో కాలు మోపారో ఇవాళ లెక్కకట్టడమూ కష్టమే. సందర్శనకు వచ్చిన ప్రముఖుల, ప్రభుత్వాధికారుల శుభాశీస్సుల వర్షం కురుస్తూనే వున్నా, నిధుల నీటి చుక్కల కోసం, భవంతుల మొలకల కోసం, అనుమతుల ఫలాల కోసం, ఇప్పటికీ ప్రతినిత్యం అగచాట్లే. అగచాట్లు ఎన్నివున్నా, ఆటుపోట్లు ఎన్నైనా, వాటన్నిటినీ అధిగమించగలిగే సంకల్ప బలం కోటేశ్వరమ్మది. ఏ క్షణంలోనూ, నిరాశపడలేదు, నిస్పృహకు లోను కాలేదు. ఈ అసాధారణ ఆత్మస్థైర్యంతోనే, ఆమె మాంటిస్సోరి విద్యాసంస్థల్ని వజ్రోత్సవ వసంతం వరకు వేలు పట్టుకొని నడిపించుకొచ్చారు. ఆ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాల సందర్భానికి, ఆ పాఠశాల పూర్వ విద్యార్థిగా, ఈ విద్యాసంస్థల వైభవాన్ని ఉగ్గడిస్తూ ఒక నృత్య రూపకాన్ని రచించి, ఆ రచనను బహుమానంగా ఇచ్చాను. అందులోనివే రెండు ఖండికల్ని ఉటంకించాలనిపిస్తోంది–

*"అచ్చమాంబ ఆశయాలు దారిదీపమై*
*అమ్మ కోటేశ్వరమ్మ ప్రాణవాయువై*
*అతిరథులే అందించిన దీవెనల్ సాక్షిగా*
*సాగుతోంది మాంటిస్సోరి ఔన్నత్యం దీక్షగా"*
*"కేజీకి, పీజీకి సంగమమౌ ప్రాంగణమై*
*మగువల చైతన్యానికి తాను మాతృరూపియై*
*రూపుదిద్దుకున్నది ఈ మహిళల కళాశాల*
*అక్షరాలే హర్మ్యాలు, ఇది శారద యాగశాల*
*సాగిందోయ్ మాంటిస్సోరి పురోగమనపథాన*
*ఇంతింతై వటుడింతై ఎదిగిన చందాన"*

అనడానికి, వినడానికి మాంటిస్సోరి చరిత్ర చాలా ఘనంగానే వుంటుంది. కానీ దాని వెన్నంటి వుండి నడిపించిన కోటేశ్వరమ్మ జీవితం మాత్రం అంతా ఆనందమయం కాదు. సన్మానాలు, అవమానాలు పోటీపడి మరీ ఆమెకు తారసిల్లాయి. వ్యక్తిగత త్యాగాలు అనేకం. అన్నీ తన విద్యాసంస్థ కోసమే. కన్నవాళ్ళందరూ ఖండాంతరాల కవతల జీవనం సాగిస్తున్నా, కట్టుకున్న భర్త ఆరున్నర దశాబ్దాల సాహచర్యాన్ని దయనీయమైన అనారోగ్య కారణంగా విడనాడి, మూర్తి రూపం వీడి శేషకీర్తుడైనా, తన శరీరంలో కొంత భాగం ఏమాత్రం సహకరించకపోయినా, తన మార్గదర్శి డా. అచ్చమాంబ ఇచ్చిన ఆత్మస్థైర్యం ఆలంబనగా, డా. కోటశ్వరమ్మ కార్యదీక్ష ఈనాటికీ మొక్కవోలేదు. వజ్రోత్సవ సందర్భంలో ఆమె అన్న రెండు మాటలు మీ గమనికకు తేవాలనుంది.

"దేశాభివృద్ధికి, స్త్రీ విద్య ముఖ్య సాధనమని, త్రికరణ శుద్ధిగా నమ్మిన దానినవడంవల్ల, తత్ప్రేరణతో చేయగలనా? లేదా? సాధ్యమా? అసాధ్యమా? అనే విషయాలనాలోచించక ఈ మహిళావిద్య కార్యక్రమంలో ప్రవేశించాను. ఎంతవరకు నిర్వహించానో చెప్పలేను. కానీ నా జీవితమంతా ఈ సాధనలోనే గడిపాను. ఇంకా గడుపుతున్నాను. తల్లి సరస్వతి దయామయి. ఈ సేవలకు తగిన ఉత్సాహ ప్రోత్సాహాల నందించి ముందుకు నడిపింది."

తొంభైయేళ్ళ జీవితాన్ని విద్యాగంధ పరిమళాల పరివ్యాపన కోసం అరగదీసేసినా, ఫలితంగా లభ్యమైన విజయాలను తన పేర నమోదు చేసుకోవడంలేదు. పైగా ఫలశ్రుతిని, సరస్వతీ మాతకే సమర్పించిన హృదయ నైర్మల్యం ఆమెది. కొలమానానికి అందని కొలమానాలు, ఇక ముందు కాలంలో, మహిళా వికాస విద్యావరణంలో, ఆమె కార్యదీక్ష ముందు, ఊడిగం చేస్తాయి. ఇది ఆరున్నర దశాబ్దాలుగా కోటీశ్వరమ్మ అవిశ్రాంత కృషిని గమనిస్తున్న సమాంతర సమాజం పక్షాన చేస్తున్న సన్నుతి. ఇప్పుడామెకు నవతి. అందుకే ఈ ప్రణతి.


డా. వోలేటి పార్వతీశం
హైదరాబాదు. ఫోన్ : 944 003 1213

# ల్యాబ్ కేస్

– దస్తగిరి

స్టాఫర్డ్ క్రిప్స్ రాయబారం విఫలమైన తరువాత బ్రిటీషు ప్రభుత్వాన్ని దేశం నుండి వెళ్ళగొట్టడం తప్ప మరే పరిష్కారం లేదని భారత ప్రజలకు స్పష్టం అయింది. దాని ఫలితమే 1942 ఆగస్టు క్విట్ ఇండియా ఉద్యమం. "డు ఆర్ డై" అనే నినాదం దేశం నలుమూలలా ఉరుములా ప్రతిధ్వనించింది. ఉద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం తీవ్ర అణచివేత చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడ నాయకులను జైళ్లలో కుక్కింది. దేశభక్తుల్ని కాల్చింది. స్త్రీలనూ వదలి పెట్టకుండా హింసించింది. దేశం మొత్తంమీద భయానక వాతావరణం కల్పించింది. అయినా జనం తీవ్రంగా ప్రతిఘటించారు. యువకులలో ఆవురావురమనే స్పందన పెల్లుబికింది. అనంతపురం దేశ భక్తులూ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. అనంతపుర ఉద్యమకారులు టెలిఫోన్ తీగలు తెగ్గొట్టారు. రైలు పట్టాలు పీకివేశారు. ఫారెస్ట్ బంగ్లాలు కాల్చివేశారు. పెనుగొండ గగనమహల్‌ను కాల్చాలనీ ప్రయత్నించారు. కర్నూల్ వద్ద తుంగభద్ర పొడవునా పోలీసుల గస్తీ పెరిగినందున బాంబులు, రివాల్వరులు నదిని దాటలేక నదిలో మునిగిపోయాయి.



గడియారం స్థంభం - అనంతపురం

క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగానే అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజి విద్యార్థులు రైల్ రోకో చేశారు. ఈ విద్యార్థులపై పోలీసులు చాలా మొరటుగా లాఠీఛార్జి చేశారు. ఐ. సుందరరావు ఎదమీద కాలితో తొక్కారు. సి. ముత్యాలప్ప నడుములు, మోకాళ్ళు నలగ్గొట్టారు. విద్యార్థుల ఈ కార్యక్రమాలు ప్రిన్సిపాల్‌కు నచ్చలేదు. ప్రిన్సిపాల్ పేరు కే.పీ.జి. మీనన్. ఆయన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివాడు. జ్యులియస్ సీజర్, నెపోలియన్, చర్చిల్ – తానూ అంతా ఒకే ఎత్తు, ఒకే ధైర్యం, ఒకే అసాధారణ ప్రతిభ వున్నవాళ్ళమని ఆయన గర్వంగా చెప్పుకొనేవాడు. ప్రిన్సిపాల్ నిరంతరం చర్చిల్‌ను పొగడడం విద్యార్థులకు నచ్చలేదు. 'చర్చిల్ డౌన్ డౌన్' అని నినాదాలు చేసేవారు విద్యార్థులు. అందుకు ఆయనకు ఎక్కడలేని కోపం వచ్చేది.

రానురాను క్విట్ ఇండియా ఉద్యమ ఉధృతి తగ్గుతోంది. దేశం మొత్తం మీద చల్లబడుతోంటే ఇక్కడ మాత్రం కొనసాగించడం కష్టం అయింది. విద్యార్థులలో ఒకరి తరువాత ఒకరు కాలేజికి పోవడం మొదలైంది. తెల్లవారు ఝామున నాలుగు గంటలకే వెళ్లి విద్యార్థులు కాలేజికి పోకుండా కాపలా కాసేవారు విద్యార్థి నాయకులు. 10-09-1942 న కాలేజి విద్యార్థులతోపాటు మూడు ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పెద్ద ఊరేగింపు చేసి, సమావేశం ఏర్పాటు చేశారు. వి.కే. ఆదినారాయణ రెడ్డి, తిరుమలరెడ్డి, ఎల్లయ్య నాయకత్వం వహించినారు. పరిమితి లేని సమ్మెవల్ల విద్యార్థుల ఐక్యత చెడుతుందని వివరించారు. సమ్మె కొనసాగింపుపై విద్యార్థులలో ఓటింగు నిర్వహించారు. విద్యార్థులలో అధిక భాగం సమ్మెకు వ్యతిరేకంగా ఓటు చేశారు.

ఇదే రోజు రాత్రి కళాశాల ప్రయోగశాలను ఎవరో కాల్చి వేయడం జరిగింది.

ఎప్పుడైతే విద్యార్థి సమాఖ్య నాయకులు సమ్మె



ప్రభుత్వ కళాశాల భవనం - అనంతపురం

విరమించారో వాళ్ళకు వ్యతిరేకంగా కొంతమంది విద్యార్థులను కూడదీసి సమ్మె కొనసాగించాలని రెచ్చగొట్టినాడు ప్రిన్సిపాల్. 12 వ తేదీన సమ్మె మరలా మొదలైంది. విద్యార్థి సమాఖ్య నాయకులు విద్యార్థులలో తమ పాలసీని ప్రచారం చేస్తున్నారు. సమ్మె చేయమని చెప్పిన ప్రిన్సిపలే పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. రిజర్వు పోలీసులు వచ్చారు. వచ్చీరావడంతోటే గేటు దగ్గర నుంచీ విద్యార్థులను తుపాకీలతో కాలుస్తూ, మడమలపై లాఠీలతో కొట్టుకుంటూ కళాశాల లోపలికి దూసుకు వచ్చారు. లోపల కనపడిన వారినందరినీ కొట్టారు. తరగతిలోనికి దూరి మరీ కొట్టారు. విద్యార్థి సమాఖ్య సభ్యులు 6 మందికి బాగా గాయాలు అయ్యాయి. అందులో ఒక స్త్రీ విద్యార్థి (బహుశా జీవరత్నమ్మ) కూడా వుందని నాటి ప్రజాశక్తి వార్త. అప్పటికీ అక్కసు తీరక చురుకైన కార్యకర్తలనందరినీ తప్పుడు కేసుల్లో ఇరికించాలని ప్రిన్సిపాల్ సి.ఐ. దావూద్ ఖాన్ అనుకున్నారు. ప్రయోగశాల కాల్చివేత సంఘటనను మంచి అవకాశంగా ఉపయోగించినారు.

1942 సెప్టెంబరు, 10 తేది రాత్రి కళాశాల ప్రయోగశాలను ఎవరో కాల్చినారు. 10 లక్షలకు పైగా నష్టం జరిగింది. ఎవరు కాల్చారో యిప్పటికీ తెలియదు. నేను (రచయిత దస్తగిరి) కేసులో వున్నవారిని, సమకాలీన రాజకీయ, విద్యార్థి ప్రముఖులను – వి.కె. ఆదినారాయణ రెడ్డి, ఐదుకల్లు సదాశివన్, నీలం రాజశేఖర రెడ్డి, నీలం సంజీవ రెడ్డి, జి. రామకృష్ణ, సి. ముత్యాలప్ప, ఆదిశేషయ్య (జీవరత్నమ్మ గారి భర్త)లను విచారించినాను. ఎవరు కాల్చిందీ ఎవరికీ తెలీదు. ఇందుకు సంబంధించి రెండు వాదనలు ఉన్నాయి – విద్యార్థులే కాల్చినారు అనేది ఒక వాదన అయితే, గుత్తికి సంబంధించిన ఒక రసాయన ఆచార్యుడు పరుసవేదిని (ఇనుమును బంగారుగా మార్చేది) తయారు చేయబోయి, ఆ ప్రక్రియ వికటించి ప్రయోగశాల అంటుకుంది అనేది. ఇంకొక వాదన. దేనికీ ఖచ్చితమైన ఆధారాలు లేవు.

కళాశాల ప్రిన్సిపాల్ కే.పీ.జి. మీనన్, సి.ఐ. దావూద్ ఖాన్ ఏరి, 12 మంది పైన కేసులు పెట్టినారు. పోలీస్ కేసుల్లోని దళారులను సాక్షులుగా నమోదు చేశారు. కోర్టు రికార్డుల ప్రకారం ముద్దాయులు : (1) కె. బి. ఆర్. కొట్రే గౌడ్ (వీరన్న), విద్యార్థి 22 సం. (2) వి.కె. ఆదినారాయణ రెడ్డి (రంగప్ప), విద్యార్థి 23సం. (3) చెన్నబ సప్ప (వీరన్న). విద్యార్థి 21 సం. (4) ఎస్.పీ. నాగిరెడ్డి (శివ రామిరెడ్డి), విద్యార్థి 19 సం. (5) కె. తిరుమల రెడ్డి విద్యార్థి, 19 సం. (6) ఎన్.రాజశేఖర రెడ్డి (చిన్నప రెడ్డి), విద్యార్థి 24సం. (7) సదాశివన్ (చెన్నప్ప), హరిజన్ వర్కర్ 29 సం. (8) వెంకటప్ప (ఓబయ్య), ప్రెస్ కార్మికుడు 25సం, (9) జి. వెంకట రెడ్డి (వెంకట రెడ్డి), వకీలు 32 సం. (10) కె.ఎస్. రాఘవాచార్లు (వకీలు), 52 సం. (11) నరసప్ప (పట్రప్ప), విద్యార్థి 18 సం. (12) కరియప్ప, 21 సం. (బ్రాకెట్లలో వున్నవి తండ్రి పేర్లు).

యిందులో వున్నది ఇద్దరే కాంగ్రెస్ ప్రముఖులు. విద్యార్థులంతా విద్యార్థి సమాఖ్య కార్యకర్తలే. నాగిరెడ్డిని పట్టుకు రమ్మన్నాడు సి.ఐ. నాగిరెడ్డి అంటే తరిమెల నాగిరెడ్డి అని సి.ఐ. అభిప్రాయం. ఆ విషయం తెలియని పోలీసు తనకు తెలిసిన ఎస్.పీ. నాగిరెడ్డి పేరును ముద్దాయిల పేర్లలో నమోదు చేశాడు. వాస్తవానికి తరిమెల నాగిరెడ్డి అప్పుడు కలకత్తాలో వున్నాడు.

ప్రయోగశాల 10-09-1942 న కాలిపోతే 26-09-1942 న కేసు నమోదు చేసి, ముద్దాయిలను అరెస్టు చేశారు. 14-12-1942 న కేసు విచారణ ప్రారంభమై, 16-12-1942 వరకు కొనసాగి, 17-12-1942 న తీర్పు వెలువడడంతో ముగిసింది.

ప్రిన్సిపాల్ అత్యుత్సాహంతో అరెస్టు అయిన విద్యార్థులను కాలేజి నుండి తొలగించినాడు. జరిమానాలు వేసినాడు. తాలూకా పోలీస్‌స్టేషన్, జైలు కళాశాల గోడకు ఆనుకొనే వుంది. జైల్లో వున్న ముద్దాయిలపట్ల జనంలో గౌరవం పెరిగింది. మంచి భోజనం, బుట్టల బుట్టల పళ్ళు సరఫరా అయ్యేవి. సి.ఐ. ఎంత వ్యతిరేకించినా, జైలు వార్డెన్ దేశభక్తుడు

కనుక విద్యార్థులు కోరిన పుస్తకాలు - నిషేధింపబడిన పుస్తకాలు కూడా - అందుబాటులో ఉంచేవాడు. ఈ సమయంలోనే లెనిన్ పుస్తకాలు చాలా చదివినట్లు వి.కే. ఆదినారాయణ రెడ్డి చెప్పాడు.

ఈలోగా పోలీసులు మరో కుట్ర పన్నారు. ముద్దాయిలు అపీలు చేసుకోడానికి వీలులేకుండా స్పెషల్ కోర్టు ఏర్పాటు చేయాలనే ప్రయత్నం చేశారు. అప్పుడు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర శాఖ జోక్యం చేసుకుంది. పోలీసుల వైఖరిని ఖండిస్తూ విద్యార్థి సమాఖ్య నాయకులు ఎస్.వి.కె. ప్రసాద్ 14-10-1942 న ప్రజాశక్తిలో వివరణాత్మక వ్యాసం రాశారు. కేసులు ఎత్తివేయాలని, స్పెషల్ కోర్టు ఏర్పాటు చేయరాదని హెచ్చరిక చేశారు. స్పెషల్ కోర్టు ఏర్పాటు చేస్తే రాష్ట్రవ్యాపితంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అన్ని జిల్లాల నుండి నిరసన టెలిగ్రాములు పంపారు. ఈ ఒత్తిడి వల్ల పోలీసుల ప్రయత్నం వ్యర్థమైంది.

జైలు నుంచి ముద్దాయిలను బేడీలు వేసుకొని తీసుకుపోయేవారు. విద్యార్థి ముద్దాయిలంతా ఘనకార్యం సాధిస్తున్న వీరులుగా బేడీల చేతులు పైకెత్తి చూపిస్తూ ఉత్సాహంగా నడిచేవారు. అదేపనిగా చూడడానికి వచ్చిన జనం రోడ్డువెంబడి నిలబడి జేజేలు పలికేవారు. ప్రఖ్యాత న్యాయవాది, ప్రసిద్ధ నటులూ అయిన బళ్ళారి రాఘవ ప్రధాన న్యాయవాది. ఆయన బళ్ళారి నుండి అదేపనిగా వచ్చారు. స్థానికుడైన నగరూరి నారాయణరావు సహాయకుడుగా వున్నారు. వాస్తవానికి పట్టణంలో వుండే లాయర్లందరూ ఈ కేసు తమదిగా భావించారు.


ప్రిన్సిపాల్‌కు మొత్తం లెక్చరర్లు అంతా వ్యతిరేకం. ఆయనొక నియంత అని, అగౌరవ పరుస్తాడని కోపం. విద్యార్థులను తిడతాడు కనుక విద్యార్థులకూ కోపం. ఎప్పుడైతే విద్యార్థి నాయకులను అరెస్టు చేశారో అతని క్రూరత్వం పెరిగింది. దాంతో అతని మీద వ్యతిరేకత విద్యార్థులలోను లెక్చరరులలోను మరింత పెరిగింది. ఈ దశలో ఈ కేసు నడిచింది. విచారణలో పోలీసులు ప్రవేశపెట్టిన సాక్షులు పోలీసుల మాటలు వినకుండా విద్యార్థులకు అనుకూలంగా చెప్పారు. కొందరు సాక్షులు హాజరు కాలేదు. విద్యార్థులందరూ చదివేవాళ్ళు కాదని, తిరుగుబోతులని, ప్రిన్సిపాల్ సాక్ష్యం చెప్పాడు. సి.ఐ. కూడా అదేమాట చెప్పాడు. ప్రిన్సిపాల్ వాదన సరికాదు, రికార్డులు తెప్పించి చూడండి అని లెక్చరర్లు



ప్రభుత్వ కళాశాల భవన ముఖద్వారం - అనంతపురం

చెప్పారు. న్యాయవాదులూ కోరారు. రికార్డులు తెప్పించి కోర్టు పరిశీలించింది. విద్యార్థులందరికీ హాజరు బాగుంది, 60 శాతం పైగా మార్కులు వచ్చాయి. "so you are not a principal, you are a liar" అని న్యాయవాదులు అన్నారు, కోర్టూ అదే నిర్ధారించింది. "how you became a principal?" అని కోర్టు ప్రశ్నించింది. అదే వాక్యంతో అందరు అతన్ని ఏడిపించడం మొదలైంది. ఆయనకు తల ఎత్తుకోలేని పరిస్థితి కలిగింది.

విచారణ సమయంలో కోర్టు జనంతో కిటకిటలాడింది. బళ్ళారి రాఘవ నాటకీయతతో కూడిన వాదనాపటిమ అందరిని ఆకట్టుకుంది. కేసు కొట్టివేయబడింది. ముద్దాయిలందరు నిర్దోషులుగా విడుదలైనారు. ఇదో ఘన విజయం. విద్యార్థులే కాదు ప్రజలంతా తమ విజయంగా భావించినారు. వీరునిగా జీవించడం, వీరునిగా మరణించడమే విద్యార్థి లక్షణంగా విద్యార్థుల మనసులో నాటుకొనిపోయింది. ఉత్తేజకరమైన ఈ పోరాటం అనంత స్వాతంత్రోద్యమ చరిత్రలోనే కాదు, వందేళ్ళ (08-07-1916-2016) కళాశాల చరిత్రలోనూ ఒక ప్రత్యేక, ప్రముఖ అధ్యాయంగా నిలిచిపోయింది.



**పి. దస్తగిరి**
**గుల్జార్ పేట్, అనంతపురం**
**ఫోన్ : 984 892 8329**
dasthagiri.vidwan@gmail.com

# మా నాన్న హీరో కాదు

*- కాం(డ్రేగుల జీలం చటర్జీ*

*బలమైన కుటుంబ వ్యవస్థ భారతీయుల ఆత్మ. ఈ గడ్డపై పుట్టిన వ్యక్తి గాఢంగా విశ్వసించే రెండవ ముఖ్యమైన ఆర్యోక్తి 'పితృదేవోభవః'. దీనికి సంబంధించి ఒక వ్యాసం గత సంచికలో కోడూరి పుల్లారెడ్డి మా నాన్న చెన్నారెడ్డి అన్న పేరుతో వ్రాశారు. ఇప్పుడు మారుతున్న కాలం, స్థలం దృష్ట్యా ఈ వ్యాసాన్ని అర్థంచేసుకోగలరు. ఈ ఇద్దరు రచయితల మధ్యా 55 సం॥ వయసు తేడా ఉంది. ఈనాటి తరంవారిపై పరోక్షంగా పడుతున్న సినిమా ప్రభావం గమనించండి.*

మా అమ్మ చెబుతుండేది – నాన్న చిన్నగా ఉన్నప్పుడు నాన్నకు ఎప్పుడూ దగ్గరగా ఉండేదాన్ని కానని. చిన్నతనంలో చాలాసార్లు అనిపించేది – మా నాన్న, మరోలా ఉంటే బాగుండేదని. మా నాన్న పేరుగాంచిన సినిమా హీరోగా ఉండాలని లేదా ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఉండాలని లేదా నిరంతరం దేశాటనం చేసి ఊపిరి సలపని ఒక ముఖ్య వ్యక్తిగా ఉండాలని ఊహల రెక్కలలో తేలియాడేదాన్ని.

ఇవన్నీ నాన్నను చూడగానే వాస్తవంగా పటాపంచలయ్యేవి. ఫ్యాక్టరీ నుంచి తిరిగి వచ్చేప్పుడు ముఖానికి అక్కడక్కడ మసి ఉండేది. చెమట వాసన, డస్సిపోయి ఇల్లు చేరేవాడు. ఒక చేతి సంచి భుజం నుంచి వేలాడుతూ ఉండేది. ఇలా కనిపించే నాన్న నాకెప్పుడూ హీరోలా అనిపించలేదు.

మా క్లాసులో సాటివాళ్ళు కారులలో తీసుకునివచ్చే నాన్నలు, డాబుసరిగా దుస్తులు వేసుకునే నాన్నలను, చూసినప్పుడు నేను సిగ్గుతో ముడుచుకుపోయేదాన్ని. సరిపెట్టుకునే ప్రయత్నాలు చేసేదాన్ని. మా నాన్న హీరోలా ఉండడు. తలమీద వెంట్రుకలు లేవు, దుస్తులపై శ్రద్ధ లేదు, స్థూలకాయం – అక్కడక్కడా ఊడిపోయిన పళ్ళతో పెద్దగా ఇంప్రెస్ చేయలేదు.

ఇంగ్లీషు గ్రామరు, లెక్కలు వీటిని నాకు బాగా విశదీకరించేవాడు. ఆయనకు వాటిపై మంచి పట్టు ఉంది. ఇవంటే నాన్నకు ఇష్టం. ప్రయాణాలు చేయాలని, సినిమాలు చూడాలని, ఫ్యాషనబుల్‌గా కనిపించాలనీ ఎప్పుడూ అనుకునేవాడు కాదు. నాన్న నాకెప్పుడూ ఖరీదైన బహుమతులు తేలేదు. విలాసవంతమైన హోటళ్ళకు తీసుకుపోలేదు. పుస్తకాలు, సాహిత్యం జోలికి వెళ్ళేవాడు కాదు.

నా చిన్నతనంలో మా నాన్న W.H. Audens వ్రాసిన The unknown citizen రచనలో ఒక అనామిక పౌరునిగానే కనిపించేవాడు. కాలేజీ చదువుకోసం హాస్టలుకు (సి.ఫిల్) వచ్చాను. కాలం నెమ్మదిగా గడుస్తుంది. దూరపు కొండలు నునుపన్న మాటల్లో దాగున్న సత్యం క్రమక్రమంగా బోధపడుతుంది. నాన్న గుర్తుకు వచ్చేవాడు. బెంగగా అనిపించేది. ఆయన నుంచి దూరంగా ఉంటున్నాను అనే భావన కలచివేయటం ప్రారంభమయింది. జ్ఞాపకాలు వెంటాడుతుండేవి. వర్షం జోరుగా కురిసిన ఒకరోజు ఇంటికి రాగానే (అమ్మ ఇంట్లో లేదు) తాను వంటగదికి వెళ్ళి వేడివేడి అల్లం టీ తయారుచేసి ఇచ్చి ప్రేమతో నాతో తాగించిన నాన్న, నన్ను నిరాశ ఆవహించినపుడు ఒంటరిగా వరండాలో కూర్చున్న నాకు ప్రేమతో తల నిమిరిన నాన్న (నాన్న మితభాషి), చిరునవ్వుతో మౌనంగా చేసిన పలకరింపులు, నేను పై చదువులకు వెళుతున్నప్పుడు నా సర్టిఫికెట్లు, దానికి నకళ్ళు తీయించి గంటలకొద్దీ టైప్‌మిషన్లవద్ద కూర్చుని తీసుకువచ్చిన నాన్న ఇప్పుడు గుర్తుకొస్తున్నాడు. మా చిన్న మారుతీకారు కింద ఒక చిన్న పిల్లి చనిపోతే రోజంతా విచారించిన నాన్న, అమ్మ కాపురానికి వచ్చినపుడు ఆ (బిదాయి) సమయంలో, అందరూ విచారిస్తే, అందరికంటే ఎక్కువగా రోధించిన నాన్న, జీవితంలో ఎవరితో ఎప్పుడూ ఒక పరుషపదం వాడని నాన్న, ఇప్పుడు పదేపదే గుర్తుకువస్తున్నాడు. ఇప్పుడర్థమవుతుంది – సముద్రమంత ప్రేమను కళ్ళల్లో ఇముడ్చుకునేవాడని.

నా పరీక్షా సమయాల్లో ఆయన ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు! తాను అలారం పెట్టుకుని లేచి మమ్మల్ని నిద్ర లేపేవాడు. తనకంటే మేము బాగుండాలని సదా కోరుకునే నాన్న ఇప్పుడు నాకు సినిమా హీరోలకంటే గ్లామరస్‌గా, పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలకంటే గొప్పగా కనిపిస్తున్నాడు.



కాండ్రేగుల జీలం చటర్జీ
(ఆంగ్లమూలం)
హైదరాబాద్.
ఫోన్ : 964 206 5757

# సంగీత ఆభరణం

– సి.వి. రామచంద్రరావు

*ఏదైనా కష్టకాలంలో ద్రవ్యం అవసరమైనపుడు, మనం సాధారణంగా బంగారు ఆభరణాలనో లేదా విలువైన వస్తువులనో తాకట్టుపెట్టి ద్రవ్యాన్ని పొందుతాము. కానీ ఒకానొక సంగీత విద్వాంసుడు తాను పాడే ఒక సంగీత రాగాన్ని తాకట్టుపెట్టి ద్రవ్యాన్ని పొందిన కథ ఇది.*

తంజావూరులో నరసింహయ్యర్ అనే పేరుగల సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు ఉండేవాడు. నరసింహయ్యర్ 'శంకరాభరణ' రాగాన్ని అత్యద్భుతంగా పాడేవాడు. అప్పట్లో తంజావూరు రాజ్యాన్ని పాలిస్తుండిన మరాఠా మహారాజు శరభోజి (1712–1728) శంకరాభరణ రాగాన్ని తన రాజ ఆస్థానంలో పాడించుకొని విని, నరసింహయ్యర్‌కు 'శంకరాభరణం నరసయ్యర్' అనే బిరుదునామం ప్రసాదించాడు. ఒకానొక సమయంలో నరసింహ అయ్యర్‌కు ద్రవ్యం అత్యవసరమయింది. మరెక్కడా ఆ ద్రవ్యం పుట్టక, నరసింహయ్యర్ తనకు సన్నిహితుడు, స్నేహితుడు అయిన, కుమ్భలం జమీందార్ అయిన రామభద్రమూపనార్‌ను ద్రవ్యాన్ని అర్థించడానికై కపిస్థలం వెళ్ళాడు. ఈ రామభద్ర మూపనార్ నేడు తమిళ రాజకీయాలలో రాణిస్తున్న వాసన్ మూపనార్ పూర్వీకుడు.

నరసింహ అయ్యర్ రామభద్ర మూపనార్ బంగళాలో మూపనార్ అతిథిగా ఉండినాడు. అన్ని అతిథి మర్యాదలు పొందాడు. మూడోరోజున నరసింహయ్యర్ మెల్లగా మూపనార్‌ను సమీపించి తన కష్టాన్ని తెలుపుకొని తనకు 80 బంగారు నాణేలు అప్పుగా ఇవ్వమని అభ్యర్థించాడు. నరసింహ అయ్యర్ తనవద్దకు అప్పు అడగడానికై రావటం మూపనార్‌కు ఆశ్చర్యం కలిగించింది. రామభద్ర మూపనార్ నరసింహ అయ్యర్‌తో : "అట్లే ఇస్తాను. కానీ దానికై నీవు ఏ ఆభరణాన్నైనా నా వద్ద తాకట్టుపెట్టవలసి ఉంటుంది" అని అన్నాడు. నరసింహయ్యర్ మెల్లగా తల వంచుకొని – "నా దగ్గర వున్న ఒకే ఒక ఆభరణం 'శంకరాభరణం'. మీరు అంగీకరిస్తే దానిని మీ దగ్గర తాకట్టు పెడతాను. మీకు ఎనభై నాణేలు తిరిగి చెల్లించి, అప్పు తీర్చి తాకట్టును విడిపించుకొనేటంత వరకు నేనెక్కడా 'శంకరాభరణం' రాగాన్ని పాడను అని మాట ఇస్తున్నాను" అని బదులిచ్చాడు. నరసింహ అయ్యర్, మూపనార్ కోరగా, ఆ ప్రకారం ఒక పత్రాన్ని కూడా తన సంతకంతో వ్రాసి ఇచ్చాడు.

రామభద్ర మూపనార్‌కు ఇచ్చిన మాటప్రకారం, నరసింహయ్యర్ చాలా కాలం 'శంకరాభరణ' రాగాన్ని ఎక్కడగాని ఏ సంగీత సభలోకానీ పాడలేదు. ఆ రాగాన్ని పాడటం పూర్తిగా మానివేశాడు. ఇలా ఉండగా, ఒక సమయంలో శంకరాభరణంలో రాగాన్ని పాడవలెనని నరసింహ అయ్యర్ మీద ఒత్తిడి తేవడం జరిగింది. 'వ్యాలిస్' అనే పేరుగల ఒక బ్రిటీష్ అధికారికి అతి సన్నిహితుడుగా, ఆప్తుడుగా కుంభకోణంలో అప్పరాయర్ ఉండేవాడు. అప్పరాయర్ 'వ్యాలిన్' కొలువులో అధికారిగా ఉండి, కుంభకోణంలో ప్రముఖుడుగా ఉండేవాడు. అప్పరాయర్ కుటుంబంలో ఒకరికి వివాహం జరుగుతున్న సమయంలో, వివాహ వేడుకలో ఒక వేడుకగా శంకరాభరణం రాగాన్ని పాడవలసిందని అప్పరాయర్, నరసింహ అయ్యర్ మీద ఎనలేని ఒత్తిడి తెచ్చాడు. ఆ ఒత్తిడికి తట్టుకోలేక నరసింహయ్యర్ తాను ఆ రాగాన్ని మూపనార్ వద్ద తాకట్టు పెట్టిన విషయాన్ని అప్పరాయర్‌కు తెలిపాడు.

అప్పరాయర్ వెంటనే హుటాహుటిన 80 బంగారు నాణేలతో ఒక దూతను కపిల స్థలానికి పంపించాడు. దూత కపిలం పోయి ద్రవ్యం తీసుకొని రాగాన్ని తాకట్టు నుండి విడిపింపమని మూపనార్‌ను కోరాడు. మూపనార్ ద్రవ్యాన్ని తీసుకోవడానికి నిరాకరించి, నరసింహ అయ్యర్ తనకు వ్రాసి యిచ్చిన తాకట్టు పత్రాన్ని కూడా తిరిగి ఇచ్చివేశాడు. మూపనార్ ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా, కుంభకోణానికి పోయి అప్పరాయర్‌ను కలుసుకొన్నాడు. తనకు ఆప్తమిత్రుడైన నరసింహ అయ్యర్ తనను ద్రవ్యం అప్పుగా ఇవ్వమని అడగడం తన మనసుకు బాధ కలిగించిందని, అందువల్ల తాను నరసింహ అయ్యర్‌తో ఆ విధంగా ప్రవర్తించానని అప్పు అయ్యర్‌కు వివరించాడు మూపనార్. నరసింహ అయ్యర్‌కు క్షమాపణలు తెలిపి, కళాకారులను పోషించని, వారిని కష్టసమయాలలో ఆదుకోలేని సంపద నిరుపయోగమని ప్రకటిస్తూ, నరసింహ అయ్యర్‌కు ఇతోధికంగా ధనాన్ని పారితోషికంగా ఇచ్చాడు. నరసింహ అయ్యర్‌ను తన ఆస్థాన సంగీత విద్వాంసుడుగా నియమించాడు. తరువాతి కాలంలో నరసింహ అయ్యర్, శరభోజి రాజు ఆస్థానంలో 'శంకరాభరణం నరసయ్యర్' అనే బిరుదు నామంతో రాజాస్థాన సంగీత విద్వాంసుడుగా ఉండినాడు. అప్పు అయ్యర్ కోరిక మేరకు, నరసింహ అయ్యర్ ప్రక్క రోజున శంకరాభరణ రాగాన్ని అత్యద్భుతంగా పాడి, వివాహానికి విచ్చేసిన అతిథులందరినీ అలరించాడు. కొసమెరుపు 'తన మాట అరవలను పాఠకులుగా చేసిన తెలుగు భాష' అని విశ్వనాథవారు అనడంలో – వారి ఉద్దేశ్యమేమిటో?

డా. సి.వి. రామచంద్రరావు, ఎమ్.ఎ., పిహెచ్.డి.
చెన్నై. ఫోన్ : 044 - 244 84 778

### బహుముఖ ప్రజ్ఞాశాలి

# బాలశౌరి రెడ్డి

**– యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**

*కడప జిల్లా గొల్లల గూడూరు గ్రామంలో శ్రీమతి ఓబులమ్మ మరియు గంగిరెడ్డిల ఏకైక సంతానంగా జూలై 1వ తేది 1928వ సంవత్సరంలో బాలశౌరి రెడ్డి జన్మించారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన వీరు నెల్లూరు మరియు కడప జిల్లాలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పొంది, మహాత్మాగాంధీ ఆదర్శాల స్ఫూర్తితో దక్షిణ భారతావనిలో హిందీ ప్రచారద్యోమంలో పాల్గొన్నారు. 'సాహిత్యరత్న' మరియు 'సాహిత్యాలంకార' కోర్సులు చదువుతున్న రోజులలో పండిత్ కమలాపతి త్రిపాఠి, పండిత్ గంగాధర్ మిత మరియు సూర్యకాంత త్రిపాఠి నిరాలా వంటి దిగ్గజ సాహిత్యకారుల ఆశ్రయం మరియు ఆశీస్సులు వీరికి లభించినాయి. ఎందరో మహోన్నత సాహిత్యకారుల సాంగత్యం బాలశౌరి రెడ్డి వ్యక్తిత్వానికి వన్నెలు దిద్దిందనడంలో ఎలాంటి సందేహం లేదు. సౌమ్యునిగా, నిరాడంబరునిగా, వినమ్రుడిగా, భాషాకోవిదుడిగా, ప్రతిభావంతుడైన కథారచయితగా, నవలాకారుడిగా, నాటకకర్తగా, చరిత్రకారుడిగా, పత్రికా సంపాదకునిగా, అనువాదకునిగా, అధ్యాపకునిగా, హిందీ ప్రచారకుడిగా బహుముఖ రూపాలలో బాలశౌరి రెడ్డి గారి సాధన అనితర సాధ్యం కాని రీతిలో సాగింది. తన 87వ ఏట సెప్టెంబర్ 15, 2015 తేదీన వీరు పరమపదించటం హిందీ సాహిత్య లోకానికి తీరని లోటు.*



బాలశౌరి రెడ్డి

**బా**లశౌరి రెడ్డి తన స్వతంత్ర మరియు అనువాద రచనలతో హిందీ నవలాసాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. హిందీలో 65 రచనలు వీరు ప్రచురించారు. 15 స్వతంత్ర నవలలు, 15 అనువాద నవలలు, బాలసాహిత్యానికి చెందిన 13 పుస్తకాలు 2 నాటక సంకలనాలు విశేష ప్రాచుర్యాన్ని పొందాయి. అనువాద రచనలు వీరికి జాతీయ స్థాయిలో ప్రాముఖ్యాన్ని కల్పించాయి. *తెలుగు సాహిత్య చరిత్ర, ఆంధ్ర భారతి, తెలుగు సాహిత్య నిర్మాతలు, తెలుగు వాఙ్మయము, పలు రచనాప్రక్రియలు* వంటి సమీక్షాత్మక రచనలు వీరి ఖ్యాతిని ఇనుమడింపచేశాయి. 1966 కలకత్తాలోని 'భారతీయ భాషాపరిషత్' అధ్యక్షునిగా, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షునిగా, *చమక్‌తా సితారా* హిందీ దినపత్రిక ప్రధాన సంపాదకునిగా, తమిళనాడు హిందీ అకాడమీ అధ్యక్షునిగా, మద్రాసులోని హిందీ ప్రచార సభ మహా విద్యాలయంలో అధ్యాపకునిగా హిందీ భాషావ్యాప్తికి, సాహిత్య సుసంపన్నతకూ, దక్షిణాదిన హిందీ పత్రికలకు ప్రాచుర్యాన్ని కలుగజేయడానికి బాటలు వేసిన బాలశౌరి రెడ్డి ధన్యజీవి.

*శబరి* (1959) బాలశౌరి రెడ్డి గారి పౌరాణిక నవల. ఈ రచనలో *శబరి* ఆదర్శ జీవితాన్ని వస్తువుగా స్వీకరించి, త్యాగానికి మారుపేరుగా నిలిచిన స్త్రీ వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని వీరు వేనోళ్ళ చాటిచెప్పారు. వర్ణాశ్రమ వ్యవస్థ నిరర్థకతను, ఈ వ్యవస్థలోని పలు సమస్యల నేపథ్యంలో స్త్రీ జీవితంలో సంఘర్షణను వీరు చిత్రించారు. *జిందగీ కీ రాహ్* (1962) నవలలో మధ్యతరగతి హిందూ సమాజంలో వివాహ సమస్యను ప్రస్తావించారు. 'సరళ' పాత్ర ద్వారా ఈ వ్యవస్థలో అడుగడుగునా ప్రతికూలతను ఎదుర్కొనే స్త్రీ జీవితాన్ని వీరు యథార్థపరంగా వర్ణించారు. మధ్యతరగతి వెన్ను విరిచే కుసంస్కారాల కర్కశ పాదాలకింద నలిగి, ఒత్తిడిని తట్టుకోలేక నవలా నాయకుడు, నాయిక తమ జీవితాన్ని చాలిస్తారు. ఆదర్శాన్ని, యథార్థాన్ని, సమన్వయం చేసుకొంటూ సమస్యలను అధిగమించే పాత్రగా 'సుహాసి'ని ద్వారా నవలా రచయిత పరిష్కారాన్ని చూపించటం పాఠకులను ఆకట్టుకుంటుంది.

*యే బస్తీ యే లోగ్* (1963) నవలలో మద్రాసు వంటి మహానగరంలో నివసించే వారి జీవితాలలోని డొల్లతనాన్ని వ్యంగ్యాత్మకంగా రెడ్డి చిత్రీకరించారు. 'మేడిపండు చూడు

మేలిమై ఉండు, పొట్టవిప్పి చూడు పురుగులుండు' అన్న చందాన నగర జీవుల కృత్రిమ జీవన విధానంలో విలువలకు తిలోదకాలిచ్చిన వైనాన్ని వీరు వర్ణించారు. *భగ్నసీమాయేం* (1965)లో మధ్యతరగతి హిందూ కుటుంబంలో ప్రేమ మరియు పెళ్ళి సమస్య నేపథ్యంలో తారసపడే పలు సమస్యలను చిత్రిస్తూ రెడ్డి నల్లబజారు, వరకట్నం, గవర్నమెంట్ వారి అభివృద్ధి పథకాలలోని డొల్లతనం, కులవ్యవస్థల ప్రభావాన్ని, వాటి పరిణామాలను తన పాత్రల ద్వారా చెప్పిన తీరు కడు శ్లాఘనీయం. త్యాగానికి, కర్తవ్య పాలనకు ప్రతీకగా ఈ నవలలో 'షీలా' పాత్ర చిత్రణ జరిగింది. *బారిష్టర్* (1967) నవలలో నేటి వివాహ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపిస్తూ, సంస్కారాలకు, కోరికలకు మధ్య సంఘర్షణ నేపథ్యంలో నిరాడంబరత్వానికి, కర్తవ్య పరాయణతకు, సహనానికి మారుపేరుగా నిలిచే స్త్రీ వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని చెప్పిన తీరు నభూతో అన్న రీతిలో సాగింది. *ప్రకాష్ ఔర్ పర్‌ఛాయియా* ఒక చారిత్రాత్మక నవల. ఆంధ్రప్రదేశ్‌లో మధ్యకాలం నాటి చారిత్రక నేపథ్యంలో వ్రాయబడిన ఈ రచనలో ఒక గ్రామానికి చెందిన బాలుని ఉజ్వల చరిత్రను వర్ణించటం జరిగింది. సామాన్య కుటుంబంలో జన్మించిన బాలుడు కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తన జీవితాన్ని ముగిస్తాడు. తన తప్పు తెలుసుకున్న రాజు మంత్రి తిమ్మరసుకు క్షమాపణ చెప్పడంతో కథ ముగుస్తుంది. *స్వప్న ఔరి సత్య్* (1968)లో స్త్రీ-పురుషుల మనోభావాలను సూక్ష్మంగా పరిశీలించటం జరిగింది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను సమర్థించటం, పలు రూపాలలో ఈ సమాజంలో దోపిడీ జరుగుతున్న వైనాన్ని స్పష్టపరచటం, ఆధునిక జీవితంలోని కృత్రిమత వంటి విషయాలను ఈ నవలలో చిత్రీకరించటం జరిగింది. *ధరీతీ మేరీ మా* (1969) విశ్వచైతన్యమే మూలవస్తువుగా స్వీకరించి వ్రాయబడిన నవల. ధరిత్రి ప్రజలు మరియు సాంస్కృతిక వైభవాల సమన్వయం ఈ నవలలోని అంతర్లీనంగా గోచరిస్తుంది. ప్రేమ మరియు కర్తవ్యాల భవ్యమైత్రి ఈ నవలకు సొబగులు అద్దుతుంది.

*లకుమ* (1969) చారిత్రిక నవలలో సామ్రాజ్య పరిరక్షణకై ఆత్మహత్య చేసుకున్న దేవదాసి లకుమ జీవిత చరిత్రను వర్ణించారు. అపురూప సౌందర్యరాశి, రాజనర్తకి లకుమ వ్యక్తిత్వంలో స్వాభిమానం మరియు నిస్వార్థం గొప్ప గుణాలుగా భాసిల్లుతాయి. లకుమను మోహించి తన కర్తవ్యాన్ని విస్మరించిన రాజు కారణంగా రాజ్యం నష్టపోతున్న విషయాన్ని గ్రహించి, తన ప్రాణాన్ని త్యాగం చేసిన స్త్రీ గా లకుమ వ్యక్తిత్వం ఎందరికో ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. *ప్రొఫెసర్* (1971) నవలలో పాశ్చాత్య సంస్కృతి మరియు జీవనశైలిని అనుకరించి అధోగతిపాలైన ఒక ఆచార్యుని మానసిక సంఘర్షణను విడమరచి చెప్పటం జరిగింది. సీతాపతి, ప్రొఫెసర్, ఉమాపతి, ఆనంద్, సుధా, విమల వంటి పాత్రల ద్వారా స్త్రీ-పురుషుల సంబంధాలపై సంస్కృతి ప్రభావాన్ని చిత్రించటం జరిగింది. *దావానల్* (1969) చారిత్రిక నవలలో పలనాడు యుద్ధం నేపథ్యంలో నాగమ్మ, బాలచంద్రుడు మరియు బ్రహ్మనాయుడు వంటి పాత్రల ద్వారా పలు చారిత్రక సంఘటనలను, యుద్ధానికి దారితీసిన పరిస్థితులను మరియు ఆనాటి సామాజిక సమస్యలను రెడ్డి ఎంతో ప్రతిభావంతంగా కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు. ఈ విధంగా ఒక నవలాకారునిగా రెడ్డి తన విలక్షణ ప్రతిభాపాటవాలతో ఆనాటి సామాజిక సమస్యలను, మానవ ప్రవృత్తులను, సామాజిక సంబంధాలను, సమాజంలో తన ఉనికి కాపాడుకునే ప్రయత్నంలో స్త్రీ మనోవేదనను చక్కగా చిత్రీకరించి హిందీ నవలా సాహిత్యానికి రత్నాలవంటి రచనలను అందజేశారు.

హిందీ కథాసాహిత్య వికాసంలో తెలుగు ప్రాంతానికి చెందిన కథకుల పాత్ర చిరస్మరణీయంగా నిలుస్తుంది. ఎందరో సాహిత్య కృషీవలులు అందరికీ వందనాలు. బాలశౌరి రెడ్డి ఒక గొప్ప హిందీ కథారచయితగా కూడా పేరొందారు. 1998 లో *బైసాఖీ* పేరిట వీరి 17 కథలు ఒక సంకలనంగా వెలువడ్డాయి. భారతీయ సామాజిక వ్యవస్థలోని లోపాలు, పరిపాలనా వ్యవస్థలో అవినీతి, స్త్రీ పట్ల అనుచిత ధోరణి కారణంగా ఉద్భవించిన సమస్యలు మరియు రాజకీయాలలో విలువలకు తిలోదకాలిచ్చే నేతల మరియు వారి అనుచర గణాల అకృత్యాలు ముఖ్యంగా ఈ కథలలో కనిపిస్తాయి. *బైసాఖీ* సంకలనంలోని కథలు స్త్రీ-పురుష సంబంధాలను పలు కోణాలలో పరికిస్తూ కుటుంబ విలువలపై నమ్మకాన్ని పెంపొందించుకోవాలన్న సందేశాన్ని తెలియజేస్తాయి. *పాపి చిరాయు* కథలో పలు సంఘర్షణలకు లోనైన సామాన్య తరగతి ప్రజల మనోభావాలను చిత్రించటం జరిగింది. *జ్ఞానోదయ్, టూట్‌తీ సీమాయేం* మరియు *ప్రకాష్ కీ ఓర్* వంటి కథలలో సామాజిక రుగ్మతలపై రెడ్డి విరుచుకుపడి మానవ సంబంధాల విలువను తెలియజేస్తారు. వరకట్న సమస్యను వస్తువుగా తీసుకొని వ్రాసిన *చాందీ కా జూతా* కథ ప్రేక్షకుల ఆదరణకు

లోనైంది. *దిల్ కా కాంటా* కథలో కుటుంబ సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వని కారణంగా ఏర్పడే సమస్యలను చిత్రించారు. *పఛతావా* కథలో కూడా కుటుంబ సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న సందేశం కనిపిస్తుంది. *జబ్ ఆంఖ్ ఖులీ* కథలో గ్రామ జీవితానికి, నగర జీవితానికి గల తేడాను చెప్పడం జరిగింది. *'ఇల్లున్నవాడికి ఇల్లాలు లేదు, ఇల్లాలు ఉన్నవాడికి ఇల్లు లేదు'* అన్న సత్యాన్ని ఒక సమస్యగా గుర్తించి *ఘర్ ఔర్ గృహస్థీ* కథలో పలు సామాజిక సమస్యలను రెడ్డి వర్ణించారు. *న్యాయ్ కీ కహానియాం, మర్యాదా రామ్, మరాహువా హాథీ, సోనేకీ అంగూఠీ, అనోఖీ ఛడీ, కిఫాయతీ, చోర్ కీ దాడీ మే తిన్‌కా, బదలా, శరత్ నామా* వంటి రచనలు ప్రసిద్ధినొందాయి.


అనువాదకుడిగా, హిందీ – తెలుగు సాహిత్యాల మధ్య వారధిగా బాలశౌరి రెడ్డి విశేష కృషి చేశారు. *రుద్రమదేవి, నారాయణ భట్, రాజశేఖర చరిత్ర, అల్పజీవి, చంద్రగుప్త్ కా స్వప్న్, కౌశల్య కౌముది, నియతి కే పుతలే, మై మర్‌నా నహీ చాహ్‌తా, పుణ్యభూమి* వంటి అనువాద నవలలను అందించి రెడ్డి హిందీ నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. *తెలుగు కీ శ్రేష్ఠ్ కహానియ, స్వర్ణ్ కమల్* వంటి కథాసంకలనాలను రెడ్డి గొప్ప అనువాద రచనలుగా పేర్కొనవచ్చు. హిందీ పాఠ్యాంశాల అధ్యయనాన్ని సరళీకరణ చేసేందుకు రెడ్డి తులనాత్మక వ్యాకరణాన్ని, పదకోశాలను రచించి ఖ్యాతినొందారు. పాఠశాలల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకూ బాలశౌరి రెడ్డి రచనలు పాఠ్యపుస్తకాలుగా గుర్తింపు పొందటం వీరి స్థాయినీ, వీరి రచనల ప్రయోజనాన్ని తెలియజేస్తాయి. త్రిభాషా సూత్రాన్ని రెడ్డి సమర్థించారు. ప్రాంతీయ భాషలను ఆయా రాష్ట్రాల అధికార భాషలుగా, హిందీని జాతీయ భాషగా గుర్తించి, వాటి వికాసానికి పాటుపడటం దేశాభిమానుల కర్తవ్యమని వీరు పలు రచనలలో చెప్పారు. హజారీ ప్రసాద్ ద్వివేదీ, దిన్‌కర్, శివపూజన్ సహాయ్, రాజ్‌కుమార్ వర్మ, వాసుదేవ్ శరణ్ అగ్రవాల్, సుమన్ వంటి దిగ్గజాలు రెడ్డిగారి రచనకు ముందు మాటలు వ్రాయటం రెడ్డి రచనల వాసిని తెలియజెపుతుంది.

*పంచామృత్, ఆంధ్రభారతి, తమిళ్‌నాడు, తెలుగు సాహిత్య కా ఇతిహాస్, కర్ణాటక్, వీరేశలింగం పంతులు, తెలుగు సాహిత్య్ కే నిర్మాతా* వంటి రచనలు దక్షిణ భారత సాహిత్యం గొప్పతనాన్ని, దక్షిణ భారత సంస్కృతీ సాంప్రదాయాల విశిష్టతను తెలియజెప్పేవిగా కీర్తినొందాయి.

బాల సాహిత్యకారునిగా బాలశౌరి రెడ్డి అవిరళమైన కృషిచేశారు. మూఢనమ్మకాలను ఖండిస్తూ బాలలలో ఆత్మవిశ్వాసాన్ని, తర్కబుద్ధిని, వివేకాన్ని, సంస్కారాలను పెంపొందించే దిశగా రెడ్డి సాధన కొనసాగింది. *తెలుగు కీ లోక్ కథాయేం, ఆంధ్ర కే మహాపురుష్, సత్య్ కీ ఖోజ్, తెనాలి రామ్ కీ లతీఫే, బుద్ధి సే బుద్ధిమాన్, న్యాయ్ కీ కహానియాం, ఆదర్శ జీవనియాం, ఆముక్త మాల్యద* (బాల నవల), *దక్షిణ్ కీ లోక్ కథాయేం, తెనాలి రామ్ కీ కహానియాం* వంటి రచనల ద్వారా గొప్ప సామాజిక ప్రయోజనాన్ని ఆశించి, బాలశౌరి రెడ్డి కృషిచేశారు.

ఆదివాసీ ప్రజల సంస్కృతీ సాంప్రదాయాలను, వారి స్థితిగతులను, సమస్యలను వస్తువుగా గ్రహించి రెడ్డి పలు రచనలు చేశారు. *పలనాటి వీర చరిత్ర, రాజా కట్టమ్మ, రాజ్‌కుమార్ రామ్, శివ్ గాంధారీ* వంటి రచనలు చేసి రెడ్డి ఖ్యాతినొందారు. *సత్య్ కీ ఖోజ్, హర హర గంగే, సాంచ్ కో ఆంచ్ కహాం, అభిజాత్య* వంటి సామాజిక వస్తు ప్రధానమైన నాటికల ద్వారా ఈ ప్రక్రియలోనూ రెడ్డి తన ప్రతిభా పాటవాలను చాటుకొనటం గమనర్హం.

బాలశౌరి రెడ్డిని జాతీయ స్థాయిలో పలు పురస్కారాలు వరించాయి. భారత ప్రభుత్వం, బీహార్ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరియు పలు సాహితీ సంస్థల ద్వారా వీరికి సుమారు 25 పురస్కారాలు లభించాయి. రాంచీ, అహ్మదాబాద్, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఉస్మానియా విద్యాలయం, బెంగుళూరు విశ్వవిద్యాలయం, లక్నో, ఆగ్రా మరియు కాన్పూర్ విశ్వవిద్యాలయాలలో బాలశౌరి రెడ్డిగారి రచనలపై విస్తృతంగా పరిశోధనలు జరిగాయి. అనేక సంస్థలకు సలహాదారుడిగా పనిచేసిన రెడ్డి అమెరికా, యూరప్, మారిషస్, సింగపూర్ మరియు ఆఫ్రికా దేశాలలో విస్తృతంగా పర్యటించి హిందీ భాషా పరివ్యాప్తికి విశేషంగా దోహదం చేశారు.




ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
హిందీ ప్రొఫెసర్, ఫార్మర్ యం.పి.
విశాఖపట్నం.
ఫోన్ : 984 906 7343

# కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై

చదువు నేర్చిన మనిషి కళ్ళు అక్షరాలను గుర్తిస్తాయి. అందులో ఎక్కువ శాతం కళ్ళు పైపైన తడిమినట్లుగా అర్థగ్రహణం చేస్తాయి. అందులోని ఆంతర్యాన్ని చేదుకొంటాయి. అలా వెలికితీసి లోకంతో పంచుకొనే దశలో అలా లోతుల్లో అణిగిన భావాలు, జీవాలు సరికొత్త వెలుగులోకి వస్తాయి. ఆనందం పంచుతాయి. అలాంటి లోచూపుగల బహు కొద్ది కళ్ళలో మరింత వెలుగుల జతకు యజమానులైన ఆత్మీయ కరణం బాలసుబ్రహ్మణ్యం కవీంద్ర. శిష్యుని వ్యతిరేక వర్తనకు అసాధ్యాన్ని కాంక్షించిన గురువుగారి అసహనానికీ, ఆర్థిక, నిండుదన మందించలేని రాజు అసహాయకత కారణంగా కూతురు మాధవి పడినపాట్లను, నలుగురికి తాత్కాలిక ఇల్లాలై పిల్లలను కని వారివారికి దత్తంచేసి బేలగా మిగిలిపోయిన 'విషాద మాధవి' హృదయాన్ని విప్పిచెప్పేవరకూ ఎంతమంది గమనించారని? బ్రహ్మర్షిగా మారిన ఆ గురువు కూడ కనికరించని పరిస్థితిలో ఎటువంచితే అటు వంగే రబ్బరు బొమ్మలా మారిన ఆమె గుండె లోతుల దైన్య భావనను మీరు చూశారు. ఆమె ఎదలో మూగగా రోదించిన ధ్వనిని మీరు విన్నారు. అప్పుడు కదా లోకం ఆమె మీద కరుణను కురిపించింది!



కరణం
బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై

'చరిత్రకెక్కని మారణహోమం'లో తమపాలి రాజ్యసాధనకై రణయజ్ఞం జరిపి అక్షౌహిణుల కొద్దీ సేనను, పురుషులను సమయింపచేసి, వారి ఇల్లాండ్రు నిర్గతికులై, అనాథలై నడివీధుల పాలుకాగా, రాజ్యంలో ఏర్పడిన సాంఘిక సమస్యను పరిష్కరించలేని అజాత శత్రువు మహాధర్మరాజూ, తరుణోపాయంగా, స్వైరిణులైన స్త్రీలను, తమ పతులతో సమాగమప్రాప్తి ఆమిషాన్ని చూపి, కాళిందిలో, తాముగా కలిసిపోయే కుతంత్రాన్ని నెరపిన వేదవ్యాస, శ్రీకృష్ణద్వైపాయన మహానుభావుడూ ఓహ్! ఆ కరుణామయ సన్నివేశం మీరుగదా దర్శించారు. పేరు ధర్మరాజు పెనువేపవిత్తయా అన్న వేమన్నగారి అచ్చమైన వారసులు మీరు కదా!

ప్రాంతీయ భేదాల వాదాల నాదాలతో దద్దరిల్లు నాటి విపత్కర పరిస్థితులతో మీ 'ఓరుగల్లు – వీరగల్లు' కావ్యరచన మీ తెలుగు భాషాభిమానానికి నిలువెత్తు నీరాజనం. పరప్రాంతంలో ఒక సామాన్య కార్మికుడు ఎంతలా తన తల్లి తెలుగుకై చేసిన ఎక్కటి పోరాటం, తెలుగు జాతి గౌరవం నిలబెట్టే దిశలో చేసిన త్యాగం, కల్పనే కావచ్చు మనోజ్ఞం.

ఆధునిక సామాజిక ఇతివృత్తాన్ని పద్యాలలో వ్రాసి ఇలా మెప్పించవచ్చని 'ఒక రాఘవరెడ్డి కథా' రచనతో పద్యోపాసనా జీవులకు పరమానందం కలిగించారు. 2007 ఫిబ్రవరి మాసంలో విడుదలైన ఈ వర్తమాన కథాకావ్యానికి, 2007 ఏప్రిల్ మాసంలో బళ్ళారి జిల్లా జోళదరాశి గుత్తి నారాయణరెడ్డి స్మారక సాహిత్య పీఠం, తమ తొలి పురస్కారాన్ని మీకు సమర్పించి తన గౌరవాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచుకున్నది. అదే దారిలో అనేక సంస్థలు, విశ్వవిద్యాలయాలు మిమ్మల్ని సమ్మానించి తమకు గౌరవాన్నాపాదించుకున్నాయి. పద్య నిర్మాణంలో మీ కౌశలం నిరుపమానం. సత్యం, సరళత స్పష్టత, సమగ్రత, సాంద్రతలు మీ కావ్యాల్లో పంచకల్యాణి గుర్రాలై పరిగెడుతూ, చదువరి ఎదలోకి దూరి తిష్ఠవేసుకొంటాయి.

మీరు కూర్చిన కథలు, పౌరాణిక నవల, త్రిశంకుని స్వర్గారోహణ గాథ చండాలుడు, ఎంత నవ్యతను సంతరించుకొందని? అలాగే మీ అద్వితీయ ప్రతిభా సమున్నత చారిత్రాత్మక కృతి బోయకొట్టములు పండ్రెండు గురించి ఎంత చెప్పినా తక్కువే. తొలి పద్యశాసన కర్త పండరంగని అద్దంకి శాసనం పునాదిగా, చరిత్రలోని ముఖ్యపాత్రలను వారి అంతరంగాన్ని యథాతథంగా వుంచి, కల్పిత పాత్రలను కలగలిపి ఎక్కడా ఔచితికి పిసరంత భంగం వాటిల్లకుండా సంతరించిన మీ చాతుర్యం, మీలోని మనస్సాక్షినే ప్రమాణంగా తెలిపిన మీ హృదయౌన్నత్యం, ఏ విషయాన్నయినా నిర్మలంగా, నిష్పక్షపాతంగా వెలిబుచ్చే మృదుమధుర శిష్టవ్యావహారిక భాషావిన్నాణం మిమ్మొక ఆదర్శ రచయితగా నిలిపింది. ఈ నవలలోని భాష ముఖ్యంగా అలాంటి చారిత్రక, పౌరాణిక, కృతులకేకాక సాంఘిక ఇతివృత్తాలకు చాల సముచితంగా వుండి, ప్రామాణికతను సంతరించుకొని క్రొత్త రచయితలకు దారిదీపంగా వుంది. మీ సంస్కృత భాషాకృతులు అత్యంత సరళమూ, సులభమూ అయిన శైలిలో చాలా సుబోధకంగా వున్నాయి. శంకరాచార్యులలోని అద్వితీయ కవితామూర్తిని చూపిన మీ విశ్లేషణ మనోహరం.

మీరు సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణరాయలను గురించి రచన చేస్తున్న ఆ నవ్యకృతికై మేము ఆతృతగా ఎదురుచూస్తున్నాము. జాతీయ, అంతర్జాతీయ గౌరవాలకు మీరు పాత్రులు కాగలరని నమ్ముతూ, కావాలని అభిలషిస్తున్నాము.

***మీ పలుకులు ముత్యాలహారాలు / మీ భావాలు మాణిక్యదీప్తులు / మీ రచనలు స్ఫటికపు శలాకలు / మీ బ్రతుకు పట్టాభిరాముడు మెచ్చినది.***


మి

(కరణం వారి హఠాన్మరణానికి రెండు దినాల పూర్వం జరిగిన సన్మాన సభలో...)


గుత్తి (జోళద రాశి) చంద్రశేఖర్ రెడ్డి
హైదరాబాద్. ఫోన్ : 917 794 5559

# చదవండి...


– ఎన్నార్కె





✦ ***నాన్నతో నేను* :** విజయాసంస్థ రథసారథి ముఖ్యులైన బి. నాగిరెడ్డి పై వారి కుమారులు విశ్వం (విశ్వనాథ రెడ్డి) వ్రాసిన బయోగ్రాఫికల్ స్కెచ్. వ్యక్తిగా, తండ్రిగా, వ్యాపారవేత్తగా, సాంఘిక ప్రయోజనాలు ఆశించే, వ్యవస్థలాంటి వ్యక్తి గురించి 280 పేజీలలో చెప్పటం నిజంగా ఒక సాహసమే. ఇంతవరకూ ఆయనపై వచ్చిన పుస్తకాలలో ఇది సమగ్రమైనదనే భావించవచ్చు. రచయితకు చిన్నతనం నుంచే విజయ స్టూడియోతో, సినిమా నిర్మాణంతోనున్న అనుబంధం రచనకు సంపూర్ణతనిచ్చింది. ఈశ్వర్ వేసిన ముఖచిత్రం ఒక చిన్న హైలెట్. ఇందులో కొన్ని అరుదైన ఛాయా చిత్రాలున్నాయి.
*పేజీలు : 280, వెల : ₹ 100/- ప్రతులకు – విజయా గార్డెన్స్, చెన్నై. ఫోన్ : 044 – 2365 2007*



✦ ***నువ్వే నేను, నేనే నువ్వు* :** 79 సంవత్సరాల వయసులో తన మూడవ సంపుటితో ముందుకొచ్చిన రచయిత పులిగడ్డ విశ్వనాథరావు. చిరకాలం తెలుగు నేలకు దూరంగా బ్రతికినా, ఈ 24 కథలలో కావలసినంత తెలుగుదనం ఉంది. ప్రతి కథలోను ఒక మెలిక, భాషా చమత్కారం కనిపిస్తుంది.
*పేజీలు : 132, వెల : ₹ 80/-, ప్రతులకు – ఫోన్ : 949 138 4480*




✦ ***అంతర గాంధారం* :** ఈ వచన కవితా సంపుటి 7 రచయిత ఎలనాగ. ఇందులో 38 కవితలున్నాయి. కొన్ని quotable quotes ను తలపిస్తాయి – పదే పదే గుర్తుండిపోయేలా!
*పేజీలు : 70, వెల : ₹ 70/- ప్రతులకు – అన్ని పుస్తక షాపులలో లభ్యం.*



✦ ***కథారామం* :** మహీధర రామశాస్త్రి వ్రాసిన 18 కథల పుస్తకం. వాటిలో రసానందమే కాదు సామాజిక స్పృహ కూడా ఉంది. రచయిత మంచి కథకులు. కథలలోని వస్తువునకు, ముఖచిత్రానికి సంబంధంలేదు. వారి అర్థాంగి అభిప్రాయం ఒక చిన్న హైలైట్.
*పేజీలు : 80, వెల : ₹ 75/- ప్రతులకు – మహీధర రామశాస్త్రి, డోర్ నెం: 2-51-10, శంభునగర్, మొదటి వీధి, ఐ.ఎల్.టి.డి. రైల్వే గేటు వద్ద, రాజమహేంద్రవరం.*



✦ ***మనిషి 'కత'లు* :** రచయిత దేవరాజుమహారాజు వ్రాసిన 18 కథల సంపుటి. సామాజిక దృక్పథాన్ని మనసులో ఉంచుకొని కొత్తగా చెప్పిన చిన్న కథలు. ప్రతి కథ చివర "మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు" అంటూ ముగించారు రచయిత.
*పేజీలు : 84, వెల : ₹ 60/- ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక షాపులలో లభ్యం.*

✦ ***పరస్పరం* :** భమిడిపాటి జగన్నాథరావు గారి వ్యాసాలు. జీవితం పట్ల ప్రేమ, మనిషి పట్ల ఆదరణ, సమగ్ర దృష్టి, హోలిస్టిక్ అప్రోచ్ గల భమిడిపాటి వారి రచనలపై, ఆయన గురించి పలువురి రచనలు మరియు సమీక్షలు. భమిడిపాటివారు ఇతరుల రచనల, వ్యక్తులపై రాసిన వ్యాసాల సంకలనం.
*పేజీలు : 200, వెల : ₹ 150/-, ప్రతులకు – చినుకు పబ్లికేషన్స్, విజయవాడ, నవోదయ, విశాలాంధ్ర బుక్ హౌస్‌లు.*




✦ ***వేదన :*** ఇది ఒక స్మృతి కావ్యం. జయశంకర ప్రసాద్ ఆధునిక హిందీ సాహిత్యలో లబ్ధప్రతిష్టులు. ఆంసూ అనే ఒక ఎలిజీని 1923 సం॥ ప్రాంతంలో వ్రాశారు. ఇందులోని మంచి గీతాలకు భావకుడైన కూరెళ్ళ శ్రీనివాస్ చిత్రాలుగా రూపుదిద్దారు. మూలకవి పదాలను, అవి పలికే సంగీతాన్ని కూడా అనువదించాలంటాడు ఆంగ్ల కవి మిలింగ్‌టన్. దానిని దృష్టిలో పెట్టుకొని ఒక గేయంలో "కంటి నుండి కన్నీరై కురవక పోతే అది యిక రక్తమెలా అవుతుంది?" అంటూ మ్యూజికల్‌గా అనుసృజన సాగించారు జలజం సత్యనారాయణ. ఇందులో ఇటువంటి వాక్యాలు మరెన్నో !

*పేజీలు : 100, వెల : ₹ 100/- ప్రతులకు - ఫోన్ : 984 944 4944*




✦ ***కన్నీటి కట్ట :*** బోల యాదయ్య వ్రాసిన గెండె లయ తడి ఆరని 50 అలల పాటలు. మనసును స్పృశించే కవిత్వం. కొన్ని గేయాలు కరుణ రసాత్మకాలు.

*పేజీలు : 66, వెల : ₹ 60/- ప్రతులకు - ఫోన్ : 991 220 6427*




✦ ***బ్రేకింగ్ న్యూస్ :*** కోట్ల వెంకటేశ్వరరెడ్డి కవిత్వం. ఒక్కరుగా కనిపించే కవి, నిజానికి అనేకులు, అందరి ఆరాటాలా అంతర్వేది కవి. ఈ రచన మార్పును కోరుకున్న ఆశాస్వప్నం. మార్పులపట్ల తీవ్ర కలవరం – "వాలిపోయే పొద్దువు – ఎదిరించి నిలబడితే ఎదురొచ్చే పొద్దు నీదవుతుందంటూ" ఆత్మవిశ్వాసాన్ని మనలో నింపుతాడు రచయిత.

*పేజీలు : 190, వెల : ₹ 150/- ప్రతులకు - నవోదయ, ప్రజాశక్తి, పాలపిట్ట, నవచేతనలలో పుస్తకం లభ్యం.*




✦ ***అంతర్జాలంలో తెలుగు సాహిత్యం :*** రచయిత్రి డా॥ పుట్ల హిమలత. శాస్త్రవిజ్ఞానం ప్రచండ వేగంతో విస్తరిస్తుంది. దానితో ఎన్నో వెసులుబాట్లు అందుబాటులోకి వచ్చాయి. వాటిని అందిపుచ్చుకోగలిగితే ప్రపంచ మన గుప్పిట్లోకి వచ్చినట్టే. తెలుగు భాషలో చదువుకున్నవారికది దూరం కాకూడదనే సదుద్దేశంతో ఎంతో శ్రమకోర్చి వ్రాసిన పుస్తకం. పుస్తకం పేరు ఇందులోని విషయాన్ని చెబుతుంది.

*పేజీలు : 190, వెల : ₹ 200- ప్రతులకు - ఫోన్ : 814 343 3030*



✦ ***మా కేరళ యాత్ర :*** వివిధ అంశాలపై కూలంకషంగా రచన సాగించిన ముత్తేవి రవీంద్రనాథ్ – కేరళలో 18 రోజుల పాటు చేసిన యాత్రావిశేషాలతో అక్కడి చరిత్ర, సంస్కృతి వగైరాల గురించి కూడా ప్రస్తావించి రచనకు సమగ్రత సాధించారు. పుస్తకం నిండుగా ఫోటోలున్నాయి.

*పేజీలు : 260, వెల : ₹ 250/- ప్రతులకు - విశాలాంధ్ర బుక్ స్టాల్స్,*
*ఫోన్ : 040-2422 4458 / 59.*



✦ ***ప్రొఫెసర్ గారి విశిష్టయాత్రా కథనాలు :*** కన్నడ మూలం ప్రొ॥ రహమత్ తరీకెరే – తెలుగు అనువాదం – శాఖమూరి రామగోపాల్, ఇది కొన్ని రోజులకే పరిమితమైన యాత్రా విశేషం కాదు – ఒక జీవితకాలంలో చేసిన యాత్రావిశేషాలను, చూసిన సాంఘిక జీవనాలను, ఎన్నో విశేషాలు, ఎన్నో సంఘటనలను కథనాలుగా మలిచి చెప్పిన వైనం దీని ప్రత్యేకత. ఒకసారి చదవటం మొదలుపెడితే వదలలేం!

*పేజీలు : 290, వెల : ₹ 290/-, ప్రతులకు - విశాలాంధ్ర, నవచేతన పుస్తక షాపులు.*


## **మిసిమి** *విజ్ఞానదాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి పత్రిక ప్రతి నెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని**
**ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹ 300/- తోపాటు పంపండి.**
**బయటి చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు అదనంగా ₹ 50/- కలపండి.**

1. **పేరు :** ..................................................................
2. **చిరునామా :**
   ఇం.నెం. ..............................................................
   వీధి ..................................................................
   ఊరు ..................................................................
   పిన్ ...................................................................
   సెల్ ...................................................................
3. **సంతకం :** ..............................................................

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |



**రెండు సంవత్సరాల చందాదారులకు (₹ 600+50/-) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి**



**మూడు సంవత్సరాల చందాదారులకు (₹ 900+50/-) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి**



**నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ 1200+50/-) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి**





**అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ 1500+50/-) మిసిమి 2013/2014 సంచికల బౌండ్ పుస్తకం బహుమతి**

---

**మీరు బహుమతిగా మిసిమి మాసపత్రిక పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి**ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹ 300/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ ప్రక్కగడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....


**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో**
**మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధ-ధమ్మ-సంఘ (జె. లక్ష్మీరెడ్డి), 4. బుద్ధుని సూత్రసముచ్చయం, 5. మానవీయ బుద్ధ, 6. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 7. అంతర్వీక్షణం, 8. దూరతీరాలలో, 9. అగాధం, 10. ఓ ఖైదీ వీరగాథ, 11. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 12. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).

**బహుమానంగా పంపవలసినవారి చిరునామా :**


..............................................................
..............................................................
..............................................................

**మిసిమి**
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536.



క్రోధమ్

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.02.2016




లోభమ్